www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బుధవారం | 6-2-2019 | పేజీలు: 16 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 15 సంచిక (Issue) : 209 | శ్రీవికంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: విదియ పూర్తి; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 9.09 తదుపరి శతభిషం; వర్జ్యం: సా. 5.15-7.03; దుర్ముహూర్తం: మ. 12.07-12.52; అమృతఘడియలు: తె. 4.03-5.51; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.08 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

Aanjan Path Labs & ALLERGY TESTING CENTRE — AFFORDABLE ACCURACY


అలర్జీ (Allergy)కి సంబంధించి ఫిబ్రవరి 8, 9 & 10న నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, కామారెడ్డి, బోధన్, మంచిర్యాలలో సగం కంటే తక్కువ ధరకే మీ అంతట మీరే పరీక్ష చేయించుకొనవచ్చును.

ఒక రక్త పరీక్ష అలర్జీకి గల మూల కారణాన్ని నిర్ధారిస్తుంది.

త్వరితగతిన నిర్ధారణలు అలర్జీల(చర్మం, ఆహారం, శ్వాసక్రియ(ఇన్‌హలెంట్) చికిత్సలకు తోడ్పడగలవు.

అంజన్ పాత్ ల్యాబ్స్ యొక్క కలెక్షన్ సెంటర్లు & **నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, కామారెడ్డి, బోధన్, మంచిర్యాలలోని** అలర్జీ టెస్టింగ్ సెంటర్ 50 శాతం కంటే ఎక్కువగా డిస్కౌంట్‌తో రాయితీ ధరలలో అన్ని రకాల అలర్జీ (Allergy) (ఆహారం, చర్మం, ఇన్‌హలంట్, కాంప్రహెన్సివ్) ల కొరకు అలర్జీ పరీక్ష నిర్వహిస్తున్నాయి. అందులో 70-80 అలర్జెన్స్ కలిగి ఉంటాయి. సదరు పరీక్షలు **ఫిబ్రవరి 8, 9 & 10న ఉ.9.00 గం.ల నుండి సా 5.00 గం.వరకు** నిర్వహించబడతాయి. ఈ పరీక్షలు మూడు రోజులకు సగం ధర కంటే తక్కువ ధర కలిగి ఉంటాయి.

ఇంతకుముందు స్కిన్ ప్రిక్ టెస్ట్ చేయబడేది. రోగి ఏ రకమైన అలర్జీ (Allergy) నుండి బాధపడుతున్నారో, ఏ అలర్జెన్స్ దానికి కారణమవుతుందో తెలుసుకోవడానికి చేతిపై 98 చోట్ల చిన్న రంధ్రాలు చేయబడేవి. అయితే ఇప్పుడు ఒక రక్తపరీక్ష శాంపిల్ ద్వారా దానిని సులభంగా పరీక్షించవచ్చును. ఈ పరీక్ష ఫాడియా 250, యురోబ్లాట్‌వన్ వంటి ప్రత్యేకమైన యంత్రాల ద్వారా నిర్వహించబడుతుంది. అవి మా ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నాయి.



ఇంతకుముందు, స్కిన్ ప్రిక్ టెస్ట్ నిర్వహించబడేది అందులో రోగి ఏరకమైన అలర్జీ (Allergy) నుండి బాధపడుతున్నాడో ఏ అలర్జెన్లు అయితే దానికి కారనం అవుతున్నాయో తెలుసుకోవడానికి చేతిపై 98 చోట్ల చిన్న రంధ్రాలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఒక రక్తం నమూనాతో దానిని తేలికగా పరీక్షించవచ్చును.

డా. జి. సామ్రాట్ యాదవ్ (MBBS) – అలర్జీ(Allergy) ఒక విధమైన రుగ్మత. అయితే దీనిని ప్రజలు ఇలా పరిగణన లోనికి తీసుకోవడం లేదు. ఒక వ్యక్తికి ఒకసారి అది సోకితే అది ఇబ్బందులకు కారణం అవుతుంది.ఒక వ్యక్తికి కొన్ని సువాసనలు పడకపోతే, అతనికి పువ్వులంటే అలర్జీ అని అనుకొనవచ్చును. ప్రజలు తమ పెంపుడు జంతువుల ద్వారా కూడా అలర్జీకి గురి అవుతారు. ఒకసారి ఈ అలర్జీలను గుర్తించడం జరిగితే, అది ప్రభావవంతమైన చికిత్సకు దారి తీయవచ్చును. వీటికి చికిత్స చేయవచ్చును. ముందు జాగ్రత్త కూడా తీసుకోవచ్చును. **అలర్జీ చికిత్స కోసం రోగ నిర్ధారణ ఒకటే మార్గం.**

డా. కె.శివ (MBBS) – అలర్జీలు రాకుండా చూసుకోవాలి ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారి జీవితంలో అనేక సమస్యలకు ఇవి కారణం కాగలవు. అలర్జీలు సీజనల్. ఒక వ్యక్తి నిర్దిష్టమైన ఒక సీజనల్ అలర్జీ(Allergy)తో బాధపడుతుంటే, అది బాధను ఇంకా పెంచుతుంది. కనుక వెంటనే అతను/ఆమె డాక్టరును సంప్రదించవలెను. అలర్జీ వలన కలిగే వ్యాధులను వెంటనే నిర్ధారించుకోవాలి. అలా చేయడం వలన వాటికి చికిత్స చేసి ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చును. అలర్జీని నిర్ధారిస్తే రోగికి మంచి చికిత్స అందించడానికి డాక్టరుకు సులభతరం అవుతుంది.

డా. జె.రవి కుమార్ (MD) – ఈ రోజుల్లో రోగి రక్తం నమూనాతో అలర్జీ(Allergy) నిర్ధారించడం తేలిక. ఒకసారి అలర్జీ వ్యాధి నిర్ధారించబడితే, రోగి అలర్జీ(Allergy) ప్రతిచర్యలపై పోరాడేందుకు అతని రోగ నిరోధక శక్తిని అంతర్గతంగా దృఢపరుచుకునేందుకు కొన్నిరోజులు డాక్టరు ద్వారా సరియైన మందును తీసుకొనవలసి ఉంటుంది. దాని వలన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అతని అలర్జీ(Allergy)కి చికిత్స తీసుకోవడానికి అది సహాయకారి అవుతుంది.

అలర్జీ అంటే ఏంటి ?

పురుషుడు లేదా స్త్రీకి అన్య పదార్థాల ద్వారా కలిగే ప్రేరణలను సహించేందుకు కొంత శక్తి కలిగి ఉంటుంది. అయితే కొన్ని పరార్థాలు ఒక వ్యక్తి రోగనిరోధక శక్తిపై అసాధారణ ప్రతిచర్యకు కారణం అవుతాయి. అదే అలర్జీ (Allergy)కి కారణం అవుతుంది.

అలర్జీ లక్షణాలు

- చర్మం ఎర్రబారుట
- చర్మంపై దద్దుర్లు/దురద
- చర్మంపై ఎర్రని కురుపులు
- ముఖం, పెదవులు వాయుట
- కడుపు నొప్పి
- డయేరియా
- గొంతు నొప్పి, దగ్గు
- ఎగ్జిమా
- శ్వాస తీసుకొనుట కష్టతరమగుట
- సోరియాసిస్
- యుర్టికేరియా
- అలర్జిక్ రినైటిస్ (స్నీజింగ్)



అలర్జీ (Allergy)కి గల కారణాలు

మన దైనందిన జీవితంలో మన చుట్టుప్రక్కల ఉన్న అనేక విషయాలు అలర్జీకి కారణమవుతాయి.

గాలి ద్వారా సోకే అలర్జీలు, పుప్పొడి, జంతువుల ధూళి తవుడు పురుగుల దుమ్ము మరియు బూజు మొదలగునవి.

కొన్ని రకాల ఆహారాలు, ముఖ్యంగా బఠాణీలు, చెట్ల గింజలు, గోధుమ, సోయ్, చేప, షెల్ ఫిష్, గుడ్లు మరియు పాలు.

తేనెటీగ లేదా కందిరీగ వంటి **కీటకాలు కుట్టడం వలన.**

మిమ్మల్ని తాకేటువంటి లేటెక్స్ లేదా ఇతర పదార్థాలు అలర్జిక్ చర్మ ప్రతి చర్యలకు కారణం అవుతాయి.

ఒక రక్త నమూనా వలన ఎటువంటి అలర్జీని అయినా కనుగొనవచ్చును. దానిని కొన్ని రోగనిరోధక- బూస్టర్స్, యాంటీ-అలర్జిక్ మందులతో మరియు ఇమ్యునో-థెరపీ ద్వారా కూడా చికిత్స చేయవచ్చును.

ఆస్తమా రోగ చరిత్ర కలిగిఉండటం, శ్వాస తీసుకొనుట, దగ్గు మరియు ఆయాసంతో బిగ్గరగా రొప్పుట (Wheezing) దగ్గుతో బాధపడుతున్న 12 ఏళ్ల బాలికను ఒక ఉదాహరణగా తీసుకుంటే, ఆమె శ్వాస క్రియ రోగలక్షణాలకు స్పష్టమైన కారణం లేదని రిపోర్టుల ద్వారా తెలిసింది. ఆమె ఆస్తమా చికిత్స కోసం ఒక ఫిజీషియన్‌ను సంప్రదించింది. మంచి మందులు ఇచ్చినప్పటికీ కూడా ఆమె పూర్తిగా కోలుకోలేదు.బఠాణీలు, శెనగ గింజలు, కాయ ధాన్యాలు తినడం వలన శ్వాసలో ఇబ్బంది, దురద వంటి అనారోగ్యాలకు గురి అయ్యేది. గతంలో ఆమెకు వచ్చే దగ్గు సీజనల్‌గా వచ్చేది. అది పుప్పొడి, గడ్డికి సంబంధమైనదిగా ఉండేది. ఆమెకు బ్లడ్ అలర్జీ పరీక్ష చేస్తూ రోగ నిర్ధారణ జరిగింది. ఇమ్యునో-థెరపీ ద్వారా, కొన్ని యాంటీ- అలర్జిక్ మందుల ద్వారా చికిత్స చేయబడింది. ఆ తర్వాత ఆమెకు స్వస్థత చేకూరింది. ఎవరికైనా శ్వాస పీల్చుకోవడంలో సమస్యలు ఏర్పడితే అప్పుడు అతనికి/ఆమెకు అలర్జీ టెస్ట్ చేయించాలి. ఒక సారి అలర్జీ (Allergy) ఉందని నిర్ధారణ జరిగితే సగం సమస్య తీరుతుంది. ప్రత్యేక నిపుణుల డాక్టర్ల ప్యానల్ తోడ్పాటుతో, తగిన వైద్య విధానాలతో సరైన చర్య తీసుకోవడానికి వారి అలర్జీకి చికిత్స చేయడానికి ఇది సహాయకారి అవుతుంది.

యూరోబ్లాట్ అండ్ ఫాడియా ఉపయోగిస్తూ అటువంటి అలర్జీల నిర్ధారణకు మా ప్రఖ్యాత డాక్టర్ల ప్యానెల్ ప్రత్యేకంగా శిక్షణ పొందింది.

అలర్జీల చికిత్స

ఒకసారి నిర్ధారించబడిన అలర్జీలను నిర్దిష్ట ఆహార పదార్థాల నివారణ ద్వారా గానీ లేదా మందుల సహాయంతో గానీ చికిత్స చేయవచ్చును. ఔషధ ప్రయోగాలు యాంటీ-అలర్జెన్స్ కావచ్చును. లేదా నిపుణులైన వైద్యులచే ఏర్పాటు చేయబడిన ఇమ్యునోథెరపీగా పిలువబడే ప్రత్యేక చికిత్స కావచ్చును. అవి అలర్జీలు పూర్తిగా తగ్గటానికి సహాయం చేస్తాయి.



జెరత్ పాత్ ల్యాబ్స్ & అలర్జీ టెస్టింగ్ సెంటర్, భారతదేశంలో అలర్జీ టెస్టింగ్ కోసం మొదట NABL గుర్తింపు పొందిన ల్యాబ్‌లలో ఒకటి. జెరత్ పాత్ ల్యాబ్స్‌లలో అంజన్ పాత్ ల్యాబ్ ఒక కో కంపెనీ. ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలోని 14 రాష్ట్రాలలో JPL సేవలందిస్తోంది. మరియు APL ద్వారా దక్షిణ భారత దేశంలోని ప్రాంతాలు అనగా తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో ఇది ప్రవేశించింది.

ప్రముఖ న్యూరోసర్జన్ డా. వి.సుందర్, ఉత్సాహవంతమైన పారిశ్రామికవేత్త మరియు అడ్మినిస్ట్రేటర్ శ్రీమతి బకియావతి సుందర్‌చే APL నడుపబడుతున్నది.

ECHS/ESI/CGHS కార్డుదారులు & తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అదనపు డిస్కౌంట్

EUROBlotOne



Tested by World Famous Modernities Machine (EUROBlotOne & Phadia 250)

Aanjan Path Labs & ALLERGY TESTING CENTRE — CORPORATE OFFICE : Plot No. - 29A ARK Colony (Anantha Ramakrishna Iyyer Colony) Eldams road, Teynampet Chennai.

పరీక్షల కొరకు మమ్మల్ని సంప్రదించండి

NIZAMABAD
08462-231458, 94400-90141
Bharat Pathological Laboratry, Opp Bus Stand Lane, Beside Old City Cable Building Khaleelwadi

ADILABAD
8096146146, 9848259306
Suraksha Diagnostic Center, Suraksha Children's hospital 1st Floor Bank of Baroda Complex, Jyothiba Pule Chowk

NIRMAL
9440386871, 9573662855
Santhosh Kumar Diagnostic Laboratory, Opp. Stupam, Beside Ent Hospital, Doctor's Lane, N.h.7 Road

ARMOOR
7013353998, 9440142321
Shylaja Diagnostic Centre, Laxmi Children's Hospital, Opp. Pisa Mallanna Temple Lane

KAMAREDDY
08468-221193, 9059415951
Sevasadan Diagnostic Centre, H. No. 1-7-111/5, Sri Kalabhairava Complex, Daily Market

BODHAN
98481-75613
Balaji Pathology Lab, Sharbathi Canal Rd., Bodhan

MANCHERIAL
9652211678, 08736-250678
Health Care, Bellampally Chowrastha, Beside Andhra Bank, Mancherial

MANCHERIAL
9866514566, 8555949010
Sri Sai Diagnostics, Opp. Dcp Office, Near Carmel School, Acc, Mancherial

HELPLINE : +91 6383873278, +91 6383848063, +91 9500053404

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
నిజామాబాద్ ● బుధవారం 6 ఫిబ్రవరి 2019

హాకీ ప్రపంచకప్‌కు భారత్ బిడ్డింగ్

లాసానె: హాకీ ప్రపంచకప్ ఆతిథ్య హక్కుల కోసం భారత్‌తో పాటు ఆరు దేశాలు బిడ్ దాఖలు చేసినట్టు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వెల్లడించింది. 2023 (జనవరి 13-29)లో జరిగే పురుషులు లేదా మహిళల వరల్డ్ కప్ నిర్వహణకు భారత్ బిడ్ వేసినట్టు తెలిపింది. ఇప్పటి దాకా మూడుసార్లు ప్రపంచకప్ నిర్వహించిన భారత్.. చివరగా గతేడాది భువనేశ్వర్ వేదికగా పురుషుల కప్‌కు ఆతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే.

సౌరాష్ట్ర x విదర్భ

రంజీ ఫైనల్ (నాలుగో రోజు)

ఉ. 9 గం. నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 2లో..

ప్రొ వాలీబాల్‌లో నేడు

కొచ్చి X అహ్మదాబాద్
రాత్రి 7 గం. నుంచి
సోనీ సిక్స్, సోనీ టెన్-3లో...



మిథాలీ

ఇంగ్లండ్‌తోనే ఆఖరా..!

టీ20లకు వీడ్కోలు యోచనలో మిథాలీ రాజ్

భారత మహిళల జట్టులో అత్యంత సీనియర్ అయిన మిథాలీ రాజ్ టీ20 కెరీర్ ఇక ముగిసినట్టేనా? ప్రస్తుతం జరుగుతున్న కివీస్‌తో సిరీస్‌లో ఆమెను ఆడిస్తారా? మూడు మ్యాచ్‌ల్లోనూ సుస్థిర స్థానంపై భరోసా లేని వేళ.. ఆమె కీలక నిర్ణయం తీసుకోనుందా? ఇప్పటికిప్పుడు కాకపోయినా స్వదేశంలో వచ్చేనెలలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌లో పొట్టి ఫార్మాట్ నుంచి మిథాలీ వీడ్కోలు చెప్పనుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

న్యూఢిల్లీ: భారత వన్డే జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ అంతర్జాతీయ టీ20 కెరీర్ నుంచి తప్పుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చేనెలలో ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు రానుండగా మార్చి 4 నుంచి మూడు టీ20ల సిరీస్ జరుగుతుంది. ఆ సమయంలోనే 36 ఏళ్ల ఈ సీనియర్ బ్యాట్స్‌వుమెన్ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్నట్టు సమాచారం. అయితే వన్డేల్లో మాత్రం కొనసాగనుంది. మరోవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో బుధవారం నుంచి న్యూజిలాండ్‌తో భారత మహిళల జట్టు మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. మిథాలీ బ్యాటింగ్ తీరు ఈ ఫార్మాట్‌కు సరిపోదనే అభిప్రాయంతో ఉన్న కెప్టెన్.. ఆమెను తుది జట్టులోకి తీసుకుంటుందా, లేదా? అనేది సందేహమే. ఒకవేళ తొలిమ్యాచ్‌లో ఆడించినా మిగిలిన మ్యాచ్‌లకు దూరం పెట్టే చాన్సుందని టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి మిథాలీకి సంకేతాలు అందినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేసి ఆమెను గౌరవంగా సాగనంపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నెహ్రా తరహాలో: టీ20ల్లో బంతిని బలంగా బాదడమే ప్రధానం కావడంతో అలాంటి ఆటతీరుకు మిథాలీ సరిపోదనే విమర్శలు చాలా రోజులుగా ఉన్నాయి. ఈ కారణంతోనే టీ20 ప్రపంచకప్ సెమీస్‌లో ఆమెను తుది జట్టుకు ఎంపిక చేయలేదు. ఆ నిర్ణయం మహిళల జట్టులో పెను దుమారం రేపింది. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మాత్రం మిథాలీ ఉద్వాసనపై ఎలాంటి పశ్చాత్తాపం లేదని అప్పట్లోనే ప్రకటించింది. అదీ కాకుండా వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ కోసం హర్మన్ ఇప్పటి నుంచే పటిష్ఠ జట్టును తయారు చేసుకోవాలనుకుంటోంది. ఎలా గూ మిథాలీ ఆ టోర్నీలో ఆడే అవకాశాలు లేవు. కానీ జట్టుకు ఎనలేని పేరు తెచ్చిన మిథాలీ లాంటి బ్యాట్స్‌వుమన్‌కు ఘనమైన వీడ్కోలు పలకాల్సి ఉందని బీసీసీఐ ఉన్నతాధికారి తెలిపారు. 'ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో మిథాలీ అన్ని మ్యాచ్‌లు ఆడుతుందని చెప్పలేం. అందుకే పేసర్ ఆశిష్ నెహ్రా తరహాలో సిరీస్‌లోని తొలి మ్యాచ్ ఆడి వీడ్కోలు పలికే చాన్సుంది' అని ఆ అధికారి చెప్పారు.

వేగాన్ని అందుకోవడం లేదా..?: కొంతకాలంగా టీ20ల్లో మిథాలీ చోటుపై చర్చ సాగుతోంది. దీనికి ఆమె స్లో స్ట్రయిక్ రేట్ ఓ కారణం. అలాగే ఫీల్డింగ్‌లో చురుగ్గా లేకపోవడం కూడా ప్రభావం చూపుతోంది. 2017 నుంచి మిథాలీ 105.89 స్ట్రయిక్ రేట్‌తో జెమీమా, స్మృతి, హర్మన్‌ప్రీత్, అనూజ, వేదల తర్వాత ఆరో స్థానంలో ఉంది. ఇది టీ20ల్లో చాలా తక్కువ. మిథాలీ ఇప్పటిదాకా 85 టీ20ల్లో అత్యధికంగా 2,283 రన్స్ చేసి నెంబర్‌వన్‌గా ఉంది. ఇది పురుషుల టీ20ల్లో కూడా ఎక్కువే. ఇందులో 17 అర్ధసెంచరీలు ఉండగా అత్యధిక వ్యక్తిగత స్కోరు 97.

స్టార్ స్పోర్ట్స్ 1,3లో ఉదయం 8.30 నుంచి

రసపట్టులో రంజీ

● సౌరాష్ట్ర 307 ● విదర్భతో ఫైనల్

నాగపూర్: టెయిలెండర్ల అద్భుత పోరాటంతో రంజీ ఫైనల్లో విదర్భకు సౌరాష్ట్ర దీటుగా బదులిచ్చింది. 158/5తో మూడో రోజైన మంగళవారం ఆటను కొనసాగించిన సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటైంది. దీంతో విదర్భ తొలి ఇన్నింగ్స్ 312 పరుగుల స్కోరుకు 5 పరుగులు మాత్రమే వెనుకబడింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ స్నెల్ పటేల్ (102) పరుగులు చేయగా.. ఉనాద్కట్ (46), సకరియా (28 నాటౌట్), కమలేష్ (27) విదర్భ బౌలింగ్‌ను ఎదుర్కొని జట్టును పోటీలో నిలిపారు. ఆదిత్య సర్వాటే (5/98) ఐదు వికెట్లతో అదరగొట్టగా.. అక్షయ్ వాఖరే (4/80) నాలుగు వికెట్లు తీశాడు. ఉమేష్ యాదవ్ (1/59) బాడీలైన్ బౌలింగ్‌తో సౌరాష్ట్ర బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టాలని చూసినా.. వారు మాత్రం మొండి ధైర్యం ప్రదర్శించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ.. ఆట ముగిసే సమయానికి 55/2 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫయాజ్ ఫజల్ (10), సంజయ్ (16)ను లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్రసింహ్ జడేజా (2/36) పెవిలియన్ చేర్చాడు. వెటరన్ వసీం జాఫర్ (5), గణేష్ సతీష్ (24) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం విదర్భ 60 పరుగుల ఆధిక్యంలో ఉండగా.. చేతిలో 8 వికెట్లున్నాయి.

పంత్‌ను 4 లేదా 5లో ఆడించాలి



గవాస్కర్

న్యూఢిల్లీ: వచ్చేనెలలో ఆరంభమయ్యే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు యువ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్‌ను ఎంపిక చేయాలని టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సూచించాడు. ఆ సిరీస్‌లో అతణ్ని 6, 7లో కాకుండా.. 4 లేదా 5 స్థానాల్లో బరిలోకి దించాలన్నాడు. 'ఉపఖండంలో ఆస్ట్రేలియాతో జరిగే ఐదు వన్డేల సిరీస్‌కు జట్టులో పంత్ ఉండాలి. టాపార్డర్‌లో అతడి ఎడమచేతి వాటం జట్టుకు ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే, అతడిని నాలుగు లేదా ఐదు స్థానాల్లో బరిలోకి దింపితే ఎలా ఆడుతున్నాడో తెలుస్తుంది. అంతేకానీ.. ఆరు, ఏడు స్థానాల్లో ఆడిస్తే భారీ షాట్లకే మొగ్గుచూపుతాడు. కానీ, మనకు కావాల్సింది ఇది కాదు కదా' అని గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

మరో సిరీస్‌పై అమ్మాయిల గురి

కివీస్‌తో భారత్ తొలి టీ20 నేడు



స్మృతి మంధాన

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్ నెగ్గిన జోష్‌లో ఉన్న భారత మహిళలు.. టీ20 సిరీస్‌పైనా కన్నేశారు. దీంట్లో భాగంగా మూడు టీ20ల సిరీస్‌లో బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. మహిళల వన్డే చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో నెగ్గింది. కానీ, చివరి వన్డేలో 149 పరుగులకే కుప్పకూలిన మిథాలీ సేన.. 8 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. వన్డేల్లో హర్మన్‌ప్రీత్ కౌర్‌కు తన బ్యాటింగ్ సత్తా చాటే అవకాశాలు అంతగా రాలేదు. కానీ టీ20 కెప్టెన్‌గా హర్మన్ తనదైన శైలిలో దుమ్మురేపడానికి సిద్ధంగా ఉంది. వరల్డ్ టీ20 సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓటమి తర్వాత భారత్ ఆడుతున్న తొలి మ్యాచ్ ఇదే..! ఆ టీ20లో మిథాలీని పక్కన పెట్టడం పెద్ద వివాదాన్నే రాజేసింది. కోచ్ రమేష్ పొవార్, మిథాలీ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంది. రాజ్ స్ట్రయిక్ రేట్‌పై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో టీ20ల్లో మిథాలీ ప్రదర్శనపై అందరి దృష్టి నెలకొని ఉంది. కివీస్‌తో మూడో వన్డేలో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో భారత బ్యాట్స్‌వుమెన్ తడబడ్డారు. దానిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అద్భుత ఫామ్‌లో ఉన్న ఓపెనర్ స్మృతి మంధానతోపాటు విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడే హర్మన్‌ప్రీత్‌పై జట్టు ఎక్కువగా ఆధారపడింది. వేదా కృష్ణమూర్తి స్థానంలో జట్టులో చోటుదక్కించుకున్న ఆల్‌రౌండర్ ప్రియా పూనియా అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి. ఈ సిరీస్ నుంచి వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు ప్రదర్శనపై మేనేజ్‌మెంట్ ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది.

దశాబ్దకాలం తర్వాత కివీస్ గడ్డపై వన్డే సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న టీమిండియా.. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లోనూ వారికి షాకిచ్చేందుకు సిద్ధమైంది. అయితే టీ20ల్లో కివీస్‌దే ఆధిపత్యం. భారత జట్టు ఇక్కడ ఒక్క మ్యాచ్ కూడా గెలవకపోగా.. 2009లో జరిగిన ఏకైక సిరీస్‌లోనూ 0-2తో చిత్తయింది. దీంతో ప్రతీకారం కోసం ఎదురుచూస్తున్న రోహిత్ సేన.. ప్రస్తుత ఫామ్‌ను కొనసాగిస్తూ మూడు నెలల విదేశీ పర్యటనను చిరస్మరణీయంగా ముగించాలనుకుంటోంది. అటు ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య జట్టు కనీసం ఈ సిరీస్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని భావిస్తోంది.

స్టార్ స్పోర్ట్స్ 1,3లో మధ్యాహ్నం 12.30 నుంచి

బోణీ కొట్టేస్తారా!



రోహిత్

● నేటి నుంచి న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్
● 'తొలి' విజయంపై భారత్ దృష్టి

హామిల్టన్: ఆస్ట్రేలియాలో ఆరంభించిన విజయ యాత్రకు న్యూజిలాండ్‌లో చక్కటి ముగింపునివ్వాలన్నది భారత జట్టు ఆలోచన. ఇప్పటికే వన్డే సిరీస్‌ను 4-1తో దక్కించుకున్న టీమిండియా నేటి (బుధవారం) నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది. చివరి వన్డే జరిగిన వెస్ట్‌ప్యాక్ మైదానంలోనే ఈ ఆరంభ మ్యాచ్ జరుగనుంది. టీ20ల్లో కివీస్‌పై ఉన్న పేలవ రికార్డును సవరించుకుంటూనే, ఇక్కడ తొలి టీ20 సిరీస్ సాధించాలనే కసితో భారత్ ఉంది. వన్డే సిరీస్‌కు దూరమైన రిషభ్ పంత్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ప్రపంచకప్‌లో చోటు దక్కించుకోవాలంటే అతడికి ఈ సిరీస్ మంచి అవకాశం. అలాగే టీనేజర్ శుభ్‌మన్ గిల్ అరంగేట్రం చేసే అవకాశం ఉండగా.. గత జూలైలో చివరి టీ20 మ్యాచ్ ఆడిన ధోనీ మళ్లీ బరిలోకి దిగబోతున్నాడు. ఇక సిరీస్ ఆరంభానికి ముందే స్టార్ ఓపెనర్ గప్టిల్ గాయం రూపంలో కివీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది.

ఆత్మవిశ్వాసంతో భారత్: రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత జట్టు టీ20ల్లో అదుర్స్ అనిపించుకుంటోంది. అందుకే 12 మ్యాచ్‌ల్లో అతడి విజయాల శాతం 91.67గా ఉంది. అలాగే రోహిత్ ఫామ్‌కు ఇబ్బందేమీ లేకపోయినా మరో ఓపెనర్ ధవన్ చివరి మూడు వన్డేల్లో విఫలమయ్యాడు. దీంతో బౌన్స్, స్వింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అతడు టెన్నిస్ బాల్‌తో ప్రాక్టీస్ చేశాడు. మూడో స్థానంలో గిల్‌ను ఆడించే అవకాశం ఉంది. కఠిన పరిస్థితుల్లో అతడు ఆడిన రెండు వన్డేల్లో 9,7 స్కోర్లతో విఫలమైనా ఈ ఫార్మాట్‌లోనూ పరీక్షించాలనుకుంటున్నారు. ఇక రిషభ్ పంత్‌ను ఏ స్థానంలో బరిలోకి దించుతారనేది ఆసక్తికరంగా మారింది. ధోనీ వికెట్ కీపర్‌గా ఉండడంతో పంత్ స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గానే ఆడనున్నాడు. మరోవైపు ఈఫార్మాట్‌లోనూ ధోనీ రాణించాల్సిన ఆవశ్యకత ఉంది. దినేశ్ కార్తీక్ ఫినిషర్‌గా తానేమిటో ఇప్పటికే నిరూపించుకున్నాడు. బౌలింగ్‌లో పేస్ బాధ్యతను భువనేశ్వర్ తీసుకోనుండగా ఆల్‌రౌండర్ బ్రదర్స్ హార్దిక్ పాండ్యా, క్రునాల్ పాండ్యా తొలిసారిగా ఆడే చాన్స్ ఉంది. ఖలీల్, సిద్దార్థ్ కౌల్‌లో ఒకరు ఆడనున్నారు. స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగనున్నాడు.

కొత్తవారికి చాన్స్!

వన్డే సిరీస్‌ను తమ చెత్త ఆటతో కోల్పోయిన కివీస్.. ఈసారి అలాంటి పొరపాటుకు తావీయకూడదనుకుంటోంది. ఓపెనర్ గప్టిల్ గాయం కారణంగా దూరం కావడంతో కెప్టెన్ విలియమ్సన్ ఓపెనింగ్ చేయనున్నాడు. మూడు సెంచరీలు సాధించిన కొలిన్ మన్రో ఈ ఫార్మాట్‌లో అత్యంత ప్రమాదకారి. ఈ సిరీస్‌లోనూ అతడు ఫామ్ కనబరిస్తే భారత్‌కు ఇబ్బందే. సీనియర్ రాస్ టేలర్, జేమ్స్ నీషమ్‌పై జట్టు ఎక్కువగా ఆధారపడి ఉంది. ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్, పేసర్ బ్లెయిర్ టిక్నెర్‌లతో అరంగేట్రం చేయించే చాన్స్ ఉంది. ప్రధాన పేసర్ బౌల్ట్‌కు విశ్రాంతినివ్వగా టిమ్ సౌథీ, ఫెర్గూసన్ ఈ విభాగంలో కీలకం కానున్నారు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), ధవన్, శుభ్‌మన్ గిల్, ఎంఎస్ ధోనీ, రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్యా, క్రునాల్ పాండ్యా/కేదార్ జాదవ్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్/సిద్ధార్థ్ కౌల్, చాహల్/కుల్దీప్.

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), మన్రో, టిమ్ సీఫెర్ట్, టేలర్, డారిల్ మిచెల్, నీషమ్, గ్రాండ్‌హోమ్, స్కాట్ కుగెలిన్, బ్రేస్‌వెల్, సౌథీ, ఫెర్గూసన్/టిక్నెర్, సోధీ.

పిచ్, వాతావరణం

చివరి వన్డేలో వెస్ట్‌ప్యాక్ పిచ్ అంచనాలకు భిన్నంగా ప్రవర్తించింది. ఏడాది క్రితం ఇక్కడ జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్‌లో కివీస్ 196 పరుగుల స్కోరును కాపాడుకుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతంగా ఉన్నా వర్షం నుంచి ఇబ్బంది లేదు.

ఓవరాల్‌గా కివీస్‌తో భారత్ ఎనిమిది టీ20లు ఆడితే రెండు మాత్రమే గెలిచి ఆరింట్లో ఓడింది.

గత 10 టీ20 సిరీస్‌లలోనూ భారత జట్టు విజేతగా నిలిచింది.

రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉన్న 12 టీ20 మ్యాచ్‌ల్లో భారత్ ఒక్కదాంట్లోనే ఓడింది.

రోహిత్ శర్మ మరో 36 పరుగులు చేస్తే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలుస్తాడు. ప్రస్తుతం గప్టిల్ (2,272) టాప్‌లో ఉన్నాడు.



కాలికట్ ఆటగాళ్ల ఆనందం

కాలికట్‌కు మరో విజయం

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కాలికట్ హీరోస్ వరుసగా రెండో విజయం సాధించింది. మంగళవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కాలికట్ 3-2 (15-10, 12-15, 15-13, 14-15, 15-9)తో యు ముంబా వాలీపై గెలిచింది. తొలిసెట్‌ను కాలికట్ హీరోస్ 15-10తో గెలుచుకోగా.. ఆ తర్వాత సత్తాచాటుతూ ముంబా 15-12తో రెండోసెట్ నెగ్గింది. మూడో సెట్ నువ్వానేనా అన్నట్టుగా సాగినా.. అజిత్ స్పైక్‌తో 15-13తో కాలికట్ ఆసెట్ నెగ్గింది. నాలుగో సెట్‌లో తొలుత 4-8తో వెనుకడిన ముంబా.. తర్వాత వరుస బ్లాక్‌లు, స్పైక్‌లతో అదరగొడుతూ 15-14తో పైచేయి సాధించి ఫలితాన్ని ఆఖరిసెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణాయక ఐదోసెట్ ఆరంభంలో ఇరువురూ 6-6తో సమంగా ఉన్న దశలో ఒక్కసారిగా విజృంభించిన కాలికట్ వరుసగా ఆరు పాయింట్లు సాధించి 12-6తో దూసుకెళ్లింది. 15-9తో సెట్‌తోపాటు మ్యాచ్‌నూ కైవసం చేసుకుంది. అజిత్ లాల్ ఏకంగా 16 (15 స్పైక్‌లు, 1 బ్లాక్) పాయింట్లతో అదరగొట్టాడు.

మహిళల టీ20 విజేత తెలంగాణ

ఖమ్మం (స్పోర్ట్స్): ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ మహిళల టీ20 టోర్నీలో ఆతిథ్య తెలంగాణ జట్టు చాంపియన్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో తెలంగాణ 7 వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత ఉత్తరప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం తెలంగాణ 13 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. అయితే.. వెలుతురు సరిగ్గా లేకపోవడంతో రన్‌రేట్ ఆధారంగా తెలంగాణను విజేతగా ప్రకటించారు.



జాతీయ ఫెన్సింగ్‌లో తెలంగాణకు కాంస్యం



హైదరాబాద్: అసోంలో జరిగిన జాతీయ సీనియర్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు పతకంతో సత్తా చాటింది. భాగ్యశ్రీ, శీతల్, షేక్ ఫౌసియా, శ్రీషాతో కూడిన రాష్ట్ర మహిళల జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకొంది.

కుల్దీప్ మా నెంబర్‌వన్ స్పిన్నర్



రవిశాస్త్రి

వెల్లింగ్టన్: విదేశీగడ్డపై అద్భుతంగా రాణిస్తున్న స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను కోచ్ రవిశాస్త్రి ప్రశంసించాడు. అశ్విన్, జడేజాకన్నా కుల్దీపే ముందున్నాడని, అతడే తమ ప్రధాన స్పిన్నర్ అని స్పష్టం చేశాడు. 'టెస్టు క్రికెట్‌లో ఇప్పుడు మణికట్టు స్పిన్నర్లదే ఆధిపత్యం. విదేశాల్లో కుల్దీప్ విశేషంగా రాణిస్తున్నాడు. సిడ్నీ టెస్టులో 5 వికెట్లతో రాణించాడు. ఆ మ్యాచ్‌లో అతడు బౌలింగ్ వేసిన తీరు అబ్బురపరిచింది. అందుకే ఇప్పుడు అతడే మా ప్రధాన స్పిన్నర్. ఒకవేళ తుదిజట్టులో ఒక్క స్పిన్నర్‌కే చోటుంటే కుల్దీప్‌కే ప్రాధాన్యం' అని శాస్త్రి చెప్పాడు.

రిచర్డ్స్, ఇమ్రాన్ కలయిక కోహ్లీ: భారత క్రికెట్‌కు కోహ్లీలాంటి కెప్టెన్ లభించడం అదృష్టమని రవిశాస్త్రి కొనియాడాడు. 'కోహ్లీ ఆటతీరులో నాకు వివ్ రిచర్డ్స్ గుర్తుకొస్తాడు. అతడిలాగే కోహ్లీ కూడా బౌలర్లపై ఎదురుదాడికి దిగుతాడు. కెప్టెన్సీ విషయంలో ఇమ్రాన్ ఖాన్ మాదిరి తనకు కావాల్సింది సహచరుల నుంచి చక్కగా రాబట్టుకుంటాడు' అని అన్నాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నిజామాబాద్ సిటీ*

బుధవారం | 6-2-2019 | పేజీలు: 16 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 15 సంచిక (Issue) : 209 | Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



సీఎం కేసీఆర్‌ను కలిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, పూల రవీందర్

ఆశల పల్లకి

ఏకీకృత సర్వీసు, పదోన్నతులపై ఉపాధ్యాయుల ఆశాభావం

వెంటనే ప్రక్రియ చేపట్టాలి: సంఘాలు

ముఖ్యమంత్రి సానుకూలం: ఎమ్మెల్సీలు

అటు న్యాయ సమస్యలు.. ఇటు కోడ్‌లు

వీటిని అధిగమిస్తూ చేయడమెలా!?

ప్రభుత్వ అధికారుల మల్లగుల్లాలు

న్యాయ సలహా కోరాలని నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇప్పటికైనా పదోన్నతులు దక్కేనా!? సుప్రీం కోర్టు ఇచ్చిన ఊరట వరం కానుందా!? ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న సమస్య పరిష్కారం కానుందా!? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం రావడం లేదు. సుప్రీం కోర్టు స్టే నేపథ్యంలో ఉపాధ్యాయుల పదోన్నతులపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పుడు పదోన్నతులు ఇద్దామా..? వద్దా..? అనే మీమాంసలో ఉంది. ఏం చేయాలనే దానిపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. పదోన్నతులు కల్పిస్తే వచ్చే సమస్యలేంటి!? వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలనే దానిపై చర్చిస్తున్నారు. దీనిపై న్యాయ సలహా కూడా తీసుకోవాలని

మిగతా 14వ పేజీలో...

గ్రామాభివృద్ధికి ‘ఉపాధి’

ఆ నిధులను వినియోగించండి.. రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా ఇస్తాం

12,751 గ్రామాల్లో నర్సరీలు.. 14,012 వైకుంఠ ధామాలు నిర్మించండి

859 పంచాయతీల్లో బీటీ రోడ్లు వేయండి.. నిధుల దుర్వినియోగం వద్దు

గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టండి.. అధికారులతో సమీక్షలో కేసీఆర్

14

భాషా పండితుల కల సఫలం

స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

ఫైలుపై ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం

నేడు ఉత్తర్వులు.. ఆ వెంటనే ప్రమోషన్లు

ఎక్కడి వారిని అక్కడే అప్‌గ్రేడ్ చేస్తారు

ఫలించిన 20 సంవత్సరాల పోరాటం

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): భాషా పండితుల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు వారి పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సంబంధిత ఫైలుపై సీఎం కేసీఆర్ ఆమోదం తెలుపుతూ మంగళవారం సంతకం చేశారు. దీంతో రాష్ట్రంలోని భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించనుంది. గతంలోనే 2,487 భాషాపండిత పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం తాజాగా మరో 6,024 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 8,500 మంది భాషా పండితులకు లబ్ధి చేకూరనుంది. ఫైలుపై సీఎం సంతకం కావడంతో బుధవారం ఉత్తర్వులు జారీ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉత్తర్వులు వెలువడగానే పోస్టింగులు ఇవ్వనున్నారు. అయితే పోస్టింగులకు ఎలాంటి కౌన్సెలింగ్ నిర్వహించకుండా

మిగతా 6వ పేజీలో...

ప్రభుత్వ బడి.. విద్యార్థులేరీ!?

సర్కారీ స్కూళ్లలో పడిపోతున్న ప్రవేశాలు

క్రమేణా పెరుగుతున్న విద్యార్థుల్లేని స్కూళ్లు

గత సంవత్సరంతో పోలిస్తే భారీ తేడా

ఏడాదిలో 2వేలకు పైగా స్కూళ్లలో దుస్థితి

6

సుప్రీంకోర్టు మధ్యే వాదం



సీబీఐకి సహకరించాలని సీపీ రాజీవ్‌కు ఆదేశం

అరెస్టు వద్దని, ఒత్తిడి పెట్టొద్దని సీబీఐకి ఉత్తర్వు

మమత దీక్ష విరమణ 12న ఢిల్లీలో సీఎంల ధర్నా

తటస్థ ప్రదేశం షిల్లాంగ్‌లో విచారణ

సాక్ష్యాల ధ్వంసంపై రాజీవ్‌కు నోటీసు

కోర్టు ధిక్కారంపై సర్కారుకూ తాఖీదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పశ్చిమ బెంగాల్లో తీవ్రస్థాయిలో ఘర్షణ పడుతున్న రెండు పక్షాలకూ కాస్తంత ఊరట కలిగించేలా సుప్రీం కోర్టు ఓ మధ్యస్థ ఉత్తర్వును ఇచ్చింది. దీని ప్రకారం- శారదా చిట్‌ఫండ్ కుంభకోణంపై కోల్‌కతా సిటీ పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను విచారణ నిమిత్తం సీబీఐకి సహకరించాలని ఆదేశించింది. సీబీఐ ఎప్పుడు

మిగతా 16వ పేజీలో...



కోల్‌కతాలో మమత దీక్ష విరమణ సమయంలో చంద్రబాబు

ప్రధానీ.. తప్పుకో!.. రాజీనామా చేసి గుజరాత్‌కు వెళ్లిపో

కేంద్రంలో ఏక వ్యక్తి, ఏక పార్టీ ప్రభుత్వం.. మమత ధ్వజం

కూటమి రూపకర్త మమతే.. విపక్షానికి ఆమే మూల స్తంభం

జాతీయ స్థాయిలోనూ కీలకం.. బెంగాల్లో క్లీన్‌స్వీప్: బాబు

14



దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గజానన్

అది నేరమని తెలిసీ చేశారు

129 మంది విద్యార్థులపై అమెరికా అభియోగం

అక్రమంగా ఉండేందుకు వారు ప్రయత్నించారు

విద్యాచరిత్రలో ఇది అసాధారణ పరిణామం

భారత్ నిరసనకు అమెరికా సమాధానం

16

విద్యుత్తు కనెక్షన్లపై జీఎస్టీ భారం

14

2017 జూలై 1 నుంచి ఇచ్చిన అన్ని కనెక్షన్లపై 18% వసూలు

అప్పు.. తప్పు

ఎన్నారై జయరాం హత్య కేసులో మరో మలుపు

రాకేశ్‌రెడ్డే చంపాడని తేల్చిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు

ఆస్తి గొడవే కారణమని ప్రకటన.. శిఖాచౌదరికి క్లీన్‌చిట్

ఈ వాదనతో విభేదించిన జయరాం భార్య పద్మశ్రీ

రాకేశ్ ఎవరో తమకు తెలియనే తెలియదని వెల్లడి

శిఖాచౌదరి విలువైన పత్రాలు ఎత్తుకెళ్లిందని ఆరోపణ

ఏపీ పోలీసులపై నమ్మకం లేదని టీ పోలీసులకు ఫిర్యాదు



భర్త హత్యపై ఫిర్యాదు చేసేందుకు జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన జయరాం భార్య పద్మశ్రీ

విజయవాడ/నందిగామ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ప్రముఖ పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ కేసు మరో మలుపు తిరిగింది. ఆయనను చంపింది రాకేశ్ రెడ్డేనని పోలీసులు తేల్చారు. కానీ, అసలు రాకేశ్ ఎవరో తమకు తెలియదని జయరామ్ భార్య పద్మశ్రీ చెప్పారు. జయరామ్‌కు రాకేశ్ రూ.4.15 కోట్లు అప్పు ఇచ్చాడని, వాటిని వసూలు చేసుకునే క్రమంలోనే హత్య చేశాడని పోలీసులు చెప్పారు. కానీ, అన్ని కోట్లు అప్పు ఇచ్చే స్తోమత రాకేశ్‌కు లేదని అతని ఆర్థిక పరిస్థితి స్పష్టం చేస్తోంది. రాకేశ్‌ను ప్రధాన నిందితుడిగా, అతనికి సహకరించిన వాచ్‌మన్‌ను ఏ2గా చేర్చి ఏపీ పోలీసులు కేసు దర్యాప్తును ముగించారు. కానీ, ఈ కేసులో శిఖా చౌదరి పాత్ర ఏమిటనేది బయటకు

మిగతా 13వ పేజీలో...



ఏసీపీ మల్లారెడ్డి; ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ఏసీపీ మల్లారెడ్డిపై వేటు

అంబర్‌పేట్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్

నిందితుడు రాకేశ్‌రెడ్డితో అంటకాగిన ఫలితం

ఇప్పటికే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు బదిలీ

13



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గొండ్లగూడెంలో స్వాధీనం చేసుకున్న అక్రమ కలప

అటవీశాఖలో భారీగా బదిలీలు

200 మందికి స్థానచలనం

బదిలీల్లో బీట్ ఆఫీసర్ నుంచి.. చీఫ్ కన్జర్వేటర్ స్థాయి అధికారి

21 జిల్లాలకు కొత్త అధికారులు

11 మందిపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ‘జంగిల్ బచావో-జంగిల్ బఢావో’ నినాదంతో అటవీ శాఖ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కలప స్మగ్లింగ్, జంతువుల వేటకు ఇంటి దొంగలే సహకరిస్తున్నారనే సమాచారంతో చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 200 మంది

మిగతా 14వ పేజీలో...

పాలన ప్రక్షాళన!

ఐఏఎస్, ఐపీఎస్‌లకు స్థాన చలనం

ముఖ్యమంత్రి వద్దకు బదిలీల ఫైలు

త్వరలో మరిన్ని శాఖల్లో బదిలీలు

14

● రంగంలోకి ప్రియాంక



రాహుల్‌తో చెల్లెలి భేటీ.. మిషన్ యూపీపై దృష్టి

సమావేశంలో జ్యోతిరాదిత్య, రాజ్‌బబ్బర్, వేణుగోపాల్

ప్రభువులా మోదీ ప్రభ ఏదీ?

ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత.. 3 రాష్ట్రాల ఫలితాలే రుజువు

పారిశ్రామిక వేత్తల రుణ ఎగవేతలు నిరర్థక ఆస్తులా?

15

రైతు రుణాలను కూడా నిరర్థక ఆస్తులని ఎందుకనరు?

ప్రస్తుత పథకాలు కొనసాగిస్తూనే కనీస ఆదాయం ఇస్తాం

రాఫెల్ డీల్.. ప్రధాని మోదీ నిర్వహించిన ‘బైపాస్’ సర్జరీ

మోదీ ఓటమే లక్ష్యం.. ప్రధాని ఎవరో తర్వాత తేలుస్తాం

అయోధ్యపై సుప్రీం తీర్పును గౌరవిస్తాం: రాహుల్ గాంధీ

(పారిశ్రామిక వేత్తలు) బ్యాంకు రుణం తీసుకుని దాన్ని తిరిగి తీర్చకపోతే ‘ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మింగ్ అసెట్-నిరర్థక ఆస్తి)’గా వ్యవహరిస్తారు. మరి రైతుల విషయంలో కూడా వారు చెల్లించలేని రుణాల్ని ‘ఎన్‌పీఏ’ అని ఎందుకు అనరు? రైతులకు కూడా అవే పదాలు ఎందుకు వాడరు? రైతులు రుణం తీర్చకపోతే ఎగవేతదారులైపోతారు! ఎగవేతదారులైన కార్పొరేట్లు మాత్రం ‘ఎన్‌పీఏలు’ అయిపోతాయి. ఎందుకిలా?

తెలంగాణలో ఎందుకు ఓడాం?

గెలవాల్సిన రాష్ట్రం కదా?.. పార్టీ నేతలకు రాహుల్ సూటి ప్రశ్న

13

ఈవీఎంల రిగ్గింగ్, డబ్బూ పనిచేసింది.. టికెట్ల జాప్యం ముంచింది

ప్రచారాన్ని కేసీఆర్ వర్సెస్ చంద్రబాబుగా మార్చారు.. నేతల వివరణ

మీ వాకిట్లో న్యాయం

55 గ్రామ న్యాయాలయాల ఏర్పాటుకు మార్గం సుగమం

కుటుంబ, భూసంబంధిత కేసులపై తీర్పులన్నీ గ్రామంలోనే

గరిష్ఠంగా ఆరు నెలల్లోగా పరిష్కారం

రాష్ట్రంలో పదేళ్ల అనంతరం ఏర్పాటు!

ప్రభుత్వ ఉత్తర్వుపై హైకోర్టు సంతృప్తి

తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నేరం జరిగిందంటే చాలు.. పోలీసు స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సిందే.. సమయం, డబ్బు కోల్పోవాల్సిందే.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. చిన్నపాటి నేరాలకు సత్వర న్యాయాన్ని గడప వద్దనే అందించేందుకు సిద్ధమైంది. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 55 గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి హైకోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసి, వాటిని మంగళవారం కోర్టు పరిశీలనకు అందజేసింది. ఈ ఉత్తర్వులపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం

మిగతా 6వ పేజీలో...

మాల్యా రాక ఎప్పుడు?

విజయ్‌మాల్యాను వెనక్కు తెచ్చే బృహత్కార్యంలో మరో ముందడుగు పడింది. మాల్యాను భారత్‌కు అప్పగించమంటూ లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ కోర్టు డిసెంబరు 10న తీర్పు చెబితే, అంతిమ నిర్ణయం చేయాల్సిన హోంశాఖ కూడా ఆదివారం సానుకూలంగా స్పందించింది. మాల్యా అప్పగింతకు తలూపుతూ పాకిస్థాన్ సంతతికి చెందిన బ్రిటన్ హోంమంత్రి సాజిద్ జావీద్ పత్రాలపై సంతకాలు చేయడంతో భారత పాలకులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ నిర్ణయంపై బ్రిటన్ ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీలుకు పోతున్నట్టు మాల్యా ప్రకటించిన నేపథ్యంలో ఈ సుదీర్ఘ న్యాయపోరాటం ఇప్పట్లో ఒక కొలిక్కి రాకపోవచ్చు.

వెస్ట్‌మినిస్టర్ కోర్టు తీర్పునూ, తదనుగుణంగా హోంశాఖ తీసుకున్న నిర్ణయాన్నీ సవాలు చేస్తూ హైకోర్టులో మాల్యా పోరాడుతారు. మాల్యా అప్పీలును హైకోర్టు తిరస్కరించిన పక్షంలో మాత్రమే ఎన్నికలు మొదలయ్యేలోగా ఆయనను దేశానికి తేవాలన్న పాలకుల అభీష్టం నెరవేరే అవకాశాలున్నాయి. తీసుకున్న అప్పును పక్కదారి పట్టించాడనీ, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నాడనీ మేజిస్ట్రేట్ కోర్టు నమ్మినట్టుగానే హైకోర్టు కూడా భావిస్తే తీర్పు భిన్నంగా రాకపోవచ్చు. కానీ, బ్రిటన్ అప్పగింతల చట్టంలోని కొన్ని రక్షణలను మాల్యా అస్త్రాలుగా వాడుకొనే సూచనలున్నాయి. అప్పగించిన వ్యక్తిని సదరు దేశం ఉరితీసే అవకాశాలున్నా, అప్పగిస్తున్న కేసుతో పాటు ఇతరత్రా కేసుల్లో ఇరికిస్తారని అనిపించినా ఈ అప్పగింత రద్దుకావచ్చు. అప్పీలులో మాల్యా ఇప్పటివరకూ మేజిస్ట్రేట్ కోర్టులో ఏయే వాదనలైతే చేశారో అన్నీ హైకోర్టులో మొదటినుంచీ చేయవచ్చు. కక్షసాధింపనీ, ఆరోపణలకు ఆధారాలు లేవనీ, భారత్ జైళ్ళలో దుర్భరమైన పరిస్థితులున్నాయనీ, న్యాయవిచారణ పక్షపాతంగా జరుగుతుందనీ ఎన్నైనా చెప్పుకోవచ్చు. అప్పీలుకు పదిహేను రోజుల గడువున్నది కానీ, వాదనలు మొదలు కావడానికీ, తీర్పురావడానికీ ఎన్ని నెలలైనా పట్టవచ్చు. అప్పీలును హైకోర్టు తిరస్కరిస్తే సుప్రీంకోర్టుకు కూడా పోవచ్చు. ఈ కేసులో విస్తృత ప్రజాశ్రేయస్సూ, ప్రాధాన్యతలు ఇమిడివున్నాయని హైకోర్టు నిర్ధారిస్తే చాలు. భారత్–బ్రిటన్ అప్పగింతల ఒప్పందం ప్రకారం మనదేశం రెండో కేటగిరీలో ఉన్నది కనుక అక్కడి న్యాయవ్యవస్థలు ఇచ్చే ఈ తరహా తీర్పులపై అంతిమ నిర్ణయాధికారం హోంశాఖదే. సుప్రీంకోర్టులో ఏ నిర్ణయం జరిగినా వ్యవహారం తిరిగి హోంశాఖ ముందుకు వస్తుంది. ఇప్పటిమాదిరిగానే అప్పుడు కూడా సానుకూల నిర్ణయం జరిగితేనే మాల్యా భారత్ వస్తారు. అప్పగింతల విషయంలో హోంశాఖ ఏ నిర్ణయమూ తీసుకోకుండా ఏళ్ళతరబడి నాన్చిన ఉదాహరణలు అనేకం.

మాల్యా రావడానికి కనీసం ఏడాది పడుతుందని కొందరి అంచనా. భారత్–బ్రిటన్ అప్పగింతల ఒప్పందం కుదిరిన దశాబ్దంన్నర కాలంలో ఇప్పటివరకూ వెనక్కు రప్పించగలిగిది ఒకే ఒక్కరిని. గోధ్రా అనంతర ఘటనల్లో పాలుపంచుకున్న సమీర్‌భాయ్ వినూభాయ్ పటేల్ 2016లో ఇలా వచ్చారు. ఈ లెక్కన మాల్యాను తీసుకురావడంలో ఎంత జాప్యం జరిగినా అది భారత్‌కు విజయోత్సాహాన్నిచ్చేదే. ఈ దేశ ప్రజల సొమ్ముదోచుకొని విదేశాలకు పోయి విలాసాలు చేస్తున్న మాల్యావంటి అనేకులకు ఇది హెచ్చరికగా పని చేస్తుంది. పాలకుల్లో పట్టుదల ఉంటే, సమస్త వ్యవస్థలను సంఘటితం చేసి తదేక దృష్టితో కృషి చేస్తే ఇటువంటివారిని వెనక్కు తీసుకురావడం అసాధ్యమేమీ కాదు. మాల్యా రాక ప్రభావం ఎన్నికలపై ఎంత ఉంటుందో చెప్పలేం కానీ, పాలకులు మాత్రం సార్వత్రిక ఎన్నికల్లోగా ఆయనను పుట్టింటికి తెచ్చి, కోల్పోయిన పరువుప్రతిష్ఠలను తిరిగి దక్కించుకోవడానికి శ్రమిస్తున్నారు. చోక్సీ, నీరవ్ కూడా వెంటవెంటనే వచ్చేస్తారని హామీ ఇస్తున్నారు. ఈ పిడికెడు మంది మాత్రమే కాక, ఈ దేశ బ్యాంకులను ముంచి, ఇక్కడినుంచి ఎగిరిపోయినవారి సంఖ్య రెండు పదులు దాటే ఉందని నివేదికలు అంటున్నాయి. బ్యాంకులు రుణాలపై రుణాలు ఇస్తూపోవడం, పేరుకుపోతున్న బకాయిలు బయటకు పొక్కకపోవడం, చివరకు వారు దేశం వదిలి ఎగిరిపోతుంటే సర్వవ్యవస్థలూ సహకరించడం ఈ దుస్థితికి కారణం. ఇందుకు విరుగుడుగా యాభైకోట్లకు మించిన రుణ ఎగవేతదారుల జాబితా బహిర్గతం చేయమంటూ గత ఏడాది కేంద్ర సమాచార కమిషన్ రిజర్వ్‌బ్యాంకును ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయింది. మాల్యా రాకకంటే, నష్టపోయిన బ్యాంకులకు తిరిగి సొమ్ము సమకూర్చిపెట్టడం ముఖ్యం. గతనెలలో పలాయిత ఆర్థిక నేరస్థుడిగా మాల్యాను ప్రకటించి 12వేల కోట్ల రూపాయల ఆస్తిపాస్తులను ప్రభుత్వం స్వాధీనంచేసుకున్నది. అయితే, నష్టపోయిన బ్యాంకులకు న్యాయం చేకూర్చే విషయంలో మాత్రం ఇప్పటికీ స్పష్టత లేకపోయింది.

నీతిబాహ్య బాటల్లో భారత ప్రజాస్వామ్యం

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

> రాజనీతిజ్ఞులు రాజకీయ కారణాల వల్ల ఆవేశపూరితంగా వ్యవహరించినప్పటికీ వాటి వల్ల దేశ రాజ్యాంగంలో పొందుపరచిన కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు, సమాఖ్య స్ఫూర్తికి భంగం వాటిల్లకుండా జాగ్రత్తపడుతుంటారు. పోలీసులకూ, సైనికులకూ మధ్య ఘర్షణ జరిగేంత తక్కువస్థాయి రాజకీయాలకు కేంద్ర, రాష్ట్రాలు పాల్పడేలా నేతలు హుందాతనాన్ని కోల్పోతే ఇక రాజ్యాంగమెందుకు? ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎందుకు?



లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ దేశ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. సోమవారం సాయంత్రం నేషనల్ కాంగ్రెస్ పార్టీ నేత, మరాఠాయోధుడు శరద్ పవార్ నివాసంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు నేషనల్ కాన్ఫరెన్స్, జనతాదళ్ (ఎస్)తో పాటు కొన్ని ప్రాంతీయ పార్టీల నేతలు సమావేశమయ్యారు. కోల్‌కతాలో, నగర పోలీస్ కమిషనర్‌ను అరెస్టు చేసేందుకు సిబిఐ అధికారులు పెద్ద ఎత్తున ఆయన ఇంటి వద్ద కేంద్ర భద్రతా దళాలను మోహరించడంపైనా, తర్వాత ఏర్పడిన పరిణామాలపైనా వారు ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని దేవెగౌడ, డిఎంకె నేత స్టాలిన్, ఎస్‌పి నేత రాంగోపాల్ యాదవ్, బిఎస్‌పి నేత మాయావతి, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ మొదలైన వారంతా మమతకు సంఘీభావంగా నిలిచారు. ఆఖరుకు శివసేన కూడా సిబిఐ అధికారులు చేపట్టిన చర్యను ప్రజాస్వామ్యానికి ముప్పుగా అభివర్ణించింది. ఉత్తర, పశ్చిమ భారతంలో తమకు వంద సీట్లు తక్కువ వస్తాయని గ్రహించినందువల్లే బిజెపి బెంగాల్‌లో 10–15 సీట్లు సంపాదించుకునేందుకే ఈ హంగామా సృష్టించిందని శివసేన తన అధికార పత్రిక 'సామ్నా'లో విమర్శించింది. 'అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలిసినట్లు' బిజెపి సంగతి శివసేనకు కాక మరే పార్టీకి ఎక్కువ తెలుస్తుంది?

ఈ విపత్కర పరిణామాలు అవినీతి కుంభకోణానికి సంబంధించిన విషయం మాత్రమేనని ఎవరైనా అనుకుంటే వారు విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి నిరాకరిస్తున్నారని చెప్పక తప్పదు. భారత దేశంలో అనేక అవినీతి కుంభకోణాలు జరిగాయి. కాని ఈ కుంభకోణాలు కేంద్రానికీ రాష్ట్రానికి మధ్య ఘర్షణగా మారిన ఉదంతాలు స్వాతంత్ర్యం తర్వాత ఎప్పుడూ ఎక్కడా జరగలేదు. పోలీసులకూ సిబిఐ అధికారులకు ఘర్షణ జరగడం, సిబిఐ తమ కార్యాలయాన్ని కాపాడుకునేందుకు పారామిలటరీ దళాల్ని రంగంలోకి దించడం వంటి సంఘటనలు గతంలో ఎప్పుడూ వినలేదు.

యుపిఏ హయాంలో బెంగాల్ తీరంలో భారత అమెరికా సంయుక్త వైమానిక విన్యాసాలపై అభ్యంతరం వెలిబుచ్చి సిపిఐ(ఎం) కార్యకర్తలు అడ్డుకుంటారని ఆ పార్టీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య హెచ్చరించడంతో అత్యంత సాత్వికుడైన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సైతం తీవ్రంగా స్పందించారు. రక్షణ, విదేశాంగ విధానాలను అనుసరించే విషయంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ కేంద్రాన్ని అడ్డుకోలేదని, రక్షణ స్థావరాల వద్ద శాంతి భద్రతలను రాష్ట్ర ప్రభుత్వం కాపాడకపోతే ఆ ప్రభుత్వాన్నే రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. దీనితో భట్టాచార్య దిగిరావడమే కాక సిపిఐ(ఎం) అప్పటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ ప్రధానమంత్రికి ఫోన్ చేసి రక్షణ విన్యాసాలకు తమ పార్టీ కార్యకర్తలు ఎలాంటి విఘాతం కల్పించబోరని హామీ ఇచ్చారు. దేశ భద్రతకు సంబంధించి ఇలాంటి కీలక ప్రాధాన్యత గల సంఘటన తప్ప కేంద్రం, రాష్ట్రానికి స్పర్థలు వచ్చిన దాఖలాలు లేవు. రాజనీతిజ్ఞులు రాజకీయ కారణాల వల్ల ఆవేశపూరితంగా వ్యవహరించినప్పటికీ వాటి వల్ల దేశ రాజ్యాంగంలో పొందుపరచిన కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు, సమాఖ్య స్ఫూర్తికి భంగం వాటిల్లకుండా హుందాగా జాగ్రత్తపడుతుంటారు. పోలీసులకూ, సైనికులకూ మధ్య ఘర్షణ జరిగేంత తక్కువ స్థాయి రాజకీయాలకు కేంద్ర, రాష్ట్రాలు పాల్పడితే, నేతలు హుందాతనం కోల్పోతే ఇక రాజ్యాంగమెందుకు? ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎందుకు?

నిజానికి కోల్‌కతా పరిణామాలపై సుప్రీంకోర్టు కలుగ చేసుకోకపోతే పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారి ఉండేది. బహుశా రాజ్యాంగ సంక్షోభం సృష్టించారన్న పేరుతో కేంద్రం మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని రద్దు చేసి ఉండేది. అందుకు గవర్నర్‌ను సిద్ధం చేశారన్న వార్తలూ వచ్చాయి. శారదా కుంభకోణంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దర్యాప్తును అడ్డుకున్నదనడానికి సాక్ష్యాలేమిటని ప్రశ్నించిన సుప్రీంకోర్టు ఒక తటస్థ రాష్ట్రంలో పోలీస్ కమిషనర్‌ను పిలిచి వివరాలు సేకరించవచ్చునని, ఆయనను అరెస్టు చేయనవసరం లేదని చెప్పింది. ఢిల్లీలో కోల్‌కతా పోలీసు కమిషనర్ విచారణనుకానీ, ఆయన అరెస్టును కానీ ఎందుకు అనుమతించలేదు? కేంద్రం, సిబిఐ ఈ ప్రశ్నలకు సంబంధించి ఆత్మపరిశీలన చేసుకోవాలి. శారదా కుంభకోణంపై మమతా బెనర్జీ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఛీఫ్‌గా ఉన్న కోల్‌కతా పోలీసు కమిషనర్ తన దగ్గర ఉన్న వివరాలను సిబిఐకి సమర్పించకపోతే లేక ఆ కుంభకోణంపై విచారణలో సిబిఐకి సహకరించకపోతే ఆ విషయం సుప్రీంకోర్టుకు చెప్పాల్సిన బాధ్యత సిబిఐది. ఎందుకంటే శారదా చిట్ ఫండ్ కుంభకోణం వివిధ రాష్ట్రాల్లో జరిగినందువల్ల దానిపై సిబిఐ విచారణ జరపాలని 2014లో చెప్పింది సుప్రీంకోర్టే. గత అయిదేళ్లలో ఎప్పుడైనా కోల్‌కతా పోలీసు కమిషనర్ తమకు సహకరించలేదని సిబిఐ సుప్రీంకోర్టుకు చెప్పిందా? సరిగ్గా ఇప్పుడే లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి కేవలం నెల ముందు కోల్‌కతా వెళ్లి పోలీసు కమిషనర్ ఇంటిని చుట్టుముట్టాల్సిన అవసరం ఏమొచ్చింది?

బహుశా 2019 ఎన్నికల్లో ఏదో రకంగా మమతా బెనర్జీని అభాసు పాలు చేసి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకే మోదీ సర్కార్ ఈ చర్యకు పాల్పడి ఉండాలి. చిట్‌ఫండ్‌ల పేరిట ప్రజల వద్ద వేల కోట్ల డబ్బులు వసూలు చేసి వ్యాపారాన్ని అనేక రంగాలకు విస్తరించి, ప్రజలను మోసగించిన శారదా కుంభకోణంలో ఎక్కడా మమతా బెనర్జీ పేరు లేదు. నిత్యం నారచీరలు కట్టుకునే ఆమెకు ఈ కుంభకోణంలో వ్యక్తిగత పాత్ర ఉన్నదని ఇంతవరకూ తేలలేదు. ఉంటే మోదీ సర్కార్ ఇప్పటివరకూ ఊరుకునేది కాదు. సరే, ఆమె పార్టీ నేతలు కొందరికి కుంభకోణంలో పాత్ర ఉండవచ్చు. యుపిఏ హయాంలోనే ఈ కుంభకోణం బయటపడి, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నేతలు జైలు పాలయ్యారు. మరో మంత్రి బిజెపి హయాంలో అరెస్టయ్యారు. పశ్చిమబెంగాల్ లోనే కాదు, అస్సాం, జార్ఖండ్, బిజెపి పాలిత ఛత్తీస్‌గఢ్‌కూ ఈ కుంభకోణం పాకింది. విచిత్రమేమంటే ఈ కుంభకోణంలో కీలక పాత్ర వహించి, శారదా గ్రూప్ మీడియా విభాగానికి సారథ్యం వహించి, ఆ గ్రూప్ ఛైర్మన్ సుదీప్త సేన్ కోల్‌కతా నుంచి పారిపోవడానికి సహాయపడ్డారనే ఆరోపణ ఎదుర్కొన్న ఒకప్పటి మమత కుడిభుజం ముకుల్ రాయ్ విచారణ జరుగుతుండగానే బిజెపిలో చేరారు. మరి ఆయనపై సిబిఐ ఇంతవరకూ ఏ విచారణ జరిపిందో ఎవరికీ తెలియదు. అస్సాంకు చెందిన ప్రస్తుత బిజెపిమంత్రి, మాజీ కాంగ్రెస్ నేత హేమంత బిశ్వాస్ శర్మ తన రాష్ట్రంలో శారదా గ్రూప్ వ్యాపారాన్ని విస్తరింపచేసేందుకు ఆ గ్రూప్ నుంచి నెలకు రూ.20 లక్షలు పొందేవారని, తనను రూ.3 కోట్లకు పైగా మోసం చేశారని సుదీప్త సేన్ లేఖ రాశారని ఆరోపణలున్నాయి. ముకుల్‌రాయ్, హేమంత బిశ్వాస్‌లు బిజెపిలో చేరిన తర్వాతే వారిపై సిబిఐ విచారణ మందగించిందని అంటున్నారు. మమతా బెనర్జీని దెబ్బతీసేందుకు ముకుల్ రాయ్‌ను, ఈ కుంభకోణంలో అరెస్టైన మరికొంతమందిని బిజెపి ఉపయోగించుకుంటున్నారని ఆరోపణలున్నాయి. అంతేకాదు, పోలీస్ కమిషనర్‌ను టార్గెట్ చేయడానికి ప్రధాన కారణం ఆయన మమతా బెనర్జీకి నమ్మకస్తుడైన వ్యక్తి కావడమేనని కూడా వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

సిబిఐ కోల్‌కతాలో సృష్టించిన ఈ హంగామా విచారణపై నిజాయితీతో చేసింది కాదనే విషయం స్పష్టమవుతోంది. ఇటీవలి కాలంలో సిబిఐ ఏ దర్యాప్తు అయినా నిజాయితీగా చేసిందని చెబితే నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. గతంలో కూడా సిబిఐ తన రాజకీయ యజమానులకు అనుగుణంగా నడుచుకుంది కాని మోదీ హయాంలో ఆ సంస్థ చాలా పచ్చిగా వ్యవహరిస్తున్నదనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఎంత పచ్చిగా వ్యవహరిస్తున్నదంటే సిబిఐ అధికారులపై సిబిఐ అధికారులే కేసులు పెట్టుకునే దాకా దిగజారారు. సిబిఐ అధికారులే గ్రూపులను నిర్వహించుకుంటారని, ఒక అధికారి అందలం ఎక్కితే మరో అధికారి వర్గాన్ని శంకర గిరి మాన్యాలు పట్టిస్తారని తాజాగా తెలిసింది. సిబిఐకి కనుక నిజాయితీ ఉంటే ముకుల్ రాయ్, హేమంత్ బిశ్వాస్‌లు కటకటాల వెనుక ఉండేవారు. అసలు బిజెపికి అవినీతిపై పోరాడాలన్న నిజాయితీయే ఉంటే వారిని పార్టీలో చేర్చుకునేదే కాదు. సిబిఐకి కనుక నిజాయితీ ఉంటే కొన్ని కేసుల్లో విచారణ మందకొడిగా సాగేది కాదు. కర్ణాటకలో యడ్యూరప్ప, గాలి జనార్దన్ రెడ్డి వంటి అవినీతి, అక్రమ మైనింగ్ ఆరోపణలున్నవారి అండతో ఓట్లు సంపాదించేందుకు ప్రయత్నించిన బిజెపికి నిజంగా అవినీతిపై పోరాడాలన్న నిజాయితీ ఉన్నదా అన్నదే ప్రధాన ప్రశ్న. ఇప్పటికీ కర్ణాటకలో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బిజెపి నేతలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో బేరసారాలు ఆడుతున్నారనేది జగద్విదితం.

సిబిఐని మాత్రమే కాదు, ఐటి, ఈడీ వంటి సంస్థల్ని కూడా ప్రత్యర్థుల్ని బలహీనపరిచేందుకు మోదీ సర్కార్ ఉపయోగించుకుంటున్నదని వివిధ ప్రాంతీయ పార్టీల నేతలు వాపోతున్నారు. కర్ణాటక ఎన్నికల సందర్భంగా వివిధ వ్యాపార సంస్థలపై, పార్టీ నేతలపై విస్తృతంగా దాడులు జరిగాయి. తన ప్రభుత్వంలో ఏసీబీ కార్యాలయాన్నే పారామిలటరీ దళాలు స్వాధీనం చేసుకున్నాయని, తన ఇంటిని కూడా అంగుళం అంగుళం సోదా చేశారని, తన మంత్రులను, నేతలను, అధికారులను కూడా కేంద్ర సంస్థలతో వేధింపులకు గురి చేశారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఎస్‌పి, బిఎస్‌పి నేతలు కూడా తాము ఈ వేధింపులకు గురయ్యామని అంటున్నారు. కొందరు ప్రాంతీయ పార్టీల నేతలైతే అసలు ఈ ఘటనలపై స్పందించేందుకే భయభ్రాంతులవుతున్నారు. ఇదో విచిత్ర పరిణామం.

తమ పార్టీ ఒక్కటే స్వచ్ఛమైనదని, తానొక్కడినే నీతిపరుడినని, మిగతా నాయకులంతా నీతిపరులు కారనీ, వారందరూ ఏకమయి తనను గద్దె దించాలని భావిస్తున్నారని చెప్పేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నట్లు కనపడుతోంది. ఎమర్జెన్సీలో ప్రతిపక్షాలన్నీ దేశంలో అస్థిరత సృష్టిస్తున్నాయని ఆరోపించి ఇందిరాగాంధీ అందర్నీ కట్టకట్టి జైలులో వేస్తే మోదీ ఎమర్జెన్సీ విధించనవసరం లేకుండానే అందర్నీ భయభ్రాంతులు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒకరకంగా ప్రతిపక్షాలన్నీ ఏకం అయ్యేందుకు ఆయనే దోహదం చేస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్, జెడిఎస్ ఏకం కావడానికి, యుపిలో ఎస్‌పి, బిఎస్‌పిలు ఏకం కావడానికి, దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ఏకం కావడానికి మోదీయే కారకులవుతున్నారు. తద్వారా వారి ఓట్ బ్యాంకులు సంఘటితం అయ్యేందుకు వీలు కల్పిస్తున్నారు. కాని ఈ క్రమంలో కేంద్రాన్ని రాష్ట్రాలు శత్రువుగా పరిగణించేలా చేసి ఒక అంతర్గత యుద్ధ వాతావరణం ఏర్పరిస్తే దానికి ఎవరు బాధ్యులు? దేశంలో ఆరోగ్యకరమైన రాజకీయాల స్థానంలో విధ్వంసకర రాజకీయాలు ప్రవేశించడం, ఎన్నికల్లో గెలుపుకు దేశంలో వ్యవస్థలు బలి కావడం ఆందోళన కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

దేవతా మూర్తులకూ హక్కులు ఉంటాయి!

గతంలో దండయాత్రలకు పాల్పడ్డ దురాక్రమణదారులు కేవలం మన దేవాలయాల భౌతిక సంపదను మాత్రమే కొల్లగొట్టారు తప్ప, మన ఆధ్యాత్మిక సంపత్తిని కాదు. ప్రస్తుత కాలంలో, ఈ ఆచార వ్యవహారాలపైనే దాడిచేసి నేటి ఆక్రమణ కారులు గతంలో చేయలేని విధంగా ఆధ్యాత్మిక సంపత్తిని సమూలంగా నాశనం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు.

హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు తమ అజమాయిషీలో ఉంచుకోవడం వలన ఈ దేవాలయాలు భూ, కనక, వస్తు, ద్రవ్య రూపాలలో ఉండే తమ లక్షల కోట్ల సంపదలను చేజార్చుకుంటున్నాయన్న చేదునిజం అందరికీ తెలియడమే కాదు, రికార్డుల్లో ఉంది కూడా! తమిళనాడులో వెలుగు చూసిన ఎన్నో సంఘటనలను గమనిస్తే, వీరు అక్కడి మందిరాలలోని విగ్రహాలను కూడా వదలలేదని, వాటినీ తస్కరించి దొంగరవాణాలు చేశారని కూడా తెలుస్తోంది.

హిందూ దేవాలయాలను పరిరక్షించుకునేందుకు ప్రయత్నాలు చేసే వారికి శబరిమలలో భక్తుల పోరాటం ఒక మంచి ముఖ్యమైన పాఠాన్ని నేర్పింది. దేవాలయ పరిరక్షణ పోరాటాలకు భగవన్మూర్తుల హక్కులకై పోరాడడమే సరైన దిశయని చాటి చూపింది.

1925 ఏప్రిల్ 28 'ప్రమథనాథ్ మల్లిక్ వెర్సెస్ ప్రద్యుమ్నకుమార్ మల్లిక్ ప్రీవీ కౌన్సిల్‌లోని తీర్పు ప్రకారం, సుప్రీంకోర్టు, కేరళ న్యాయస్థానం ఏర్పరచిన నియమాన్ని అనుసరించి, కోవెలలోని దైవానికి సంబంధించిన ఏ విధమైన నిర్ణయం తీసుకుంటున్నా కొలువైన భగవంతుని ఇచ్ఛను, తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. తీర్పును వెలువరించేముందు ఈ సూత్రానికి ప్రాధాన్యత నివ్వాలని ప్రముఖంగా వక్కాణించారు.

1991లో కేరళ హైకోర్టు వెలువరించిన తన తీర్పులో, శబరిమలలో కొలువైన దైవం ఇష్టప్రకారం నైష్ఠిక బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించడానికే తమ తీర్పుల్లో కట్టుబడి ఉంటామని స్పష్టపరిచింది. శబరిమల అయ్యప్పస్వామి ఇష్టాన్ని గురించి కేరళ హైకోర్టు వెలువరించిన ఈ నిజాలను ఎవరూ సవాలు చెయ్యకపోవడం వలన అంతిమ తీర్పుగా వెలువరించడమయింది.

శబరిమల దైవానికి ప్రాథమిక హక్కులంటూ ఉండవని, అందువలన ఆ దైవం ఇష్టాన్ని పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదనీ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు, ఇదే అత్యున్నత న్యాయస్థానం, కేరళ హైకోర్టు తదితరులు కూడా అనుసరిస్తూ వస్తున్న ప్రీవీ కౌన్సిల్ తీర్పులో నిర్ధారించిన నిర్ణయాల ఉల్లంఘన మాత్రమేకాక, తొమ్మండుగురు న్యాయాధిపతుల ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు కూడా విరుద్ధంగానే ఉంది. ఈ తొమ్మండుగురు జడ్జీలు 'స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వెర్సెస్ కమర్షియల్ టాక్సు ఆఫీసర్ అండ్ అదర్స్' కేసులో ఆర్టికల్ 14, ఆర్టికల్ 21, ఆర్టికల్ 25 తదితర అధికరణాల ప్రకారం దేవాలయాలలో ఉండే దైవాలకు హక్కులు ఉంటాయన్న తీర్పు ఇవ్వడం అయింది. (న్యాయవేత్తలకు కూడా)



> 1949లో భారత ప్రభుత్వం తరఫున పటేల్ గారు పద్మనాభస్వామి వారికి ఇచ్చిన మాటను ఈనాడు సుప్రీంకోర్టు ఎట్టి పరిస్థితులలోను మీరరాదని సుప్రీంకోర్టుకు ప్రధాని మోదీ గుర్తు చెయ్యాలి. రాజ్యాంగపరమైన నైతికత అంటే ఆనాడు భగవంతుడైన పద్మనాభస్వామి వారికి– హిందూ దేవతల, భక్తుల హక్కులకు భంగం కలగనీయమని చేసిన ప్రమాణానికి కట్టుబడి ఉండడం.

పూర్వపు తిరువాన్కూరు రాజ్య పరిధిలో ఉండే హిందూ దేవాలయాల దైవాలకు సంబంధించిన ఒక ముఖ్యమైన అంశంపైన ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందం నిజానికి అక్కడి దైవమైన పద్మనాభస్వామికి, భారత ప్రభుత్వానికి మధ్య 1949 జూలై 1న, జరిగిన ఒప్పందం—భగవంతునికి, మానవునికి మధ్య జరిగిన ఒప్పందం—అనే చెప్పాలి. తిరువాన్కూరు పాలకులు తమ రాజ్యాన్ని తమ ఇష్టదైవమైన పద్మనాభస్వామి చరణకమలాల వద్ద సమర్పించుకుని తాము కేవలం ఆ పరమాత్మ సేవకులం మాత్రమే అన్న భావంతో, ఆయన ప్రతినిధులుగా మాత్రమే రాజ్యాన్ని పాలిస్తున్నామన్న భావంతో పరిపాలనను కొనసాగించడమే దానికి కారణం. పైన చెప్పిన ఒప్పందం తిరువాన్కూరు రాజ్యపరిధిలోనున్న అన్ని దేవాలయాలలో కొలువైన దేవతల హక్కులను పరిరక్షిస్తుంది. అంతేకాక, సుప్రీంకోర్టు వీటిని ఏ విధంగాను చిందరవందర చెయ్యకూడదని మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 361(1) ప్రకారం దూరం ఉంచుతోంది కూడా!

సర్దార్ పటేల్ గారి అతిపెద్ద విగ్రహాన్ని స్థాపించిన కేంద్ర ప్రభుత్వాన్ని నరేంద్రమోదీ తన నేతృత్వంలో నడిపిస్తున్నారు. ఆనాడు భారత ప్రభుత్వం తరఫున పటేల్ గారు పద్మనాభస్వామి వారికి ఇచ్చిన మాటను ఈనాడు సుప్రీంకోర్టు ఎట్టి పరిస్థితులలోను మీరరాదని సుప్రీంకోర్టుకు ప్రధాని మోదీ గుర్తు చెయ్యాలి. రాజ్యాంగపరమైన నైతికత అంటే ఆనాడు భగవంతుడైన పద్మనాభస్వామి వారికి హిందూ దేవతల, భక్తుల హక్కులకు భంగం కలగనీయమని చేసిన ప్రమాణానికి కట్టుబడి ఉండడం. కోర్టు నోటీసు సెక్షను 4(1) ఆరాధనా స్థలాల 1991 చట్టం (ప్రత్యేక నియమావళి) ప్రకారం ఆలయాలలోని దేవత ఇష్టాలను గౌరవించడం. హిందూ దేవాలయాల ప్రత్యేకతను పరిరక్షించేందుకు 1947 ఆగష్టు 15న జరిగిన ఒప్పందంలో న్యాయస్థానాలు తల దూర్చరాదన్న నియమాన్ని మరోసారి గుర్తుచేసి కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. 1947 ఆగష్టు 15 నాటికి తిరువాన్కూరు రాజ్యం ఇంకా పద్మనాభస్వామి వారి ఏలుబడిలోనే ఉందని ఇక్కడ ముఖ్యంగా గమనించదగిన విషయం.

శబరిమలపై నేటి నుంచి ప్రారంభమయ్యే సుప్రీంకోర్టు విచారణలో పై అంశాలన్నీ పరిగణనలోకి రావాలని ప్రార్థిద్దాం!

■ సి.ఎస్. రంగరాజన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

'నుమాయిష్'



నేను తగలబడుతున్నానో
నుమాయిష్ తగలబడుతుందో
తలుచుకుంటేనే
నా బాల్య జ్ఞాపకాల
వస్తువులన్నీ బూడిదైపోయినట్లుంది
ఐదో తరగతి చదువుతున్నప్పుడు
బడిపిల్లలమంతా మొదటిసారి
బుడి బుడి అడుగులు అల్లుకుంటూ
ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు
పాదయాత్ర ప్రారంభించాం
చింత చెట్టుకింది
'షా బుద్దీన్ పాన్ షాప్' నుంచి
'లిబర్టీ' పెట్రోలు బంకు మీదుగా
మా 'జులూస్' మొదలయ్యింది
ఇరవై లక్షలుండే నగరం
ఇరువైపులా పచ్చని చెట్లతో
హుస్సేన్ సాగర్ అత్తరు గాలుల మధ్య
హుషారుగా వుండేది
మా డ్రిల్లు మాస్టారు, లెక్కల టీచరు
చూపుల కర్రలతోనే
అన్ని వైపులా కట్టడి చేస్తున్నారు
సైనికుల కవాతులా, నక్షత్రాల బరాతులా
బషీర్ బాగ్ ఇరానీ హోటల్ దాటి
నిజాం కాలేజి నీడల వారగా
నాంపల్లి మైదానానికి
నవ్వుల తివాచీ మీదుగా
నవాబుల్లా చేరుకున్నాం
జుగ్నూల గుంపుల్లా జిగేలుమంటూ
నుమాయిష్ ద్వారాలు కాంతులీనుతున్నాయి
ఆదాబ్! హైద్రాబాద్ అంటూ స్వాగతం
పలుకుతున్నాయి
చారాణా టికెట్టుతో హైరానా పడుకుంటూ
రంగురంగుల లోకంలోకి
రయ్యిన దూసుకు పోయాం
ఒక్కొక్క దుకాణం ఒక్కొక్క దునియా
మక్కాలో వున్నామో మదీనా చూస్తున్నామో
నిలువెల్లా కళ్ళుగా మారిపోయాం
ఒకవైపు బాలామణి
మరోవైపు రాధా రాణి
మాములు క్లాసులో కంటే
హై క్లాసుగా కనిపిస్తున్నారు
అంగళ్లన్నీ రంగవల్లుల్లా
అడుగడుగునా మిరుమిట్లు గొలుపుతున్నాయి
వస్తు ప్రపంచమంతా
మమ్మల్ని బొమ్మల్ని చేసి
ఆ సాయంత్రాన్ని అయిస్కాంతాన్ని చేశాయి
చైనా మౌతార్గన్లు జపాన్ పెన్నులు
లవ్ ఇన్ టోక్యో జడ పిన్నులు
మోటారు సైకిళ్ళ మీదా రకరకాల ఫోజులు
ఇంపాలా కార్లో ఇంపైన ఛాయా చిత్రాలు
ఆఠాణాకు పదహారు గప్ చుప్‌లు
చారాణాకు చాట సైజు అప్పడం
ఆ రుచుల గురించి ఎలా చెప్పడం?
ఈ లోపు 'ముషాయిరా' షురూ అయినట్లుంది.
'బహారో ఫూల్ బర్ సావో'
మహమ్మద్ రఫీ మధుర గీతం
చలికాలం వసంతాన్ని గుర్తుకు తెచ్చింది
లాయిలప్పలు కొనుక్కున్నాం!
జేబుల్లో టిక్కుటిక్కులు నొక్కుతున్నాం!
స్నేహితుల మందరం
సంకేతాలిచ్చుకున్నాం
ఇక ఆఖరి ఘట్టం మిగిలింది
ఆకాశమెత్తు మెట్ల మంచెన సిద్ధంగా వుంది
నేల మీద పెద్ద నీటి తొట్టి నిరీక్షిస్తోంది
మా కాలపు నిప్పుల హీరో
అందరికీ వినమ్రంగా నమస్కరిస్తూ
చకచకా మెట్లెక్కి మంచెన మీద నిలబడి
ఒంటి మీద కిరసనాయిలు పోసుకొని
అందరికీ ఆఖరి అభివాదం చేస్తూ
రెప్పపాటులో అగ్గిపుల్ల వెలిగించుకున్నాడు
భగ్గుమనే మంటల మధ్యలోంచి
నీళ్ళ ట్యాంకులోకి నేరుగా దూకేశాడు
ఉగ్గబట్టుకున్న ఉత్కంఠకు తెరపడింది
ఇంటికొచ్చాక అదే దృశ్యం
పదే పదే వెంటాడేది
ఇప్పుడు తగలబడుతున్నవి ఉత్త దుకాణాలు కాదు
కళాకారుల కన్నీళ్లు
బాలలకు అందవలసిన
భవిష్యత్తు జ్ఞాపికలు.

■ ఎండ్లూరి సుధాకర్

(ఇటీవల దగ్ధమైన నుమాయిష్ స్మృతిలో)

ఆర్థిక సంఘం పనితీరు మారేనా?

ఏప్రిల్ 1, 2020 నుండి 2025 మార్చి 31 వరకు అమలుకానున్న సిఫార్సులను రూపొందించే 15వ భారత ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) ముఖ్యమంత్రితోను, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతోనూ చర్చించేందుకు, దరిమిలా రాష్ట్రావసరాలకు అనుగుణంగా రాష్ట్ర వాటా కింద చెందాల్సిన నిధుల పంపిణీ నిర్ణయించేందుకు, రాష్ట్రానికి రానున్నది. 1951లో మొట్టమొదటిసారిగా ఆర్థిక సంఘం ఏర్పాటు అయినప్పటినుంచీ సంఘ సభ్యులు ఇలా రాష్ట్రాలకు రావడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమే. కాకపోతే రాష్ట్ర ప్రభుత్వంతో వారు జరిపిన చర్చల ఆధారంగా ఎంత మేరకు రాష్ట్రాల అవసరాలు తీరడానికి దోహద పడుతున్నాయనే అంశం జవాబులేని ప్రశ్నగానే మిగులుతుంది. భారత సహకార సమాఖ్య వ్యవస్థలో ఫైనాన్స్ కమీషన్ పాత్ర అత్యంత చాలా కీలకమైంది. 2020 ఆర్థిక సంవత్సరం నుండి, రాబోయే ఐదేళ్ల పాటు రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను, ఆర్థిక ప్రణాళికలను గణనీయంగా ప్రభావితం చేయగలిగే శక్తి కమిషన్ చేసే సిఫార్సులకు ఉంటుంది.

రాష్ట్రాల పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కానీ, ముఖ్యమంత్రితో కానీ చర్చలు ఏదో ఒక సాధారణ వ్యవహారంగా కాకుండా ఒక నిర్దుష్టమైన లక్ష్యం కొరకు, భారత ఆర్థిక వ్యవస్థ పరపతిని దృష్టిలో వుంచుకుని చేసే విధంగా ఆర్థిక సంఘం శైలిలో పరివర్తన, సంస్కరణ రావాల్సిన అవసరం ఎంతైనా వుంది. కేంద్రరాష్ట్ర స్థాయిలో వివిధ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ, ఆర్థిక సంఘం ఆలోచనాధోరణి–విధానంలో గుణాత్మక మార్పు ఆశించినంత స్థాయిలో కనిపించలేదు. ఈ విషయంలో ఆర్థిక సంఘం తనను తాను పరిశీలించుకుని, ఆత్మశోధన చేసుకుంటే మంచిదేమో. కేంద్రంలో అధికారంలో వున్న ప్రభుత్వాల విధానాల వల్ల అసంతృప్తి చెందిన ప్రజలు ఆందోళన చెంది, ప్రత్యామ్నాయల కొరకు అన్వేషిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో వున్న రెండే రెండు పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు దేశాభివృద్ధిలో ఘోరంగా విఫలమయ్యాయి. జాతిని తిరోగమన దిశగా తీసుకెళ్లాయి. అందులో ఆర్థిక సంఘం పాత్ర కూడా అంతో ఇంతో ఉందనాలి.



> కేంద్ర–రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధ బాంధవ్యాల మీదనే ఆర్థిక సంఘం తన సంపూర్ణ దృష్టి సారించాలి. తదనుగుణంగానే దాని సిఫార్సులుండాలి. ఆదాయపు పన్ను వసూళ్ల రాబడిలో రాష్ట్రాల వాటా ప్రగతిశీల పెరుగుదల దిశగా వుండేట్లు కమిషన్ సిఫార్సులుండాలి. నీతీ ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించినట్లు పేద రాష్ట్రాలను ఒకవైపు ఆదుకుంటూనే, దేశానికి గరిష్ఠ ఆదాయం సమకూరుస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహించే విధానం వుండడం మంచిది.

భారత దేశ విస్తృత ఆర్థిక విధానం మొత్తం కేంద్రప్రభుత్వం చేతిలో వుంటుంది. ఏ నిధులనైతే, పన్నులనైతే కేంద్రం విధిగా రాష్ట్రాలకు పంపిణీ చేయాలో, చేయాల్సిన అగత్యం వుందో, ఆ పని చేయకుండా వాటిని కేంద్రీకరించి తమ గుప్పిట్లో పెట్టుకున్నది. నీతీ ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించినట్లు, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల ఎదుగుదలను కేంద్రం అడ్డుకోకూడదు. రాష్ట్రాల అభివృద్ధితోనే, దేశాభివృద్ధి వుందని కేంద్రం భావించాలి. అభివృద్ధిచెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాలికాని నిరుత్సాహపరచడం ఆరోగ్యకరమైన అభ్యాసం కాదు. పేద రాష్ట్రాలను ఒకవైపు ఆదుకుంటూనే, దేశానికి గరిష్ఠ ఆదాయం సమకూరుస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహించే విధానం వుండడం మంచిది. తలసరి ఆదాయం అధికంగా వున్న రాష్ట్రాలను ధనిక రాష్ట్రాల జాబితాలో వేసి పన్నుల్లో వాటాను తగ్గిస్తున్నారు. ఆదాయం తక్కువ వున్న రాష్ట్రాలు ఎక్కువ నిధులు పొందుతున్నాయి. ఉదాహరణకు మిగులు బడ్జెట్ కలిగిన తెలంగాణకు 2.4375 శాతం మేర పన్నుల్లో వాటా ఇవ్వాలని ఆర్థిక సంఘం నిర్ణయించింది. లోటు బడ్జెట్ కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 4.305 శాతం మేర వాటా లభిస్తున్నది. దీని ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.18,560 కోట్లు రాగా, ఆంధ్రప్రదేశ్‌కు రూ.32,787 కోట్లు లభించాయి. 2019–20 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ వ్యత్యాసం కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్రానికి రూ.20,583 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.36,360 కోట్లు రానున్నాయి. దేశానికి అత్యధిక ఆదాయం సమకూర్చే ఐదారు రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న తెలంగాణకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో తగిన వాటా దక్కడం లేదు.

కొద్దిపాటి నిధుల విషయంలో కూడా కేంద్రం అనేక రకాల నిబంధనలు విధిస్తున్నది. ఇది మంచిపద్ధతి కాదు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధాలు వుండాల్సిన రీతిలో, ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా లేవు. రాష్ట్రాల వాటాగా రావాల్సిన కేంద్ర నిధుల పంపిణీ, రాష్ట్రాలను అగౌరవ పరిచే విధంగా ఉన్నదికాని వాళ్ల మాటకు విలువ ఇస్తున్నట్లు లేదు.

ముందస్తుగానే ఒక అవగాహనకొచ్చి, తమ ఆలోచనాధోరణికి అనుగుణంగా ఆర్థిక సంఘం రాష్ట్రాల పర్యటనకు రావడమనే విధానంలో సహితం మార్పు రావాలి. ఈ విధానంలో సంస్కరణలు రావాలి. రాష్ట్రాలకు వచ్చి, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపిన తరువాత రూపొందించాల్సిన సూచనలకు సంబంధించి ముందుగానే ఒక నిర్ణయానికి రాకూడదు. కేవలం సిఫార్సులు చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా, విధాన నిర్ణయాత్మక వ్యవస్థగా ఆర్థిక సంఘం రూపుదిద్దుకుంటే ఫలితం ఎక్కువగా వుంటుంది. రాష్ట్రాల వాటా కింద చెందాల్సిన నిధుల పంపిణీ విషయంలో రాష్ట్రాలకు పూర్తి హక్కు వుంది. రాష్ట్రాల అవసరాల విషయంలో గణనీయంగా వైవిధ్యం కొట్టవచ్చినట్లు కనపడుతుంది.

కేంద్ర–రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధ బాంధవ్యాల మీదనే ఆర్థిక సంఘం తన సంపూర్ణ దృష్టిని సారించాలి. తదనుగుణంగానే దాని సిఫార్సులుండాలి. ఆదాయపు పన్ను వసూళ్ల రాబడిలో రాష్ట్రాల వాటా ప్రగతిశీల పెరుగుదల దిశగా వుండేట్లు కమిషన్ సిఫార్సులుండాలి. రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే గ్రాంట్స్ ఇన్ ఎయిడ్స్ మొత్తాలు కూడా క్రమేపీ పెరుగుతుండే విధంగా కమిషన్ సిఫార్సు చేయాలి. అసలు సిసలైన సహకార సమాఖ్య వర్ధిల్లడానికి, రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తి పటిష్ఠంగా వుండడానికి పైన పేర్కొన్న చర్యలన్నీ సజావుగా చేపట్టాలి. కేంద్రరాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు బలపడేరీతిలో, ఇరువురి మధ్య విత్తసంబంధమైన విభేదం లేకుండా, వనరుల పంపకానికి రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రకరణలకు అదనంగా, ఆర్థిక సంఘం ఒక సంస్థాగత కార్యాచరణతో పనిచేయాల్సిన అవసరం వుంది.

మొదటి ఆర్థిక సంఘం ఏర్పాటైన తరువాత దాని పనితీరులో, ఆలోచనా విధానంలో, శైలిలో ఎన్నో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటికి 15 ఫైనాన్స్ కమిషన్లను ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. 2017 నవంబర్‌లో మాజీ ప్రణాళికా సంఘం సభ్యుడు, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి ఎన్‌కే సింగ్ ఛైర్మన్‌గా 15వ ఆర్థిక సంఘం ఏర్పాటైంది. పటిష్ఠమైన విత్త నిర్వహణకు ఒక సరైన ఆర్థిక స్థిరీకరణ రోడ్ మ్యాప్; కేంద్రరాష్ట్రాల ఆర్థికస్థితిగతులమీద జీఎస్‌టీ ప్రభావం; రాష్ట్రాల రెవెన్యూ లోటు పూడ్చడానికి నిధుల మంజూరు అవసరం విషయంలో సమీక్ష; 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రాలకు ఇస్తున్న పన్నుల వాటాలో పెంపుదల విషయంలో సమీక్ష; రాష్ట్రాలు చేసే అప్పులకు సంబంధించి వున్న నిబంధనల సడలింపుపై సమీక్ష; రాష్ట్రాల పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలివ్వడం లాంటివి ఆర్థిక సంఘం చేయాల్సిన సిఫార్సుల్లో వున్నాయి.

ఆర్థిక సంఘం అధ్యక్షుడుగా నియమించబడ్డ రాజకీయవేత్తలు అవునన్నా కాదన్నా అధికార పార్టీకి అనుకూలంగానే సూచనలు, సిఫార్సులు చేసే అవకాశం మెండుగా వుంది. అలాంటి భావనకు తావు లేకుండా 15 వ ఆర్థిక సంఘం సిఫార్సులు ఉంటే అంతకంటే కావాల్సింది లేదు. అందుకే, ఆర్థిక సంఘం పనితీరులో పరివర్తన, సంస్కరణ రావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ దిశగా 15వ ఆర్థిక సంఘం ఆలోచిస్తుందనీ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూస్తుందనీ ఆశిద్దాం.

■ వనం జ్వాలా నరసింహారావు

మార్కెట్లో పంటలు-పడిపోయిన ధరలు



మార్కెట్‌లో ధరలు రైతు కంట కన్నీరు పెట్టిస్తున్నాయి. దిక్కుతోచని అయోమయ స్థితికి నెట్టేస్తున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకుని... ఆరుగాలం కష్టించి.. పండించిన పంటలకు తగిన ప్రతిఫలం దక్కడం లేదు. కనీసం పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వివిధ జిల్లాల్లో రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించుకుంటున్న తరుణంలో అక్కడి ధరలు వారిని నిశ్చేష్టులను చేస్తున్నాయి. గతేడాది కంటే మరింత తక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో గత్యంతరం లేక అయిన కాడికి అమ్ముకుని విషణ్ణవదనంతో తిరుగు పయనమవుతున్నారు.



ఖమ్మం మార్కెట్‌కు

45వేల మిర్చి బస్తాలు

ఖమ్మం మార్కెట్: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం మిర్చి భారీగా వచ్చింది. రైతులు 45వేల మిర్చి బస్తాలను అమ్మకానికి తెచ్చారు. ఇంత మొత్తంలో మార్కెట్‌కు రావడం ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి. ధర క్వింటాల్ రూ.8,800 జెండాపాటగా నిర్ణయించగా.. కనిష్టంగా క్వింటాలు రూ.8వేలకు తగ్గకుండా కొనుగోళ్లు జరిగాయి. తాలుమిర్చి క్వింటాలు రూ.3వేల నుంచి రూ.4వేల మధ్య కొనుగోలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, కృష్ణా జిల్లాల నుంచి సైతం రైతులు మిర్చి పంటను మార్కెట్‌కు తీసుకొస్తున్నారు.

పత్తికి 'మద్దతు' కోసం ఆందోళన

పెద్దపల్లి: పత్తికి మద్దతు ధరలు చెల్లించడం లేదని ఆగ్రహించిన రైతులు పెద్దపల్లిలో ఆందోళనకు దిగారు. రాజీవ్ రహదారిపై బైఠాయించి గంటకు పైగా రాస్తారోకో చేశారు. దీంతో పెద్దఎత్తున వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌కు 891 మంది రైతులు 3,634.26 క్వింటాళ్ల పత్తిని విక్రయానికి తీసుకొచ్చారు. వ్యాపారులు మధ్యాహ్నం 3 గంటలకు కూడా ధరలు పెట్టకుండా తాత్సారం చేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు మార్కెట్ ముందు గల రాజీవ్ రహదారిపై గంటకుపైగా రాస్తారోకో చేశారు. పోలీసులు రైతులను సముదాయించి మార్కెట్‌లోకి తీసుకెళ్లారు. అయినా కూడా మద్దతు ధరలు పెట్టకపోవడంతో అయిన కాడికి అమ్ముకోవాల్సివచ్చింది.



పసుపు రైతు గగ్గోలు

నిజామాబాద్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లాలో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నారు. పెట్టుబడులు కూడా రాని దుస్థితిలో పసుపు రైతులు అల్లాడుతున్నారు. స్థానిక వ్యాపారులు ముందుకు రాకపోవడం, ఈ-నామ్‌పై బయటి వ్యాపారులు ఉత్సాహం చూపకపోవడంతో ధర పెరగడం లేదు. మంగళవారం 25వేలకుపైగా బస్తాల పసుపు వచ్చింది. రూ.4,500-6,000 క్వింటాల్ చొప్పున అమ్మకాలు జరిగాయి. మహారాష్ట్రతో పోలిస్తే జిల్లాలో రేటు తక్కువగా వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు పట్టించుకుని ధర వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. మద్దతు ధర నిర్ణయించకున్నా పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా గిట్టుబాటు ధర వచ్చేవిధంగానైనా చూడాలని కోరుతున్నారు.

ఖమ్మానికి కూలీల వలస



ఏన్కూరు: మిర్చి కోతలకు ఖమ్మం జిల్లాకు భారీగా వలస కూలీలు వస్తున్నారు. ఒక్క ఏన్కూరు మండలానికే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి సుమారు 8వేల మంది వలసకూలీలు వచ్చారు. వీరు మిర్చి ఏరడంతోపాటు, జామాయిల్, పామాయిల్ కటింగ్ పనులు చేస్తున్నారు. మిర్చి ఏరినందుకు కేజీకి రూ.7 నుంచి రూ.8 ఇస్తున్నారు. తమ రాష్ట్రాల్లో కూలి పనులు కూడా దొరికే పరిస్థితి కనిపించకపోవడతో కుటుంబాలతో సహా ఇక్కడకు వస్తున్నామని కూలీలు చెబుతున్నారు. వారి బాగోగుల్ని రైతులే చూస్తుండటం గమనార్హం. ఏన్కూరుతోపాటు టీఎల్ పేట, రాజలింగాల, బురదరాఘవాపురం, తిమ్మారావుపేట, జన్నారం, రాయమాధారం, కేసుపల్లి, రేపల్లెవాడ, నాచారం తదితర గ్రామాలకు భారీసంఖ్యలో వలసకూలీలు వచ్చారు. వీరంతా రెండు నెలలపాటు ఇక్కడ కూలి పనులు చేసుకుని.. అనంతరం తమ రాష్ట్రాలకు తిరిగి వెళ్తారు.



తాండూరు: వికారాబాద్ జిల్లా తాండూరులో నాణ్యమైన కందిపప్పు (సర్టెక్స్) క్వింటాలు రూ.8200లు ధర పలుకుతోంది. పంట ఆశాజనకంగా లేకపోవడంతోపాటు కందుల ధరలు కూడా మార్కెట్‌లో రూ.5531 పలుకుతుండటంతో ధరకు రెక్కలొచ్చాయి. గతేడాది క్వింటాలు రూ.7వేలు పలికిన కందిపప్పు ఈ సారి రూ.8200లకు చేరుకుంది. గతేడాదితో పోలిస్తే ఇది రూ.1200లు అధికం. నాన్ సర్టెక్స్ కందిపప్పు క్వింటాలు రూ.8వేలు, పాత కందిపప్పు రూ.7400ల వరకు ధర ఉంది. ఈ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి.

'పేట'కు పోటెత్తిన పత్తి



సూర్యాపేట సిటీ: సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బాలెంలలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి మంగళవారం పత్తి పోటెత్తింది. పత్తి లోడుతో వాహనాలు బారులు తీరాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మిర్యాలగూడెం, నకిరేకల్, చిట్యాల, దేవరకొండ ప్రాంతాల్లో కేంద్రాలను మూసివేయడంతో సీసీఐ కేంద్రానికి వాహనాల తాకిడి ఎక్కువైంది. మంగళవారం ఒక్కరోజే 110 పైగా ట్రాక్టర్లు కేంద్రానికి పత్తి లోడుతో వచ్చాయి. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ట్రాక్టర్లకు టోకెన్లను అందించారు. ఒక్క రోజే 1,000 క్వింటాళ్లకు పైగా 45మంది రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేశారు. వాహనాలు ఎక్కువ రావడంతో అధికారులు రెండు రోజులు (బుధ, గురువారం) సెలవులు ప్రకటించారు.

పాపం.. పండుటాకులు..!

- ఇంట్లోకి రానివ్వని కొడుకులు
- వృద్ధ దంపతుల భిక్షాటన

లింగాలగణపురం ఫిబ్రవరి 5: అలసిపోయిన శరీరాలు.. సేద దీరాల్సిన బతుకులు.. పాపం.. ఆ పండుటాకులకు బతుకు భారమైంది. కనిపెంచిన కొడుకులే ఇంట్లోకి రానివ్వకపోతే.. కాసిన్ని మెతుకులతో తమ పొట్ట నింపేందుకు కనికరించకపోతే.. ముదిమి వయసులో ఆరుబయట చలిలోనే నిద్రపొమ్మని గెంటేసిన తమ కొడుకులను తలచుకుని రోదిస్తున్న ఆ కన్నవారి ఆవేదన స్థానికులను కలచివేస్తోంది. అందరూ ఉన్నా.. ఆకలి తీర్చుకోవడానికి బిచ్చమే గతిగా మారిన ఓ వృద్ధజంట దయనీయ గాథ ఇది. జనగామ జిల్లా లింగాలగణపురం మండలం నెల్లుట్లలో అంజమ్మ-యాదగిరి దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రెక్కలుముక్కలు చేసుకుని పిల్లలను పెంచి పెద్ద చేసి, పెళ్లిళ్లు చేశారు. తమకున్న భూమిని ముగ్గురు కొడుకులకు అరెకరం చొప్పున అప్పగించి, ఇంటి స్థలాన్ని కూడా పంచి మరో ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రోడ్డు విస్తరణలో ఆ ఇల్లు కూల్చేయడంతో తలదాచుకునేందుకు కొడుకుల చెంతకు వెళ్లగా, వారు కాదు పొమ్మన్నారు. దీంతో ఆరుబయటే చలికి వణుకుతూ గడుపుతున్నారు. మూడు రోజులుగా గ్రామస్థుల్ని యాచిస్తూ వారు అందించే ఆహారంతో తమ కడుపు నింపుకుంటున్నారు.


బజారులో విలపిస్తున్న అంజమ్మ, యాదగిరి

ఇద్దరు రైతుల ఆత్మహత్య

టేకులపల్లి/ పరకాల రూరల్, ఫిబ్రవరి 5: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో మంగళవారం కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దాసుతండా పంచాయతీ లచ్చాతండాకు చెందిన రాంబాబు(31) నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. పంటలు పండక, అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై.. పత్తి చేనులో పురుగుల మందు తాగి కన్ను మూశాడు. వరంగల్ రూరల్ జిల్లా నడికూడ మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి ఎల్లయ్య (45) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఉరేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. పత్తి పంట సాగు చేస్తున్న ఎల్లయ్యకు గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి లేదు. సుమారు 6లక్షలు అప్పు తీరే దారి లేక సోమవారం రాత్రి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు.

అర్ధరాత్రి టీఆర్‌ఎస్ రాష్ట్ర నేత అరెస్ట్

గూడూరు రూరల్, ఫిబ్రవరి 5: మహబూబాబాద్ జిల్లా మచ్చెర్ల శివారు తార్యాతండాలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బానోత్ రవికుమార్‌ను సోమవారం అర్ధరాత్రి రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో రైల్‌రోకోలు నిర్వహించినప్పుడు రవికుమార్‌పై రైల్వే పోలీసులు కేసులు పెట్టారు. ఈ కేసు విచారణకు హాజరుకాకపోవడంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని వరంగల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రవికుమార్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి

- ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రూ.10వేల డిమాండ్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 5: వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి చిరునామాగా మారింది. వ్యవసాయ భూముల కోసం వచ్చే వారు రూ.2వేలు సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్ పేపర్లు అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల పుప్పాల రజనీకాంత్ అనే వ్యక్తి.. ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి రాగా.. రూ.10వేల లంచం ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ రమాదేవి చెప్పారు. ఈ తతంగాన్ని రికార్డ్ చేసి నెట్టింట పెట్టడంతో వైరల్‌గా మారింది. దీని ఆధారంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు నమోదైంది.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

కామేపల్లి రూరల్, ఫిబ్రవరి 5: ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని జాస్తిపల్లి గ్రామానికి చెందిన మల్లెంపాటి ప్రకాశ్(25) మూడేళ్లుగా సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా అసోంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం తుపాకీ మిస్ ఫైర్ కావడంతో ప్రాణాలు కోల్పోయాడు. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. అతడిని గుర్తు చేసుకుని గ్రామస్తులు విలపించారు.


ప్రకాశ్

ఎస్సీ రైతులకు ఆర్థిక భరోసా

- బర్రెల పంపిణీకి కార్యాచరణ
- యూనిట్‌కు 4లక్షల వ్యయం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ రైతులను ఆర్థికంగా ఆదుకునే చర్యల్లో భాగంగా పాడి యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కో రైతుకు రూ. 4లక్షల వ్యయంతో 4ముర్రా జాతి బర్రెలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ ఆదాయంతోపాటు పాడి గేదెల ద్వారా అదనపు లబ్ధి చేకూరనుంది. ఇందుకోసం రైతు ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రతి యూనిట్‌లో నాలుగు బర్రెలను 60శాతం సబ్సిడీతో అందించనున్నారు. మిగతా 40శాతం మొత్తాన్ని విజయా బ్యాంకు సహకారంతో రుణం ఇప్పించేందుకు ఎస్సీ కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఈ మేరకు కనీసం అరెకరం భూమి ఉన్న రైతులను ఎంపిక చేసి ఒక్కో గ్రామంలో ఒక సొసైటీ ఏర్పాటు చేయనున్నారు. అందులోని సభ్యులందరికీ విడతల వారీగా యూనిట్లు మంజూరు చేస్తారు. ఉత్పత్తి అయిన పాలను సేకరించి, విజయ డైరీ ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బర్రెలకు బీమాతోపాటు రైతుల ఇళ్లకు చేర్చేందుకు అయ్యే రవాణా ఖర్చు కూడా ఎస్సీ కార్పొరేషన్ భరిస్తుంది. అలాగే, పశుసంవర్ధక శాఖ ద్వారా దాణా సైతం పంపిణీ చేయనుంది. గత ఏడాది పైలట్ ప్రాజెక్టు కింద సూర్యాపేట జిల్లాలోని ఐదు మండలాలను ఎంపిక చేసి 829 మంది ఎస్సీ సన్న, చిన్నకారు రైతులకు ముర్రే జాతి బర్రెలను పంపిణీ చేశారు. తాజాగా ఆ జిల్లాలోని మిగతా మండలాలతోపాటు భూపాలపల్లి, వరంగల్ రూరల్, మహబూబాబాద్ జిల్లాల్లోని ఎస్సీ రైతులకు యూనిట్లు మంజూరు చేసేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది.



పరంజ్యోతి

అంత్యకాల స్మరణ

అంత కాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం
యః ప్రయాతి స మద్భావం యాతినాస్తి అత్ర సంశయః

"ఎవడు మరణ కాలమందు కూడా నన్నే స్మరిస్తూ దేహాన్ని విడిచి వెళతాడో, అతడు నా స్వరూపాన్నే పొంద గలడు. ఈ విషయంలో ఎలాంటి సందేహం/సంశయం అక్కరలేదు" అన్నాడు గీతాచార్యుడు. మనకి తరించడానికి చక్కని అవకాశం కల్పించాడు. కానీ.. ఏ జీవికైనా అంత్యకాలమెప్పుడు? ఇదే ఘడియా? తరువాతి ఘడియా? నేడా? రేపా? ఏడాదికా? చెప్పలేం. ఏ క్షణమైనా ఈ దేహం.. మహావృక్షం కూలిపోయినట్టుగా భూమిపై పడిపోతుంది. కాబట్టి ఆ విషయం గ్రహించి దైవ స్మరణ చేస్తూ ఉండాలి. ఎందుకంటే దైవస్మరణ అనేది మరణ సమయాన అప్పటికప్పుడు నిర్ణయించుకొనేది కాదు. బాల్యం నుంచే స్మరణ శిక్షణ పొందాలి. యవ్వనం ఉన్నప్పుడే.. పళ్లు, కళ్లు, దేహం, అవయవాలు, మనసు, అన్నీ సవ్యంగా పనిచేస్తున్నప్పుడే, చిత్తచాంచల్యం దరిజేరక ముందే, స్మరణను అలవాటుగా మార్చుకుంటే, అంత్యదశలో స్మరణ స్వాధీనంలో ఉంటుంది. లేదంటే.. మరణ సమయంలో శారీరక స్థితి అందుకు సహకరించదు. నాడి బలహీనమై పోతుంది. బతుకు పరాధీనమవుతుంది. ఆ సమయంలో దైవస్మరణ శ్రమతో కూడి ఉంటుంది. అందుకే.. ఉద్యోగంలో చేరిన వ్యక్తి ధనాన్ని ముందుగా భద్రపరచుకొని, పదవీ విరమణ అనంతరం ఆ సొమ్ము తనను కాపాడుతుందని ఎలా తలుస్తాడో అదేవిధంగా చిన్ననాటి నుంచి అలవాటైన దైవ స్మరణ తనకు చరమాంకదశలో అలవాటుగా సాగి భగవత్ సాన్నిధ్యం కలిగిస్తుందని తెలుసుకోవాలి. అందుకే ప్రణాళికాబద్ధంగా నిరంతర స్మరణ ఈ దేహానికి అలవాటు చేయాలి. మన గమ్యం భగవత్ సాన్నిధ్యమే గానీ, తిరిగి జన్మించడం కాదుగా. ఆ విషయం స్మృతిలో జ్వలిస్తూ ఉండాలి. చివరి సమయపు భావన స్థిరమైనది అని ముందే గ్రహించి 'ఎరుక'తో ఉండాలి. దీర్ఘ ప్రయాణానికి 'దారి బత్తెం' సేకరించి పెట్టుకున్నట్టే స్మరణ అలవాటును సేకరించి పెట్టుకోవాలి. అంత్యకాలమునందు



మాత్రమే స్మరణ అన్న భావన రానీయక, సోమరి తనానికి తావీయక, "తస్మాత్ సర్వేషు కాలేషు మాం అనుస్వర' అన్న శ్లోక పాద సారాన్ని గ్రహించాలి. మరణ సమయాన భగవంతుడి స్మరణ తప్ప.. ప్రయోజన శూన్యమైన సంసార తాపత్రయాలను దరిజేరనీయకూడదు. ఆయువు తీరాక భక్తి నావ ద్వారా సముద్రాన్ని అలవోకగా దాటగలనని భావిస్తూ దృఢచిత్తులై శరీరాన్ని అలవోకగా విడిచిపెట్టాలి. అప్పుడే ఆత్మ.. పరమాత్మ అయిన ఆ భగవంతుడిని చేరగలదు. నాలుగు రకాల మోక్షాలైన.. సాలోక్యం, సాయుజ్యం, సామీప్యం, సారూప్యాలలో భక్తుడి స్మరణ, భక్తి పారవశ్యాల ఆధారంగా ఏదో ఒకటి ప్రాప్తించగలదు.

- వేదాంతం జగన్నాథాచార్య, 98859 50072



సీతారామయ్య, రాజ్యలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న కాలనీ వాసులు


ఆంధ్రా జంటకు ఆత్మీయ వీడ్కోలు

- **ఉద్యోగ విరమణ అనంతరం స్వరాష్ట్రానికి..**
- **ఘనంగా సత్కరించిన కాలనీ వాసులు**

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 5: రాష్ట్రం విడిపోయినా తెలుగు ప్రజల మధ్య ఆత్మీయత అలాగే ఉందని నిరూపించారు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ డాక్టర్స్ కాలనీ వాసులు. బతుకు తెరువు కోసం వరంగల్‌కు వచ్చి ఉద్యోగ విరమణ అనంతరం స్వరాష్ట్రానికి బయలు దేరిన ఆంధ్రా దంపతులకు కాలనీవాసులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. తీపి జ్ఞాపకాలు, 44 ఏళ్లుగా పంచుకున్న ఆత్మీయతను గుర్తు చేసుకొని సాదరంగా సాగనంపారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన కంటమనేని సీతారామయ్య 1975లో చదువు నిమిత్తం వరంగల్ జిల్లాకు వచ్చారు. చదువు అనంతరం వ్యవసాయశాఖ అధికారిగా ప్రభుత్వ కొలువు సాధించారు. తమ ప్రాంతానికి చెందిన రాజ్యలక్ష్మిని పెళ్లి చేసుకొని వరంగల్ నగర కేంద్రానికి సమీపంలోని డాక్టర్స్ కాలనీ-2లో స్థిరపడ్డారు. నాటి నుంచి కాలనీ అభివృద్ధి పనులలో, దేవాలయ కమిటీలో సేవలందించి అక్కడి వారితో కలిసిపోయారు. కాగా, ఇటీవల పదవీ విరమణ పొందిన సీతారామయ్య తన బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలని స్వరాష్ట్రానికి బయలు దేరారు. వారిని మంగళవారం డాక్టర్స్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. స్థానిక కార్పొరేటర్ కావటి కవితయాదవ్ ఆధ్వర్యంలో దంపతులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు.

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మాతృవియోగం

బాన్సువాడ, ఫిబ్రవరి 5: రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మాతృవియోగం కలిగింది. స్పీకర్ తల్లి పరిగె పాపవ్వ(107) గత మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. పాపవ్వకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొదటి కుమారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రెండో కుమారుడు శంభురెడ్డి. బుధవారం వారి స్వగ్రామం పోచారంలో పాపవ్వ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.



పరిగె పాపవ్వ

● ఆకు కనిపించనంత పూత

శివరాత్రి నాటికి చెట్లకు శివలింగాలంత సైజులో మామిడి కాయలుంటయని అంటారు. మరి.. ఆ పండుగ నాటికి ఇరగ్గాసిన కాయలతో ఈ చెట్టు కొమ్మలు నేలకు వంగి పోతాయేమో! ఆకులు కనిపించనంతంగా ఎంత నిండుగా పూసిందో కదా ఈ వృక్ష రాజం! కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం శివారులో ఉందీ చెట్టు. ఆ దరిదాపుల్లోంచి వెళుతున్నవారిని కమ్మని పూత వాసన కాలు కదపనిస్తే ఒట్టు. అన్నారం రహదారి గుండా వెళ్లే వాహనదారులు కొద్దిసేపు ఆగి చక్కని గుబాళింపుతో సేదతీరుతున్నారు.



- రామారెడ్డి

ప్రభుత్వబడి..విద్యార్థులేరీ?

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సర్కారీ బడి చిన్నబోతోంది. ఏటికేడాది వాటిలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రభుత్వ బడుల్లో తమ పిల్లల్ని చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపించడం లేదు. ప్రైవేటు స్కూళ్లు, గురుకులాలకే మొగ్గు చూపిస్తున్నారు. పాఠశాల విద్యా శాఖ గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య ఏటికేడాది గణనీయంగా పడిపోతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య మరింత ఎక్కువ. తక్కువ విద్యార్థులున్న పాఠశాలలు వేలల్లో ఉంటే.. ఎక్కువ మంది విద్యార్థులున్న స్కూళ్లు వందలకే పరిమితమయ్యాయి. ఉన్నత పాఠశాలలతో పోలిస్తే.. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మరింత దారుణం. గత ఏడాది అంటే 2017-18 విద్యా సంవత్సరంలో 40 మంది కన్నా తక్కువ విద్యార్థులున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య 9,166గా ఉంది. ప్రస్తుత (2018-19) విద్యా సంవత్సరంలో అది 10,781కి చేరింది. ఇక, 40 మంది కన్నా ఎక్కువ విద్యార్థులున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య గత ఏడాది 10,470 కాగా.. ఈ ఏడాది 9,793కి తగ్గిపోయింది. కేవలం ఒక్క ఏడాదిలోనే 677 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పడిపోయింది. అలాగే, ఉన్నత పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కానీ, ప్రాథమిక పాఠశాలలతో పోలిస్తే.. వీటి పరిస్థితి కాస్త మెరుగు.

ఇదీ లెక్క..

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య

విద్యార్థులు	2017	2018	భేదం
40లోపు	9,166	10,781	1,615
40కిపైగా	10,470	9,793	677

ఉన్నత పాఠశాలల సంఖ్య

విద్యార్థులు	2017	2018	భేదం
100లోపు	974	1,196	222
300లోపు	2,588	2,450	138
300కిపైగా	1,048	986	62

భాషా పండితుల కల సాకారం

(మూడో పేజీ తరువాయి)

ప్రస్తుతం ఎక్కడ పని చేస్తున్న వారిని అక్కడే పదోన్నతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. న్యాయపరమైన సమస్యలు ఎదురుకాకుండా ఈ విధమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇక పండిట్ల సమస్య పరిష్కార బాధ్యతను సీఎం కేసీఆర్... సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్దన్‌రెడ్డి, పాతూరి సుధాకర్‌రెడ్డిలకు అప్పగించారు. వీరు నిరంతరం పర్యవేక్షిస్తూ పండిట్ల పదోన్నతుల అంశాన్ని ముందుకు తీసుకెళ్లారు.

ఫలించిన పోరాటం...

పండిట్లకు పదోన్నతులు కల్పించకపోవడంతో గ్రేడ్-2 పోస్టులో ఉద్యోగం పొంది.. 20-25 ఏళ్ల సర్వీస్ అందించి అదే స్థాయిలో ఉద్యోగ విరమణ పొందాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో పదోన్నతుల కోసం పండిత ఉపాధ్యాయులు 20 ఏళ్లనుంచి పోరాడుతున్నారు.తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరికి పదోన్నతులు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. తమకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(రుప్ టీఎస్) అధ్యక్షుడు జగదీశ్ గతేడాది సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన సీఎం కేసీఆర్.. పండిట్ల పదోన్నతు లకు సంబంధించిన ప్రక్రియను చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి 2018 జూలై 28న సీఎం కార్యాలయం నుంచి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ అయ్యాయి. సీఎం ఆదేశించిన దాదాపు ఆరు నెలల అనంతరం వారి పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ లభించింది.

10 వేల మందికి ప్రయోజనం

ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని సుమారు 10వేల మంది ఉపాధ్యాయులకు లాభం జరగనుంది. పండిట్ల పదోన్నతులకు సంబంధించి గతంలో 2487 పండిట్ పోస్టులను ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పుడు తాజాగా మరో 6024 పోస్టులను అప్‌గ్రేడ్ చేసింది. అదే విధంగా పీఈటీలకు సంబంధించి గతంలో 1047 పోస్టులను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసింది. తాజాగా మరో 786 పోస్టులను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా మొత్తం 1833 పీఈటీ పోస్టులను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసినట్లైంది. మొత్తంగా పండిట్లు, పీఈటీలు కలిపితే 10,344 మందికి పదోన్నతులు లభించనున్నాయి.

పండిట్లకు పదోన్నతులు కల్పించినందుకు సీఎం కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో కలిసి ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్ధన్ రెడ్డి, పాతూరి సుధాకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. తమ చిరకాల కోరికను సార్థకం చేసిన సీఎం కేసీఆర్‌కు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షుడు జగదీశ్, అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు. పండిట్ల పదోన్నతులకు అనుమతిచ్చిన సీఎంకు యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాములు, చావ రవి కృతజ్ఞతలు తెలిపారు.

ఇదీ లెక్క...

పండిట్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా	
గతంలో అప్‌గ్రేడ్ చేసిన పండిట్ పోస్టులు	2487
ప్రస్తుతం అప్‌గ్రేడ్ చేసిన పోస్టులు	6024
మొత్తం పోస్టులు	8511
పీఈటీ నుంచి పీడీలుగా	
గతంలో అప్‌గ్రేడ్ చేసిన పీఈటీ పోస్టులు	1047
ప్రస్తుతం అప్‌గ్రేడ్ చేసిన పోస్టులు	786
మొత్తం అప్‌గ్రేడ్ అయిన పోస్టులు	1833



బుచ్చిరాములు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జగదీశ్‌రెడ్డి, చిరుమర్తి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు, బుచ్చిరాములు (ఫైల్ ఇన్‌సెట్‌లో)

వర్దెల్లి బుచ్చిరాములుకు ఘన నివాళి

- **సేవలను గుర్తు చేసుకున్న నేతలు, ప్రజాప్రతినిధులు**

సూర్యాపేట టౌన్ ఫిబ్రవరి 5: సీపీఎం సీనియర్ నేత, పార్టీ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు వర్దెల్లి బుచ్చిరాములు(85)కు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ఘనంగా నివాళులర్పించారు. తన జీవితాన్ని చివరి నిమిషం వరకు పేద ప్రజల కోసం అంకితం చేశారంటూ కొనియాడారు. కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బుచ్చిరాములు.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కొద్ది సేపు ఉంచారు. ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల నర్సింహయ్య, బొల్లం మల్లయ్యయాదవ్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ తదితరులు బుచ్చిరాములు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో జన్మించిన బుచ్చిరాములు.. భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. సీపీఎం తరపున ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారు. తుంగతుర్తి, సూర్యాపేట డివిజన్ కార్యదర్శిగా పని చేశారు. 1994లో జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి సీపీఎం తరపున పోటీ చేసి కేవలం 750 ఓట్ల స్వల్ప తేడా ఓటమి చెందారు. అయినప్పటికీ ఉద్యమబాట వీడలేదు. బుచ్చిరాములు కుమారుడు ఓ ప్రముఖ దినపత్రిక ఎడిటర్‌గా కొనసాగుతున్నారు. కుమార్తె ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

పీఎం-కిసాన్, రైతుబంధు
వేర్వేరుగానే!

- **సీఎస్‌తో కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి భేటీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తాజాగా ప్రకటించిన 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి' పథకం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకాలు వేర్వేరుగానే అమలు కానున్నాయి. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి 'నేరుగా లబ్ధిదారులకే బదిలీ' విధానంలోనే కేంద్రం అమలు చేస్తుందని, రైతుబంధుతో పొత్తు ఉండదని 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. వీటిని బలపరుస్తూ కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం హైదరాబాద్ వచ్చిన ఆమె.. సీఎస్ ఎస్కే జోషితో భేటీ అయ్యారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ, సీసీఎల్ఏ డైరెక్టర్ కరుణ ఈ భేటీలో పాల్గొన్నారు.

10 టీవీ విక్రయంపై పోలీసులకు ఫిర్యాదు

వనపర్తి, ఫిబ్రవరి 5: పెట్టుబడులు పెట్టిన వారికి సమాచారం ఇవ్వకుండా 10 టీవీ న్యూస్ చానల్‌ను విక్రయించారంటూ వనపర్తికి చెందిన గోపాల్ అనే వ్యక్తి మంగళవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 2012లో సీపీఎం పిలుపుతో తాను రూ.2000 పెట్టుబడి పెట్టి 200 షేర్లు కొనుగోలు చేశానని, తనకు అభ్యుదయ బ్రాడ్ కాస్టింగ్ ద్వారా బాండ్ పేపర్లు అందజేశారని తెలిపారు. చానల్‌ను ఇతరులకు విక్రయించినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో చూసి తెలుసుకున్నానన్నారు. తనను తప్పుదారి పట్టించిన సీపీఎంపై, మోసం చేసిన అభ్యుదయ బ్రాడ్ కాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

మీ వాకిట్లో న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. జీవో ప్రకారం ఆ న్యాయాలయాలకు సిబ్బంది, మౌలిక సౌకర్యాలను త్వరగా ఏర్పాటు చేస్తారనే ఆశాభావాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సీజే రాధాకృష్ణన్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యక్తం చేసింది.

ఏమిటీ గ్రామ న్యాయాలయాలు..?

గ్రామ న్యాయాలయాల చట్టాన్ని కేంద్రం 2008లో చేసింది. వీటిని మేజర్ పంచాయతీ కేంద్రంలో నెలకొల్పుతారు. వీటి నిర్వహణకు వ్యయాన్ని కేంద్రం అందిస్తోంది. కేసులను విచారించేందుకు మొబైల్ వాహనంలో న్యాయాధికారితో పాటు సిబ్బంది వారి పరిధిలోని సమీప గ్రామాలకు వెళ్తారు. కేసులను అక్కడే విచారిస్తారు. చట్టం ప్రకారం కేసును గరిష్ఠంగా 6నెలల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రతి గ్రామ న్యాయాలయానికి జూనియర్ సివిల్ జడ్జి/జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్థాయి అధికారి న్యాయాధికారిగా ఉంటారు. ఒక హెడ్ క్లర్క్, ఒక జూనియర్ అసిస్టెంట్-టైపిస్ట్, ఒక స్టెనోగ్రాఫర్, ఒక కార్యాలయ సహాయకుడు కలిపి మొత్తం ఐదుగురు ఉంటా రు. వీరి నియామకాలు, సిబ్బం ది జీతభత్యాలు, వార్షిక ఖర్చుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1న జీవో జారీ చేసింది. 55 గ్రామ న్యాయలయాలకు సగటున ఏడాది కి రూ. 9.09 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు.

ఏ తరహా కేసులు..?

రూ. 20వేలు లోపు దొంగతనం, రికవరీ కేసులు, భార్య, పిల్లల భరణం కేసులు, మహిళల గౌరవానికి భంగం కలిగించిన నేరాలు, కనీస వేతనాల చట్టం, వెట్టిచాకిరి, పౌర హక్కులు, శాంతి భద్రతలు, గృహ హింస, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలు గ్రామస్థాయిలో అమలు, నీటి వినియోగం, సాగుభూముల తగాదాలు, ఆస్తి తగాదాలు.. ఇలా రెండు సంవత్సరాలు, అంతకంటే తక్కువ శిక్ష పడే కేసులన్నీ గ్రామ న్యాయాలయాలు స్వీకరించి పరిష్కరిస్తాయి. గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులపై క్రిమినల్ కేసుల్లో సెషన్స్ కోర్టుల్లో, సివిల్ కేసుల్లో జిల్లా కోర్టుల్లో అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

మధ్యప్రదేశ్, కేరళ ఆదర్శం..

చట్టం అమల్లోకి వచ్చి దశాబ్దకాలం గడుస్తున్నా దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లోనే గ్రామ న్యాయాలయాలు అమలవుతున్నాయి. మొట్టమొదటగా మధ్యప్రదేశ్ 2009లోనే వీటిని ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. గ్రామీణుల గడప వద్దకే సత్వర న్యాయాన్ని అందిస్తున్నాయి. అలాగే కేరళలో 2012 నుంచి ఇవి అమలవుతున్నాయి. వారంలో రెండు రోజుల పాటు న్యాయాధికారులు గ్రామాల్లోనే ఉండి కేసులను పరిష్కరిస్తున్నారు. తీర్పులు కూడా మళయాళంలోనే ఇస్తుండటం విశేషం. అన్నిటా ముందుండే తెలుగు రాష్ట్రాలు ఈ విషయంలో చాలా వెనకబడిపోయాయి. గ్రామ న్యాయాలయాల చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మేకపోతుల నరేంద్రగౌడ్ అనే వ్యక్తి హైకోర్టులో పిల్ వేశారు. దీంతో కదలిక వచ్చింది. గ్రామన్యాయాలయాల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించాలని స్పెషల్ జీపీ సంజీవ్‌కుమార్‌కు గత విచారణ సందర్భంలో ధర్మాసనం సూచించింది. దీనిపై ప్రభుత్వం ఫిబ్రవరి 1న ఉత్తర్వులిచ్చింది.

వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న గ్రామ న్యాయాలయాలు

రాష్ట్రం	-	న్యాయాలయాలు
మధ్యప్రదేశ్	-	89
రాజస్థాన్	-	45
కేరళ	-	29
మహారాష్ట్ర	-	18
ఒడిసా	-	16
ఉత్తరప్రదేశ్	-	12
జార్ఖండ్	-	06
గోవా	-	02
పంజాబ్	-	02
హరియాణా	-	02
కర్ణాటక	-	02

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అదిలాబాద్	12.8	30.1
హైదరాబాద్	16.9	30.9
సంగారెడ్డి	18.0	32.0
ఖమ్మం	18.0	33.0
నిజామాబాద్	18.0	32.4

11, 12 తేదీల్లో వీఐపీ బ్రేక్ ప్రముఖులకే పరిమితం

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా ఈనెల 11, 12 తేదీల్లో ప్రొటోకాల్ వర్తించే ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనం పరిమితం చేస్తున్నట్టు టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 12న తిరుమలలో రథసప్తమి వేడుకల సందర్భంగా తరలివచ్చే సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించాలన్న ఉద్దేశంతో యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే 12న వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డ తల్లితండ్రుల ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా రద్దు చేశారు.



సగం వీవీ ప్యాట్‌ల లెక్కింపు వచ్చే ఎన్నికలకు అసాధ్యం

వీవీప్యాట్‌లను 50% లెక్కించి, వాటిని ఈవీఎంలలో నమోదైన ఓట్లతో సరిపోల్చేలా నిబంధనలు తీసుకురావడం వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సాధ్యం కాకపోవచ్చు. సగం వీవీప్యాట్‌ల లెక్కింపును అమలు చేయడం రాత్రికి రాత్రి అయ్యే పని కాదు.

- టి.ఎస్.కృష్ణమూర్తి మాజీ సీఈసీ



ఆరెస్సెస్.. అతిపెద్ద లౌకిక సంస్థ

అతిపెద్ద లౌకికవాద సంస్థల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) ఒకటి. వ్యక్తుల విశ్వాసాలు, హక్కులను ఆ సంస్థ ఎప్పుడూ గౌరవిస్తుంది. కేబీ హెడ్గేవార్ నాటిన మొక్క(ఆరెస్సెస్) మహావృక్షమై ప్రపంచమంతా విస్తరించింది.

- సీహెచ్ విద్యాసాగర్‌రావు, మహారాష్ట్ర గవర్నర్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.73	పాత ధర 71.22
కొత్త ధర రూ.74.73	కొత్త ధర 71.22

మార్పులేదు



ఆరోగ్యకరమైన ఆహారంతో ఆందోళన దూరం

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: ఆరోగ్యకరమైన ఆహారం వల్ల ఆందోళన దూరమవుతుందని తాజా సర్వే పేర్కొంది. వేడిగా ఉన్నప్పుడు కూల్‌కూల్‌గా ఐస్‌క్రీం తింటే ఉపశమనం కలిగినట్లే.. బరువు తగ్గించే, పోషకాలు కలిగిన, కొవ్వును కరిగించే ఆహారం తినడం వల్ల ఆందోళనలు దూరం అవుతాయంటూ సైకోమాటిక్ మెడిసిన్ అనే జర్నల్‌లో ప్రచురితమైంది. ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం, కూరగాయలు తీసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని అందులో సూచించారు.

మలేరియాకు కొత్త వ్యాక్సిన్!

న్యూయార్క్, ఫిబ్రవరి 5: ఇప్పుడున్న వాటికన్నా మరింత ప్రభావవంతంగా పనిచేసే మలేరియా వ్యాక్సిన్‌ను అమెరికాలోని చికాగో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగనిరోధక వ్యవస్థలోని నిర్దిష్ట కణజాలాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ టీకాను అభివృద్ధి చేశారు. దీంతో ఈ వ్యాక్సిన్‌కు ఎక్కువ రోగనిరోధక శక్తి, యాంటీబాడీ రియాక్షన్ ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ప్రస్తుతం మలేరియాకు వ్యాక్సిన్ ఉన్నప్పటికీ అది 30 నుంచి 50 శాతమే ప్రభావం చూపుతోంది. 'ప్రస్తుత మలేరియా వ్యాక్సిన్‌తో పోలిస్తే.. మేం అభివృద్ధి చేసిన టీకా ఉత్తేజకరమైన ఫలితాన్ని అందించింది' అని చికాగో యూనివర్సిటీ ప్రొఫెసర్ జెఫ్రీ హుబెల్ తెలిపారు.


నవ్య
కుటుంబ కదంబం



డైట్ వర్సెస్ ఎక్సర్‌సైజ్

అవగాహన

బరువు తగ్గాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్న సహజంగానే చాలామందిని వేధిస్తూ ఉంటుంది. సరైన బరువు కన్నా ఎక్కువ ఉంటే.. కేలరీలను తగ్గించుకోవడానికి ఎక్సర్‌సైజులు చేస్తే సరిపోతుందా? లేక సరైన డైట్‌ను ఫాలో అయితే చాలా? ఈ ప్రశ్నలకు ఇటీవల కొందరు ఆరోగ్య పరిశోధకులు సమాధానం రాబట్టారు. ఈమధ్య జరిపిన ఒక పరిశోధనలో శారీరక శ్రమ కన్నా తీసుకునే డైట్ ముఖ్యమని తేల్చారు.



ఫిట్‌గా కనిపించాలంటే క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజులు చేయాల్సిందే. అంటే శారీరక శ్రమతో ఒంట్లోని కేలరీలను కరిగించాలన్నమాట. ఆ కేలరీలు ఆహారం వల్ల చేకూరుతున్నాయి. మనం తీసుకునే ఆహారంలో పది శాతం కేలరీలు జీర్ణక్రియలో భాగంగా బర్న్ అవుతుంటే, పది నుంచి ముప్పై శాతం శారీరక శ్రమ వల్ల ఖర్చవుతాయి. అయితే 'నీవు ఎంతసేపు ఎక్సర్‌సైజులు చేస్తున్నావనే దాని కన్నా ఎంత తింటున్నావు అనేది కూడా ముఖ్యమే' అంటున్నారు న్యూట్రిషనిస్టు లీసా డ్రయెర్. సహజంగానే కేలరీలనేవి మనం తీసుకుంటున్న ఆహారం, పానీయాల ద్వారా సమకూరితే, ఎక్సర్‌సైజుల ద్వారా వాటిలో కొంతభాగం ఖర్చవుతాయి. క్రీడాకారులను వదిలేస్తే, మిగతావారు ఎక్సర్‌సైజుల ద్వారా ఐదు నుంచి పదిహేను శాతం కేలరీలను బర్న్ చేస్తారు. అయితే ఇది మనం తీసుకుంటున్న ఆహారానికి సమానం ఎంత మాత్రం కాదు. అలాంటప్పుడు డైట్‌కు, ఎక్సర్‌సైజ్‌కు సమతూకం ఉండదు. 'సాధారణంగా చాలామంది ఎక్కువ ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన కేలరీలకన్నా అధికంగా అందుతాయి. ఎక్సర్‌సైజులు చేసినప్పుడు మాత్రమే కొన్ని కేలరీలు బర్న్ అవుతాయి. ఆ తర్వాత పరిస్థితి ఏంటీ... అందుకే కేలరీలను బర్న్ చేయడం కన్నా, కేలరీలను కట్ చేయడం ఉత్తమం' అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణురాలైన శాలినీ భార్గవ.

70, 30 రూల్...

బరువు తగ్గాలంటే 70 శాతం సరైన డైట్ పాటిస్తూ, 30 శాతం ఎక్సర్‌సైజులు చేయాలని సూచిస్తుంటారు. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అంటే జెండర్, వయసు, వ్యక్తి ఆరోగ్యాన్ని బట్టి 80 శాతం, 20 శాతంగా కూడా మార్చుకోవచ్చంటున్నారు. ఈ రూల్‌ను ఫిట్‌నెస్ నిపుణులు చాలాకాలంగా చెబుతున్నప్పటికీ బరువు తగ్గాలనుకున్నవారు పూర్తిగా ఎక్సర్‌సైజుల పైనే ఆధారపడకుండా, డైట్ విషయంలోనే స్ట్రిక్ట్‌గా ఉంటే మంచిదనేది ఎక్కువ మంది అభిప్రాయంగా కనిపిస్తోంది. "కేవలం నడక వల్ల బరువు తగ్గరు. కార్డియో, వెయిట్ ట్రైనింగ్‌తో పాటు మానసిక ప్రశాంతతను పొందే యోగ, మెడిటేషన్, పవర్ యోగ వంటివి కూడా అవసరమే" అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణురాలు లీనా మోగ్రే. ఆరోగ్యం బాగుండాలంటే సరైన నిద్ర కూడా అవసరమే. దీనివల్ల మెదడు కంఫర్ట్ ఫుడ్ మాత్రమే కావాలని శరీరానికి సూచనలిస్తుంది. రాత్రి పూట మేలుకొని స్నాక్స్, జంక్‌ఫుడ్ తినాల్సిన అవసరం రాదు. దాంతో అనవసరపు కేలరీలు దరి చేరవు. మొత్తానికి ఎక్సర్‌సైజుల కన్నా డైట్ ప్లాన్ సరిగా ఉంటే బరువు తగ్గించుకోవాలనే బెంగ ఉండదు.

ప్రతిభ

'డూడ్లింగ్'... ఆర్ట్‌లో సరికొత్త స్టయిల్. విదేశాల్లో పాపులరైనా మన దగ్గర ఇంకా ఇలాంటి ఆర్ట్ ఒకటి ఉందనే విషయం చాలా మందికి తెలియదు. ఇంజనీరింగ్ చదివిన తన ఈడు అమ్మాయిలంతా కెరీర్‌పైనే దృష్టి సారిస్తుంటే ఇరవై మూడేళ్ల స్నిగ్ధ మునిపల్లి మాత్రం సమాజసేవతో పాటు, సృజనాత్మక రంగంలో ముందడుగు వేస్తోంది. అరుదైన 'లైవ్ డూడ్లింగ్'తో ఆకట్టుకుంటున్న 'స్నిగ్ధ' మనోహర విజయం ఆమె మాటల్లోనే...

డూడ్లింగ్ గర్ల్





నా ప్రయాణం చిన్నదే... జీవితంలో, ఎంచుకున్న రంగంలో! కానీ ఎన్నో నేర్చుకున్నా. నాకేం కావాలో... ఏం కావాలనుకుంటున్నానో మొదటి నుంచీ స్పష్టత ఉంది. నేను పుట్టింది, పెరిగిందీ హైదరాబాద్‌లోనే. నాన్న రమేశ్ కుమార్ బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగి. అమ్మ నిర్మల గృహిణి. చిన్నప్పటి నుంచి వాళ్లు నాకు ఇచ్చిన స్వేచ్ఛ వల్లనేమో... నచ్చింది చదువుతూ, అభిరుచికి తగిన పని చేసుకుంటున్నా. హైదరాబాద్‌లోని సీబీఐటీలో రెండేళ్ల క్రితం మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఆ వెంటనే 'ఊబర్'లో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం అందులో 'కమ్యూనిటీ ఆపరేషన్ స్పెషలిస్టు'గా పనిచేస్తున్నా.

కలత చెంది...

బాలలపై లైంగిక వేధింపుల వార్తలు చూసినప్పుడల్లా నాలో ఏదో తెలియని కలత మొదలయ్యేది. బాధ కలిగేది. కాలేజీలో ఉన్నప్పుడు ఈ విషయం గురించి నా స్నేహితురాలితో మాట్లాడితే నవ్వి వెళ్లిపోయింది. అదేదో బహిరంగంగా మాట్లాడరాని అంశంగా అనుకుంటారు. ఇలాంటి విషయాల్లో ఎవరికి వారు బాధపడుతూ, ఎవరో వచ్చి ఏదో చేస్తారని కూర్చోవడం ఎంత వరకు సమర్థనీయం? నచ్చిన దారిలో పూలున్నా... ముల్లున్నా... పట్టించుకునే తత్వం కాదు నాది! నా చుట్టూ ఉన్న సమాజం బాగు కోసం కృషి చేయగలిగితే చాలు! నా ఆలోచన అదే! అందుకే చదువు అయిపోయిన తరువాత లైంగిక వేధింపులకు గురైన బాలల కోసం పని చేశాను. తెలిసీ తెలియని వయసులో ఇలాంటివి వారు ఎవరికీ చెప్పుకోలేరు. అలాంటప్పుడు నేనున్నాని కాస్త భరోసా కల్పిస్తే... అంతకు మించి వారు ఇంకేమీ కోరుకోరు. అలాంటి బాధితులను కలిసి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చాను. ధైర్యంగా ముందుకొచ్చిన వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి ఫిర్యాదులు ఇప్పించాను. వాళ్లు ఏ నిర్ణయం తీసుకున్నా... అండగా ఉంటానన్న నమ్మకం కల్పించగలిగాను. అలా యాభై మంది బాధితులకు బాసటగా నిల్చోవడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

అనుకోకుండా అటు వైపు...

నా వయసు యువతీ యువకులతో పోలిస్తే నాదో భిన్నమైన ప్రపంచం. నా అభిరుచులు, ఆశయాలు వేరు! భవిష్యత్తులో ఏదో చేసేసి, ఏదో అయిపోవాలని ఎప్పుడూ కలలు కనలేదు. జీవితంలో మనకు ఎదురైన సవాళ్లను స్వీకరించి, చుట్టుపక్కల ఎంత వరకు మార్పు తేగలనో అంత వరకే ఆలోచిస్తాను. అలా అనుకోకుండా ఓ రోజు ఆన్‌లైన్‌లో 'డూడుల్స్' చూశాను. 'డూడ్లింగ్' అంటే అదో రకమైన స్కెచింగ్. సాధారణ ఆర్ట్‌కు భిన్నంగా, కొత్తగా ఉంటుంది. దీంతో దానిపై ఆసక్తి పెరిగింది. ఆన్‌లైన్‌లో డూడ్లింగ్ గురించి వెతికాను. పరిశోధించి, సొంతగా నేర్చుకున్నా. నెమ్మదిగా దానిపై పట్టు వచ్చింది. రెండేళ్ల కిందటే డూడుల్స్ మొదలు పెట్టా. చివరకు అదే నా అభిరుచిగా మారిపోయింది. అందులో నా ప్రత్యేకత 'కామిక్, లైవ్ డూడ్లింగ్'.



'లైవ్ డూడ్లింగ్' అంటే జరుగుతున్న ఈవెంట్‌ను డూడుల్స్‌లో చూపడం. ఉదాహరణకు మ్యూజిక్ ఈవెంట్ నడుస్తుందనుకోండి... ఆ వాతావరణాన్నంతా డూడుల్స్ స్కెచ్ వేయడం! అదీ ఈవెంట్ అయిపోయేలోగా! ఈ తరహా డూడ్లింగ్ చేసేవారు నాకు తెలిసి ఇక్కడ ఎవరూ లేరు. విదేశాల్లో దీనికి బాగా ప్రాచుర్యం ఉంది.

ఈవెంటే కాన్సెప్ట్...

'లైవ్ డూడ్లింగ్' అంటే జరుగుతున్న ఈవెంట్‌ను డూడుల్స్‌లో చూపడం. ఉదాహరణకు మ్యూజిక్ ఈవెంట్ నడుస్తుందనుకోండి... ఆ వాతావరణాన్నంతా డూడుల్స్ స్కెచ్ వేయడం! అదీ ఈవెంట్ అయిపోయేలోగా! ఈ తరహా డూడ్లింగ్ చేసేవారు నాకు తెలిసి ఇక్కడ ఎవరూ లేరు. విదేశాల్లో దీనికి బాగా ప్రాచుర్యం ఉంది. అలా ఇప్పటిదాకా సండే సోల్ సెనేట్, బీయోవ్, ఆర్ట్ ఎగ్జిబిషన్స్, కేఫ్స్‌లో వేశాను. చాలా సంస్థలతో కలిసి దీనిపై పని చేస్తున్నాను. ప్రస్తుతం దేశంలోనే యువత పాల్గొనే భారీ ఈవెంట్ 'అండర్ 25'లో లైవ్ డూడ్లింగ్ కోసం బెంగళూరు వచ్చాను. ఇందులో నా లైవ్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చాను. 'ఆమ్నెస్టీ' అంతర్జాతీయ మేగజైన్‌లో నా ఆర్ట్ వర్క్ ప్రచురించారు. నాకు స్కెచ్ వేయడానికి పేపరే అక్కర్లేదు... డోర్స్, షూస్, సూట్‌కేస్ వంటి వాటిపై కూడా డూడుల్స్ గీశాను. నిజానికి ఇలా స్కెచ్ వేయడం ఎంతో కష్టం. ఎందుకంటే ఒక్కో దాని టెక్స్‌చర్ ఒక్కోలా ఉంటుంది. వాటికి తగ్గట్టుగా గీయాలంటే దేనికి దానికే ప్రత్యేకమైన టెక్నిక్ ఉపయోగించాలి.

నవతరానికి నూతనోత్తేజం...

ఓ పక్క ఉద్యోగం, మరో పక్క డూడ్లింగ్‌తో బిజీగా ఉన్నా సామాజిక సేవను మాత్రం వదిలిపెట్టలేదు. ప్రస్తుతం మోటివేషనల్ స్పీకర్‌గా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. ఇటు వైపు రావడానికి ఓ బలమైన కారణం ఉంది. దేశ భవిష్యత్తుకు పునాది యువతే! కానీ చాలా మందికి వారిపై వారికి శ్రద్ధ లేదు. జీవితంలో ఎదగాలన్నా, ఏదన్నా సాధించాలన్నా ముందు నిన్ను నువ్వు ప్రేమించాలి. గౌరవించుకోవాలి. నా వయసు యువతీ యువకుల్లో ఇప్పుడది కొరవడింది. 'నువ్వు సిగరెట్ ఎందుకు తాగుతున్నావ'ని అడిగితే 'జస్ట్ సోషలైజ్ అవ్వడానికి' అని బదులిచ్చారు కొంత మంది యువకులు! అది విని నాకు ఆశ్చర్యమేసింది. నిజానికి సిగరెట్ తాగాలని లేకపోయినా నలుగురితో కలవడం కోసం తాగడం అన్న మాట. వారిపై వారికి అవగాహన లేకే ఇలాంటివన్నీ చేస్తుంటారు. కానీ అక్కడ వాళ్ల వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారన్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. ముఖ్యంగా ఐటీ తదితర రంగాల్లో పనిచేసేవారిలో ఈ తరహా ఆలోచనలు ఎక్కువగా గమనించాను. ఇలాంటి వారి మైండ్‌సెట్ మార్చడానికే నేను మోటివేషనల్ స్పీకర్‌గా మారాను. నా వల్ల ఓ నలుగురు స్ఫూర్తి పొందినా చాలు కదా! ఈ క్రమంలో ఎన్నో వేదికలపై ప్రసంగించాను.

సోలో ట్రావెలింగ్...

రోజుకు పద్నాలుగు గంటలు పనిచేస్తున్నా. లేదంటే దేనికీ న్యాయం చేయలేం కదా! ఇష్టంగానే కష్టపడుతున్నా. వీటన్నింటికీ దూరంగా అప్పుడప్పుడూ సోలో ట్రావెలింగ్ చేస్తుంటా. ట్రావెలింగ్ నాకు ఎంతో ఇష్టం. అయితే కేవలం ఒక ప్రాంతానికి వెళ్లి, చుట్టుపక్కల చూసి వచ్చేయను. అక్కడి పరిసరాలు గమనించి, స్థానిక స్థితిగతులను డూడుల్స్‌గా మారుస్తాను. వీటితోపాటు ఖాళీ ఉంటే పోయెట్రీ రాస్తుంటా. అదీ సామాజిక అంశాలపైనే! ఇక చిన్నప్పటి నుంచీ వంట చేయడం చాలా చాలా ఇష్టం. ఓ షాపింగ్ మాల్‌లో పెట్టిన వంటల పోటీలో బహుమతి కూడా గెలుచుకున్నా. ఇవన్నీ ఎందుకంటే చెప్పాను కదా... 'ముందు మనల్ని మనం ప్రేమించుకోవాలి' అని! అప్పుడే జీవితం... చుట్టూ ఉన్న జనజీవనం అందంగా కనిపిస్తుంది. మనలో పాజిటివ్ వైబ్రేషన్స్‌ను పాస్ చేస్తుంటుంది.

• హనుమా



పొటాటో... గార్లిక్ నగ్గెట్స్

క్విక్ బైట్



బంగాళా దుంపల్ని మెత్తగా ఉడికించి, తురుములా చేసుకోవాలి. వాటికి ప్రాసెస్‌డ్ ఛీజ్ వెల్లుల్లి పేస్ట్, చిల్లీ ఫ్లేక్స్, ఉప్పు, మొక్కజొన్న పిండి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసుకొని, వాటిని కార్న్ స్లర్రీలో ముంచి, బ్రెడ్ క్రంబ్స్ పొడి మీద రోల్ చేయాలి. వీటిని నూనెలో వేగించి, తరువాత సాస్‌తో వేడివేడిగా తింటే ఎంతో రుచిగా ఉంటాయి.



బ్యూటీ

వాతావరణంలో మార్పుల వల్ల చర్మం దురద పెట్టడంతో పాటు పొడిబారి నిర్జీవంగా మారుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చర్మం తాజాగా, నిగారింపుతో కనిపించేలా చేయొచ్చు. అవేమిటంటే...

చర్మం పొడిబారుతోందా?



స్నానం: వేడినీళ్లతో ఎక్కువ సేపు స్నానం చేయకూడదు. స్నానానికి గోరువెచ్చని నీటిని ఉపయోగించాలి. తేమను అందించే సబ్బువాడితే చర్మం పొడిబారదు. తాజా తులసి ఆకుల్ని నీళ్లలో వేడిచేసి, ఆ నీళ్లతో స్నానం చేస్తే శరీరానికి సాంత్వన లభిస్తుంది.

స్కిన్ మాయిశ్చరైజర్: చర్మం తేమ కోల్పోయినప్పుడు మాయిశ్చరైజర్ క్రీమ్ రాసుకోవాలి. చర్మ తత్వాన్ని బట్టి రోజుకు రెండు సార్లు క్రీమ్ రాసుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే కొద్దిగా గ్లిజరిన్ అప్లై చేసినా ఫలితం కనిపిస్తుంది.

కలబంద: దీనిలోని మాయిశ్చరైజింగ్, టోనింగ్, యాంటీసెప్టిక్ గుణాలు చర్మానికి రక్షణనిస్తాయి. కలబంద గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె, పుదీనా నూనె కలిపి, ఈ మిశ్రమాన్ని స్నానానికి ముందు చర్మానికి రాసుకోవాలి.

ఆలివ్ నూనె: దీనిలోని విటమిన్ ఇ ఫ్రీరాడికల్స్‌ను, చర్మం మీది మలినాలను తొలగిస్తుంది.

సన్‌స్క్రీన్ లోషన్: ఎండలో కొద్దిసేపు ఉండడం ఆరోగ్యానికి మంచిదే. కానీ ఎక్కువ సేపు ఉంటే సూర్యరశ్మి చర్మానికి హాని చేస్తుంది. కాబట్టి బయటకు వెళ్లేటప్పుడు సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలి.

వన్యప్రాణి సంరక్షణ గురించి విద్యార్థులు పాఠాల్లో చదువుకొని ఆ తరువాత మర్చిపోయే సాధారణ విషయం కాదు. చదువుకున్న ప్రతి విద్యార్థీ ఆ దిశగా అడుగులేయాలి. అప్పుడే చదువుకు సార్థకత అని నమ్మి విద్యార్థులను ఆ బాటలో నడిపించేందుకు లక్షల జీతాన్ని వదిలి ఆశయానికి జీతాన్ని, జీవితాన్ని త్యాగం చేశాడు కోల్‌కతాకు చెందిన నిరీత్ దత్తా...

అతని జీతం.. జీవితం

వన్యప్రాణుల కోసం..



- గడచిన ఐదేళ్లలో నిరీత్ 83 పాములను కాపాడాడు.
- వేస్ట్‌మేనేజ్‌మెంట్ ఫీల్డ్‌లో పనిచేయటం కూడా నిరీత్‌కు చాలా ఇష్టం. కొంతమంది అంతర్జాతీయ ఆర్కిటెక్ట్‌లతో అతను చర్చలు జరుపుతున్నాడు.
- 'సీఎస్ఆర్' కార్యక్రమంలో భాగంగా 'యుడో నౌ' అనే ఒక స్టార్టప్ కంపెనీ కొన్ని వర్క్‌షాపుల నిర్వహణలో నిరీత్‌కు స్పాన్సర్ చేస్తోంది.

లక్షల్లో జీతం ఇచ్చే కొలువుల కోసం ఆరాటపడే యువతకు భిన్నం నిరీత్ దత్తా. డెహ్రాడూన్ లోని తులాస్ ఇనిస్టిట్యూట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. చదువు పూర్తవ్వగానే 'బైజూస్' ఎడ్‌టెక్ కంపెనీలో ఉద్యోగం. 22 ఏళ్లకే రూ. 10 లక్షల వార్షిక జీతంతో కొలువు కోరి వరించింది నిరీత్‌ను. స్నేహితులందరూ నిరీత్‌దత్తాను 'అదృష్టవంతుడువి' అని అభినందించారు. కానీ అతని దృష్టిలో మాత్రం ఆ మాటకు వేరే అర్థం ఉంది. అది అడవితల్లి ఒడిలో అతను చవిచూసిన చల్లగాలి స్పర్శ. ఆ అనుభవం ఆఫీసులో అత న్ని కుదురుగా కూర్చోనివ్వలేదు. అతి కష్టం మీద ఆర్నెల్లు పని చేసి కొలువుకు సెలవు పలికాడు.

ఆశయం దిశగా అడుగులు

ప్రస్తుతం నిరీత్ చిన్నపిల్లల కోసం పాఠశాలల్లో వన్యప్రాణి సంరక్షణలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఇప్పటివరకు 23 వర్క్‌షాపులు నిర్వహించాడు. వచ్చే ఏడాదికల్లా 40 వర్క్‌షాపులను నిర్వహించాలనే లక్ష్యంతో నిరీత్ పని చేస్తున్నాడు. ఒక్కో సెషన్‌ను గంటన్నర పాటు నిర్వహిస్తారు. అతను వేసే జోక్స్‌తో సమయం ఇట్టే గడిచిపోతుంది. కార్యక్రమం చివరలో 'మద్రాస్ క్రోకోడైల్ బ్యాంక్ ట్రస్ట్'కు చెందిన 'స్నేక్‌బైట్' అనే వీడియోను చూపుతారు నిరీత్. కోల్‌కతాలో అతను చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడే జంతు సంరక్షణ కార్యక్రమాల్లో పాలు పంచుకునేవాడు. పిల్లలను ఊహాలోకంలో విహరింపజేయటం, సమయం తెలియకుండా వారిని కట్టిపడేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. ఈ నైపుణ్యాలు అతనికి శిక్షణలో బాగా అక్కరకొస్తున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ నుంచి శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఫీజు తీసుకోవాలనే ఆలోచన ఉన్నా యాజమాన్యాలు ఆసక్తి చూపవని విరమించుకున్నాడు.

పాఠశాలల నుంచే పురోగతి...

"ఈ పనిలో భారీ వేతనాలు ఉండవు. దీంతో దీన్ని ఉపాధి మార్గంగా ఎంచుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు. ప్రస్తుతం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అనేది ఒక సబ్జెక్ట్‌గా ఉంది. కానీ విద్యార్థుల్లో వన్యప్రాణులను రక్షించాలనే స్పృహను అది ఏ మాత్రం పెంచలేకపోయింది. ఎంత మంది విద్యార్థులు వన్యప్రాణులను చూసేందుకు అడవులకు విహార యాత్రలకు వెళుతున్నారు? ఇలాంటి చిన్న చిన్న విషయాలపై పాఠశాలలు దృష్టిపెడితే వన్యప్రాణుల సంరక్షణలో అవగాహనను పెంచటం మరింత సులభం అవుతుంది" అంటారు నిరీత్.

వన్యప్రాణి సంరక్షణ కోసం పాటుపడుతున్న కొంతమంది వ్యక్తులతో కలసి యాంటీ వైల్డ్‌లైఫ్ క్రైమ్ అండ్ యానిమల్ రైట్ సొసైటీ ఆఫ్ ఇండియా పేరుతో ఒక సంస్థను నిరీత్ నడుపుతున్నాడు. ప్రభుత్వ అధికారిగా వన్యప్రాణుల సంరక్షణకు మరింత కృషి చేయవచ్చనే ఆలోచనతో, మనసుకు నచ్చిన పనిలో మరింత ముందుకెళ్లేందుకు యూపీఎస్సీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాడు నిరీత్.



ఇలా చేయండి

మారిన జీవనశైలికి తోడు వివిధ షిఫ్టుల్లో ఆఫీసు వేళల కారణంగా చాలామందికి వర్కవుట్స్ చేసేందుకు సమయం లభించడం లేదు. ఆఫీసులో గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేసేవారిలో వెన్ను నొప్పి, మెడనొప్పి వంటి సమస్యలు సాధారణం. ఎక్కువసేపు కాళ్లు కదపకుండా కూర్చొని పనిచేయడం వల్ల కీళ్ల మీద ఒత్తిడి పడడమే అందుకు కారణం. అయితే రోజూ వ్యాయామాలు చేసేవారిలో ఈ సమస్యలు తక్కువ. కానీ వ్యాయామం ఊసే ఎత్తని వారిని ఈ సమస్యలు ఎక్కువగా వేధిస్తాయి. అలాంటివారికి ఉపశమనం కలిగించేందుకు తేలికైన, సులువైన ఎక్సర్‌సైజ్‌లు ఉన్నాయి. వీటిని కూర్చొనే ఎంచక్కా చేసేయొచ్చు.

కూర్చున్నచోటే ఉత్సాహంగా...

- **కాళ్లను చాచి :** పాదాన్ని నేలపై ఉంచి, మోకాలిని ముందుకు చాచాలి. తొడభాగం, మోకాలు భాగం స్ట్రెచ్ అయ్యేంత వరకూ శరీరాన్ని ముందుకు వంచాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. ఇలా రెండు కాళ్లతో ప్రతి మూడు లేదా అయిదు నిమిషాలకు ఒక సారి 30 సెకన్ల పాటు చేయాలి.
- **మోకాలిని ఛాతీకి:** ఎడమ మోకాలిని రెండు చేతులతో పట్టుకొని మీ ఛాతీ భాగానికి సమీపంగా తీసుకువచ్చి, మోకాలిని ఛాతీకి ఆనించాలి. దీంతో మీ వెన్నెముక స్ట్రెచ్‌కు గురవుతుంది. తరువాత ఈ ఎక్సర్‌సైజ్‌ను కుడి మోకాలితో కూడా చేయాలి. ఇలా ప్రతి మూడు నుంచి అయిదు నిమిషాలకు ఒకసారి 20 సెకన్ల సమయం చేస్తే, కండరాలకు విశ్రాంతి లభిస్తుంది.
- **తొడభాగం ముందుకు:** మీ కుర్చీకి సమీపంగా నిల్చొని, ఎడమ పాదాన్ని సీటు వెనక భాగానికి ఆనించాలి. మోకాలిని ముందుకు వంచి రెండో పాదాన్ని నేలపై ఉంచి, శరీరాన్ని ముందుకు కదిలించాలి. దీంతో తొడ భాగం, తుంటిభాగాలు స్ట్రెచ్‌కు లోనవుతాయి. అయిదు నిమిషాలకొకసారి ఇలా చేస్తే కాళ్ల ఒత్తిడికి లోనవవు.
- **తలను మోకాళ్లకు ఆనించడం:** ఈ పొజిషన్‌లో మీ చేతుల్ని తొడల వెనక ఉంచి తలను మోకాళ్లకు ఆనించాలి. దీంతో పొట్టభాగం స్ట్రెచ్ అవుతుంది. ఇలా మూడు నుంచి నాలుగు నిమిషాలు చేయాలి.



- **పక్కకు శరీరాన్ని వంచడం:** కుర్చీలో కూర్చొనే ఎడమ చేతిని మీ తలభాగం మీదకు ఎత్తిఉంచాలి. ఇప్పుడు కుడిచేతి వైపు శరీరాన్ని వంచాలి. కుడి చేతిని తలపైకి ఎత్తి ఉంచి, ఎడమ చేతివైపు వంగాలి. ఇలా అయిదు నిమిషాలకు ఒకసారి 15 లేదా 20 సెకన్ల పాటు చేయాలి.

కొత్త బండి గురూ!



నింజా నయా లుక్

సరికొత్త హంగులద్దుకుని మరింత ఆకర్షణీయంగా ముస్తాబైంది కవాసకీ నింజా జెడ్‌ఎక్స్-6ఆర్. స్పోర్ట్స్ బైక్‌లను ఇష్టపడే వారికి ఇది అద్భుతమైన సవారీ అందిస్తుందని కంపెనీ చెబుతోంది. గత ఏడాది బుకింగ్ చేసుకున్న వారికి తాజాగా బైక్ డెలివరీ ప్రారంభమైంది. నిజానికి ధర పరంగా తప్ప ఫెర్ఫార్మెన్స్‌ను బట్టి చూస్తే... 6ఆర్‌తో పోటీపడే బైక్‌లు భారత్‌లో లేవనే అంటున్నారు.

జెడ్‌ఎక్స్-6ఆర్ చూడటానికి సూపర్ స్పోర్ట్ బైక్‌లా కనిపించినా, రోజువారీ ప్రయాణాలకు సైతం సరిపోయేలా ఉండటం దీని విశేషం. సాధారణంగా 600సీసీ సూపర్ స్పోర్ట్స్ టాప్ ఎండ్ పవర్ బ్యాండ్ కలిగి ఉంటాయి. కానీ ఈ కొత్త నింజా మాత్రం విభిన్నం. 636సీసీ ఇన్‌లైన్ ఫోర్ ఇంజిన్‌తో ఉన్నప్పటికీ, ఎక్స్‌ట్రా స్ట్రోక్ కారణంగా తక్కువ ఆర్‌పీఎం వద్ద కూడా అదనపు శక్తి అందుతుంది. 13,500 ఆర్‌పీఎం వద్ద 128 బీహెచ్‌పీ శక్తి, 11,000 ఆర్‌పీఎం వద్ద 70.8 ఎన్‌ఎం టార్క్‌ను ఇస్తుంది. దీనిలో ఎలక్ట్రిక్ క్విక్ షిఫ్టర్ ఉండటం వల్ల గేర్లు మార్చినప్పుడల్లా క్లచ్ ఉపయోగించాల్సిన అవసరం అంతగా ఉండదు. ఇక బైక్‌లో ముఖ్యమైన ఫీచర్... టూత్‌స్మాలర్ ఫ్రంట్ కౌంటర్ షాఫ్ట్ స్ప్రోకెట్ (15-టూత్) ఉండటం. దీనివల్ల డ్రైవ్ రేషియో తగ్గుతుంది. తద్వారా గేర్ మార్చినప్పుడల్లా మరింత ఎక్కువగా యాక్సలరేషన్ పుడుతుంది. ఇతర ఫీచర్లలో ఫుల్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, ట్రాక్షన్‌కంట్రోల్, రెండు రైడింగ్ మోడ్స్ (ఫుల్, లో పవర్), షోవా సస్పెన్షన్, బ్రిడ్జ్‌స్టోన్ బాటాక్స్ రబ్బర్ మొదలైనవి ఉన్నాయి. దీని ప్రారంభ ధర రూ.10.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ).

బెటర్ లైఫ్

నిర్ణయానికి ఇంత జాప్యమా?

రెండేళ్ల కిందట ఎంఎస్సీ పూర్తి చేశాను. అయితే మా వాళ్లంతా ఆశిస్తున్నట్లు నేను ఉద్యోగ ప్రయత్నాలేమీ చేయడం లేదు. ఏదో ఒకటి.. రెండు బ్యాంక్ ఎగ్జామ్స్ వాళ్ల కోసం వెళ్లి రాసొచ్చాను. నిజానికి నా మనసంతా వ్యవసాయంపైనే ఉంది. మాకు కావాల్సినంత నీటి వసతిగల పదెకరాల నాణ్యమైన వ్యవసాయ భూమి ఉంది. ఆధునిక విధానాల్లో పంటలు పండించి, సొంత ఊళ్లోనే ఆనందంగా ఉండవచ్చనేది నా ఆలోచన. కానీ మావాళ్లేమో 'ఈ మాత్రం వ్యవసాయం చేయడానికి ఇంత చదువు ఎందుకు చదివినట్లు' అంటూ రోజూ నా తల తినేస్తున్నారు. అయితే నా నిర్ణయాన్ని మార్చుకోవడానికి మాత్రం సిద్ధంగా లేను. కాకపోతే, 'ఈ నిర్ణయానికి రావడానికి నాకు ఇంత సమయం ఎందుకు పట్టింది? ముందే అనుకుని ఉంటే, ఇంటర్‌లోనో, డిగ్రీలోనో చదువు ఆపేసి అప్పుడే వ్యవసాయం పైన దృష్టి పెడితే సరిపోయేది కదా' అన్న అంతర్మథనం నన్ను ఈ మధ్య బాగా వేధిస్తోంది. ఈ క్షోభ వల్ల వ్యవసాయంపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నా. ఈ మానసిక స్థితి నుంచి బయటపడి, అనుకున్న దిశగా అడుగులు వేసే మార్గం చెప్పండి.

- ఆర్.కుమార్, మహబూబ్‌నగర్

ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చిన తర్వాతే కదా ఏదైనా నిర్ణయం జరిగేది! ఈ నిర్ణయానికి రావడం అన్నది ఇప్పుడు జరిగిందేమో గానీ, దానికి సంబంధించిన ఆలోచనలు మీలో ఎప్పటి నుంచో కొనసాగుతూ ఉండి ఉండాలి. నిజానికి ఆలోచనలన్నీ నిర్ణయాలు కాలేవు. దశాబ్దాల పర్యంతంగా సాగిన ఆలోచనలు కూడా ఒక నిర్ణయానికి రాకపోవడం అనేది కొందరికి అనేక సార్లు జరుగుతుంది. ఎందుకంటే ఏ ఆలోచనకు ఆ ఆలోచన ఏకపక్షంగానే వస్తాయి. కానీ, నిర్ణయానికి రావడానికి ముందు వేయి కోణాల్లో ఆలోచించాల్సి ఉంటుంది. ఆలోచనలు చేయడానికి ఒక స్థాయి అంటూ అవసరం లేకపోవచ్చు. కానీ నిర్ణయం తీసకోవడానికి ఒక స్థాయి అవసరం. ఎవరైనా అలా లోతుగా ఆలోచించకుండానే బిరబిరా నిర్ణయం తీసుకున్నా, అది నిలబడదు. మధ్యలో మళ్లీ ఊగిసలాట మొదలవుతుంది. అది మరీ ప్రమాదం. ఇప్పటికైనా మీరు ఒక నిర్ణయానికి రావడం సంతోషించాల్సిన విషయమే. కాకపోతే, మీరు అనుకుంటున్న ఆ వ్యవసాయం గురించి మీరు ఏ మేరకు అధ్యయనం చేశారన్నది ఇప్పుడు ముఖ్యం. అలా అధ్యయనం చేయకపోతే, మీ ఆలోచనలు ఆచరణాత్మకంగా వెళ్లవు. విద్యావంతులైన కొంత మంది ఇలాంటి నిర్ణయానికి రావడానికి వెనుక చాలా సార్లు పల్లెటూరి ప్రశాంతత, పంటపొలాల్లోని పచ్చదనం వీటి ఆకర్షణే ఉంటుంది. వాటి మీద ప్రేమే అధికంగా ఉంటుంది. అయితే ఇవేవీ మనిషిని వ్యవసాయపరమైన శ్రమకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయలేవు. వ్యవసాయం అనేది మానసికమే కాదు, శారీరక శ్రమను కూడా కోరుకుంటుందనే వాస్తవాన్ని ఎప్పుడూ మరిచిపోకూడదు. అయితే ఒక సైన్స్ పట్టభద్రుడైన మీరు వ్యవసాయంలోకి దిగగానే ఆ జ్ఞానాన్ని పూర్తిగా మూలకు పడేయకుండా, మీ ఊళ్లో సైన్స్ విద్యార్థులకు ఎంతో కొంత విజ్ఞానాన్ని పంచండి. అది ఇన్నేళ్ల చదువుకు సార్థకత చేకూరుతుంది.



- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, ట్రాంక్విల్ మైండ్ క్లినిక్, మాదాపూర్, హైదరాబాద్

మీ మానసిక సమస్య ఏదైనా సరే బెటర్ లైఫ్‌కు రాసి పంపండి.
పరిష్కార మార్గాలు అందిస్తాం.
మా మెయిల్ ఐడీ: navya@andhrajyothy.com

సెలబ్ స్టయిల్

ఎంత సక్కగున్నావే!



సమంత

"అందానికి అర్థం... మిమ్మల్ని చూసేంత వరకూ తెలియలేదు"..., "మీరు బ్యూటీ క్వీన్'... ఇలా అభిమానుల కామెంట్లతో సమంత ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలోని కొన్ని ఫొటోలకు కామెంట్లు నిండిపోతున్నాయి. 'రంగస్థలం' సినిమాలో రామలక్ష్మిని చూస్తూ చిట్టిబాబు హృదయం 'ఎంత సక్కగున్నావే' అని రాగాలు తీసింది. ఇప్పుడు సమంత తాజా ఫొటోషూట్‌ను చూసి నెటిజన్లు "ఎంత అందంగా ఉన్నావే..." అంటూ మైమరిచిపోతున్నారు. ఫ్యాషన్‌కి చిరునామాగా ఉంటారు. ట్రెండ్‌ను ఫాలో కావడమే కాదు సెట్ చేస్తారు కూడా. కానీ అప్పుడప్పుడూ ఆమె డ్రెస్సింగ్ స్టయిల్‌పై ఎప్పుడూ ట్రోలింగ్స్ వస్తూనే ఉంటాయి. అప్పట్లో పెళ్లయిన కొత్తలో ఆమె వెకేషన్‌కు వెళ్లినప్పటి ఫొటోలపై నెటిజన్లు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పెళ్లయిన తర్వాత కూడా బికినీ ధరించడం ఏంటి అంటూ మోరల్ పోలీసింగ్ చేయడానికి నెటిజన్లు ప్రయత్నించారు. "నా రూల్స్ నేను రాసుకుంటాను" అంటూ వారికి ఘాటుగానే రిప్లై ఇచ్చారు. ఫ్యాషన్ డిజైనర్ ప్రతిమా జుకేల్కర్ రూపొందించిన బ్లాక్ గౌన్‌లోని ఉన్న సమంత ఫొటోలు నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి.

డైలీ సుడోకు - 444

3				2	5	4		6
							3	
	6	4	9					
	2					7	6	
5			2		1			9
	1	9					2	
					4	9	5	
	5							
8		7	5	9				2

ఎలా పూరించాలి?
ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 443 సమాధానం

6	2	7	1	9	5	8	4	3
1	9	5	8	4	3	6	2	7
4	3	8	2	7	6	9	5	1
8	1	9	3	2	7	4	6	5
7	5	3	9	6	4	1	8	2
2	4	6	5	8	1	3	7	9
3	8	1	6	5	2	7	9	4
9	7	2	4	3	8	5	1	6
5	6	4	7	1	9	2	3	8


నెట్టింట్లో ఆదివాసీ మేళా

'కచర' షార్ట్‌ఫిలింతో దర్శకురాలిగా మారారు జెన్నీఫర్ అల్ఫోన్సె. ఈ లఘుచిత్రం ఆమెకు నంది అవార్డులను తెచ్చిపెట్టింది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించడానికి 'వేర్ హెల్మెట్', కథానాయిక లావణ్యా త్రిపాఠి ప్రధాన పాత్రలో 'సిగ్నల్ జంప్', మహిళల భద్రత అంశంపై స్ట్రేంజర్స్, షి-టీమ్ లఘుచిత్రాలూ తీశారు. కేన్ చిత్రోత్సవాల్లో 'స్ట్రేంజర్స్' ప్రదర్శితమైంది కూడా. అంతేకాదు ఆదిలాబాద్‌లోని గోండు తెగలపై రెండేళ్ల క్రితం 'గుసాడి' అనే డాక్యుమెంటరీని రూపొందించారు. తాజాగా ఓ జాతరపై మరో డాక్యుమెంటరీ రూపొందించి యూట్యూబ్‌లో విడుదల చేశారు. మెస్రం గిరిజనులకు ఎంతో ప్రీతిపాత్రమైన 'నాగోబా జాతర' తెలంగాణాలో ప్రస్తుతం జరుగుతోంది. సుమారు 2 వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఉత్సవాలు ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో ప్రతి ఏటా ఎంతో వైభవంగా జరుగుతాయి. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకూ సాగే ఈ జాతరకు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశాలలోని మెస్రం గిరిజనులూ తరలివెళతారు. మరి ఈ జాతర ఎలా జరుగుతుందో, ఆ సందడి ఎలా ఉంటుందో తన మూడు నిమిషాల డాక్యుమెంటరీ 'నాగోబా జాతర- ద ట్రైబల్ కార్నివాల్'లో చూపించే ప్రయత్నం చేశారు జెన్నీఫర్. సోమవారం విడుదలైన ఈ డాక్యుమెంటరీ నెటిజన్లను ఆకట్టుకుంటోంది.



జెన్నీఫర్ అల్ఫోన్సె

యూట్యూబ్



ప్రేక్షకులు మెచ్చే చిత్రాలు చేయడానికి కృషి చేస్తా!

- రామ్‌చరణ్



“అభిమానులు, ప్రేక్షకులు అందరికీ నచ్చే చిత్రాన్ని, అందర్నీ ఎంటర్‌టైన్ చేసే చిత్రాన్ని అందించడానికి మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తు... మేం అనుకున్న విధంగా ఒక మంచి చిత్రాన్ని (వినయ విధేయ రామ) ఇవ్వలేక అంచనాలను అందుకోలేకపోయాం. ప్రేక్షకులు, అభిమానులు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో వారందరికీ నచ్చే... మెచ్చే చిత్రాలు చేయటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను” అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో డివివి దానయ్య నిర్మించిన ‘వినయ విధేయ రామ’ సంక్రాంతికి విడుదలైంది. ఈ చిత్రఫలితాన్ని ఉద్దేశిస్తూ మంగళవారం రామ్‌చరణ్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో “ప్రియమైన అభిమానులు, ప్రేక్షకులకు... నా పట్ల, మా సినిమా పట్ల మీరు చూపించిన ప్రేమ, అభిమానాలకు వినయపూర్వక ధన్యవాదాలు. మా ‘వినయ విధేయ రామ’ సినిమా కోసం రేయింబవళ్లు కష్టించిన సాంకేతిక నిపుణులు అందరికీ నా ధన్యవాదాలు. మా నిర్మాత దానయ్య అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మిన పంపిణీదారులు, ప్రదర్శనదారులకు కృతజ్ఞుడనై ఉంటాను. మీరు ఎల్లప్పుడూ చూపించే ఈ ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు. ప్రేమతో.. మీ రామ్‌చరణ్” అని ఆయన పేర్కొన్నారు.

అతనిలో అదే చూశా!

- కియారా అడ్వాణీ



క్రియేటివ్ ఫీల్డ్‌లో ఉన్నవారికి స్టార్‌డమ్ రావడం అంత సులభమేమీ కాదు. దాని వెనుక కొన్నేళ్ల కష్టం, తపనా ఉంటాయి. ఊరికే ఎవరూ గొప్పవారు కాలేరు. చాలామందిలో నేనీ విషయాన్ని గమనించా” అని కియారా అడ్వాణీ అన్నారు. ‘భరత్ అనే నేను’, ‘వినయ విధేయ రామ’ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన కథానాయిక ఈమె. ప్రస్తుతం ‘అర్జున్‌రెడ్డి’కి రీమేక్‌గా హిందీలో తెరకెక్కుతున్న ‘కబీర్‌సింగ్’ చిత్రంలో షాహిద్ సరసన నటిస్తున్నారు. సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ అదిరిపోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. షాహిద్ గురించి కియారా ఆసక్తికర విషయాలను చెప్పారు. “షాహిద్ నా కన్నా 12 ఏళ్లు సీనియర్. కానీ అతని సినిమాలు చూస్తూ పెరిగానని మాత్రం చెప్పను. కబీర్‌సింగ్ చివరి షెడ్యూల్ జరుగుతున్నప్పుడు అతనిలో ఓ విషయం గమనించా. ఇప్పటికే అతను హీరోగా నిరూపించుకున్నాడు. కానీ ఇంకా ఏదో సాధించాలనే తపన గట్టిగా ఉంది. అది ‘కబీర్‌సింగ్’ నిజం అవుతుందని నమ్ముతున్నా. ఎందుకంటే ఈ సినిమాలో షాహిద్ కపూర్ అనే వ్యక్తి ఎక్కడా కనిపించడు. కబీర్‌సింగ్ పాత్ర మాత్రమే కనిపిస్తుంది. దానికోసం షాహిద్ ఎంతగా కష్టపడ్డాడో దగ్గరగా చూసినవాళ్లకే తెలుస్తుంది” అని పొగడ్తలతో ముంచెత్తారు కియారా.

అంజలిగా వస్తోంది!



నయనతార

నయనతార ప్రధాన పాత్రలో, సీబీఐ అధికారి పాత్రలో నటించిన తమిళ చిత్రం ‘ఇమైక్క నోడిగల్’. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు ఆర్. అజయ్ జ్ఞానముతు దర్శకుడు. ఇందులో అథర్వ, రాశీఖన్నా జంటగా నటించారు. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు ‘అంజలి సీబీఐ ఆఫీసర్’గా తీసుకొస్తున్నారు నిర్మాతలు సీహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్. ప్రస్తుతం తెలుగు అనువాద కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ “ఈ నెల 22 మా చిత్రం విడుదల కానుంది. నయనతార నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ప్రతినాయకుడిగా హిందీ దర్శకుడు అనురాగ్ కశ్యప్, నయనతారకు భర్తగా అతిథి పాత్రలో విజయ్ సేతుపతి ప్రేక్షకులను ఆకట్టుకుంటారు” అన్నారు. ఈ చిత్రానికి ‘హిప్ హాప్’ తమిళ సంగీత దర్శకుడు.

నేటితరం ఆలోచనలతో...



వెంకటేశ్, ఈశ్వర్

ఈశ్వర్, టువా చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం ‘4 లెటర్స్’. ‘కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే’ అన్నది ఉప శీర్షిక. ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, ఉదయ్‌కుమార్ నిర్మించారు. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను వెంకటేశ్ ఆవిష్కరించారు. నిర్మాతలు మాట్లాడుతూ “నేటితరం ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిది. కమర్షియల్ హంగులతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. సెన్సార్ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 22న ప్రేక్షకుల సినిమాను విడుదల చేస్తున్నాం” అని చెప్పారు. “ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటితరం ఆలోచనలు, అభిప్రాయాలు ఎలా ఉంటున్నాయన్న కథాంశంతో రూపొందించిన చిత్రమిది. వాస్తవాలకు దగ్గరగా ఉంటుంది” అని దర్శకుడు రఘురాజ్ తెలిపారు.

ఎంతవారలైనా శిక్షార్హులే!



అద్వైత్, జహీదా శ్యామ్, అలోక్ జైన్, సీతారెడ్డి ముఖ్య పాత్రధారులుగా రామదూత ఆర్ట్స్ పతాకంపై గురు చిందేపల్లి దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘ఎంతవారలైనా’. జి.సీతారెడ్డి నిర్మాత. షూటింగ్ తుదిదశకు చేరుకుంది. దర్శకుడు మాట్లాడుతూ “ఎంతవారలైనా కాంత దాసులు కావచ్చు, కనకదాసులు కావచ్చు. కానీ, తప్పు చేస్తే ఎంతవారైనా కచ్చితంగా శిక్షార్హులే అన్న లైన్‌తో హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న చిత్రమిది” అని చెప్పారు. “హైదరాబాద్, మైసూర్, బెంగళూరు, చిక్‌మగళూరులలో దాదాపు 60 రోజుల పాటు షెడ్యూల్ చేశాం. షూటింగ్ పూర్తికావొచ్చింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం” అని నిర్మాత చెప్పారు.

అంతా మహిళలే!



నదియా

నదియా ప్రధాన పాత్ర పోషించిన ‘తిరక్కు వరతకయ’ తమిళ చిత్రాన్ని కె.కె.ఆర్. క్రియేషన్స్ సంస్థ ‘దేవి’ పేరుతో తెలుగులోకి అనువదించింది. మహిళా దర్శకులు తులసీదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నదియా సీబీఐ ఆఫీసర్‌గా నటించారు. చిత్రం అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాతలు కర్రి సత్యనారాయణరెడ్డి, కె.కృష్ణ, సబ్బెళ్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ‘సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకొంది. ఓ మర్డర్ మిస్టరీని ఛేదించే క్రమంలో నదియా నటన ప్రేక్షకుల్ని అలరిస్తుంది. పాత్రధారులతో పాటు దర్శకనిర్మాతలు, సాంకేతిక నిపుణులు .. అంతా మహిళలే పనిచేసిన చిత్రమిదది. ఈ నెలాఖరున విడుదల చేస్తున్నాం. సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి’ అని చెప్పారు.

తెలుగు సినిమా@87

హ్యాపీ బర్త్‌డే... తెలుగు సినిమా!

ఇవాళ్టితో తెలుగు సినిమాకు ఎనభై ఏడు వసంతాలు నిండాయి. మన తొలి పూర్తి తెలుగు టాకీ ‘భక్త ప్రహ్లాద’ ఎనభై ఏడేళ్ళ క్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైంది. ప్రముఖ దర్శకుడు హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలో ‘భక్తప్రహ్లాద’ తయారైంది. ఎనభై ఏడేళ్ళ క్రితం 1932 ఫిబ్రవరి 6న థియేటర్లలో తొలిసారిగా రిలీజైంది. అలా ఆ రోజున పూర్తి స్థాయి తెలుగు చిత్రాలు ప్రేక్షకులను తెరపై పలకరించడం మొదలైంది. ఆ విధంగా మన తెలుగు సినిమాకు ఇవాళ పుట్టినరోజు. పరిశ్రమకూ, ప్రేక్షకులకూ పండుగ రోజు. ఇవాళ సమాజంపై అమితంగా ప్రభావం చూపుతున్న మాధ్యమం అంటే, నిస్సందేహంగా సినిమానే! మన కట్టూబొట్టూ, ఆట, పాట, మాట, ప్రవర్తన - ఇలా అన్నిటినీ ఇతోధికంగా మార్చిన పాపం, పుణ్యం మన సినిమాలదే! జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది కాబట్టే... సినిమాల గురించి, అందులోనూ మన తెలుగు సినిమా పుట్టినరోజును ప్రత్యేకంగా గుర్తు చేసుకుంటున్నది.




‘భక్త ప్రహ్లాద’లో మాస్టర్ కృష్ణారావు, ‘సురభి’ కమలాబాయి, మునిపల్లె సుబ్బయ్య

అలా మొదలైంది...

ఇలా వాక్చిత్రాలు (టాకీలు) రాక ముందు దాకా ప్రపంచవ్యాప్తంగా భాషతో ప్రమేయం లేని మూగచిత్రాలు (మూకీలు) వచ్చేవి. మనదేశంలోనూ అంతే! మన పూర్తి తెలుగు చిత్రం ఎలా రూపొందిందనేది చారిత్రక క్రమంలో పరిశీలిస్తే ఆసక్తిగా అనిపిస్తుంది. మన దేశంలో... మన భారతీయ భాషలో రూపొందిన తొలి వాక్చిత్రం ‘ఆలమ్ ఆరా’. ఈ తొలి భారతీయ టాకీ 1931 మార్చి 14న బొంబాయిలోని మెజెస్టిక్ థియేటర్‌లో విడుదలైంది. అది మన దేశంలో సినీ రంగంలో కొత్త విప్లవానికి నాంది. అప్పటి నుంచి దేశంలో వివిధ భారతీయ భాషల వారీగా టాకీలు రాసాగాయి. మన హెచ్.ఎం. రెడ్డి ఆ ‘ఆలమ్ ఆరా’కు దర్శకత్వ శాఖలో పని చేసినవారే! ‘ఆలమ్ ఆరా’ తరువాత దర్శకత్వ శాఖ నుంచి స్వతంత్ర దర్శకుడిగా ఎదిగిన హెచ్.ఎం. రెడ్డి ఆ తరువాత సరిగ్గా ఏడున్నర నెలలకు తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ ‘కాళిదాస్’ను రూపొందించారు. ప్రధానంగా తమిళం, కొన్ని తెలుగు మాటలు - పాటలు, అక్కడక్కడా హిందీ డైలాగులతో తయారైన సినిమా ‘కాళిదాస్’.

ఆ ‘కాళిదాస్’ చిత్రం 1931 అక్టోబర్ 31న మద్రాసులోని కినిమా సెంట్రల్ (తరువాతి కాలంలో మురుగన్ టాకీస్ అయింది)లో విడుదలైంది. దర్శక - నిర్మాతలు అప్పట్లో “తొలి తమిళ - తెలుగు టాకీ” అంటూ ‘కాళిదాస్’కు ప్రకటనలు జారీ చేశారు. తెరపై కనిపించే పాత్రలు మాట్లాడడం జనానికి వింతగా అనిపించింది. ఆ సగం తమిళం, సగం తెలుగు సినిమా కాసులు కురిపించింది. దాంతో, ఈ సారి పూర్తిగా తెలుగులోనే తీయాలనే ఆలోచన వచ్చింది. అలా అప్పుడు మళ్ళీ హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలోనే పూర్తి తెలుగు టాకీగా ‘భక్త ప్రహ్లాద’ రూపొందింది.



దర్శక పితామహుడు హెచ్.ఎమ్. రెడ్డి

ఇలా తెలిసింది...

నిర్మాతలు బొంబాయి వాళ్ళు కావడంతో, ఆ చిత్ర నిర్మాణం, సెన్సారింగ్ అక్కడే జరిగాయి. ఫస్ట్ రిలీజ్ కూడా బొంబాయిలోనే! నిజానికి, సగం తెలుగున్న ‘కాళిదాస్’ కన్నా ముందే, ఈ పూర్తి తెలుగు టాకీ 1931 సెప్టెంబర్ 15న వచ్చిందని కొద్దికాలం ఆధారాలు లేని ప్రచారం జరిగింది. అయితే, అది వాస్తవం కాదని పరిశోధకుడు డాక్టర్ రెంటాల జయదేవ కొన్నేళ్ళ శ్రమతో, సాక్ష్యాధార సహితంగా నిరూపించారు. ‘భక్త ప్రహ్లాద’ 1932 జనవరి 22న సెన్సార్ పూర్తి చేసుకొని, ఫిబ్రవరి 6న బొంబాయిలోని శ్రీకృష్ణా థియేటర్‌లో విడుదలైనట్లు అసలు నిజాలు వెలికితీశారు. ఆ వివరాలన్నీ అప్పట్లో ‘ఆంధ్రజ్యోతి’ పత్రిక పాఠకలోకానికి తొలిసారిగా తెలియజేసింది.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచించిన ‘ప్రహ్లాద’ నాటకం ఆధారంగా, సురభి నాటక సంస్థ నటులతో ఈ సినిమా తీశారు. హిరణ్యకశిపుడిగా మునిపల్లె సుబ్బయ్య, అతని భార్య లీలావతిగా ‘సురభి’ కమలాబాయి, వారి బిడ్డ ప్రహ్లాదుడిగా మాస్టర్ కృష్ణారావు ముఖ్యపాత్రధారులు. మొత్తం 9,762 అడుగుల నిడివిగల పది రీళ్ళ సినిమా ఇది. ఈ తొలి పూర్తి తెలుగు సినిమా కేవలం రూ. 18 వేల పెట్టుబడితో, 18 రోజుల్లో నిర్మాణమైంది.

ఇదీ చేయాల్సింది...

అలా మొదలైన మన సినిమా ఈ ఎనభై ఏడేళ్ళ ప్రయాణంలో ఎంతో ముందుకు సాగింది. ఎన్నో మైలురాళ్ళు దాటింది. సాదాసీదాగా వందలు, వేల రూపాయల్లో మొదలైన సినిమా నిర్మాణం ఇవాళ హంగామాగా ఎన్ని పదుల కోట్ల రూపాయల పెట్టుబడికీ, ఎన్ని వందల రోజుల నిర్మాణానికీ, మరెన్ని వందల కోట్ల వసూళ్ళ స్థాయికీ ఎదిగిందో తెలిసిందే! కళాత్మక విలువలు, కాసుల వర్షాల మధ్య వ్యత్యాసం గురించి చర్చ సాగుతూనే ఉంది. భిన్నాభిప్రాయాల మాటెలా ఉన్నా, మన సినిమా ఆనవాళ్ళ మీద ఇప్పటికీ అశ్రద్ధ కొనసాగుతోందనేది మాత్రం నిర్వివాదాంశం. ఆ అశ్రద్ధ వల్ల పాత చిత్రాల ప్రింట్లే లేని పరిస్థితి. ఇప్పటికైనా మన సినిమా పెద్దలు కళ్ళు తెరిచి పుణే ఫిల్మ్ ఆర్కైవ్స్ లాంటి చోట్ల మిగిలిన మన కొద్దిపాటి పాత తెలుగు చిత్రాల ప్రింట్లనైనా డిజిటలైజ్ చేయించాలి. అందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలూ చొరవ చూపాలి. సినిమా ప్రియులందరూ మన సినిమాకు ఇవ్వగలిగిన అసలైన బర్త్ డే గిఫ్ట్ అదే!

సినీ కార్మికులకు ఆరోగ్య భీమా కల్పిస్తాం


- పి. రామ్మోహన్‌రావు



కాదంబరి కిరణ్, దశరథ్, రామ్మోహన్‌రావు, వేణుగోపాల్

తెలుగు చిత్రపరిశ్రమలోని సినీ కార్మికులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి.రామ్మోహన్‌రావు చెప్పారు. కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య బీమా లేదనీ, వాళ్లకు ఎఫ్.డి.సి. నుండి హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తామన్నారు. నటుడు కాదంబరి కిరణ్ నిర్వహిస్తున్న ‘మనం సైతం’ సేవా కార్యక్రమంలో ఆయన అతిధిగా పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని నిర్మాతల మండలి హాలులో జరిగిన కార్యక్రమంలో పది మంది పేద కార్మికులకు ఆర్థిక సహాయాన్ని రామ్మోహన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘చిత్రపురి కాలనీలో ఒక వైద్యశాల నిర్మించాలని ప్రయత్నిస్తున్నాం. దీనివల్ల అక్కడ నివసిస్తున్న కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిత్యం పోటీ ఉండే చిత్రపరిశ్రమలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం’ అంటూ కాదంబరి కిరణ్ , ఆయన టీమ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు దశరథ్, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత కూడా పాల్గొన్నారు.


స్ట్రీట్ డ్యాన్సర్లు!



శ్రద్ధా కపూర్

‘ఎబిసిడి 2’ తర్వాత వరుణ్ ధావన్, శ్రద్ధా కపూర్ జంటగా నటిస్తున్న హిందీ చిత్రానికి ‘స్ట్రీట్ డ్యాన్సర్’ టైటిల్ ఖరారు చేశారు. ‘ఎబిసిడి 2’ చిత్రానికి దర్శకత్వం వహించిన నృత్యదర్శకుడు రెమో డిసౌజా ఈ చిత్రానికీ దర్శకుడు కావడంతో ఈ చిత్రం టైటిల్ ‘ఎబిసిడి 3’ అనుకున్నారంతా! అయితే... త్రీడీలో రూపొందుతున్న డిఫరెంట్ డ్యాన్స్ బేస్డ్ చిత్రమిదని ఫస్ట్ లుక్ పోస్టర్లు, టైటిల్‌తో స్పష్టం చేశారు. ఇందులో హీరో హీరోయిన్లు ఇద్దరూ స్ట్రీట్ డ్యాన్సర్లుగా కనిపించనున్నారు. శ్రద్ధా కపూర్‌ది పాకిస్తానీ డ్యాన్సర్ క్యారెక్టర్ అని నటిస్తున్నారని సమాచారం. “వీధుల్లో నడవడం ఎందుకు? డ్యాన్స్ చేయగలిగినప్పుడు!” అని వరుణ్ ధావన్ పేర్కొన్నారు. నిజానికి, ఈ పాత్రలో కత్రీనా కైఫ్ నటించాలి. సల్మాన్‌ఖాన్ ‘భారత్’తో ఈ ‘స్ట్రీట్ డ్యాన్సర్’ షెడ్యూల్స్ క్లాష్ కావడంతో సినిమా నుంచి ఆమె తప్పుకున్నారు. తొమ్మిది నెలల ముందే ఈ సినిమా విడుదల తేదీ ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ 8న సినిమాను విడుదల చేయనున్నట్టు తెలిపారు.

ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో...



నాగచైతన్య

ప్రేమికుడిగా, క్రీడాకారుడిగా, హుషారైన కుర్రాడిగా... ఇలా ఎటువంటి పాత్రలోనైనా నటించగల యువ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య. ‘చందమామ కథలు’, ‘గుంటూరు టాకీస్’, ‘పీఎస్వీ గరుడవేడ’ చిత్రాలతో ఎటువంటి కథనైనా తెరకెక్కించగల సామర్థ్యమున్న విలక్షణ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభాశాలి ప్రవీణ్ సత్తారు. వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రూపొందనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. నాగచైతన్య, ప్రవీణ్ సత్తారు మధ్య కథాచర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం నాగచైతన్య ‘మజిలీ’ చిత్రంలో నటిస్తున్నారు. త్వరలో మేనమామ వెంకటేశ్‌తో కలిసి నటిస్తున్న ‘వెంకీమామ’ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత ప్రవీణ్ సత్తారు చిత్రం ప్రారంభమవుతుందని వినికిడి.

మాఫియా సముద్రంలో...



సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా ‘ఆర్‌ఎక్స్ 100’ ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. దీనికి ‘మహా సముద్రం’ అనే టైటిల్ ఖరారు చేసినట్టు సమాచారం. మాఫియా నేపథ్యంలో దర్శకుడు కథ సిద్ధం చేశారు. ఇదొక మల్టీస్టారర్ సినిమా. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో పాటు చిత్రంలో మరో కథానాయకుడికి చోటుంది. అతను ఎవరనేది త్వరలో తెలుస్తుంది. ప్రస్తుతం తేజ దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న ‘సీత’ చిత్రీకరణ చివరిదశకు వచ్చేసింది. అది పూర్తయిన వెంటనే అజయ్ భూపతి చిత్రం మొదలవుతుందని తెలుస్తుంది. ఈలోపు మరో కథానాయకుడి ఎంపిక పూర్తవుతుందట! ప్రస్తుతం ఇద్దరు ముగ్గురు యువ కథానాయకులు పేర్లు పరిశీలనలో ఉన్నాయట.

గవర్నమెంట్ జాబ్స్

ఆరోగ్య కార్యకర్తలు

ఖాళీలు 1900

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ విభాగం - బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్త ఉద్యోగాల భర్తీకి మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
జిల్లావారీ ఖాళీలు: శ్రీకాకుళం 52, విజయనగరం 29, విశాఖపట్నం 150, తూర్పుగోదావరి 227, పశ్చిమ గోదావరి 193, కృష్ణా 168, గుంటూరు 242, ప్రకాశం 99, నెల్లూరు 176, చిత్తూరు 182, కడప 97, అనంతపురం 140, కర్నూలు 145
అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఎంపీహెచ్‌ఏ కోర్సు పూర్తిచేసి ఉండాలి లేదా ఇంటర్ (ఒకేషనల్) పూర్తిచేసి ప్రభుత్వాసుపత్రుల్లో ఏడాది క్లినికల్ శిక్షణ పొంది ఉండాలి.
వయసు: ఫిబ్రవరి 1 నాటికి 42 ఏళ్లు మించకూడదు. ఒప్పంద పద్ధతిలో ఎంపీహెచ్‌ఏగా పనిచేస్తున్నవారికి ప్రాధాన్యమిస్తారు. **దరఖాస్తు ఫీజు:** రూ.300
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
వెబ్‌సైట్: www.cfw.ap.nic.in

కానిస్టేబుల్స్

ఖాళీలు 1763

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)- కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మన్) భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 1763
ఉద్యోగాలు: కోబ్లర్, టైలర్, కార్పెంటర్, కుక్, బార్బర్, స్వీపర్, పెయింటర్, వెయిటర్, డ్రాఫ్ట్స్‌మన్
అర్హత: మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా రెండేళ్ల డిప్లొమా (ఇండస్ట్రియల్ ట్రైనింగ్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: ఆగస్టు 1 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి. **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** మార్చి 3
వెబ్‌సైట్: www.bsf.nic.in

కాంట్రాక్ట్ వర్క్‌మన్

ఖాళీలు 195

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- కాంట్రాక్ట్ వర్క్‌మన్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఉద్యోగాలు: ఫ్యాబ్రికేషన్ అసిస్టెంట్లు, అవుట్‌ఫిట్ అసిస్టెంట్లు, ఏసీ టెక్నీషియన్లు, ఫైర్‌మన్, షిప్ డిజైన్ అసిస్టెంట్లు
అర్హత: ఉద్యోగాన్ని అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: అకడమిక్ మెరిట్, ఆబ్జెక్టివ్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ లేదా స్కిల్ టెస్ట్ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 13
వెబ్‌సైట్: www.cochinshipyard.com

అసిస్టెంట్లు, ఆపరేటర్లు

ఖాళీలు 77

లఖ్‌నవ్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ - అసిస్టెంట్లు, ఆపరేటర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఉద్యోగాలు: అసిస్టెంట్లు 43, ఆపరేటర్లు 34
అసిస్టెంట్ పోస్టుల విభాగాలు: అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్, క్యూసీ, ఇన్‌స్పెక్షన్, కమర్షియల్, సివిల్ వర్క్స్
ఆపరేటర్ విభాగాలు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్
అర్హత: ఉద్యోగాన్ని అనుసరించి ఐటీఐ/ డిప్లొమా/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: జనవరి 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు
ఎంపిక: రాత పరీక్ష, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 13
వెబ్‌సైట్: www.hal-india.co.in

జర్నీమన్

ఖాళీలు 6

కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్ - వివిధ విభాగాల్లో జర్నీమ్యాన్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 6 (పైప్ ఫిట్టర్ 1, కంప్యూటర్ ఆపరేటర్ 3, పెయింటర్ 2). **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసి ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 25
వెబ్‌సైట్: www.grse.in

జూనియర్ ఇంజనీర్లు, క్లర్కులు

ఖాళీలు 73

నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ - కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఉద్యోగాలు: జూనియర్ ఇంజనీర్లు 25, ఎల్‌డీసీ 33, స్టెనోగ్రాఫర్లు 8, జూనియర్ అకౌంటెంట్లు 7
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
అర్హత: జూనియర్ ఇంజనీర్లకు డిప్లొమా(సివిల్), జూనియర్ అకౌంటెంట్లకు బీకాం, స్టెనోగ్రాఫర్లకు ఇంటర్, ఎల్‌డీసీలకు పదోతరగతి& టైపింగ్ (హిందీ, ఇంగ్లిషు) సర్టిఫికెట్లు ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.650
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 22
వెబ్‌సైట్: www.nwda.gov.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్

సికింద్రాబాద్, ఆర్‌కే.పురంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ - కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఉద్యోగాలు: హెడ్ కుక్, లోయర్ డివిజన్ క్లర్క్, స్పెషల్ ఎడ్యుకేటర్, సైన్స్ ల్యాబ్ అటెండెంట్, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, డ్రైవర్
అర్హత: ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీఎడ్ పూర్తిచేసి ఉండాలి. డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** ఫిబ్రవరి 20. **వెబ్‌సైట్:** www.apsrkpuram.edu.in

రెజ్యూమె

బ్లాగ్‌ల నుంచి కాపీ వద్దు

దరఖాస్తు ఎలా నింపాలో చెప్పడానికి ఈ రోజుల్లో బోలెడు వెబ్‌సైట్‌లు, బ్లాగులు, అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తు పూర్తి చేయడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి. అయితే వీటితోనే పనంతా పూర్తి కాదు. బ్లాగులో నుంచి మనకు నచ్చింది తీసుకుని తిరగ రాసుకోవాలి. అవసరానుగుణంగా పాలిష్ చేసుకోవాలి. నిజానికి బ్లాగ్‌లోని మేటర్ చాలా సందర్భాల్లో అభ్యర్థి అంతరంగానికి అద్దంపట్టకపోవచ్చు. బ్లాగులు, సైట్లు రెజ్యూమె నింపేందుకు దారి చూపుతాయే తప్ప గమ్యానికి చేర్చవు. మనం దేనికి దరఖాస్తు చేస్తున్నాం, సదరు ఉద్యోగానికి కావాల్సిన కనీస ప్రాతిపదికలు ఏమిటి అన్నవి క్షుణ్ణంగా తెలుసుకుని అందుకు అనుగుణంగా రెజ్యూమె రూపొందించుకుని పంపుకోవాలి. ఒక రెజ్యూమె తయారు చేసుకుని రొడ్డుకొట్టుడుగా అన్నింటికీ అదే పంపొద్దు.

మూస రెజ్యూమెలకు ఆదరణ తక్కువ. బ్లాగులతో వచ్చే ప్రధాన ఇబ్బంది అదే. మన దరఖాస్తు మనకు చాలా గొప్ప, మనకు ముఖ్యం. అయితే అది రిక్రూటర్ దృష్టిలో గొప్పగా ఉండకపోవచ్చు. సవాలక్ష దరఖాస్తుల్లో రిక్రూటర్‌కు అది ఒకటి మాత్రమే. ప్రధానంగా దరఖాస్తుల తొలి వడపోతలో పాల్గొనే వ్యక్తులు పెద్దగా పెద్ద స్థాయి ఉద్యోగులు కారు. రిక్రూటింగ్ ప్రొఫెషనల్స్‌కు సహాయకారులుగా ఉండే క్లరికల్ సిబ్బంది కావచ్చు. లేదంటే డిపార్ట్‌మెంట్‌లో కొద్దిపాటి అనుభవం గడించిన వ్యక్తులు కావచ్చు. ప్రాథమిక వడపోతలో భాగంగా ఒకేరకంగా ఉన్న వాటిని పక్కన పెట్టేయవచ్చు. మేనేజర్లు చెప్పిన కొన్ని సూచనలకు లోబడి దరఖాస్తులను వేరుచేయవచ్చు. ఆ నేపథ్యంలో రెజ్యూమే ఎంత పకడ్బందీగా ఉండాలో అర్థం చేసుకోవాలి.

అనుభవం

ఏదైనా ఒక ఉద్యోగానికి ప్రాథమికంగా కొన్ని అర్హతలు అవసరమవుతాయి. మరికొన్నింటికి అనుభవం కూడా కావాల్సి వస్తుంది. వేర్వేరు రంగాల్లో అనుభవం మీకు ఉండొచ్చు. అదంతా ఒకదాని తరవాత పూసగుచ్చినట్టు రాసుకుంటూ వెళ్ళకూడదు. దరఖాస్తు చేస్తున్న ఉద్యోగానికి తగ్గ అనుభవం మాత్రమే ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ఆ విషయానికి రెజ్యూమెలో ఇతోధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సేల్స్ ఉద్యోగానికి సంబంధిత అనుభవం మాత్రమే అక్కరకు వస్తుంది. పర్చేజింగ్ అనుభవం ఉన్నప్పటికీ దానికి ప్రాముఖ్యం ఉండదు. పోస్ట్‌కు తగిన అనుభవం ఏదైనా ఉంటే దాన్ని మొదట హైలైట్ చేయాలి. మిగిలినదంతా వెనక్కు తీసుకువెళ్ళాలి.

మాస్టర్ లిస్ట్

ఉద్యోగం ఏదైనప్పటికీ కొన్ని విషయాలకు ఎప్పుడూ ప్రాముఖ్యం ఉంటుంది. అవేంటో తెలుసుసుకుని ఒక జాబితా రూపొందించుకోవాలి. వాటిని ఒక క్రమపద్ధతిలో తప్పనిసరిగా రెజ్యూమెలో పొందుపరచాలి. ఈ విషయంలో బ్లాగులు అందించే సమాచారం ఉపకరిస్తుంది. ఏ విషయాన్ని ఏ ప్రాతిపాదికపై ఎంత మేరకు తీసుకోవాలన్నది బ్లాగుల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అసలు మాస్టర్ లిస్టులోకి ఏయే అంశాలు, విషయాలు అవసరం అన్నంత వరకు తెలుసుకోవాలి. అయితే బ్లాగ్‌లో ఇచ్చిన ఆయా అంశాలను మన అర్హతలు, ఆసక్తులకు అనుగుణంగా మలుచుకోవాలి. అది మన బాధ్యత.

అవసరమైనది మొదట్లో..

ఉద్యోగానికి నేరుగా వర్తించే అంశాలు మొదట్లో ఉండాలి. అంటే ఇక్కడ బ్లాగ్‌కు మించి ఆలోచించాలి. అనుభవాన్ని ఒక క్రమపద్ధతిలో ఎలా వివరించాలో బ్లాగ్ తెలియజేస్తుంది. అంతే తప్ప ప్రతి ఉద్యోగానికీ అలాగే ప్రతి వ్యక్తికి తగ్గట్టు అది రెజ్యూమెను రూపొందించదు. జాబ్ స్వరూప స్వభావాలను అనుసరించి ప్రాధాన్యాలు మారుతూ ఉంటాయి. చదువుకున్నది ఇంజనీరింగ్, దరఖాస్తు సేల్స్ ఉద్యోగానికి అనుకుందాం. ప్రాథమిక అర్హతగా ఇంజనీరింగ్ వరకు ఓకే. అనుభవం విషయానికి వస్తే ప్రాజెక్ట్ వర్క్ లేదంటే క్యాంపస్‌లో నిర్వహించే వివిధ వేడుకల్లో మీరు గడించిన ప్రొడక్ట్ సేల్స్ అనుభవానికి ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థులుగా మీ ఆవిష్కరణ లేదంటే ప్రాజెక్టుగా ఇచ్చిన పని నలుగురికీ నచ్చేలా చెప్పిన విధం లేదంటే ఆకట్టుకునేలా చేసేందుకు మీరు చేసిన కృషికి ప్రాధాన్యం ఇచ్చి వివరించగలగాలి.



సంక్షిప్తత ముఖ్యం

దరఖాస్తు ఎ4లో రెండు పేజీల వరకు ఉండొచ్చని ఎక్కువ మంది చెబుతూ ఉంటారు. అదే నమ్ముతూ సమస్త సమాచారాన్ని ఆ రెండు పేజీల్లోనే కూరడానికి ప్రయత్నిస్తుంటారు. నిజానికి అనవసర విషయాలను పక్కకు పెట్టేయాలి. అసలు సంగతులను చక్కగా పేర్చగలిగితేనే దరఖాస్తు ఆకట్టుకుంటుంది. ఉదాహరణకు క్రికెట్‌లో ప్రావీణ్యం ఉంటే ఆటకు సంబంధించిన పది పాఠాలు మొదటి పేజీలో చెప్పి, మీ సామర్థ్యం ఎక్కడో చెపితే ఉపయోగం ఉండదు. అది రిక్రూటర్ దరి చేరదు. క్రికెట్ గురించి అందరికీ తెలుసు. అందులో మీ సామర్థ్యం ఏమిటో తెలియజేస్తే సరిపోతుంది. మీ అర్హత బీటెక్ అని, బ్రాంచ్ ఫలానా అని తెలుసు. ఆ కోర్సు చేసిన నాలుగేళ్ళలో ఏమి గ్రహించారన్నది తెలియజేయగలిగితే బాగుంటుంది.

సూచనలను పాటించాలి

జాబ్ ప్రకటనలో చేసిన సూచనలను ఎక్కువ మంది పాటించరు. ఈ విషయాలు బ్లాగులో లభ్యం కావు. ఫలానా విధంగానే దరఖాస్తు చేసుకోవాలని లేదా తమకు అవసరమైనవి ఆ కొద్ది విషయాలు మాత్రమేనని ప్రకటనలోనే కచ్చితంగా చెప్పినప్పుడు అవి పాటించి తీరాల్సిందే. అందుకు తగ్గట్టుగానే దరఖాస్తు ఉండాలి. జాబ్ ప్రకటనలో ఎలాంటి నిబంధనలు లేనిపక్షంలో మనకు నచ్చిన విధంగా దరఖాస్తును రూపొందించుకునే వెసులుబాటు లభిస్తుంది. అందువల్ల జాబ్ ప్రకటనను క్షుణ్ణంగా చదవాలి. అప్పుడే మనకు ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అన్న సంగతులు తెలుస్తాయి.

సరళత ముఖ్యం

దరఖాస్తులో టైపింగ్ తప్పులు పెద్ద విషయం కాదని చాలా మంది అభ్యర్థులు భావిస్తుంటారు. రెండు మూడు పర్యాయాలు దరఖాస్తు మొత్తం చదువుకున్నప్పటికీ 'సెండ్' బటన్ కొట్టే సమయంలో కూడా ఏదో ఒక తప్పు కనిపిస్తుంది. అంతేకాదు అన్ ప్రొఫెషనల్‌గా ఉండే ఉదాహరణలు, పదాలు కూడా సీవీల్లో దొర్లుతుంటాయి. వాటిని రిక్రూటర్లు సీరియస్ విషయంగా పరిగణిస్తారు.

పంచ్ కవర్ లెటర్

సుదీర్ఘంగా, పదేపదే దొర్లే పదాలతో కవరింగ్ లెటర్ రాయవద్దు. ఒకే రకమైన భావం, పదాలతో కూడిన దరఖాస్తులు హైరింగ్ మేనేజర్లు రోజూ చూసి విసుగెత్తి ఉంటారు. పంచ్ పదాలు, భిన్నంగా ఉన్నవి రిక్రూటర్లను ఆకట్టుకుంటాయి. ఇవే మిగిలిన వారినుంచి భిన్నంగా నిలబెడతాయి. ఉద్యోగంలో కలిగిన ఏదో ఇబ్బందిని మీరు ఎలా సులువుగా పరిష్కరించారు, ఇతరుల కంటే ముందే సదరు ఉద్యోగానికి అవసరమైన టెక్నాలజీని మీరు ఎలా అందిపుచ్చుకున్నారు తదితరాలు రిక్రూటర్‌ను ఆకట్టుకుంటాయి. కవరింగ్ లెటర్ అంటే ఒక ఐదారు వందల పదాలతో రాయవద్దు.
మూడు చిన్ని పేరాలు ఉంటే చాలు. సైజు పెరుగుతున్న కొద్దీ చెత్తబుట్టలోకి చేరడానికి దగ్గరవుతోందని భావించాల్సిందే.

జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

ఖాళీలు 53

రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్- జూనియర్ ఇంజనీర్ల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
ఉద్యోగం: జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు
విభాగం: ప్రొడక్షన్. **అర్హత:**బీఎస్సీ(ఎంపీసీ) లేదా డిప్లొమా (కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 2018 డిసెంబరు 31 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.200. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 15 నుంచి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** మార్చి 14.
వెబ్‌సైట్:www.nationalfertillizers.com

సౌత్ ఈస్టరన్ కోల్‌ఫీల్డ్స్

ఖాళీలు 76

సౌత్ ఈస్టరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్- కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఉద్యోగాలు: మైనింగ్ సిర్దార్ 62, డిప్యూటీ సర్వేయర్ 14
అర్హత: మెట్రిక్యులేషన్ లేదా పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు మైనింగ్ సిర్దార్‌షిప్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ అండ్ గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికెట్, సర్వే సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ పొంది ఉండాలి.
వయసు: ఫిబ్రవరి 28 నాటికి 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
వెబ్‌సైట్: www.seclcil.in

అప్రెంటీస్‌లు

ఖాళీలు 40

ఇండోర్‌లోని రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ - ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ట్రేడ్స్: ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, డ్రాఫ్ట్స్‌మన్ (మెకానికల్), వెల్డర్ (గ్యాస్ & ఎలక్ట్రిక్), మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, కంప్యూటర్ నెట్ వర్క్ టెక్నీషియన్
అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసి ఉండాలి. **వయసు:** ఏప్రిల్ 15 నాటికి 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
వెబ్‌సైట్:www. rrcat. gov.in

సేఫ్టీ ఆఫీసర్లు

ఖాళీలు 38

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)- ఎఫ్‌టీఏ - సేఫ్టీ ఆఫీసర్ల భర్తీకి ఇంజనీర్ల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: బిఈ/ బీటెక్(మెకానికల్/ ఎలక్ట్రికల్/ సివిల్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్) ఉత్తీర్నతతోపాటు డిప్లొమా(ఇండస్ట్రియల్ సేఫ్టీ)చేసి ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.
వయసు: జనవరి 23 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రూ.62,100
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా (1:10 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు.)
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 11
వెబ్‌సైట్: www.bhelpssr.co.in

బోధన, బోధనేతర సిబ్బంది

హైదరాబాద్‌లోని గోల్కొండ కేంద్రీయ విద్యాలయ - ఒప్పంద ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఉద్యోగాలు: పీజీటీలు, టీజీటీలు, ప్రైమరీ టీచర్లు, డ్యాన్స్ టీచర్ / కోచ్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కోచ్, నర్స్, కౌన్సిలర్, పీఆర్‌టీ మ్యూజిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, జర్మన్ టీచర్
అర్హత: పీజీ/ డిగ్రీ/ డిప్లొమా/ బీఎడ్ పూర్తిచేసి ఉండాలి. సీటెట్ అర్హతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, బోధన నైపుణ్యం ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ, స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 16
వెబ్‌సైట్: www.kv1golconda.edu.in

క్లర్కులు

ఖాళీలు 60

ముంబైలోని బాబా అటామిక్ రీసెర్చ్ (బార్క్) - కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఉద్యోగాలు: అప్పర్ డివిజన్ క్లర్క్ 47, స్టెనోగ్రాఫర్స్ 13
అర్హత: క్లర్కులకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు టైప్ రైటింగ్, కంప్యూటర్ డేటా ప్రాసెసింగ్ పరిజ్ఞానం ఉండాలి. స్టెనోలకు స్టెనోగ్రఫీతోపాటు టైపింగ్ పరిజ్ఞానం ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: ఆబ్జెక్టివ్ టెస్ట్, డిస్క్రిప్టివ్ టెస్ట్, స్టెనోగ్రఫీ స్కిల్ టెస్ట్ ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 25
వెబ్‌సైట్: www.barc.gov.in

ఏపీ పోస్టల్ సర్కిల్

ఖాళీలు 68

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ - గ్రూప్ సి ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఉద్యోగాలు: మెయిల్ గార్డ్ 3, ఎంటీఎస్ 46, పోస్ట్‌మన్ 19
అర్హత: మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన పరీక్ష లేదా ఐటీఐ పూర్తిచేసి ఉండాలి.
వయసు: ఎంటీఎస్‌లకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య మిగిలిన పోస్టులకు 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
ప్రొబెషన్: రెండేళ్లు. **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు రూ.100)
ప్రైమరీ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ: మార్చి 5
ఫైనల్ సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: మార్చి 8
వెబ్‌సైట్: www.appost.in

ఐసిఎంఆర్

ఖాళీలు 24

ఐసిఎంఆర్ సంస్థ- నేషనల్ యాని మల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్ కింది పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. ఉద్యోగాలు: అసిస్టెంట్ 2, యూడీసీ 2, టెక్నికల్ అసిస్టెంట్ 4, ల్యాబొరేటరీ అటెండెంట్ 12, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ 4. **ఆఖరు తేదీ:** ఫిబ్రవరి 25
వెబ్‌సైట్: www.icmr.nic.in/

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 134

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)- కింది విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలవారీ ఖాళీలు: మెడికల్ 121, నాన్ మెడికల్ 13
మెడికల్ విభాగాలు: అనెస్థీషియా, అనాటమీ, కమ్యూనిటీ మెడిసిన్ అండ్ ఎస్‌పీహెచ్, హెల్త్ ఎకనామిక్స్, సీటీవీఎస్, సైటాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, జనరల్ సర్జరీ
అర్హత: సంబంధిత విభాగంలో పీజీ (ఎండీ/ ఎంఎస్/ ఎంసీహెచ్/ డీఎం) లేదా పీహెచ్‌డీ పూర్తిచేసి ఉండాలి.
వయసు: దరఖాస్తునాటికి 50 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: రూ.1000 (ఎస్సీ/ ఎస్టీలకు రూ.500)
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 9
వెబ్‌సైట్: www.pgimer.edu.in

అసిస్టెంట్ సర్జన్లు

ఖాళీలు 17

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్- అసిస్టెంట్ సర్జన్ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.
విభాగం: అసిస్టెంట్ కమాండెంట్ / వెటరినరీ
దరఖాస్తు ఫీజు: రూ.400 (ఎస్సీ/ ఎస్టీ/ఎక్స్ సర్వీస్‌మన్/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 6
వెబ్‌సైట్: www.recruitment.itbpolice.nic.in

డల్లాస్ కంపెనీలో శ్రీ కేపిటల్ పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డల్లాస్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కృత్రిమ మేథ (ఏఐ) రంగంలోని స్టార్టప్ కంపెనీ ఎడ్జ్‌టెన్సర్‌లో శ్రీ కేపిటల్ పెట్టుబడులు పెట్టింది. పెట్టుబడి వివరాలను మాత్రం బయటకు వెల్లడించలేదు. ఎడ్జ్‌టెన్సర్‌కు బెంగళూరులో అభివృద్ధి కేంద్రం ఉంది. దీన్ని రాజేశ్ నరసింహ, సౌమిత్రి జె రాయ్ కలిసి నెలకొల్పారు. మాస్ మార్కెట్‌కు ఆమోదయోగ్యమైన వ్యయంతో ఎడ్జ్ ఆధారిత ఏఐ సొల్యూషన్లను అభివృద్ధి చేయడంపై ఈ కంపెనీ దృష్టి పెట్టింది. ఆమోదయోగ్యమైన ధరల ఏఐ సొల్యూషన్ల మార్కెట్‌లో ఎడ్జ్‌టెన్సర్ కీలక పాత్ర పోషించగలదని భావిస్తున్నామని శ్రీ కేపిటల్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ పార్టనర్ శశి రెడ్డి తెలిపారు.

మార్కెట్‌కు మంచిదే!

2019పై మిరే అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ స్వరూప్ మొహంతి

వినియోగ, వాహన రంగ కంపెనీలకు బాగుంటుంది

ఎన్నికల సమయంలో వృద్ధి పుంజుకుంటుంది

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పుడే పెట్టుబడులకు మంచి అవకాశం. మదుపర్లు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళిక (సిప్)ను కొనసాగించాలి. పెట్టుబడులకు 2019 బాగా ఉండే అవకాశాలు ఉన్నాయని మిరే అసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఇండియా) ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈఓ) స్వరూప్ మొహంతి తెలిపారు. దేశంలో వ్యవస్థాపూర్వకమైన వృద్ధి కొనసాగుతుందని, ప్రపంచవ్యాప్తంగా 35 సంవత్సరాల లోపు వయసున్న జనాభాలో 65 శాతం మంది భారత్‌లోనే ఉన్నారని వివరించారు. భారత్‌కు ఇది ఎంతో అనుకూల అంశం. పెట్టుబడులన్నీ ఇక్కడికే వస్తాయని, మరెక్కడా లేని వ్యాపార స్వేచ్ఛ భారత్‌లో ఉందన్నారు. గతంలో మార్కెట్ పడిపోతే 60 శాతానికి పైగా మదుపర్లు సిప్‌ను నిలిపివేసే వారని.. ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవని వివరించారు. మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ కంపెనీ రూ.23,500 కోట్ల ఆస్తులను (ఏయూఎం) నిర్వహిస్తోంది. ఇందులో ఇండియా ఈక్విటీ ఫండ్ కిందే రూ.10 వేల కోట్ల ఆస్తులను నిర్వహిస్తున్నట్లు మొహంతి తెలిపారు. మార్కెట్‌పై ఆయన ఏమన్నారంటే..

- 2019లో స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండొచ్చు. ప్రపంచ వృద్ధి రేటు కొద్దిగా మందగించినా.. పదేళ్ల సగటు కన్నా ఎక్కువగానే ఉంది. భారత్‌లో 7 శాతం పైన వృద్ధి రేటు కొనసాగుతోంది. దీర్ఘకాల ప్రాతిపదికన దేశంలోని అనుకూల జనాభా పరిణామాలు వృద్ధికి మద్దతుగా నిలవనున్నాయి.
- ఇటీవల తగ్గిన ముడి చమురు ధరలు భారత కరెంట్ ఖాతా లోటు (సీఏడీ)పై ఒత్తిడిని తగ్గించనుంది. దీని వల్ల డాలరుతో రూపాయి మారకపు విలువ పెరగొచ్చు. 2018 అక్టోబరులో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర 36 శాతం పెరిగింది. నాలుగేళ్ల గరిష్ఠ స్థాయి 86 డాలర్లకు చేరింది . అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గుతుందన్న భయంతో ఆ తర్వాత 40 శాతం తగ్గింది. ముడి చమురు సరఫరా పెరగడం.. గిరాకీ మందగించడం వల్ల 2019లో ముడి చమురు ధరలు తక్కువగానే ఉండొచ్చని అంచనా.
- 2018లో తగ్గిన రూపాయి మారకపు విలువ 2019లో ఒక శ్రేణి మధ్య కదలాడే అవకాశం ఉంది. అమెరికా ఫెడ్ పరిమాణాత్మక నిబంధనలు కఠినం చేయడం.. విదేశీ సంస్థాగత మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం, అధిక ముడి చమురు ధరలు, వర్ధమాన దేశాల కరెన్సీలు బలహీన పడడం 2018లో రూపాయి క్షీణతకు కారణం అయ్యాయి. ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణం, చమురు ధరలు, అంతర్జాతీయంగా మదుపు సాధనాలు ఇస్తున్న ప్రతిఫలాలపై 2019లో రూపాయి మారకపు విలువ ఆధారపడి ఉంది.
- ఏప్రిల్ లేదా మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలపై ప్రపంచ మదుపర్లు దృష్టి సారించనున్నారు. గతంలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే.. ఎన్నికల సమయంలో వృద్ధి పుంజుకుంది.
- గత ఏడాదిలో మార్కెట్‌కు ఎదురు గాలులుగా నిలిచిన స్థూల ఆర్థిక అంశాలు ఈ ఏడాదిలో సానుకూల పవనాలుగా మారడానికి వీలుంది.
- అంతర్జాతీయంగా, దేశీయంగా కొన్ని ప్రతికూల పరిణామాలు చోటు చేసుకున్నా.. 2019లో కంపెనీల ఎర్నింగ్‌లు పుంజుకోవచ్చని భావిస్తున్నాం.
- రిటైల్ ద్రవ్యోల్బణం 2018 ప్రారంభంలో 5.07 శాతం ఉంది. 2018 నవంబరులో 2.33 శాతానికి పరిమితమైంది. ఆహార వస్తువుల ధరలు నియంత్రణలో ఉన్నందున రి టైల్ ద్రవ్యోల్బణం అదుపులోనే ఉండే అవకాశం ఉంది.
- మధ్య కాలానికి జీఎస్‌టీ, ఐబీసీ చట్టం అమలు ప్రభావాలు సానుకూల ప్రభావాన్ని చూపొచ్చు. అయితే.. నెలకు జీఎస్‌టీ పన్ను వసూళ్లు స్థిరంగా రూ.లక్ష కోట్లపైనే ఉండడం మార్కెట్‌కు కీలకం. మౌలిక సదుపాయాలపై చేస్తున్న ఖర్చు, రైతులకు నగదు బదిలీ మొదలైన అంశాలు కూడా ఆర్థిక వ్యవస్థలో వినియోగం పెరగడానికి దోహదం చేయనున్నాయి.
- ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్లు మించి కొనసాగితే మాత్రం ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందే.
- అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం వర్ధమాన మార్కెట్ల కరెన్సీలపై ప్రభావం చూపే వీలుంది.
- వినియోగ, వాహన రంగ కంపెనీలు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలకు చెందిన కంపెనీల షేర్లకు మార్కెట్‌లో మద్దతు లభించే వీలుంది. ఐటీ, ఫార్మా, ఆరోగ్య సంరక్షణ రంగాలకు చెందిన షేర్లు పెద్దగా ఆకర్షణీయంగా ఉండకపోవచ్చు.



హైదరాబాద్ మార్కెట్ కీలకం..

మిరే హైదరాబాద్ శాఖ నుంచి మిరే మ్యూచువల్ ఫండ్‌లలో మదుపర్లు రూ.728 కోట్ల పెట్టుబడులు పెట్టారు. హైదరాబాద్ శాఖ కంపెనీకి కీలకమైందని, కంపెనీ నిర్వహిస్తున్న ఆస్తుల్లో హైదరాబాద్ వాటా 2018, డిసెంబరు చివరకు రూ.728 కోట్లు ఉందని మొహంతి తెలిపారు. 2017 చివరి నాటికి ఈ ఆస్తులు రూ.450 కోట్లు మాత్రమేనన్నారు. ఇక్కడి నుంచి 55,000 ఇన్వెస్టర్ ఫోలియోలు ఉండగా.. 30,000 సిప్ ఫోలియోలేనన్నారు. కంపెనీ నిర్వహిస్తున్న మొత్తం ఆస్తులు ప్రస్తుతమున్న రూ.23,500 కోట్ల నుంచి 2019లో రూ.40,000 కోట్లకు చేరగలవని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ శాఖ ఏయూఎం రూ.1,000 కోట్లకు చేరగలదన్నారు.

రెనో ఇండియా అధిపతి మామిళ్లపల్లి వెంకట్రామ్



న్యూఢిల్లీ: మామిళ్లపల్లి వెంకట్రామ్‌ను రెనో ఇండియా ఎండీగా నియమిస్తున్నట్టు ఫ్రాన్స్‌నకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం 'రెనో గ్రూప్' ప్రకటించింది. వచ్చే నెల 1 నుంచి ఈ నియామకం అమలులోకి వస్తుంది. ఆటోమొబైల్ రంగంలో విస్తృత అనుభవం ఉన్న వెంకట్రామ్ ప్రస్తుతం రెనో గ్రూప్ రష్యా వ్యవహారాలు చూస్తున్నారు. మధురై కామరాజ్ యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పట్టభద్రుడైన వెంకట్రామ్, రెనో గ్రూప్‌లో చేరక ముందు టాటా మోటార్స్, జనరల్ మోటార్స్ కొరియా, జనరల్ మోటార్స్ ఇండియా, లంబోర్ఘినీ, డెల్ఫీ ఇండియా, ఐషర్ ట్రాక్టర్స్ వంటి పలు ఆటోమొబైల్ సంస్థల్లో పని చేశారు. ఇప్పటి వరకు రెనో ఇండియా ఎండీగా ఉన్న సుమిత్ సహానీ, రెనో గ్రూప్ ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ ఇండియా ప్రాంత ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతారు. త్వరలోనే ఆయన చేపట్టే కొత్త పదవిని ప్రకటిస్తామని రెనో గ్రూప్ తెలిపింది.

24 గంటల్లో పన్ను రిఫండ్!

రెండేళ్లలో అందుబాటులోకి: పాండే

న్యూఢిల్లీ: మరో రెండేళ్లలో అన్ని రిటర్నులను 24 గంటల్లో ప్రాసెస్ చేయడంతో పాటు రిఫండ్‌ను సైతం జారీ చేసే వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు. ఇందుకు అనుగుణంగా ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) ఐటీ వ్యవస్థను ఆధునికీకరించేందుకు గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ.4,200 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ ఏడాదిలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన రిఫండ్లను నేరుగా పన్ను చెల్లింపుదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరిగిందని పాండే చెప్పారు. ఐటీ డిపార్ట్‌మెంట్ సేవలిప్పుడు ఆన్‌లైన్ ద్వారానూ జరుగుతున్నాయని మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

'స్మార్ట్' స్టార్టప్‌లకు ఒప్పో సహకారం

తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో స్టార్టప్ సంస్కృతిని పెంచేందుకు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో..రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా స్మార్ట్‌ఫోన్ సంబంధిత పరిజ్ఞానానికి సంబంధించిన రంగాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహాయం అందించనుంది. కెమెరా, ఇమేజ్ ప్రాసెసింగ్, బ్యాటరీ, 5జీ నెట్‌వర్క్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), గేమింగ్ రంగాల్లోని సమస్యల పరిష్కారానికి సంబంధించి అప్లికేషన్స్, టెక్నాలజీ, సేవలు అందించే స్టార్టప్‌లను తాము గుర్తించి ప్రోత్సహిస్తామని ఒప్పో భారత ఉపాధ్యక్షుడు తస్లీమ్ ఆరిఫ్ పేర్కొన్నారు.



ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళతా

ప్రకటించిన విజయ్ మాల్యా



లండన్ : యూకే ప్రభుత్వ ఉత్తర్వులపై భారీ అప్పీల్‌కు సిద్ధమవుతున్నట్లు పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు విజయ్ మాల్యా ప్రకటించారు. భారత్‌లో రూ.9,000 కోట్ల నిధుల మళ్లింపు, మోసం చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మాల్యాను స్వదేశానికి అప్పగించేందుకు యూకే హోం శాఖ మంత్రి సాజిద్ జావిద్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు మాల్యాకు రెండు వారాల గడువునిచ్చారు. ఒకవేళ ఇక్కడ కూడా మాల్యాకు వ్యతిరేకంగా తీర్పు వస్తే సుప్రీం కోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. మాల్యా ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని, నకిలీ పత్రాలతో రుణాలు తీసుకున్నారన్న ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని అంటూ భారత్‌కు ఆయనను అప్పగించే విషయం పరిశీలించాలని కోరుతూ వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టు గత ఏడాది డిసెంబరు 10న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

హోం శాఖ మంత్రి నిర్ణయం తీసుకోక ముందు అప్పీల్ ప్రక్రియ చేపట్టరాదని భావించానని, తాజాగా ఆదేశాలు జారీ చేయటంతో ఈ ప్రక్రియను మొదలుపెట్టాలని నిర్ణయించినట్లు విజయ్ మాల్యా ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఆస్తుల అప్పగింతపై అభ్యంతరం లేదు

పీఎంఎల్ఏ కోర్టుకు విన్నవించిన ఈడీ

ముంబై : పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు విజయ్ మాల్యాకు చెందిన ఆస్తులను బ్యాంకులకు అప్పగించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)... కోర్టుకు తెలిపింది. అయితే భవిష్యత్తులో కోర్టు క్లెయిమ్ చేసుకునేందుకు అనుమతిస్తే బ్యాంకులు ఆ మొత్తాలను వడ్డీతో సహా తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించి అండర్‌టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మాల్యా ఆస్తుల విక్రయానికి సంబంధించి అనుమతివ్వాలని ఎస్‌బీఐ సారథ్యంలోని బ్యాంకుల కన్సార్షియం.. పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జప్తు చేసిన ఆస్తులను త్వరితగతిన విక్రయించేందుకు సత్వరమే అనుమతించాలని ఆ పిటిషన్‌లో కన్సార్షియం కోరింది.

నానో కనుమరుగు!

జనవరిలో ఉత్పత్తి లేదు, అమ్మకాలు లేవు

న్యూఢిల్లీ : రతన్ టాటా కలల కారు 'నానో' త్వరలో చరిత్రగా మిగలనుంది. ఈ సంవత్సరం జనవరిలో గుజరాత్‌లోని సనంద్ దగ్గర ఉన్న టాటా మోటార్స్ ప్లాంట్‌లో ఒక్క 'నానో' కారు కూడా ఉత్పత్తి కాలేదు. అలాగే దేశంలో ఎక్కడా ఒక్క 'నానో' కారు అమ్ముడుపోలేదు. ఎగుమతులదీ ఇదే పరిస్థితి. గత ఏడాది ఇదే సమయంలో కంపెనీ 83 నానో కార్లు ఉత్పత్తి చేసి, 62 కార్లను విక్రయించింది. టాటా మోటార్స్ సంస్థ మంగళవారం రెగ్యులేటరీ సంస్థలకు ఈ విషయం తెలిపింది. నిజానికి వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈ కార్ల ఉత్పత్తి నిలిపి వేయాలని, టాటా మోటార్స్ నిర్ణయించింది. ప్రస్తుత నానో కారు, కొత్తగా అమలులోకి వస్తున్న బీఎస్-6 ప్రామాణిక కాలుష్య నిబంధనలు, భద్రతా నిబంధనలకు అనుగుణంగా లేదు. అందుకు అనుగుణంగా తీర్చిదిద్దాలంటే మరింత ఖర్చు చేయాలి. చేసినా, కొనుగోలుదారుల ఆదరణను చూరగొంటుందో లేదో నమ్మకం లేదు. దీంతో వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 'నానో' కార్ల ఉత్పత్తి నిలిపి వేయాలని నిర్ణయించింది. అయితే ఈ లోపే మార్కెట్లో అమ్మకాలు జీరో స్థాయికి పడిపోవడంతో వచ్చే ఏడాది మార్చి కంటే ముందే, 'నానో' కారు చరిత్ర చరిత్రగా మిగిలి పోతుందని భావిస్తున్నారు. కంపెనీ అధికార వర్గాలు మాత్రం దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నాయి. డిమాండ్‌ను బట్టి నానో కార్ల ఉత్పత్తి ఉంటుందని కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు.

ఇదీ చరిత్ర

సామాన్య మధ్య తరగతి ప్రజలకు కూడా రూ.లక్షకే కారు అందించాలనే రతన్ టాటా సంకల్పంతో, టాటా మోటార్స్ కంపెనీ 'నానో' కారును అభివృద్ధి చేసింది. జనవరి, 2008లో ఢిల్లీలో జరిగిన ఆటో షోలో ఈ కారును మొదటిసారిగా ప్రదర్శించారు. ఆ మరుసటి సంవత్సరం మార్చి నుంచి 'నానో' కార్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. అయితే అప్పటికే ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయాయి. అయినా 'నా వాగ్దానం వాగ్దానమే' అని రతన్ టాటా స్పష్టం చేయడంతో టాటా మోటార్స్ 'నానో' బేసిక్ మోడల్‌ను లక్ష రూపాయలకే అందించింది.

ప్రారంభం నుంచే సమస్యలు

నానో కారు ప్రాజెక్టు ప్రారంభం నుంచే అనేక సమస్యలు ఎదుర్కొంది. నిజానానికి టాటా మోటార్స్ ఈ కారును పశ్చిమ బెంగాల్‌లోని నందిగామ్ దగ్గర ఉత్పత్తి చేయాలనుకుంది. అందుకు అవసరమైన భూమిని అప్పటి వామపక్ష ప్రభుత్వం కంపెనీకి కేటాయించింది. అయితే రైతుల నుంచి బలవంతంగా ఈ భూములు సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ టీఎంసీ నాయకత్వంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. దాంతో కంపెనీ ఈ ప్లాంట్‌న గుజరాత్‌లోని సనంద్‌కు తరలించింది. మార్కెట్లోకి వచ్చాక కూడా ఈ కారు ఇంజిన్‌లో మంటలు వస్తున్నాయని అనేక ఫిర్యాదులు వచ్చాయి. దాంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కూడా ఈ కారుపై పెద్దగా ఆసక్తి చూపలేదు. 'అత్యంత చౌకైన కారు' అని ప్రచారం చేయడం కూడా నానో కారు అమ్మకాలను దెబ్బ తీసిందని రతన్‌టాటా పేర్కొన్నారు.



ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీల వివరాలివ్వండి

ప్రభుత్వానికి ఎన్‌సీఎల్ఏటీ ఆదేశం

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూప్ కంపెనీల పేర్లు వాటి వర్గీకరణతో సహా అందించాలని, రుణాల చెల్లింపు విషయంలో వాటి సామర్థ్యం ఏమిటో కూడా సవివరంగా తెలియచేయాలని ఎన్‌సీఎల్ఏటీ.. ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ గ్రూప్ రుణ పరిష్కార ప్రణాళికను సోమవారం ప్రభుత్వం ఎన్‌సీఎల్ఏటీకి అందించింది. ఈ రుణ పరిష్కార ప్రణాళికా ప్రక్రియ పర్యవేక్షించడానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీకే జైన్‌ను నియమించినట్టు కూడా తెలిపింది. దివాలా చట్టంలో నిర్దేశించిన విధివిధానాలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని కూడా తెలిపింది. రుణ పరిష్కార ప్రణాళికలో ప్రభుత్వం ఆ గ్రూప్‌లోని కంపెనీలను వాటి ఆర్థిక స్థితి రీత్యా ఆకుపచ్చ, పసుపు, ఎరుపు వర్ణాల్లో విభజించింది. అయితే దేశీయంగానే ప్రధాన కార్యాలయాలు ఉండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీల్లో ఏయే కంపెనీలను ఆ మూడు రంగుల్లో వర్గీకరించింది వివరాలందించడంతో పాటు వాటి వాస్తవ ఆర్థిక స్థితిని కూడా వచ్చే విచారణ తేదీ నాటికి తెలియచేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఇద్దరు సభ్యుల ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఇవి కాకుండా విదేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆ గ్రూప్‌లోని ఇతర కంపెనీల వివరాలు వేరుగా అందించాలని కూడా కోరింది.

ఐబీసీలో 53వ సెక్షన్‌లో నిర్దేశించిన వాటర్‌ఫాల్ సిస్టమ్‌లోనే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీల మానిటైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామని, అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాలను కూడా అదే విధానం కింద రుణదాతలందరికీ పంపిణీ చేస్తామని ఎన్‌సీఎల్ఏటీకి తెలియచేసింది. ఐబీసీలోని 53వ సెక్షన్ కింద సీనియర్ రుణదాతలకు ముందు గా చెల్లింపులు చేసి మిగిలిన సొమ్మును అన్‌సెక్యూర్డ్, సబార్డినేట్ రుణదాతలకు అందించాల్సి ఉంటుంది.

అమ్మకానికి రీడ్ అండ్ టేలర్

ఆదేశాలు జారీ చేసిన ఎన్‌సీఎల్‌టీ

ముంబై : రీడ్ అండ్ టేలర్.. లిక్విడేషన్ (అమ్మకం)కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. కార్మికుల హక్కులను పరిరక్షించే విధంగా గోయింగ్ కన్సర్న్ (యథావిధిగా కార్యకలాపాలు సాగించటం)తో కంపెనీని విక్రయించే విధంగా చూడాలని రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ)కి సూచించింది. రీడ్ అండ్ టేలర్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన కొత్త ఇన్వెస్టర్ ఇండియా గాస్.. రూ.50 కోట్ల నెట్‌వర్త్‌తో పాటు రూ.2 కోట్ల నాన్ రిఫండబుల్ ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) చూపించటంలో విఫలం కావటంతో ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌కు సారథ్యం వహించిన భాస్కర పంతుల మోహన్, వి నల్లసేనాపతి ఈ మేరకు లిక్విడేషన్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి నెట్‌వర్త్‌ను చూపించటంలో విఫలం కావటంతో నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)ను ఇండియా గాస్ ఆశ్రయించరాదని కూడా ఎన్‌సీఎల్‌టీ బెంచ్ ఆదేశించింది. మరోవైపు రీడ్ అండ్ టేలర్ లిక్విడేషన్‌కు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేయటంతో పాటు యూఎస్‌కు చెందిన ఇన్వెస్టర్ ఫినిక్స్ జీబీఎల్ దాఖలు చేసిన టేకోవర్ బిడ్‌ను తిరస్కరించింది. మళ్లీ సమయాన్ని వృథా చేయాలని తాము భావించటం లేదని బెంచ్ స్పష్టం చేసింది. ఇప్పటికే నాలుగైదు బిడ్లు విఫలమయ్యాయని, లాభాల్లో నడుస్తున్న కంపెనీతో పాటు కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరలో లిక్విడేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్‌పీకీ బెంచ్ ఆదేశాలిచ్చింది. కాగా ఎన్‌సీఎల్‌టీ లిక్విడేషన్ ఉత్తర్వులపై ఉద్యోగుల అసోసియేషన్.. ఎన్‌సీఎల్ఏటీని ఆశ్రయించాలని నిర్ణయించింది.

ధరలు తగ్గిన వేళ.. వడ్డీ రేట్లూ తగ్గొచ్చు

స్టాండర్డ్ అండ్ పూర్ అంచనా

న్యూఢిల్లీ: ఈసారి సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీ (రెపో) రేట్లను తగ్గించేందుకు అవకాశాలున్నాయని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ స్టాండర్డ్ అండ్ పూర్ (ఎస్ అండ్ పీ) అంటోంది. ధరలు శాంతించడంతో పాటు ముడి చమురు సెగలు సైతం తగ్గుముఖం పట్టడంతో రేట్ల కోత విషయంలో ఆర్‌బీఐకి వెసులుబాటు లభించనుందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ ఆర్థికవేత్త విశ్రుత్ రాణా అన్నారు. ధరల ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నియంత్రిత లక్ష్య శ్రేణిలో కనిష్ఠ స్థాయికి చేరువైందని, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అక్టోబరు నాటి గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం తగ్గాయని ఆయన పేర్కొన్నారు. డిసెంబరు సమీక్షలో వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించిన ఆర్‌బీఐ..మున్ముందు నెలల్లో ద్రవ్యోల్బణాన్ని పెంచేందుకు పొంచి ఉన్న ముప్పు తప్పితే వడ్డీ రేట్లు తగ్గిస్తామని సంకేతాలిచ్చింది.

ఆర్‌బీఐ సమీక్ష షురూ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ఆరో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష మంగళవారం ప్రారంభమైంది. ఆర్‌బీఐ గవర్నర్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో కూడిన ఎంపీసీ వరుసగా మూడు రోజుల పాటు భేటీ అవుతుంది.

మరో రూ.3.5 లక్షల కోట్ల మొండి బకాయిలు

హెచ్చరించిన ఇండియా రేటింగ్స్

ముంబై: కార్పొరేట్ రుణాల్లో మరో రూ.3.50 లక్షల కోట్లు మొండి బకాయిలుగా మారే అవకాశం ఉందని తాజా నివేదిక ఒకటి హెచ్చరించింది. గత ఏడాది సెప్టెంబరు నాటికి రూ.13.5-14 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు ఒత్తిడిని ఎదుర్కొంటుండగా.. అందులో రూ.3.5 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు ఇంకా అధికారికంగా (ఒత్తిడిలో ఉన్నట్లు) గుర్తించలేదని ఇండియా రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. అధికారికంగా గుర్తించని వాటిలో 40 శాతం (రూ.1.5-2 లక్షల కోట్లు) మేర రుణాలు 2020 సెప్టెంబరు కల్లా మొండి పద్దులోకి చేరే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. వీటి కోసం బ్యాంకులు అదనంగా రూ.40 వేల కోట్ల మేర కేటాయింపులు జరపాల్సి రావచ్చని ఇండియా రేటింగ్స్‌లో బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థల విభాగ అసోసియేట్ డైరెక్టర్ జిందాల్ హరియా అన్నారు.

సుబాగ్జోన్‌పై కోర్టులో డాక్టర్ రెడ్డీస్‌కు విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ జనరిక్ ఔషధం సుబాగ్జోన్ కేసులో విజయం సాధించింది. ఆ ఔషధంపై తాము డాక్టర్ రెడ్డీస్‌కు అనుకూలంగా ఇచ్చిన ఇంజంక్షన్ ఉత్తర్వులపై తిరిగి విచారించేందుకు అమెరికా అప్పీళ్ల కోర్టు నిరాకరించిందని బ్రిటన్‌కు చెందిన ఫార్మా కంపెనీ ఇండివియార్ పీఎల్‌సీ ప్రకటించింది. కొన్ని రకాల నొప్పుల నివారణలో ఉపయోగించే ఔషధాలకు బానిసలైపోయిన వారికి చికిత్స అందించడంలో ఉపయోగించే ఈ ఔషధాన్ని అమెరికా మార్కెట్‌లో డాక్టర్ రెడ్డీస్ సహా పోటీదారులు విడుదల చేయడాన్ని నిరోధించేందుకు ఇండివియార్ న్యాయపోరాటం సాగిస్తోంది. అయితే ఈ పోటీ ఔషధాలను నిలువరించడం వల్ల తమకు ఏ విధంగా ప్రయోజనం అన్నది ఇండివియార్ నిరూపించలేక పోయిందంటూ డాక్టర్ రెడ్డీస్ ఔషధాలపై (బుప్రెనోర్ఫైన్, నాలోక్జోన్) గతంలో జిల్లా కోర్టు విధించిన ప్రాథమిక ఇంజంక్షన్‌ను అప్పీళ్ల కోర్టు కొట్టి వేసింది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
34.07 ↑	22.10 ↑	25 ↓	205 ↑	23 పైసలు ↑	↓
36,616.81	10,934.35	33,350	40,315	71.57	62.12
		ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)			

andhrajyothibusiness@gmail.com

హెచ్‌పీసీఎల్ డివిడెండు 65%

న్యూఢిల్లీ:ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను నిరాశపర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19).. మూడో త్రైమాసికానికి (అక్టోబరు-డిసెంబరు) కంపెనీ లాభం 87 శాతం తగ్గి రూ.248 కోట్లకు పరిమితమైంది. ముడి చమురు ధరల తగ్గుదలతో ఏర్పడిన ఇన్వెంటరీ నష్టాలతో పాటు రిఫైనింగ్ మార్జిన్లు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. గత ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఇదే త్రైమాసికానికి హెచ్‌పీసీఎల్ రూ.1,950 లాభం ప్రకటించగలిగింది. సమీక్షా కాలానికి కంపెనీ చమురు నిల్వలపై రూ.3,465 కోట్లు నష్టపోవాల్సి వచ్చిందని హెచ్‌పీసీఎల్ చైర్మన్, ఎండీ ముకేశ్ కే సురానా తెలిపారు. డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ విక్రయాలు రూ.76,884 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను షేర్‌హోల్డర్లకు ఒక్కో షేరుపై రూ.6.50 (65%) మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ బోర్డు ప్రకటించింది.

నిరోధాలు 10960, 11000

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమై 10940 వద్ద సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం 22 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. మార్కెట్ మరోసారి కీలక దశలో ప్రవేశించింది. మానసిక అవధి 11000కి చేరువవుతోంది. ఇదే స్వల్పకాలిక, మధ్యకాలిక ట్రెండ్ నిర్ణయ స్థాయి. ఈ స్థాయిలో గతంలో ఏర్పడిన భారీ రియాక్షన్‌తో పోల్చితే ఈ సారి మైనర్ రియాక్షన్లు మాత్రమే ఏర్పడ్డాయి. అమ్మకాల ఒత్తిడి తగ్గిందనేందుకు ఇది సంకేతం. ధోరణి ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉన్నా మరింత ర్యాలీకి పటిష్ఠతపై స్పష్టమైన సంకేతం వెలువడడం అవసరం.

బుధవారం స్థాయిలివే...

నిరోధం : 10960 మద్దతు : 10900

- మరింత పురోగమించేందుకు ఇంట్రాడే నిరోధం 10960 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11000. ఆ పైన ముగిసినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగుతుంది.
- మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 10900 కన్నా దిగజారితే మైనర్ ఇంట్రాడే కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10800. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్ ఏర్పడుతుంది.

■ వి.సుందర్ రాజా

మిడ్ సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ శుక్ల విదియ
నక్షత్రం : శతభిషం

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10934.35 (+22.10)

ట్రెండ్ మార్పు వేళలు : 1.03

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 10.05 నుంచి 11.45 వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి 1.45 వరకు, తిరిగి చివరిలోను మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.30 వరకు మెరుగ్గా ట్రేడయి చివరిలో మరోసారి నిస్తేజం అయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11.45 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయానికి. 1.45 తర్వాత తిరిగి దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలోను క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 109750, 11010

మద్దతు స్థాయిలు : 10895, 10860

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	34,480	33,760	34,390	33,700	33,280
క్రితం ముగింపు	34,400	33,780	34,410	33,600	33,280
22 క్యారెట్లు	31,930	31,300	31,630	31,240	31,810
క్రితం ముగింపు	31,850	31,300	31,650	31,220	31,810
వెండి (కిలో)	41,700	41,900	41,500	41,500	44,000
క్రితం ముగింపు	41,500	41,700	41,300	41,500	43,700

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.65 — నెక్ (100 గుడ్లు)


హైదరాబాద్	403	చిత్తూరు	438
వరంగల్	405	చెన్నై	445
విజయవాడ	401	నమక్కల్	430
గోదావరి	401	బెంగళూరు	435
విశాఖపట్నం	406	ముంబై	456

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70	విజయవాడ	75
కరీంనగర్	71	గుంటూరు	76
వరంగల్	70	ఒంగోలు	77
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	88
కర్నూలు	70	నెల్లూరు	88
విశాఖపట్నం	78	అనంతపురం	89
గోదావరి	72		

మళ్లీ లాభాల్లోకి పీఎన్‌బీ

డిసెంబరు త్రైమాసికానికి రూ.247 కోట్లు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మూడు త్రైమాసికాల నష్టాల పరంపర నుంచి బయటపడి డిసెంబరు త్రైమాసికంలో తిరిగి లాభాలు ప్రకటించింది. 2018 ఫిబ్రవరిలో బ్యాంకులో రూ.14 వేల కోట్ల నీరవ్ మోదీ కుంభకోణం బయటపడిన నాటి నుంచి వరుసగా నష్టాలు ప్రకటిస్తూ వచ్చింది. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో బ్యాంకు రూ.247 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.230.11 కోట్లతో పోల్చితే ఇది 7.12 శాతం అధికం. మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గడం, రుణ బకాయిల వసూలులో వేగం పెరగడంతో బ్యాంకు తిరిగి పట్టాల పైకి వచ్చినట్టు బ్యాంకు ప్రకటించింది. బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా లాభదాయకత పెరగడంతో పాటు ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడిందని, కుంభకోణంలో చిక్కుకున్న ఒక పద్దును కేటాయింపుల ద్వారా సైతం తొలగిస్తోయిదని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సునీల్ మెహతా తెలిపారు. అంతకు ముందు మూడు వరుస త్రైమాసికాల్లో బ్యాంకు రూ.13,416.91 కోట్లు (2017-18 చివరి త్రైమాసికం), రూ.940 కోట్లు (ఈ ఏడాది మొదటి త్రైమాసికం), రూ.4532.35 కోట్లు (రెండో త్రైమాసికం) నష్టాలను ప్రకటించింది. గత ఏడాదితో పోల్చితే బ్యాంకు ఆదాయం 2.64 శాతం క్షీణించి రూ.14,854.24 కోట్లకు చేరింది. 2018 మార్చి చివరి నాటికి 18 శాతానికి చేరిన స్థూల ఎన్‌పీఏలను డిసెంబరు త్రైమాసికంలో 16.33 శాతానికి తగ్గించగలిగామని మెహతా అన్నారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి అవి మరో రెండు శాతం తగ్గి 14 శాతానికి దిగి రాగలవన్న ఆశాభావం ఆయన ప్రకటించారు. అయితే గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే మాత్రం స్థూల ఎన్‌పీఏలు 12.11 శాతం నుంచి 16.33 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు కూడా 7.55 శాతం నుంచి 8.22 శాతానికి పెరిగాయి. రూపాయి విలువలో స్థూల ఎన్‌పీఏలు రూ.77,733.33 కోట్లు, నికర ఎన్‌పీఏలు రూ.35,675.12 కోట్లుగా ఉన్నాయి.

ఎన్‌పీఏలకు తగ్గిన కేటాయింపులు

డిసెంబరు త్రైమాసికంలో ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2996.42 కోట్ల నుంచి రూ.2565.77 కోట్లకు తగ్గించుకోగలిగామని మెహతా చెప్పారు. ఇదే కాలంలో రూ.4,424 కోట్ల బకాయిలు రాబట్టామని ఆయన అన్నారు. అయితే రూ.3,324 కోట్లు కొత్తగా ఎన్‌పీఏలుగా నమోదయ్యాయి. బ్యాంకు ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకోగల స్థితిలో ఉన్నదని, ప్రధానంగా వసూళ్లు పెంచడంతో పునరుజ్జీవం సాధ్యమైందన్నారు. రిస్క్‌తో కూడిన ఆస్తుల విలువ కూడా రూ.89 వేల కోట్ల స్థాయి పైబడి తగ్గిందని తెలిపారు. ఎన్‌సీఎల్‌టీలో ఉన్న రుణ పరిష్కార కేసుల విషయం ప్రస్తావిస్తూ వాటికి కేటాయింపులు 75 శాతం మేరకు ఉన్నాయని, అన్ని ప్రధాన ఖాతాల నుంచి వసూళ్ల వేగం అందుకున్నాయని, నాలుగో త్రైమాసికంలో ఈ ఖాతాల నుంచి రూ.8,000 కోట్లు వసూలు కాగలవని ఆశిస్తున్నామని ఆయన చెప్పారు. దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న ఎస్సార్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్ రెండింటి నుంచే రూ.5000 కోట్ల నుంచి రూ.6000 కోట్లు రాబట్టగలమని భావిస్తున్నట్టు తెలిపారు. మంచి ఆఫర్ వస్తే తమ ఏ సంస్థలోనూ వాటాలు విక్రయించాల్సిన అవసరం లేదని మెహతా అన్నారు. గృహ రుణాల రంగంలోని పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్‌లో 32.8 శాతం వాటాలను అమెరికాకు చెందిన కార్లైల్ గ్రూప్‌కు విక్రయిస్తారన్న వార్తలపై స్పందించడానికి ఆయన నిరాకరించారు. ప్రస్తుతం ఆ పీఈ సంస్థ పీఎన్‌బీ హౌసింగ్‌లో 32.4 శాతం వాటాలున్నాయి. అంతర్జాతీయ వ్యాపారాలు కూడా క్షీణించడం వల్ల మూడు ప్రాంతాల్లో కార్యకలాపాలను మూసివేశామని, హాంకాంగ్ శాఖను గణనీయంగా కుదించామని మెహతా చెప్పారు.

ఆచితూచి మదుపర్ల కొనుగోళ్లు



ముంబై: స్టాక్ మార్కెట్ మంగళవారం ఆటుపోట్ల నడుమ స్వల్ప లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 34.07 పాయింట్ల లాభంతో 36616.81 దగ్గర, నిఫ్టీ 22.10 పాయింట్ల లాభంతో 10934.35 దగ్గర ముగిశాయి. సూచీలు లాభాలతో ముగియడం వరుసగా ఇది నాలుగో రోజు. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో మదుపరులు ఆచితూచి కొనుగోళ్లు జరిపారు. 'మార్కెట్ ఆటుపోట్లతో ట్రేడైంది. నిఫ్టీ 10950 పాయింట్ల దగ్గర గట్టి ప్రతిఘటన ఎదురైంది. అయితే ఆర్‌బీఐ కీలకమైన వడ్డీ రేట్లు పెంచక పోవచ్చనే అంచనాతో మదుపరులు ఆటోమొబైల్, ప్రైవేట్ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లకు మొగ్గు చూపారు' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఎలాంటి సానుకూల సంకేతాలు లేకపోవడం కూడా మంగళవారం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ సెక్టోరియల్ సూచీల్లో ఆటో, ఆర్థిక సేవల కంపెనీల సూచీలు మాత్రమే కొద్దిపాటి లాభాలతో ముగిశాయి. రియల్టీ, మెటల్, ఎఫ్ఎంసీజీ ఇండెక్స్‌లు మాత్రం అమ్మకాల ఒత్తిడితో నీరసించాయి.

సెన్సెక్స్ షేర్లలో హీరో మోటోకార్ప్, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఆటో, మారుతి, ఎం అండ్ ఎం షేర్లు లాభాలతో ముగియగా టాటా మోటార్స్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు నష్టాలతో క్లోజయ్యాయి.

కుప్పకూలిన సుజ్లాన్ షేరు

కంపెనీ ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేదని వచ్చిన వార్తలతో మార్కెట్లో సుజ్లాన్ ఎనర్జీ షేరు కుప్పకూలింది. దీంతో బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు ఒక దశలో 42.91 శాతం నష్టపోయి 52 వారాల కనిష్ఠ స్థాయి అయిన రూ.2.70కు పడిపోయింది. తర్వాత కొద్దిగా కోలుకుని 23.26 శాతం నష్టంతో రూ.3.63 దగ్గర క్లోజైంది.

ఆగని ఆర్‌కామ్ పతనం

అనిల్ అంబానీ నాయకత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) షేరు మంగళవారం కూడా నష్టాల పరంపరను కొనసాగించింది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు 27.95 శాతం నష్టంతో రూ.5.44 దగ్గర ముగిశాయి. ఇంట్రాడేలో ఒక దశలో 32.84 శాతం నష్టంతో రూ.5.078 చేరింది. ఈ ప్రభావం మిగతా గ్రూప్ కంపెనీల షేర్లపైనా కనిపించింది. రిలయన్స్ పవర్ కంపెనీ షేరు 30.12 శాతం, రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ కంపెనీ షేరు 13.39 శాతం నష్టపోయింది. రూ.46,000 కోట్ల అప్పుల చెల్లింపుల్లో విఫలమవడంతో ఆర్‌కామ్ దివాలా పరిష్కార ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అప్పటి నుంచి అడాగ్ గ్రూప్ కంపెనీల షేర్లన్నీ నష్టాల బాట పట్టాయి.

భెల్‌కు కలిసొచ్చిన మూడో త్రైమాసికం

» షేరుకు 40 పైసల మధ్యంతర డివిడెండు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బీహెచ్ఈఎల్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.191.95 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 25 శాతం ఎక్కువ. దీంతో వాటాదారులకు ఒక్కో షేరుపై 40 శాతం చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. ప్రస్తుతం బీహెచ్ఈఎల్ షేరు ముఖ విలువ రూ.2. దీని ప్రకారం ఒక్కో షేరుపై వాటాదారులకు 80 పైసల చొప్పున మధ్యంతర డివిడెండ్ లభిస్తుంది. ఫిబ్రవరి 21న ఈ డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ పేర్కొంది. 'కొత్త వ్యాపారాల్లోకి విస్తరించడంతో పాటు వేగంగా ప్రాజెక్టుల అమలు, ఖర్చుల నియంత్రణ, ఉన్న వనరులను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించడం ద్వారా ఈత్రైమాసికంలో ఉత్పాదకతతో పాటు లాభాలు పెంచుకున్నాం' అని బీహెచ్ఈఎల్ సీఎండీ అతుల్ సొబ్తీ చెప్పారు.

గెయిల్ లాభం రూ.1,681 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ ఇండియా లిమిటెడ్ మూడో త్రైమాసిక (అక్టోబరు-డిసెంబరు) లాభం 33 శాతం వృద్ధి చెంది రూ.1,681 కోట్లకు (ఒక్కో షేరుపై రూ.7.46) చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికానికి సంస్థ లాభం రూ.1,262.22 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19) గాను షేర్‌హోల్డర్లకు రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.6.25 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు గెయిల్ ప్రకటించింది. సమీక్షా కాలంలో సహజ వాయువు విక్రయంతో పాటు సరఫరా పెరగడం సంస్థ లాభాల పెరుగుదలకు దోహదపడింది. ఎల్‌పీజీతో పాటు లిక్విడ్ హైడ్రోకార్బన్ (ఎల్‌హెచ్‌సీ) విభాగం మెరుగైన పనితీరు కనబర్చాయని పేర్కొంది. త్రైమాసికంలో ఎల్‌హెచ్‌సీ వ్యాపార మార్జిన్ గణనీయంగా పెరగగా.. సహజవాయువు, పెట్రోకెమికల్ విభాగాల మార్జిన్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయని గెయిల్ చైర్మన్, ఎండీ బీసీ త్రిపాఠి తెలిపారు.

టెక్ మహీంద్రా ఆదాయంలో 15% వృద్ధి

న్యూఢిల్లీ : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం దేశీయ ఐటీ దిగ్గజం 'టెక్ మహీంద్రా'కు బాగానే కలిసొచ్చింది. అనుబంధ కంపెనీలతో కలిపి ఈ కాలానికి కంపెనీ రూ.8,944 కోట్ల రాబడులపై రూ.1,203 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 15 శాతం, నికర లాభం 27.5 శాతం పెరిగాయి. 'ఈ త్రైమాసికంలో రాబడులతో పాటు లాభ శాతమూ పెంచుకున్నాం. ఈ సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించిన 500 కోట్ల డాలర్ల వార్షిక టర్నోవర్‌ను చేరుకోవడం ఆచరణ యోగ్యంగానే కనిపిస్తోంది' అని కంపెనీ సీఈఓ సీపీ గుర్నానీ తెలిపారు.

సువెన్ లైఫ్ డివిడెండ్ 150 శాతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఔషధ తయారీ సంస్థ సువెన్‌లైఫ్ మూడో త్రైమాసిక లాభం 27.22% తగ్గి రూ.25.16 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాదిలో ఇదే కాలానికి కంపెనీ రూ.34.57 కోట్ల లాభం ఆర్జించింది. సమీక్షా కాలానికి సంస్థ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 19.27 శాతం క్షీణించి రూ.134.78 కోట్లకు పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2018-19)కి గాను షేర్ హోల్డర్లకు రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1.50 (150 శాతం) మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు సువెన్ లైఫ్ బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపులకు అర్హులైన షేర్‌హోల్డర్ల రికార్డు తేదీని ఈనెల 15గా ప్రకటించిన సంస్థ.. 25వ తేదీన డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM .59(.6)100
ADITYA SPIN. 4.75(4.73)2494
AGRO TECH FO 576.75(584.6)427
AISHWARYA TE 2.38(2.5)3002
ALPHAGEO (I) 446.55(459.35)748
ALU FLUORIDE 84.3(88.6)16058
AMAR RAJA BA 771.2(771.3)6762
ANDHRA BANK 24.35(24.9)115078
ANDHRA CEMEN 4.29(4.51)5500
ANDHRA PETRO 55.4(56.4)54021
ANJANI PORTL 108(108.05)163
ASTRA MICRO 75.2(77)5270
AUROB.PHARMA 744.7(766.3)142801
AVANTEL LTD 220.3(228.05)2819
AVANTI FEEDS 324.8(332.15)26546
B.N.RATHI SE 24.75(24.5)130
BALAJI AMINE 392.6(398.15)1042
BAMBINO AGRO 180(182)407
BARTRONICSIN 6.13(6.35)7689
BCG 2.88(2.99)939170
BHAGIRA.CHEM 400(395.65)3609
BHAGYA INL 32.5(34.4)1084
BHARATFIN 959.35(939.35)7433
CAMBRIDGE 41.2(45.75)987
CAT TECHN. .5(.52)1250
CCHHL 6.51(6.9)2168
CCL PRODUCTS 269.5(267.6)1702
CELESTIAL 6.59(6.57)1638
CIL SECURITS 15(14.99)30
COROM INTER 452.1(457.55)4431
CUBEX TUBING 13.68(13.96)1493
CYBERMATE 1.78(1.82)14673
CYIENT 606.8(610.25)4492
DANLAW TECH. 84.75(88.9)1847
DECAN CEMENT 375(379)200
DHAN ROTO SP 31.2(29.75)1256
DIAMONPOWER 1.3(1.36)1501
DIVI'S LAB. 1616.45(1610.85)28948
DIVYA.GRANIT 91(91)340
DQ ENT 6.37(6.55)5200
DR.REDDY'S 2826.25(2742.2)87038
EMPEE SUGARS 1.2(1.26)1450
EVEREST ORG. 158.05(165.75)5905
FACOR ALLOYS 1.98(1.92)115337
FIRSTOBJ 8.8(8.42)5362
FOURTH GEN. 2.36(2.36)77
GATI LTD. 70(70.65)70728
GAYATRI PROJ 165.45(168.85)1558
GENNEX LAB 2.98(3.2)129050
GMR INFRASTR 14.8(15)35358672
GODAVARI DRU 21.35(22.05)792
GOLDSTONE EN 13.6(14.23)1789
GRANULES (I) 85.8(85.2)48774
GVK POWERINF 5.54(5.99)658858
HBL P SYS 24.85(25.55)9151
HERITGFOOD 481.95(492.35)731
HIND.FLUROCA 13.3(13.95)2074
INCAP LTD. 34.85(36.15)449
IPAPPM 449.1(453.45)5859
IVRCL LTD .86(.9)39438
KAKATIYA CEM 168(169.7)1357
KALLAM 16.55(17.1)6079
KAVERI SEED 580.55(577.85)15338
KCP LTD 83.9(86.45)997
KERNEX MICRO 23.2(23.45)883
KNR CONST 205.9(209.2)1060
KREBS BIOCHM 94.45(93.8)907
LOKESH MACH 40(40.4)760
LOTUS CHOC 23.65(24.7)566
MADHUCON PRJ 5.53(6.13)11708
MOLD-TEK TEC 42.7(42.15)582
MOSCHIP SEMI 19.85(20.55)31733
MSR INDIA 9.07(9.53)5205
N C L IND. 114.25(116.6)2256
NACLIND 28(27.25)14456
NATCO PHARM 681.35(682.35)2732
NCC 78.15(79)519081
NEHA INTER. 4.18(4.08)1603
NETTLINX LTD 41.9(41.95)592
NEULAND LAB. 486.5(517.2)668
NIHAR INFO 11.8(11.26)450
NILE LTD. 296.6(306.85)3763
NTL 1.53(1.47)219
OIL COUNTRY 12.87(13.06)6374
OLECTRA 201.2(205.75)19244
PADMALAYA TE 2.1(2)2
PALRED 36.45(37.5)10
PANYAM CEMEN 8.36(9.97)18716
PENNAR STEEL 34.75(35.15)7648
PFL INFOTECH 8.01(8.17)50
PHYTOCHEM I. 42.4(40.6)6157
PITTIENG 54.5(55.85)1494
POKARNA LTD 170.5(172.15)3235
PRAJAY ENGS. 7.5(7.92)6437
PREMIER EXPL 210.7(222.75)2834
PRSMJOHNSN 66.55(64.8)20455
RAIN 103.2(108.6)180250
RAJ PACKAGIN 27.5(25.55)534
REG.CERAMIC 3.36(3.53)200
RESTILE CER. 4.2(4.28)2091
SAGAR CEM. 605.65(595.3)309
SAMKRG PIST. 171.3(173.25)1320
SANGHI IND. 54.65(54.5)12666
SATVAH.ISPAT 9(9.09)26156
SAVEN TECHNO 22.75(23.45)2172
SIBAR AUTO 28(29)1000
SMPL .39(.39)112
SMS PHARMACE 66.95(68.45)1124
SREE RAYALA 147.4(145.2)2870
STEEL EXCH 11.92(11.56)1622
SUJANA INDUS .27(.28)70
SURANATP 4.43(4.4)550
SURYACHAKRA .29(.3)2333
SURYAMBA SP 63.25(65)1542
SURYLAK.COTT 36.6(37.6)31
SUVEN LIFE S 205.55(199.9)50483
TAJ GVK HOTL 180.15(173.85)2803
TANLA 34.1(35.75)38203
TRANSCORP IN 21.1(21.5)2716
TRANSGENE BI 5.04(5.14)37919
TRANSPORT CO 286.15(286.95)848
USHER AGRO 2.49(2.62)20833
VICEROY HOTE 2.7(2.84)4310
VIJAY TEXTIL 38.9(39)2025
VIMTA LABS 251.5(246.65)2244
VIRAT CRANE 27.3(27.95)1573
VIRINCHI 69.9(73.15)29209
VISAKA IND. 369.05(366.35)594
VISTA PHARMA 24.3(25)9810
VIVIMED LABS 22.1(23.4)52909
VST INDUS. 3200(3200)489
WATERBASE 141.8(145.75)25680
XLENERGY 1.03(1.03)40
ZEN TECH 72.55(73.3)3722
ZENOTECH 21.7(24.05)33935

ఎన్ఎస్ఈ-500 (NSE)
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 589.45(590.25)10781
AARTIIND 1687.75(1721.3)160406
ABAN 57.45(63.75)723514
ABB 1257.75(1273.3)76231
ABFRL 212.5(207.15)3189092
ABGSHIP 1.75(1.8)3017
ACC 1388.8(1406.1)2027916
ADANIENT 124.25(123.1)8484607
ADANIPORTS 339.8(335.65)3262960
ADANIPOWER 37.75(39.75)16204237
ADANITRANS 214.7(215.4)561497
AEGISCHEM 196.45(198.25)119315
AHLUCONT 277.35(279.95)3746
AIAENG 1617.35(1625.15)4188
AJANTPHARM 924.75(959.55)697589
AKZOINDIA 1758.4(1713.7)4495
ALBK 42.45(43.55)3099175
ALLCARGO 100.95(102.45)94776
ALOKTEXT 3.55(3.65)5078743
AMARAJABAT 770.75(772)331248
AMBUJACEM 209.25(212.5)1990920
ANANTRAJ 31.6(32)237213
ANDHRABANK 24.4(25)939936
APARINDS 600.2(605.25)6037
APLLTD 582.7(587.25)14549
APOLLOHOSP 1290.85(1296.75)423344
APOLLOTYRE 202.5(200.15)6299857
ARVIND 85.3(87.65)1183497
ASHIANA 111.45(114.15)27546
ASHOKA 117.3(119.2)82958
ASHOKLEY 82.15(82.3)16979058
ASIANPAINT 1450.35(1446.35)786962
ASTRAL 1140.75(1130.25)25572
ASTRAZEN 1589.55(1599.65)5002
ATUL 3472.55(3526.65)7419
AUROPHARMA 743.5(763.95)2602950
AXISBANK 729.5(720.5)8665426
BAJAJ-AUTO 2710.65(2642.5)469089
BAJAJCON 347.75(353.45)19296
BAJAJELEC 474.85(474)82038
BAJAJFINSV 6017.1(6009.2)175304
BAJAJHIND 7.65(7.65)2458286
BAJAJHLDNG 2928.6(2993.5)13382
BALKRISIND 796.25(806.9)359712
BALLARPUR 3(3.15)1347921
BALMLAWRIE 183.85(184.15)21316
BALRAMCHIN 108.1(102.35)9134914
BANKBARODA 107.95(110.3)12325444
BANKINDIA 90.95(93.25)8987658
BASF 1327.1(1365.55)7217
BATAINDIA 1177.9(1185.65)712476
BBTC 1173.4(1192.3)57040
BEML 763.7(796.9)1997519
BERGEPAINT 307.8(309.25)773522
BFUTILITIE 186.4(190.6)179954
BGRENERGY 49.7(52)64785
BHARATFIN 959.95(938.2)903062
BHARATFORG 487.65(487.65)618809
BHARTIARTL 308.2(306.55)13229252
BHEL 58.85(64.95)48929404
BIOCON 649.3(652.45)613560
BIRLACORPN 447(477.6)129812
BLISSGVS 161.5(156.2)2247476
BLUEDART 3093.1(3170.9)5525
BLUESTARCO 594.2(592.95)34939
BOMDYEING 109.3(115.05)709099
BOSCHLTD 19056.4(19048.1)9772
BPCL 337.95(338.55)1292066
BRFL 7.2(7.55)57362
BRIGADE 204.35(207.9)24736
CADILAHC 314.85(318.9)696394
CANBK 231.15(235)4362173
CARERATING 975.8(986.3)180141
CASTEXTECH .85(.9)638470
CASTROLIND 153(155.9)571718
CCL 271(269.1)22239
CEATLTD 1098.45(1079.3)393345
CENTRALBK 29.25(30.25)243840
CENTURYPLY 162.15(162.15)375441
CENTURYTEX 749.9(764.9)739750
CERA 2320.75(2373.15)8739
CESC 692.25(681.7)1852533
CHAMBLFERT 161.6(165.05)111998
CHENNPETRO 230.85(230.1)530238
CHOLAFIN 1237.35(1221.8)346095
CIPLA 508(509.6)4358002
CLNINDIA 375.1(382.95)25896
COALINDIA 216.4(222.1)5557034
COLPAL 1291.1(1289.45)276094
COROMANDEL 453.35(458.95)18553
CORPBANK 25.65(25.8)167148
COX&KINGS 159.25(156.5)27023
CRISIL 1640.8(1635.55)3923
CUB 188.05(188.6)437974
CUMMINSIND 799.55(794.35)521959
CYIENT 605(611.45)102799
DABUR 449.05(447.45)1499771
DBCORP 179.85(179.05)27461
DBREALTY 23.4(24.6)90330
DCBBANK 178.6(178.6)744881
DCMSHRIRAM 343.05(335.05)73274
DEEPAKFERT 113.05(114.65)325887
DELTACORP 231.2(230.15)341311
DEN 71.75(71.9)160126
DENABANK 11.75(11.9)1367728
DHANUKA 414.8(434)23536
DHFL 122.3(115.5)45736545
DISHTV 23.05(23.45)16844454
DIVISLAB 1616.15(1609.45)1031235
DLF 159.75(163.6)7095047
DREDGECORP 387.25(394.95)164029
DRREDDY 2821.45(2735.2)1653331
DYNAMATECH 1336.25(1353.15)233
ECLERX 1000.3(1021.65)3808
EDELWEISS 140.2(137.85)1219986
EICHERMOT 20479.65(20128.3)101870
EIDPARRY 197.8(197.6)45942
EIHOTEL 195.5(193.4)250748
ELECTCAST 20.05(20)71422
ELGIEQUIP 239.15(237.1)13613
EMAMILTD 405.35(408.15)70860
ENGINERSIN 113(113.6)441644
EROSMEDIA 72.3(72.75)317995
ESCORTS 684.4(678.55)2182433
ESSDEE 14.1(14.8)23741
ESSELPACK 108.1(105)318519
EVEREADY 211.55(211.9)145211
EXIDEIND 220.15(224.3)4949876
FCONSUMER 43.85(46.25)2122956
FDC 169.05(165.55)29922
FEDERALBNK 87.25(88.05)9005623
FINCABLES 397.55(410.95)23975
FINPIPE 502.4(503.7)6229
FLFL 432.8(429.5)27911
FORTIS 134.9(134.85)401925
FSL 47.5(48.9)1000135
GAIL 332.1(329.75)5703845
GATI 70.05(70.35)272482
GDL 108.7(108.3)49572
GEPIL 757.25(761.85)6771
GESHIP 292.65(300.1)19766
GET&D 281.45(292.3)17172
GILLETTE 6499.85(6492.75)1966
GLAXO 1396.1(1404.1)12480
GLENMARK 635.45(646.3)293822
GLOBOFFS 12.3(12.75)6769
GMDCLTD 80.25(82.6)87541
GMRINFRA 14.75(15)82268889
GODFRYPHLP 934.45(949.05)113663
GODREJCP 684.5(699.75)1509185
GODREJIND 489.7(506.5)422158
GODREJPROP 729.45(764.7)108966
GPPL 83(82.85)45284
GRANULES 85.9(85.5)729234
GREAVESCOT 120(120.8)205859
GREENPLY 130.85(131.7)49025
GRINDWELL 518.4(536.55)41830
GRUH 219.75(209.6)1985070
GSFC 93.15(92.9)1167883
GSKCONS 7597.85(7535.1)14370
GSPL 170.3(170.9)694843
GUJFLUORO 844.3(867.9)22828
GULFOILLUB 892.5(878.05)17517
GVKPIL 5.55(6)3400809
HATHWAY 32(32)2800545
HAVELLS 730.8(735.55)892725
HCC 11.65(11.6)6311816
HCL-INSYS 17.35(19.2)1031226
HCLTECH 1047.75(1044.8)1184282
HDFC 1981.4(1978.5)1450509
HDFCBANK 2114.05(2104.9)2172572
HDIL 22.6(25.65)5015791
HEIDELBERG 145.5(143.1)35938
HEROMOTOCO 2854.55(2780.15)767865
HEXAWARE 356.35(354.9)1884180
HFCL 21.8(22.3)2046428
HIMATSEIDE 183.25(189.55)112609
HINDALCO 204.75(204.2)4765441
HINDCOPPER 44.3(45)308166
HINDPETRO 225.15(226.5)5064284
HINDUNILVR 1821.45(1802.6)1278708
HINDZINC 254.8(254.7)612984
HMT 17.1(17.7)4095
HMVL 106.55(109)10042
HONAUT 21515.1(21341.7)1116
HOTELEELA 12.5(13)129718
HSIL 249.45(264.3)110730
HTMEDIA 39.8(40.3)87362
IBREALEST 69.35(72.35)2862742
IBULHSGFIN 645.4(650.75)8178330
ICICIBANK 352.65(354.55)12197271
ICRA 2899.75(2922.4)546
IDBI 47.05(50.5)13999310
IDEA 30.45(30.05)21969460
IDFC 36.75(36.9)3115064
IFBIND 751.85(780.65)26546
IFCI 12.5(13)6022097
IGARASHI 488.45(500.9)7591
IIFL 379.7(381.9)213617
IL&FSTRANS 6.6(6.9)64684
INDHOTEL 143(144.9)800968
INDIACEM 78.95(78.8)7065793
INDIANB 214(214.7)1368416
INDOCO 180.4(178.3)14315
INDUSINDBK 1541.75(1504.65)1710784
INEOSSTYRO 615.3(616.85)4419
INFRATEL 288.9(295.05)3538939
INFY 754.85(755.9)4694366
INGERRAND 556.45(565.35)5545
INOXLEISUR 268.2(262.65)613713
INOXWIND 61(64.85)96066
INTELLECT 168.05(164.55)546591
IOB 13.1(13.2)477278
IOC 133.75(135.9)3435563
IPAPPM 449.05(453.95)80180
IPCALAB 723(740.9)122513
IRB 122.9(139.2)10005079
ITC 274.15(277.1)9827060
J&KBANK 39.05(38.55)673684
JAGRAN 99.75(101.15)47532
JAICORPLTD 95.4(97.25)413634
JBCHEPHARM 315.5(311.8)18338
JBFIND 16.25(17.1)56216
JCHAC 1785(1773)31114
JETAIRWAYS 236.2(243.4)7164171
JINDALPOLY 238.45(240.5)29027
JINDALSTEL 129.1(130.85)8596457
JISLJALEQS 52.6(54.55)11322032
JKCEMENT 692(699.5)13551
JKIL 107.8(108.9)187066
JKLAKSHMI 305.05(301.05)31846
JKTYRE 88.85(90.55)459880
JMFINANCIL 76.45(76.7)235445
JPASSOCIAT 5.15(5.95)48484922
JPINFRATEC 2.85(3)919627
JPPOWER 1.75(1.8)1783550
JSWENERGY 66.85(67.85)530296
JSWHL 2581.9(2630.05)864
JUBILANT 739.3(735.05)245501
JUBLFOOD 1303.4(1396.5)9418525
JUSTDIAL 469.85(481.45)2003268
JYOTHYLAB 184.6(183.95)66064
KALPATPOWR 364.35(367.2)75220
KANSAINER 463.7(458.15)52102
KEC 248.6(244.75)610947
KESORAMIND 63.15(64.65)122878
KIRLOSENG 172.55(173.1)6978
KITEX 98.8(100.5)33067
KOLTEPATIL 263.35(263.4)32723
KOTAKBANK 1279.15(1272.2)1917782
KPIT 112.7(113.75)1371634
KRBL 365.25(367.25)181533
KSCL 581(577.25)231018
KSK 1.05(1.1)117094
KTKBANK 115.4(116.95)951478
KWALITY 5.95(6.25)737628
L&TFH 126.4(127.55)5188504
LAKSHVILAS 57.85(58.95)3391684
LAOPALA 208.95(211.55)11152
LAXMIMACH 5323.5(5320.8)1940
LICHSGFIN 459.35(455.9)1047464
LT 1304.6(1307.4)1447400
LUPIN 837.7(855.9)1344930
M&M 684.9(674.45)3550741
M&MFIN 401.2(402.2)739707
MAGMA 98.65(98.9)55840
MAHINDCIE 230.6(237.5)49345
MAHLIFE 372.05(375)23963
MANAPPURAM 93.8(92.1)2045287
MANPASAND 64.2(67.75)345049
MARICO 363.5(367.75)2212876
MARKSANS 24.35(24.9)1241402
MARUTI 7093.6(6988.2)681498
MAYURUNIQ 369.4(370.3)1011
MCLEODRUSS 99.9(96.25)205088
MERCK 3265.45(3250.95)4948
MHRIL 195.35(199.15)29628
MINDACORP 139.05(140.3)41486
MINDTREE 887.9(889.8)636345
MMTC 25(25.85)483760
MOIL 163.1(164.5)113852
MONSANTO 2630.8(2592.35)1446
MOTHERSUMI 136.5(138.3)4297335
MOTILALOFS 617.95(621.9)33964
MPHASIS 1017.75(1016.55)436062
MRF 60004.3(59906.55)6603
MRPL 64.05(65.25)997786
MTNL 12.35(13)1147636
MUTHOOTFIN 498.8(502.05)396252
NATCOPHARM 678.6(681.6)36180
NATIONALUM 57.9(58.9)4645973
NAUKRI 1760.95(1727.75)451354
NAVKARCORP 43.7(45.65)97133
NCC 78.05(79.25)5360338
NETWORK18 35.05(35.6)165088
NHPC 23.8(25.2)5825861
NIITTECH 1322.6(1309.85)472603
NITINFIRE 1.3(1.35)138910
NLCINDIA 61.65(62)168811
NMDC 93.9(95.35)1501649
NTPC 138.05(137.25)7105333
OBEROIRLTY 448.25(454.3)69161
OFSS 3828.25(3796.2)22004
OIL 169.5(171.1)452390
OMAXE 212.05(213.15)344462
ONGC 142.95(146.25)5413425
ORIENTBANK 92.35(94.25)4765962
ORIENTCEM 64.95(65.75)61650
ORISSAMINE 745.25(761.8)2299
PAGEIND 24234.55(24201.45)21635
PARSVNATH 5.25(5.9)169704
PCJEWELLER 65.85(69.95)19987173
PEL 2171.1(2107.9)430224
PERSISTENT 644.65(639.85)217213
PETRONET 220.15(210)6151316
PFC 100.7(100.95)8295732
PFIZER 3013(3055.9)9373
PFS 14.1(14.7)712684
PGHH 9938.5(9877.1)2380
PHOENIXLTD 572.2(594.55)215054
PIDILITIND 1119.3(1121.2)360603
PIIND 832.05(837.2)26930
PNB 73.4(73.15)70132820
POWERGRID 186.1(184.6)3093963
PRAJIND 129.9(120.95)7062830
PRESTIGE 199.15(199.7)68150
PRSMJOHNSN 66.8(64.95)191175
PTC 76.1(75.65)472053
PUNJLLOYD 2.4(2.5)224234
PURVA 69.05(70.5)44058
PVR 1596.95(1577.15)176760
RADICO 439.9(437.2)428076
RAIN 103.05(108.45)884324
RAJESHEXPO 575.15(597.7)562444
RALLIS 157.7(159.7)54510
RAMCOCEM 596.55(597.6)198322
RAMCOSYS 226.55(234.1)11033
RATNAMANI 849.9(871.2)1849
RAYMOND 728.5(743.05)357403
RCF 57.45(59.55)818883
RCOM 5.55(7.55)393801088
RECLTD 116.8(121.3)4113831
REDINGTON 68.15(69.15)133941
RELAXO 734.55(720.1)10204
RELCAPITAL 152.2(151.65)40395079
RELIANCE 1291.55(1290.9)9362406
RELINFRA 227.25(227.1)14361852
RENUKA 9.85(9.85)662205
REPCOHOME 390.25(389)526067
RIIL 295.75(303.05)148591
RKFORGE 485.3(485.8)57164
RNAVAL 8.6(10.05)5012875
ROLTA 4.55(4.75)217303
RPOWER 12(17.2)209001837
RTNPOWER 3.05(3.35)3628481
RUCHISOYA 6.7(6.9)650429
SADBHAV 189.95(194.25)105763
SADBHIN 88.6(89.05)19123
SAIL 45.35(45.75)8388731
SANOFI 6386.35(6444.5)1097
SBIN 284.65(283.95)13291133
SCHAEFFLER 5502.8(5350.55)14772
SCHNEIDER 85.65(88.65)34406
SCI 38.4(39.45)181096
SHARDACROP 320.3(320.3)6524
SHILPAMED 374.6(375.5)6948
SHK 166(163.45)5578
SHOPERSTOP 506.3(500.2)17283
SHREECEM 15675.65(15906.9)11291
SHRIRAMCIT 1594.95(1650.35)7176
SIEMENS 994.6(1023.3)525443
SIMPLEXINF 142.05(150.6)258538
SINTEX 8.25(9.2)3681236
SITINET 5.45(5.95)185464
SJVN 25.5(25.5)884764
SKFINDIA 1919.75(1928.3)14483
SMLISUZU 570.15(583.65)4786
SNOWMAN 30.6(30.1)1122382
SOBHA 477.95(477.05)120176
SOMANYCERA 341(336.9)200502
SONATSOFTW 325.35(325)26612
SOUTHBANK 12.85(13.2)13132894
SPARC 147.4(153.55)749601
SREINFRA 22.25(24.85)11141272
SRF 2023.3(1968.05)1662762
SRTRANSFIN 1068.1(1024.75)1113882
STAR 421.75(436.25)2511964
STCINDIA 110.05(112.9)66569
SUNDARMFIN 1378.6(1408.15)9797
SUNDRMFAST 518.8(522.15)25681
SUNPHARMA 409.9(414.8)3523707
SUNTV 522(524.1)1066230
SUPREMEIND 1006.45(990.25)25299
SUVEN 204.95(200.35)498106
SUZLON 3.6(4.75)184031592
SWANENERGY 98.4(97.85)183984
SYMPHONY 1221.1(1214.35)89215
SYNDIBANK 35.65(36.65)3568932
SYNGENE 601.9(597.15)83839
TAKE 132.95(134.9)115094
TATACHEM 645.7(657.35)635609
TATACOFFEE 86.75(88.35)160039
TATACOMM 494.85(494.7)612054
TATAELXSI 897.4(888.65)488902
TATAGLOBAL 185.95(199.85)8331711
TATAMOTORS 175.8(180.25)12064426
TATAMTRDVR 90.7(93.15)2026371
TATAPOWER 69.9(70.55)2916745
TATASPONGE 767.75(753.55)237361
TATASTEEL 464.7(476.05)7281927
TATASTLBSL 27.95(28.5)366173
TBZ 59.15(57.35)169802
TCS 2044.55(2050.25)1111404
TECHM 751(749.15)2446263
TEXRAIL 58.15(59.85)460153
THERMAX 1079.3(1092.65)16506
THOMASCOOK 211.85(214.3)73372
TIDEWATER 5072.7(5124.2)324
TIMKEN 568.25(575)4514
TITAN 1066.7(1025.75)7144200
TNPL 210.35(207.95)39342
TORNTPHARM 1824(1839.05)222019
TORNTPOWER 247.6(243.55)1638872
TREEHOUSE 3.75(3.8)20289
TRIDENT 62.15(64.85)436230
TRITURBINE 103.8(104.95)99079
TTKPRESTIG 7820.25(7815.55)3499
TTML 3.15(3.4)3046984
TV18BRDCST 31.35(32.05)2885489
TVSMOTOR 497.35(499.65)885677
TVSSRICHAK 2302.45(2345.75)1154
TVTODAY 349.55(351.1)118788
UBL 1419.5(1438.85)594362
UCOBANK 18.1(18.55)345865
UFLEX 252.8(252.4)34985
ULTRACEMCO 3461.75(3447.5)286515
UNICHEMLAB 195.65(194.75)23563
UNIONBANK 78.15(79.45)6870366
UNITECH 1.4(1.45)880034
UPL 795.95(770.9)2516447
VAIBHAVGBL 652.6(656.4)7206
VAKRANGEE 42.6(44.8)5981011
VEDL 162.6(161.35)14352577
VIDEOIND 2.6(2.7)216433
VIJAYABANK 42.4(42.5)2017622
VINATIORGA 1594.15(1598.45)27126
VIPIND 500.75(498.05)114575
VOLTAS 533.55(544)810734
VRLLOG 260.6(263.05)6540
VSTIND 3201.05(3204.15)4007
VTL 1039.8(1065.15)34198
WABAG 293.25(295.2)78091
WABCOINDIA 6333.05(6119.1)9854
WELCORP 102.4(102.35)334840
WELSPUNIND 55.45(58.35)540717
WHIRLPOOL 1457.9(1518.75)345139
WIPRO 368.45(371.25)2456401
WOCKPHARMA 411(422)1228930
WONDERLA 289.45(288.6)15201
ZEEL 365.35(347.75)12141903
ZEELEARN 25.2(25.65)305602
ZYDUSWELL 1324.8(1309.6)3282

కోర్టుల్లో సదుపాయాల కల్పనకు చర్యలు

- కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి
- ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి: సీఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి తెలిపారు. కోర్టుల్లో సౌకర్యాల కల్పనపై మంగళవారం సచివాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఇంకా నిర్మించాల్సిన ప్రాంతాల్లో సమీకృత కోర్టు కాంప్లెక్స్‌లకు ప్రణాళికలు రూపొందించాలని, న్యాయాధికారుల నివాస భవనాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, సునీల్ శర్మ, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్ రావు, హైకోర్టు అధికారులు పాల్గొన్నారు.

ఒక్క అస్లీకి 3 నకిలీ నోట్లు

- వ్యాపారులు, పశువుల అంగళ్లే టార్గెట్!
- అంతర్రాష్ట్ర నకిలీ నోట్ల తయారీ ముఠా దందా
- 10 మంది అరెస్టు, 31 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ, ప్రింటర్స్, ఇతర సామగ్రి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'తళతళలాడే నోటు తీర్చును లోటు ' అని పాడుకుంటాం కానీ.. ఏది అస్లీ నోటో.. ఏది నకిలీ నోటో తెలియకపోతే చిక్కుల్లో పడక తప్పదు. కాస్త ఏమరుపాటుగా ఉన్నా మార్కెట్లో మీ చేతికి నకిలీ నోట్లు రావొచ్చు!! హైదరాబాద్‌లో నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ఓ అంతర్రాష్ట ముఠా ఆటకట్టయింది. అది రూ.500 అయినా.. రూ.2000 నోటయినా ఒక్క అస్లీ నోటుకు మూడు నకిలీ నోట్లు అంటూ బ్రోకర్లను పెట్టుకొని మరీ దందా నిర్వహించిందీ ముఠా. ఈ మేరకు 10మందిని పోలీసులు అరెస్టు చేశారు రాచకొండ పోలీసులు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీపీ మహేశ్ భగవత్ వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరుకు చెందిన ఇప్పనపల్లి రాజేశ్ ప్రైవేట్ ఉద్యోగం కోసం నగరానికొచ్చి కూకట్‌పల్లిలో ఉండేవాడు. నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాతో సంబంధాలు ఏర్పడి ఆ దందాను కొనసాగించాడు. 2013లో జైలుపాలైనా బుద్ధి మార్చుకోలేదు. విడుదలయ్యాక మకాంను సరూర్‌నగర్‌కు మార్చాడు. 1999 నుంచి నకిలీ ఇండియన్ కరెన్సీ తయారు చేస్తున్న ఏలూరుకు చెందిన ముఠాతో రాజేశ్‌కు పరిచయాలున్నాయి. ఏలూరుకు చెందిన బోతపాటి సురేశ్, ఇన్నవల్లి దుర్గాప్రసాద్, విజయనగరానికి చెందిన రాజశేఖర్ అలియాస్ రాజా, సురేశ్ నాయుడు, విజయవాడకు చెందిన డాక్టర్ దరణి, కొప్పోలు శ్రీనివాస్, ఇన్నవల్లి శ్రీనివాస్ ఓల్డ్ మలక్‌పేటకు చెందిన రోషన్ మహబూబ్ షేక్‌లు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలోని రాకేశ్ నివాసంలో ఈ దందాను కొనసాగిస్తున్నారు. తయారు చేసిన నకిలీ నోట్లను మార్కెట్లో చెలామణి చేయడానికి మహ్మద్ బాబా, మహ్మద్ షకీల్‌తో పాటు మరికొంత మందిని చేర్చుకుందీ ముఠా. వీరు ఇబ్రహీంపట్నం, చౌటుప్పల్, షాద్‌నగర్, నల్లగొండ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సంతల్లో రైతులు, చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని నోట్లను చెలామణి చేసేవారు. ఇటీవల రూ. 90వేలను మహ్మద్‌బాబా చెలామణి చేశాడు. చెలామణి చేసే బ్రోకర్‌కు ఒక అసలు నోటుకు మూడు నకిలీ నోట్లు ఇచ్చేవారు. నకిలీ నోట్ల చెలామణి సమాచారం అందడంతో సీపీ మహేశ్ భగవత్ ఆదేశాల మేరకు ఎస్‌వోటీ బృందం, ఎల్బీనగర్ పోలీసులను రంగంలోకి దిగారు.నోట్లు చెలామణి చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా 12మంది ఉన్న అంతర్రాష్ట ముఠా బాగోతం వెలుగులోకి వచ్చింది. ముఠాలోని 10మందిని అరెస్టు చేశారు. 31.25లక్షల నకిలీ కరెన్సీ నోట్లు, ప్రింటర్, కెనాన్ స్కానర్, 7మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అర్హులందరికీ పరిషత్ పథకాలు

- బ్రాహ్మణ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట
- కలిసికట్టుగా సమస్యల్ని పరిష్కరించుకోవాలి: రమణాచారి
- బెస్ట్, వివేకానంద పథకం లబ్ధిదారులకు చెక్కుల అందజేత

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ అందుతాయని పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తెలిపారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా పరిషత్ పనితీరుపై, పథకాల అమలుపై వాట్సాప్ గ్రూపుల్లో విమర్శలు చేస్తున్నారని, అది సరైంది కాదని అన్నారు. గ్రూపులుగా విడిపోయి పరస్పరం ఆరోపణలు చేసుకోకుండా.. అంతా కలిసికట్టుగా ఉండి సమస్యల్ని పరిష్కరించుకోవాలని సూచించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహకారం అందించేందుకుగాను పరిషత్ ప్రవేశపెట్టిన 'బెస్ట్', వివేకానంద విదేశీ పథకం లబ్ధిదారులకు మంగళవారం తెలంగాణ సారస్వత పరిషత్తులో రమణాచారి చెక్కులు అందజేశారు. బ్రాహ్మణ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, ప్రతి బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నారని ఆయన చెప్పారు. హైదరాబాద్ శివారులో బ్రాహ్మణ సదన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఈ సదన్‌లు నిర్మిస్తామని తెలిపారు. ఆర్థికంగా వెనకబడ్డ ప్రతి బ్రాహ్మణుడికీ పరిషత్తు తరపున సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. వివేకానంద విదేశీ విద్య పథకంలో ఇప్పటివరకు 64 మంది విద్యార్థులకు రూ.8,78,69,000 ఆర్థిక సహకారం అందించామని, మంగళవారం మరో 110 మందికి కలిపి రూ.19.75 కోట్లు ఇస్తున్నామని చెప్పారు. బెస్ట్ పథకం ద్వారా సబ్సిడీపై ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు, తాజాగా 42 మంది ఔత్సాహిక బ్రాహ్మణ పారిశ్రామికవేత్తలకు రూ.1,33,22,000 అందజేసినట్లు రమణాచారి వెల్లడించారు. ఇక రామానుజ పథకం, వేద విద్యను అభ్యసించే వారికి, వేద పండితులకు, వేద పాఠశాలలకు ఆర్థిక సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నవారు సరైన వివరాలు, పత్రాలు సమర్పించకపోవడం వల్లే ఎంపిక ప్రక్రియలో ఆలస్యం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ వైస్ చైర్మన్ వనం జ్వాలానరసింహారావు, సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, సముద్రాల వేణుగోపాలచారి, పురాణం సతీష్‌కుమార్, మృత్యుంజయ శర్మ, అష్టకాల రామ్మోహన్, సుమలత శర్మ, సువర్ణ సులోచన తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ రమణాచారి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి సమీపంలో ఉన్న పాండవుల గుట్టలు, (ఇన్‌సెట్లో) గుట్టల వద్ద ఏర్పాటు చేసిన గుడారాలు

పాండవుల గుట్టలపై నైట్ క్యాంపింగ్

- కొండలపై గుడారాలు.. అక్కడే రాత్రి బస
- నేటి నుంచి అధికారికంగా ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి)

ఓరుగల్లు సిగలో మరో కలికితురాయి చేరబోతోంది. చారిత్రాత్మక పాండవుల గుట్టలు పర్యాటకులకు స్వర్గధామంగా మారబోతున్నాయి. ఇప్పటికే రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్‌తో పర్యాటకులను ఆకట్టుకుంటున్న ఈ గుట్టల్లో అటవీ శాఖ తాజాగా నైట్ క్యాంపింగ్‌కు ఏర్పాట్లు చేస్తోంది. పాండవుల గుట్టలు సహజ అందాలకు నెలవు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ గుట్టలకు చారిత్రక నేపథ్యం ఉంది. వీటిలోనే పాండవులు వనవాసం ఉన్నట్లుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఒకప్పుడు పాండవుల ఆనవాళ్లను తిలకించేందుకే పర్యాటకులు గుట్టలపైకి వెళ్లేవారు. జిల్లాల విభజన తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీశాఖ పాండవుల గుట్టలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రతి శని, ఆదివారాల్లో హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాలతో పాటు విదేశీయులు కూడా వచ్చి రాక్ క్లైంబింగ్ చేస్తున్నారు. లక్నవరంలో అటవీశాఖ ఎకో టూరిజం పేరుతో ఇప్పటికే నైట్ క్యాంపింగ్ నిర్వహిస్తోంది. తాజాగా పాండవుల గుట్టల్లోనూ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసింది. వారం రోజులుగా ప్రయోగాత్మకంగా పాండవుల గుట్టల్లో నైట్ క్యాంపింగ్ నిర్వహించిన అధికారులు బుధవారం అధికారికంగా ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 గంటలకు డీఎఫ్‌వో ప్రదీప్‌కుమార్ ఈ నైట్ క్యాంపింగ్‌ను ప్రారంభిస్తారు. ప్రతి ఒక్కరు రూ.1500 చెల్లిస్తే రాత్రివేళ క్యాంపు సైట్‌లో భోజనం.. గుట్టలపైనే ఫైర్‌క్యాంప్, పాటలు, నృత్యాలతో పర్యాటకులు మైమరచిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరుసటి రోజు ఉదయం అల్పాహారం, అనంతరం రాక్ వ్యూ కనబడేలా సఫారి, బుగులోని గుట్టలవరకు ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, ర్యాపెలింగ్ నిర్వహించి భోజన వసతి కల్పించి పర్యాటకులకు సెండాఫ్ ఇవ్వనున్నారు. ఆసక్తి గలవారు 7382619363 నెంబర్‌లో సంప్రదించవచ్చు. ఎత్తైన బండరాళ్లు, మధ్యమధ్యలో లోయలు అడుగడుగునా అబ్బురపరిచే విధంగా పడగలెత్తి నిల్చున్న కొండరాళ్లు పాండవుల గుట్టల్లో కనిపిస్తాయి. పాండవుల అరణ్యవాస కాలంలో గుట్టల వద్ద నివాసం ఉన్న ఆనవాళ్లు ఇప్పటికీ నిక్షిప్తమై ఉన్నాయి. వరంగల్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరిలో ఈ గుట్టలు ఉన్నాయి.

నిజామాబాద్ మెడికల్ కాలేజీలో అధ్యాపక పోస్టులకు 12న ఇంటర్వ్యూలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన వారు ఈనెల 12న ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ మంగళవారం తెలిపారు.ఉదయం పదిన్నర నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయని, 9 ప్రొఫెసర్ పోస్టులు, 3 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 5 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయన్నారు. ఆసక్తికల అర్హులు www.gmcnzb.org వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

● ఫారెస్టు పోస్టులకు 11నుంచి ఇంటర్వ్యూలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఫారెస్టు కాలేజీ, పరిశోధన సంస్థలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో భాగంగా ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రెటరీ ఎ.వాణిప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

● మూడేళ్లలో తెలంగాణకు 47 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు తెలంగాణకు మూడేళ్లలో రూ.47,556.41 కోట్లు విడుదల చేశామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్ వెల్లడించారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు ప్రశ్నకు ఆయన ఈ మేరకు మంగళవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ మూడేళ్లలో ఏపీకి రూ. 99,674.41 కోట్లు విడుదల చేశామని రాధాకృష్ణన్ వెల్లడించారు.

● సెల్ఫీ మరణాలను నిరోధించండి: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పర్యాటక కేంద్రాల వద్ద సెల్ఫీ మరణాలను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం ఆదేశించింది. పర్యాటక కేంద్రాల్లోని ప్రమాదకర స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖకు సూచించింది. అవసరమైతే 'నో సెల్ఫీ జోన్'గా ప్రకటించాలని తెలిపింది.

తెలంగాణలో ఎందుకు ఓడాం?

ఖాయంగా గెలవాల్సిన రాష్ట్రం కదా?.. పార్టీ నేతలకు రాహుల్ సూటి ప్రశ్న


ఢిల్లీలో రాహుల్‌తో భేటీ అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న ఖుంటియా, భట్టి తదితరులు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణతో పాటు ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఖాయంగా గెలుస్తామనుకున్న తెలంగాణలో మాత్రం ఓడిపోయాం. కారణాలేంటి?" అని టీపీసీసీ నేతలు, పార్టీ ఎమ్మెల్యేలను ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సూటిగా ప్రశ్నించారు. ఈవీఎం అక్రమాలు, విచ్చలవిడిగా డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగం వంటి కారణాలను కొందరు నేతలు, ఎమ్మెల్యేలు వివరించగా.. మరికొందరు మాత్రం ప్రభుత్వ వ్యతిరేకతను పార్టీకి అనుకూలంగా మలుచుకోవడంలో విఫలమయ్యామని స్పష్టం చేశారు. కేసీఆర్ కేవలం డబ్బును ప్రయోగించి గెలిచారంటే తాను నమ్మబోనని, ఛత్తీస్‌గఢ్‌లో కూడా బీజేపీ నేతలు భారీగా డబ్బు ఖర్చు పెట్టారని రాహుల్ అన్నారు. కేసీఆర్ డబ్బుతోనే గెలిచారన్న పీసీసీ చీఫ్ ఉత్తమ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖుంటియా వాదనను ఆయన అంగీకరించలేదు. జరిగిందేదో జరిగింది.. ఇప్పటికైనా కలిసికట్టుగా, కసిగా పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో మంగళవారం పార్టీ తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీపీసీసీ నేతలతో రాహుల్‌గాంధీ సమావేశం అయ్యారు. ఈ భేటీలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్, రేవంత్‌రెడ్డి, కుసుమ్‌కుమార్, ప్రచార, పబ్లిసిటీ కమిటీల చైర్మన్లు విజయశాంతి, మధుయాష్కీగౌడ్ పాల్గొన్నారు. పార్టీ ఎమ్మెల్యేల్లో జగ్గారెడ్డి, ఆత్రం సక్కు మినహా మిగిలిన సభ్యులందరూ పాల్గొన్నారు. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలూ తాము రాలేకపోవడానికి కారణాలు వివరించి, పార్టీ అనుమతి తీసుకున్నారు. సమావేశంలోకి రాగానే రాహుల్ గాంధీ పార్టీ నేతలను 'ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయాం. ఒక్కొక్కరూ చెప్పండి' అని అడిగారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సీట్ల సర్దుబాటు, టికెట్ల కేటాయింపులో జాప్యం నష్టం కలిగించిందని, ప్రచారానికి అభ్యర్థులకు సమయం సరిపోలేదని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. ఈవీఎంల ట్యాంపరింగ్ అంశమూ ప్రస్తావనకు వచ్చింది. కుసుమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజస్థాన్‌లో సాయంత్రం 7 గంటలకల్లా ఎంత శాతం పోలింగ్ జరిగిందన్నది అక్కడి ఎన్నికల కమిషన్ ప్రకటించిందని, తెలంగాణలో మాత్రం 30 గంటల సమయం తీసుకున్నారని వివరించారు. చాలాచోట్ల కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి నాయకులను అధికార పార్టీ కొనేసిందని, పార్టీ పట్ల నిబద్ధత ఉన్నవారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. టీఆర్ఎస్ పార్టీ.. ఎన్నికలను చంద్రబాబు వర్సెస్ కేసీఆర్‌గా ప్రచారం చేసిందని పొంగులేటి సుధాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఖమ్మం నుంచి లోక్‌సభకు పోటీ చేయాల్సిందిగా రాహుల్‌ని ఆహ్వానించారు. గతంలో ఇందిరాగాంధీ కూడా తెలంగాణ నుంచి పోటీ చేశారని గుర్తు చేశారు. ఇందుకాయన నవ్వి ఊరుకున్నారు. కేసీఆర్‌తో పోల్చదగ్గ బలమైన నాయకుడు కాంగ్రెస్‌లో లేడని, పార్టీ ప్రజల్లోకి వెళ్లి ఉద్యమాలు చేయలేదని శ్రీధర్ బాబు చెప్పారు. పోటీ చంద్రబాబుకు, కేసీఆర్‌కూ మధ్య జరిగిందని.. భావోద్వేగాలతో జనం కేసీఆర్‌కు ఓటేశారని పొన్నం తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ప్రొటోకాల్ ఇన్‌చార్జి హర్కార వేణుగోపాల్‌కు రాహుల్ సూచించారు. సీట్లు రాకపోవడానికి కారణాలేంటని అడగ్గా.. పోల్ మేనేజ్‌మెంట్‌లో టీఆర్ఎస్ సక్సెస్ అయిందని, 5గంటల తర్వాత ఓటింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆయన తెలిపారు.

బలమైన ఉద్యమాల నిర్మాణం జరగలేదు

ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసేందుకు బలమైన ప్రజా ఉద్యమాలను పార్టీ నిర్మించలేకపోయిందని కొందరు నేతలు తెలిపారు. కేవలం గాంధీభవన్‌లో మీడియా సమావేశాలకు పరిమితమయ్యారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇకనైనా పార్టీ తరపున బలమైన పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ఆర్గనైజేషనల్ సెటప్‌ను మార్చాల్సిన అవసరం ఉందని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు.

రేవంత్.. నువ్వెందుకు ఓడావ్?

కొడంగల్ నుంచి పోటీ చేసిన రేవంత్‌రెడ్డిని ఓటమికిగల కారణాలను రాహుల్ ప్రత్యేకంగా అడిగారు. రేవంత్ స్పందిస్తూ తన నియోజకవర్గంలో టీఆర్ఎస్ పాలనా యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం, డబ్బు పంపిణీ, నిర్బంధం తదితర కారణాల వల్ల ఓడినట్లు వివరించారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించినందుకుగాను విజయశాంతి రాహుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలపై దిశానిర్దేశనం తదితర అంశాలపై ఖుంటియా, ఉత్తమ్, బోసురాజు, సలీం అహ్మద్, శ్రీనివాస్‌కృష్ణన్ తదితర నేతలతో మళ్లీ భేటీ అవుతానని రాహుల్ తెలిపారు.

రెండుమూడు రోజుల్లో కార్యాచరణ

సమావేశం అనంతరం ఉత్తమ్, ఖుంటియాలు విలేకర్లతో మాట్లాడారు. పరాజయానికి కారణాలను రాహుల్‌కు వివరించామని, ఆయన వాటిని జాగ్రత్తగా విని లోక్‌సభలో గెలిచేందుకు కృషి చేయాలని చెప్పినట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు రెండు మూడు రోజుల్లో సమావేశం కావాలని రాహుల్ ఆదేశించారని ఉత్తమ్ చెప్పారు. ఫలితాలపై నిష్కర్షగా చర్చ జరిగిందని ఖుంటియా తెలిపారు. కలిసికట్టుగా పనిచేయాలని రాహుల్ స్పష్టం చేశారన్నారు. తెలంగాణలో సాధ్యమైనన్ని ఎక్కువ ఎంపీ సీట్లు గెలవాలని చెప్పినట్లు తెలిపారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల గురించి మాట్లాడలేదన్నారు. ఎన్నికల్లో ఘోర వైఫల్యం తర్వాత తొలిసారిగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాహుల్ గాంధీ క్లాస్ తీసుకుంటారని పార్టీలోని పలువురు నేతలు ఆందోళన పడినట్లు సమాచారం. అయితే సమావేశంలో ఓటమికి గల కారణాలను వినేందుకే రాహుల్ ప్రాధాన్యం ఇవ్వడంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అప్పు.. తప్పు

(మూడో పేజీ తరువాయి)

రావాలని, ఏపీ పోలీసులు జరిపిన దర్యాప్తు తనకు సంతృప్తికరంగా లేదని, కేసును తెలంగాణకు బదిలీ చేయాలని పద్మశ్రీ విజ్ఞప్తి చేశారు. వెరసి, జయరామ్ హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. జయరామ్ హత్య కేసులో మిస్టరీ వీడిపోయిందని పోలీసులు చెప్పారు. ఊహించినట్లుగానే ఈ కేసులో రాకేశ్ రెడ్డే ప్రధాన నిందితుడని తేల్చారు. అతడికి సహకరించిన వాచ్‌మన్ శ్రీనివాస్‌ను ఏ2గా చేర్చారు. ఆది నుంచీ ఆరోపణలు ఎదుర్కొంటున్న శిఖా చౌదరికి ఈ కేసుతో సంబంధం లేదని తేల్చారు. కేసు వివరాలను కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ మంగళవారం విలేకరులకు వెల్లడించారు.

విడతలవారీగా రూ.4.15 కోట్ల అప్పు!

జయరామ్‌కు చెందిన టెట్రాన్ పరిశ్రమ వివాదంలో చిక్కుకున్నప్పుడు కార్మికులతో మాట్లాడి రాకేశ్ సమస్యను పరిష్కరించాడు. ఇద్దరి మధ్య ఈ పరిచయం అప్పులు ఇచ్చిపుచ్చుకునే దాకా వెళ్లింది. కొన్నాళ్లకు జయరామ్ అతడికి ఫోన్ చేసి రూ.2.25 కోట్లు సర్దుబాటు చేయమని అడిగి తీసుకున్నాడు. ఇంకొన్నాళ్లకు మరో రూ.1.1 కోట్లు తీసుకున్నాడు. అనంతరం జయరామ్ అమెరికా వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు మళ్లీ రాకేశ్‌కు ఫోన్ చేసి మరో రూ.80 లక్షలు ఏర్పాటు చేయాలని అడిగాడు. ఈ డబ్బును రాకేశ్ రెండు విడతలుగా ఇచ్చాడు. అప్పటిదాకా తీసుకున్న రూ.4.15 కోట్ల అప్పును అవసరమైతే జూబ్లీహిల్స్‌లోని ఇంటిని విక్రయించైనా తీరుస్తానని జయరామ్ అతడికి మాటిచ్చాడు. కాగా బాకీ తీర్చాలంటూ రాకేశ్ ఇటీవల తరచూ జయరామ్‌కు ఫోన్ చేస్తున్నాడు. ఆయన కాల్స్ ఎత్తకపోగా, రాకేశ్ నంబర్లను బ్లాక్ చేశాడు.

అమ్మాయిలా ఎర వేసి..

జయరామ్‌ను ఎలాగైనా పట్టుకోవాలనే ఉద్దేశంతో రాకేశ్ ఆయన కదలికలపై నిఘా పెట్టాడు. హైదరాబాద్‌కు వచ్చిన జయరామ్ ఏదో ఒక సమయంలో శిఖా చౌదరి ఇంటికి వెళ్తాడని భావించాడు. గచ్చిబౌలిలో ఆమె ఉంటున్న విల్లా మేనేజర్‌ను పరిచయం చేసుకున్నాడు. జయరామ్ వస్తే చెప్పాలంటూ అతడికి నెలకు రూ.15 వేలను వేతనంగా ఇచ్చేవాడు. జయరామ్ జనవరి 29వ తేదీ సాయంత్రం శిఖా చౌదరి ఫ్లాట్‌కు వెళ్లిన విషయాన్ని విల్లా మేనేజర్ వెంటనే రాకేశ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. తాను ఫోన్ చేసినా.. వెళ్లినా ఫలితం ఉండదని భావించిన రాకేశ్.. జయరామ్‌కు ఉన్న అమ్మాయిల బలహీనతను ఆసరాగా చేసుకొని రప్పించుకోవాలనుకున్నాడు. కొత్తగా సెల్ నంబర్ తీసుకుని.. వాట్సా‌ప్‌లో ఓ మోడల్ ఫొటోను డీపీగా పెట్టాడు. 30న రీనా పేరుతో గంట గంటకు జయరామ్ ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్‌లను పెట్టాడు. ఆమే తనతో చాట్ చేసిందని భావించిన జయరామ్ అదే రోజు సాయంత్రం నేరుగా ఆ ఇంటికి వెళ్లిపోయాడు. లోపలకు వెళ్లగానే రాకేశ్ ఆయన్ను బంధించాడు. రాత్రంతా చిత్రహింసలకు గురిచేశాడు. గుండెకు స్టంట్లు వేయించుకున్న జయరామ్ తాను మందులు వేసుకోవాల్సి ఉందని.. తనను వదిలేయమని వేడుకున్నా రాకేశ్ రెడ్డి కనికరించలేదు. డబ్బులు తిరిగివ్వాల్సిందేనని తీవ్రంగా కొట్టాడు. దెబ్బలకు తాళలేక జయరామ్.. తాను విజయవాడ వెళ్లాల్సి ఉందని.. అక్కడి నుంచి డబ్బులు తెచ్చి ఇస్తానని ప్రాధేయపడ్డాడు. అంతలోనే సోఫాలో కుప్పకూలిపోయాడు. రాకేశ్ మరింత కోపంతో జయరామ్ పీకను చేతులతో పట్టుకొని గట్టిగా సోఫాకు అదిమిపట్టాడు. కొద్దిసేపటికే ముక్కు నుంచి రక్తస్రావమై జయరామ్ ప్రాణాలు కోల్పోయాడు. కంగారుపడిన రాకేశ్ వివిధ కేసుల్లో పరిచయాలు ఉన్న ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డి, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు.

ఉదయం 10-11 గంటల ప్రాంతంలో హత్య జరగ్గా.. ఏసీపీ మల్లారెడ్డి, శ్రీనివాస్‌లతో రాకేశ్ సుదీర్ఘంగా మాట్లాడాడు. అప్పటికే జయరామ్ విజయవాడకు వెళ్లాల్సి ఉందని చెప్పడంతో ఆ ఇద్దరు పోలీసు అధికారాలు విజయవాడకు వెళ్లే మార్గంలో రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి వదిలేయాలని చెప్పారు. అర్ధరాత్రి ఒంటిగంటకు రాకేశ్ తన ఇంటి వాచ్‌మన్ దున్నే శ్రీనివాస్ సాయంతో కారులోని వెనుక సీట్లో జయరామ్ మృతదేహాన్ని పెట్టాడు. అక్కడి నుంచి నేరుగా కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చి నందిగామ దాటిన తర్వాత ఐతవరం వద్ద జాతీయ రహదారికి పక్కకు తోసేశాడు. అనంతరం ప్రైవేటు బస్సులో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు.

బస్సు టికెట్‌కూ డబ్బుల్లేక..

కూకట్‌పల్లిలో పలువురు వ్యాపారులు, బిల్డర్లు, వ్యాపారవేత్తలను బెదిరించి వసూలు చేసిన డబ్బుతో రాకేశ్ రెడ్డి ఇటీవల గోవా వెళ్లాడు. అక్కడ రూ.లక్షలు ఖర్చు చేసి జల్సాలు చేశాడు. క్యాసినోలో పేకాట, మద్యం, అమ్మాయిలతో గడిపాడు. చివరకు తిరిగి నగరానికి వచ్చేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో స్నేహితుడి సహకారంతో బస్సు టికెట్ బుక్ చేసుకొని తిరుగు పయనమయ్యాడు. అప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అతడి కాల్ డేటా ఆధారంగా గోవా నుంచి బస్సులో తిరిగి వస్తున్నట్లు తెలుసుకొని మార్గమధ్యలోనే బీజాపూర్ వద్ద అదుపులోకి తీసుకొన్నారు.

ఇంటికొచ్చి శిఖా పత్రాలు తీసుకెళ్లిందని వాచ్‌మన్ చెప్పాడు

- నా భర్త హత్య కేసులో పలు అనుమానాలు: జయరాం భార్య

బంజారాహిల్స్/హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జయరామ్ హత్య కేసులో పలు అనుమానాలున్నాయని ఆయన భార్య పద్మశ్రీ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఏపీ పోలీసులు జరిపిన దర్యాప్తు సంతృప్తి కరంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో హత్య జరిగింది కాబట్టి కేసును ఇక్కడికే బదిలీ చేయాలని కోరారు. కుటుంబసభ్యులు, న్యాయవాదితో కలిసి వచ్చిన ఆమె.. మూడు పేజీల ఫిర్యాదు కాపీని జూబ్లీహిల్స్ సీఐ హరిశ్చంద్రారెడ్డికి అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో జయరామ్ మేనకోడలు శిఖా చౌదరి పాత్ర అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. "శిఖాచౌదరి నా ప్రమేయం లేకుండా మా జీవితంలోకి వచ్చింది. మేనమామ మరణించినప్పుడు ఘటనాస్థలికి వెళ్లకుండా శిఖా జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి ఎందుకు వచ్చిందనే ప్రశ్నకు సమాధానం రాలేదు. జయరామ్ ఇంటికి వెళ్లి.. బెడ్‌రూంలో నుంచి విలువైన డాక్యుమెంట్లు, వస్తువులు తీసుకెళ్లినట్లు వాచ్‌మన్ చెప్పాడు నేను వచ్చేసరికి ఇంట్లో వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. నా భర్త హత్యలో శిఖా పాత్ర ఏమిటి? అన్నది తేలాలి" అని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో పూర్తి స్థాయి విచారణ జరిని తనకు, తన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని ఆమె కోరారు. రాకేశ్ రెడ్డి ఎవరో తెలుసా అనే ప్రశ్నకు అసలు ఆ పేరు కూడా తానెప్పుడు విన్లేదన్నారు. శిఖాచౌదరితో ఎలాంటి ఆర్థిక వివాదాలు లేవని పేర్కొన్నారు. రాకేశ్ రెడ్డి దగ్గర రూ. 80 లక్షలు తన భర్త తీసుకున్నాడని పోలీసులు చెబుతున్నారని, ఈ విషయాన్ని తాను నమ్మడం లేదన్నారు.

ఏసీపీ మల్లారెడ్డిపై వేటు

- అంబర్‌పేట్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్
- నిందితుడు రాకేశ్‌రెడ్డితో అంటకాగిన ఫలితం
- ఇప్పటికే సీఐ శ్రీనివాసులు బదిలీ

హైదరాబాద్ సిటీ, ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భూ దందాలు, సెటిల్మెంట్లు చేస్తూ నేరచరిత్ర కూడా ఉన్న రాకేశ్ రెడ్డితో అంటకాగిన ఫలితం.. ఆ ఇద్దరు పోలీసు అధికారులపై బదిలీ వేటు పడింది. వ్యాపారవేత్త చిగురుపాటి జయరామ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు రాకేశ్ రెడ్డికి సహకరించారంటూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఏసీపీ ఎస్.మల్లారెడ్డి, నల్లకుంట సీఐ శ్రీనివాసులు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. జయరామ్ హత్య అనంతరం రాకేశ్.. ఈ ఇద్దరి పోలీస్ అధికారుల సలహాలు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు వారు రాకేశ్‌తో ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు కాల్ డాటా ఆధారంగా గుర్తించారు. ఈ మేరకు కృష్ణాజిల్లా ఎస్పీ త్రిపాఠి హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసులును సోమవారమే బదిలీ చేశారు. ఏసీపీ ఎస్. మల్లారెడ్డిని మంగళవారం అంబర్‌పేట్ పోలీస్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. విచారణలో మల్లారెడ్డిపై ఆరోపణలు నిజమని తేలితే తప్పకుండా చర్యలుంటాయని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ తెలిపారు. కాగా ఆయన స్థానంలో వనస్థలిపురం ఏసీపీ గాంధీనారాయణకు ఇన్‌చార్జ్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. మల్లారెడ్డి.. 2016 డిసెంబరు నుంచి మల్లారెడ్డి ఇబ్రహీంపట్నం ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఓ కేసు సందర్భంగా రాకేశ్, ఏసీపీ మల్లారెడ్డి మధ్య పరిచయం ఏర్పడిందని, జయరాం హత్య అనంతరం ఆరోపణల నేపథ్యంలోనే అతడిని బదిలీ చేశామని సీపీ భగవత్ చెప్పారు. ఈ విషయంలో విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా రాకేశ్‌తో మరో పోలీస్ అధికారికీ సంబంధాలున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదిభట్లలో రాకేశ్ భూ దందా

రాచకొండ కమిషనరేట్ ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌లో రాకేశ్ రెడ్డి భూ దందాకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. 41ఎకరాల ప్రైవేట్ స్థలం విషయంలో రాకేశ్ రెడ్డి కలగజేసుకొని దాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఆ భూమిలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంబాలు, వైర్లు తొలగించి గలాటా సృష్టించారని సీపీ భగవత్ పేర్కొన్నారు. ఈ విషయమై ప్రధాన నిందితుడు ధీరజ్‌రెడ్డి, రాకేశ్‌పై ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది జూన్‌లో కేసులు నమోదయ్యాయి. అయితే స్థలాన్ని కబ్జాచేయడానికి ప్రయత్నించిన విషయంలో ఏసీపీ మల్లారెడ్డి రాకేశ్‌కు సహకరించాడా..? లేదా..? అసలు ఇద్దరికి ఎలా పరిచయం అయింది? రాకేశ్ నేరచరిత్రలో పోలీసుల పాత్రం ఏంటి? తదితర విషయాలన్ని విచారణలో తెలుస్తాయని సీపీ మీడియాకు తెలిపారు. ఏది ఏమైనా ఆరోపణల్లో వాస్తవం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



బేగిన వచ్చెనోయి సైబీరియన్ అతిథులు

పొడవాటి ముక్కు.. తెలుపు రంగు శరీరం.. కాషాయం రంగు తల.. నలుపు రంగు రెక్కలు.. వెనుక గులాబీ రంగు ఈకలు.. గులాబీ రంగు కాళ్లు.. చూడగానే ఆకట్టుకు నే సైబీరియన్ కొంగలివీ! గుడ్లు పెట్టి.. పొదుగుకొని.. వానలు మొదలయ్యే సమయానికి తిరుగు పయనమయ్యేలా ఏటా వేసవికాలంలో ఎక్కడి నుంచో వలస వస్తాయి. ఈ మారు ముందే వచ్చివాలాయి. మహబూబాబాద్ రూరల్ మండలం మాధవాపురం గ్రామంలో ఓ చెట్టు మీద వలస కొంగల సందడి ఇదీ. మండలంలోని చింతపల్లి, మల్యాల, అనంతాద్రి ప్రాంతాల్లో సైబీరియన్ కొంగలు బాగా కనిపిస్తున్నాయి.

- మహబూబాబాద్, ఆంధ్రజ్యోతి



కొత్త సర్పంచ్.. ఉచిత రేషన్ బియ్యం

తాను గెలిస్తే ఊరందరికీ ఉచితంగా రేషన్ బియ్యాన్ని అందజేస్తానన్న హామీని ఆయన సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన 3 రోజులకే అమలు చేశారు. మంగళవారం ఊరందరికీ రూ.11,520 విలువైన బియ్యాన్ని ఉచితంగా అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ సర్పంచ్‌గా గెలిచిన హన్మంతురెడ్డిదీ 'వితరణ'! ఈ హామీని ఆయన అమలు చేయాలంటే ఐదేళ్లలో రూ.7 లక్షలు ఖర్చవుతుంది. ఎన్నికల హామీ మేరకు ఊర్లో స్మశాన వాటిక కోసం రూ.10 లక్షల విలువైన ఎకరం స్థలాన్ని కూడా ఆయన విరాళంగా ఇచ్చారు.

- చిన్నచింతకుంట



జాతీయ 'ఇన్‌స్పైర్' ఎగ్జిబిషన్‌కు సోలార్ ఆసుయంత్రం

ఆసుయంత్రం ఆవిష్కర్త పద్మశ్రీ చింతకింది మల్లేశం స్ఫూర్తిగా యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి విద్యార్థులు రూపొందించిన సోలార్ ఆసు యంత్రం జాతీయ ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైంది. పట్టణంలోని జిల్లా పరిషత్(బాలుర) ఉన్నత పాఠశాల విద్యార్థులు సంతోష్, డి.ఓంహరి సౌరశక్తితో పనిచేసే ఈ యంత్రాన్ని ఆవిష్కరించారని ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో గైడ్ టీచర్ వీరబ్రహ్మాచారి పర్యవేక్షణలో విద్యార్థులు సోలార్ ఆసు యంత్రాన్ని ప్రదర్శిస్తారని చెప్పారు.

- భూదాన్‌పోచంపల్లి

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గజానన్



హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) జనరల్ మేనేజర్‌గా గజానన్ మాల్యా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్(ఐఆర్ఎస్ఎంఈ) పట్టభద్రుడైన మాల్యా స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటీస్‌గా 1979లో చేరారు. జబల్పూర్(బీహార్)లోని ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఐఆర్ఐఎంఈఈ) డైరెక్టర్‌గా పనిచేశారు. లండన్‌లో మెకానికల్ ఇంజనీరింగ్, ముంబైలోని ఎన్‌టీటీఐఈలో ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ చేశారు.

● విద్యుత్ లైన్లపై ఉపగ్రహ నిఘా

కరెంట్ లైన్లపై ఉపగ్రహం ద్వారా నిఘా పెట్టాలని విద్యుత్ సంస్థ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 400 కేవీతో పాటు 220 కేవీ, 132 కేవీ లైన్లను జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) సాయంతో మ్యాపింగ్‌తో పాటు రూట్ అలైన్‌మెంట్ చేస్తారు. తొలిదశలో 400 కేవీ లైన్‌ను చేసి ఫలితం వచ్చాకా 220 కేవీ, 132 కేవీ లైన్ల కు విస్తరించాలని నిర్ణయించారు. దీని కోసం వెబ్ జీఐఎస్ (జియో ఫిజికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) పోర్టల్‌ను అభివృద్ధి చేస్తారు. దీని కోసం ఆరుగురు డివిజనల్ ఇంజనీర్ స్థాయి అధికారులతో కమిటీని ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు ఏర్పాటు చేశారు.

● రైతుల స్థితిగతులపై దేశవ్యాప్త సర్వే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశంలో రైతుల స్థితిగతులను అంచనా వేయడానికి ప్రస్తుత పంట సంవత్సర కాలానికి ఒక సర్వే చేపడతామని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ నేషనల్ శాంపుల్ సర్వే 77వ రౌండ్‌లో భాగంగా రైతుల ఆదాయం, ఖర్చు, రుణాల వివరాలు సేకరిస్తామన్నారు.

● బీజేపీకి మళ్లీఅధికారం ఖాయం: మురళీధర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మోదీ నేతృత్వంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.భువనగిరి పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 11న సమర్పణ దివస్, 28న కమలజ్యోతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

● ఎండీఎస్ కోర్సుల్లో కొత్తగా 50 సీట్లు

దేశవ్యాప్తంగా 8 దంత కళాశాలల్లో ఎండీఎస్ కోర్సుల్లో కొత్తగా 50 సీట్లకు కేంద్రం అనుమతులు మంజూ రు చేసింది. అందులో తెలంగాణలో మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో 5 సీట్లు, విశాఖపట్నంలోని అనిల్ నిరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లోని నాలుగు విభాగాల్లో కొత్తగా 8 సీట్లు ఉన్నాయి.

● 50 వేల వేతనం ఇవ్వాలి: రేషన్ డీలర్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించి నెలకు రూ.50 వేల వేతనం ఇవ్వాలని లేదా క్వింటాలుకు రూ.300 కమీషన్ చెల్లించాలని అఖిల భారత రేషన్ డీలర్ల సమాఖ్య ఉపాధ్యక్షుడు నాయికోటి రాజు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే మార్చి 1నుంచి రేషన్ పంపిణీని నిలిపివేస్తామని హెచ్చరించారు.

● 'శంషాబాద్ వరకు మెట్రో' ప్రతిపాదన లేదు

హైదరాబాద్ మెట్రో రైలును శంషాబాద్ విమానాశ్రయం వరకు విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. టీఆర్ఎస్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

గ్రామాభివృద్ధికి 'ఉపాధి'

ఆ నిధులను వినియోగించండి.. రాష్ట్రప్రభుత్వ వాటా కూడా ఇస్తాం

- 12,751 గ్రామాల్లో నర్సరీలు పెంచండి
- 14,012 వైకుంఠ ధామాలు నిర్మించండి
- 859 పంచాయతీల్లో బీటీ రోడ్లు వేయండి
- నిధులు దుర్వినియోగం కావడానికి వీల్లేదు
- గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టండి
- సమీక్షలో అధికారులకు సీఎం ఆదేశం



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించి గ్రామాలను అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. తెలంగాణకు హరితహారం, వైకుంఠధామాలు (స్మశాన వాటికలు) నిర్మించాలని సూచించారు. ఉపాధి నిధులతో పాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకుని గ్రామాల్లో అభివృద్ధి చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉపాధి పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో, అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్లో నిధులు కేటాయిస్తుందని చెప్పారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే ఉపాధి పనులు జరగాలని, హరితహారం పనులకు మొదటి ప్రాధాన్యం, స్మశాన వాటికల నిర్మాణానికి రెండో ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. హరితహారంలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేయాలని, ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి రక్షించాలని చెప్పారు. ఈ బాధ్యతను పంచాయతీలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఆరునెలల్లో వైకుంఠధామాలు నిర్మించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ భూమి లేకుంటే గ్రామ పంచాయతీలు తమ నిధులతో స్థలాలు సమకూర్చాలని, దాతల నుంచి స్వీకరించాలని సూచించారు. 3వేల లోపు జనాభా కలిగిన గ్రామాల్లో ఒకటి చొప్పున, 3వేలకు పైగా జనాభా కలిగిన గ్రామాల్లో రెండు చొప్పున మొత్తం 14,012 వైకుంఠధామాలు నిర్మించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలకు కచ్చితంగా బీటీ రోడ్డు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలన్నారు. కొత్తగా 859 గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం గ్రామ పంచాయతీల బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. నిధులు దుర్వినియోగం కావద్దని, ప్రతి పైసా సద్వినియోగం కావాలని అన్నారు. అధికారులు 20 బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ జోషి, ఎంపీలు వినోద్‌కుమార్, బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రెడ్యానాయక్, బాల్క సుమన్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, అడిషనల్ పిసిసిఎఫ్ డోబ్రియాల్, సిఎంవో ప్రత్యేక కార్యదర్శులు స్మితా సబర్వాల్, భూపాల్ రెడ్డి, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డులన్నీ ప్రింటవుట్!

- వీఆర్‌వోలు, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్‌లలో సిద్ధంగా ఉంచాలని ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భూ రికార్డుల నవీకరణ, శుద్ధీకరణలో సిద్ధం చేసిన రికార్డులన్నింటి ప్రింటవుట్‌లు తీసి... ఫిజికల్ కాపీలు సిద్ధంగా ఉంచుకోవాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ రాజేశ్వర్ తివారి అధికారులను ఆదేశించారు. 2017 సెప్టెంబరు 15 నుంచి చేపట్టిన భూ రికార్డుల నవీకరణలో భాగంగా 30 జిల్లాల్లోని 568 మండలాల పరిధిలో 10,823 గ్రామాల్లోని 2,38,56,322.25 ఎకరాల రికార్డులను పరిశీలించారు. ఇందులో 1.46 కోట్ల ఎకరాలపై యాజమాన్య హక్కును యంత్రాంగం ధ్రువీకరించింది. దాంతో గ్రామం, తహసీల్దార్, డివిజన్, జిల్లాల వారీగా రికార్డులను డౌన్‌లోడ్ చేసుకొని, ఆ రికార్డులను ప్రింటవుట్ తీసుకోవాలని సీసీఎల్‌ఏ నిర్దేశించారు. తాజాగా డిజిటల్ సంతకాలు చేసిన పహాణీ (సర్వే నెంబర్ల వారీగా), తాజా రికార్డ్ ఆఫ్ రైట్ (ఆర్‌వోఆర్) 1బీ, ప్రభుత్వ భూముల రికార్డులు, ప్రభుత్వ ఆస్తులు, పార్ట్-బీలోని వివాదాస్పద భూముల వివరాలు సర్వే నెంబర్ల వారీగా ప్రింటవుట్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా వీఆర్‌వోలు, తహసీల్దార్‌లు, ఆర్డీవోలు, కలెక్టర్లు రికార్డులను తమ వద్ద పెట్టుకోవాలని పేర్కొన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం పీఎం-కిసాన్ పథకం కోసం రికార్డులన్నీ సిద్ధంగా పెట్టుకోవాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం కేంద్రం నుంచి సీనియర్ ఐఏఎస్ వసుధా మిశ్రా కూడా రాష్ట్రంలో పర్యటించారు. రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో రికార్డులను కేంద్రానికి అందిస్తూనే.. ఫిజికల్ కాపీలను క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచనున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తే.. ఫిజికల్ రికార్డులను వారికి చూపించే అవకాశాలున్నాయి.



మోదీ ప్రభుత్వం ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు కృతజ్ఞతగా హైదరాబాద్ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సన్మానిస్తున్న ఈబీసీ సంఘాలు.

8 రోజుల్లోనే కాళేశ్వరానికి అనుమతి

కేసీఆర్ వచ్చి కోరగానే మంజూరు: గడ్కరీ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు కేవలం ఎనిమిది రోజుల్లోనే అనుమతులు ఇచ్చామని కేంద్ర జల వనరుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. "ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు నా వద్దకు వచ్చారు. అప్పటికప్పుడు నా శాఖ అధికారులను పిలిపించి వెంటనే అన్ని అనుమతులు ఇవ్వాలని ఆదేశించాన"ని వివరించారు. తన వద్దకు ఎన్నిసార్లు వచ్చారో అప్పటి మంత్రి హరీశ్‌రావును అడిగితే చెబుతారన్నారు. సముద్రంలో వృధాగా కలుస్తున్న 1100 టీఎంసీల నదీ జలాలను సద్వినియోగం చేయాలనే కాళేశ్వరం, ఏపీలో పోలవరం ప్రాజెక్టులకు యుద్ధప్రాతిపదికన అనుమతులు ఇచ్చామని చెప్పారు. మంగళవారం మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల బూత్ కమిటీలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులతో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గడ్కరీ మాట్లాడారు. "45 టీఎంసీల నీటి కోసం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు గొడవ పడుతున్నాయి. నేను నిర్వహించిన సమావేశాల్లో పబ్లిక్ కుళాయిల వద్ద మహిళలు కొట్లాడుకున్నట్లు కొన్ని రాష్ట్రాల సీఎంలు పోట్లాడుకోవడం ఆశ్చర్యం కలిగించింది. ఆ పరిస్థితి ఏపీ, తెలంగాణ మధ్య ఏర్పడకూడదన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. అందుకే వృధా జలాల వినియోగానికి ప్రాధాన్యత ఇచ్చాం" అని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఇప్పటి వరకు రూ.60 వేల కోట్లు వెచ్చించిందని తెలిపారు. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటకల్లో 99 సాగునీటి ప్రాజెక్టులకు తమ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, వీటిలో 67 ప్రాజెక్టులు వచ్చే జూన్ నాటికి పూర్తికానున్నాయని తెలిపారు. కార్యకర్తలు రైలు ఇంజిన్‌లాంటివారని, ప్రజలను ఢిల్లీకి బుల్లెట్ రైలులో తీసుకెళ్లి బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఎంపీ దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఆశల పల్లకి

(మూడో పేజీ తరువాయి)

నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు కారణం.. ఇందులో న్యాయ సమస్యలు ఇమిడి ఉండడమే. ఏకీకృతంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడంతో ఉపాధ్యాయుల్లో ముఖ్యంగా పంచాయతీరాజ్ టీచర్లలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మంగళవారం ప్రగతి భవన్లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. పదోన్నతులపై చర్చించారు. పదోన్నతులను వేగంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారని తెలిపారు.

సుప్రీం కోర్టు స్టే ఇచ్చినా ఉపాధ్యాయులకు పదోన్నతులు అంత సులభం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం కోర్టు స్టే ఆధారంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలంటే.. షరతులతో కూడిన పదోన్నతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, మార్చి 25నే ఈ కేసులో తుది తీర్పు వెలువడే అవకాశం ఉంది. అది ఎలా వస్తుందో తెలియదు. నిజానికి, గతంలో ఇలాగే కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఉపాధ్యాయులకు షరతులతో కూడిన పదోన్నతులు ఇచ్చారు. ఫలితంగా, విద్యా శాఖ ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కార కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, ఇప్పుడు మళ్లీ అదే తప్పిదం చేయడం అవసరమా? అనే కోణంలో ఆలోచిస్తున్నారు. ఇక, మార్చి రెండో వారంలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వారంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. వారంలో సర్వీస్ రూల్స్ రూపొందించి.. ఉత్తర్వులు జారీ చేసి హడావిడిగా పదోన్నతులు ఇవ్వడం కుదరదని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసేలోపే లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉంది. ఇన్ని సమస్యల మధ్య టీచర్లకు పదోన్నతులు సాధ్యమవుతాయా? అని సర్కారు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

సీఎం సానుకూల స్పందన: టీచర్ ఎమ్మెల్సీలు

ఉపాధ్యాయుల పదోన్నతులపై సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు తెలిపారు. పూల రవీందర్, జనార్దన్ రెడ్డి, పాతూరి సుధాకర్ రెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. పదోన్నతుల అంశంపై త్వరలోనే ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. పదోన్నతులపై సానుకూలంగా స్పందించిన సీఎంకు ఎమ్మెల్సీలతోపాటు పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తం రెడ్డి, కమలాకర్‌రావు, టీపీఆర్‌టీయూ అధ్యక్షుడు అంజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పదోన్నతులు ఇవ్వాలి.. టీచర్‌సంఘాల డిమాండ్

ఉమ్మడి సర్వీసు నిబంధనల మేరకు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని సుప్రీంకోర్టు సోమవారం తీర్పునివ్వడంతో హైదరాబాద్ జిల్లాలోని ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. హైదరాబాద్ జిల్లాలో జడ్పీ పాఠశాలలు లేవని, కేవలం ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే ఉన్నాయని, ఉమ్మడి సర్వీసు రూల్స్ జిల్లాలోని ఉపాధ్యాయులకు వర్తించనప్పటికీ పదోన్నతులు కల్పించడంలో సర్కారు వివక్ష చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పదోన్నతులు లేకుండానే పదవీ విరమణ



ఉమ్మడి సర్వీసు రూల్స్ వర్తించని జిల్లాలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకపోవడంతో.. ప్రమోషన్ లేకుండానే వారు పదవీ విరమణ చేయాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదు. సుప్రీం కోర్టు స్టే నేపథ్యంలో వెంటనే పదోన్నతులు కల్పించాలి.

-డి.సంజీవరావు, యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు

పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలి



సుప్రీం స్టే నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జిల్లాలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలి. ఏళ్లతరబడి పదోన్నతులు కల్పించకపోవడంతో జిల్లాలోని ఉపాధ్యాయులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ప్రక్రియ చేపడితే 300 మందికి పదోన్నతులు వస్తాయి.

-ఎం. నర్సింహారెడ్డి, ఎస్టీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు

అటవీశాఖలో భారీగా బదిలీలు

(మూడో పేజీ తరువాయి)

అటవీ అధికారులకు స్థానచలనం కల్పించింది. వీరి బదిలీల ఫైల్‌పై సీఎం కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు. చీఫ్ కన్జర్వేటర్ నుంచి బీట్ ఆఫీసర్ వరకు ఇంత భారీస్థాయిలో బదిలీలు చేపట్టడం ఇదే తొలిసారి. ఇందులో భాగంగా 21 జిల్లాలకు నూతన అటవీ అధికారులను నియమించారు. అడవుల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలని, నిబద్ధత కలిగిన అధికారులను ముఖ్య స్థానాల్లో నియమించాలని సీఎం కేసీఆర్ గతంలోనే ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు జాబితా రూపొందించగా దాన్ని సీఎం పరిశీలించి ఆమోద ముద్ర వేశారు. జిల్లా అటవీ అధికారులుగా పనిచేస్తున్న చీఫ్ కన్జర్వేటర్లు, కన్జర్వేటర్లు, డీఎఫ్ఓలు 21 మందికి ముఖ్యమైన జిల్లాల బాధ్యతలు అప్పగించారు. కలప స్మగ్లింగ్, జంతువుల వేట ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వారిని నియమించారు. చీఫ్ కన్జర్వేటర్ ఏకే సిన్హాను అచ్చంపేటకు కేటాయించారు. కన్జర్వేటర్ ర్యాంకు అధికారులు శర్వానంద్, వినోద్‌కుమార్‌ను మెదక్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు నియమించారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, మంచిర్యాల, పాల్వంచ, కిన్నెరసాని, వరంగల్, ఖానాపూర్, నిజామాబాద్, అమ్రాబాద్, బాన్సువాడ, ఇల్లందు, కాగజ్‌నగర్, ఇచ్చోడ డివిజన్లకు నూతన డీఎఫ్‌వోలను నియమించారు. తాజా బదిలీల్లో 19 మంది రేంజ్ అధికారులకు స్థానచలనం కలిగింది. మహబూబాబాద్, గూడూరు, గంగారం, బయ్యారం, ఆజంనగర్, పెద్దపల్లి, నర్సంపేట, మంచిర్యాల, డోర్నకల్, కరీంనగర్, కొత్తగూడెం, కెరమెరి, బెల్లంపల్లి, తిర్యాని, గాంధారి, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, దూలపల్లికి రేంజ్‌లకు కొత్త అధికారులను కేటాయించారు. మరో 160 మంది ఫారెస్టర్లు, బీట్ ఆఫీసర్లను బదిలీ చేశారు.

11 మందిపై సస్పెన్షన్ వేటు

కలప స్మగ్లింగ్, జంతువుల వేట, ఇతర అటవీ సంబంధ కేసుల్లో ప్రమేయమున్న 11 మంది అధికారులపై అటవీ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. కలప స్మగ్లర్లకు సహకరిస్తున్న నిజామాబాద్ డీఎఫ్‌వోపై వేటు పడింది. స్మగ్లర్లకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులకు మెమోలు జారీ చేస్తోంది.

ఇక బదిలీల పర్వం!

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ స్థాయిలో బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఉన్నతాధికారుల బదిలీలకు సంబంధించిన ప్రతిపాదనల ఫైలు సీఎం కేసీఆర్ వద్ద సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల నుంచి దిగువ స్థాయి ఉద్యోగుల వరకు బదిలీలు చేసి పరిపాలనలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలని సీఎం నిర్ణయించినట్లు తెలిసింది. తొలుత ఉన్నతాధికారుల బదిలీలు పూర్తి చేసి, తదుపరి శాఖలవారీగా ఇతర అధికారులు, ఉద్యోగుల బదిలీ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు మార్చిలో షెడ్యూల్ వెలువరించే అవకాశం ఉన్నందున.. ఈలోగానే అత్యవసర బదిలీలు పూర్తి చేసుకోవాలని ఎన్నికల సంఘం రాష్ట్రానికి సంకేతాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఆ ప్రక్రియను వేగవంతం చేసింది. అటవీ శాఖతో బదిలీలను ప్రారంభించింది. సోమవారం ఒకేరోజు 200 బదిలీలు జరిగాయి. కాగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలను రెండు, మూడు రోజుల్లోనే పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే జిల్లాల కలెక్టర్లుగా ఉన్నవారు జిల్లా ఎన్నికల అధికారులుగా నియమితులవుతారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిని ఈ లోగానే బదిలీ చేయడంతోపాటు ఖాళీగా ఉన్న, బదిలీలు కోరుకుంటున్న కలెక్టర్లకు స్థానచలనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. వీరితోపాటు పలువురు ఐపీఎస్‌లకూ స్థానచలనం కల్పించాలని సర్కారు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మంత్రివర్గ కూర్పుతో సంబంధం లేకుండానే..

టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక.. ముగ్గురు ఐఏఎస్ అధికారులు జనార్దన్‌రెడ్డి, గౌతమ్, సురేంద్రమోహన్‌ను బదిలీ చేసినప్పటికీ వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. మరోవైపు పంచాయతీరాజ్, విద్యాశాఖ, సీసీఎల్‌ఏ వంటి కీలక శాఖలు ఇన్‌చార్జులతో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అప్రాధాన్య శాఖల బాధ్యతల్లో ఉన్న కొందరు ఐఏఎస్‌లకు కీలక శాఖలను అప్పగించాలని నిర్ణయించినట్లు, మంత్రివర్గ కూర్పుతో సంబంధం లేకుండానే బదిలీలు చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నెలాఖరు నాటికి అన్ని శాఖల్లోనూ అంతర్గత బదిలీలను పూర్తి చేసేందుకు సర్కారు సన్నాహాలు చేస్తోంది.

విద్యుత్ కనెక్షన్లపై జీఎస్టీ భారం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి)

విద్యుత్తు వినియోగదారులపై కూడా వస్తు సేవా పన్ను (జీఎస్టీ) భారం పడుతోంది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన 2017 జూలై 1వ తేదీ తర్వాత విద్యుత్తు మీటర్లు తీసుకున్న వారి నుంచి ఇప్పుడు 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. అప్పట్లో విద్యుత్తు వినియోగదారులకు జీఎస్టీ మినహాయించే అవకాశాలు ఉన్నాయన్న వార్తలతో విద్యుత్ సంస్థ ఆ పన్ను వసూలు చేయలేదు. కానీ, ఈ నెల జారీ చేసిన బిల్లుల్లో జీఎస్టీని కలిపారు. 2017 జూలై 1నుంచి ఇప్పటివరకు సంగారెడ్డి జిల్లాలో 29,870 విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. వీటిలో గృహ వినియోగం కోసం తీసుకునే ఒక కిలోవాట్ సామర్థ్యమున్న మీటరుకు చెల్లించాల్సిన రుసుము రూ.1200 ఉండగా, 18 శాతం జీఎస్టీ కింద రూ.216 వసూలు చేస్తున్నారు. మీటరు సామర్థ్యం పెరిగిన కొద్దీ రుసుము కూడా పెరుగుతుంది. ఈ లెక్కన 29,870 కనెక్షన్లకు ప్రజలపై కోటి రూపాయల భారం పడనుంది. ఈ నెల నుంచి కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు రుసుముతో పాటు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

నాగోబా జాతరలో నలభై ఏళ్ల జ్ఞాపకం



దేశం కాని దేశం ఆయనది. భారతదేశం అన్నా.. తండాల్లో నివసించే బిడ్డలన్నా ఎంతో ఇష్టం. అందుకే 1976-78లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజుగోండులపై పరిశోధన చేసేందుకు లండన్ నుంచి వచ్చారు. ఇప్పుడు మళ్లీ నాలుగు దశాబ్దాల తర్వాత మంగళవారం నాడు కేస్లాపూర్‌లోని నాగోబా జాతర సందర్శనకు తన భార్యతో కలిసి వచ్చారు. ఆయనే హైమెండాఫ్ సహాయకుడు, విఖ్యాత మానవ పరిణామ శాస్త్రవేత్త మైకెల్ యోర్క్! 1976లో యువకుడుగా వచ్చి అలరించిన యోర్క్.. నేడు 80 ఏళ్ల వయసులోనూ ఎంతో చలాకీగా జాతరలో పాల్గొన్నారు. పరిశోధనలో భాగంగా ఆనాడు నాగోబా సాంప్రదాయాన్ని కళ్లకు కట్టినట్లు తీసిన చిత్రాలతో జాతరలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వాటిని చూసి మురిసిపోయారు.

-ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పాక్‌లోని శ్రీకృష్ణ దేవాలయంలో విధ్వంసం

» విగ్రహాలు, మత గ్రంథాలు తగులబెట్టిన దుండగులు

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 5: పాకిస్థాన్‌లో గుర్తుతెలియని దుండగులు హిందూ దేవాలయంలో విధ్వంసం సృష్టించారు. దక్షిణ సింధ్ ప్రావిన్సులోని ఖాయిర్‌పూర్ జిల్లా కుంబ్ ప్రాంతంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక శ్యామ్ సుందర్ సేవా మండలి ఆలయంలోకి సాయంత్రం 6 గంటల సమయంలో చొరబడిన దుండగులు.. గర్భగుడిలోని విగ్రహాలను, భగవద్గీత సహా మూడు గ్రంథాలను తగులబెట్టారు. ఈ ఘటన స్థానికంగా ఉన్న హిందువుల్లో తీవ్ర భయాందోళనలను సృష్టించింది. ఆలయ ఇన్‌చార్జ్ విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పాకిస్థాన్ హిందూ కౌన్సిల్ సలహాదారు రాజేశ్ కుమార్ హార్దసాని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాక్‌లో హిందూ ప్రార్థనా స్థలాలకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.



మనసు దోచిన సెల్ఫీ!



ముద్దులొలికే చిన్నారులు.. ముసి ముసి నవ్వులు కురిపిస్తుంటే ఆస్వాదించని వారుంటారా? కల్మషం లేని వారి నవ్వులు.. ఎలాంటి అరమరికలు, ఆలోచనలు లేని వారి స్వేచ్ఛ.. చుట్టూ జరుగుతున్న విషయాలను అనుకరిస్తూ వారు చేసే చిలిపి పనులు ప్రతిఒక్కరి హృదయాన్ని కదిలిస్తాయి. అలా సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరి మనసు దోచిన చిత్రమే ఇది. ఐదుగురు చిన్నారులు ఒక దగ్గర చేరి నవ్వుతూ సెల్ఫీకి ఫోజిచ్చారు. కానీ చేతిలో ఫోన్ లేదు. అయితేనేం.. వారిలో ఒకరు చెప్పును చేతికి తగిలించుకుని మొబైల్ పట్టుకున్నట్లుగా ముందు నిలబడగా.. మిగిలిన చిన్నారులు సెల్ఫీకి రెడీ అన్నట్లుగా నిలబడ్డారు. ఆ దృశ్యాన్ని ఎవరో బంధించి.. సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. చిన్నారుల మోహంలో తొణికిసలాడుతున్న అమాయకత్వం.. కల్మషం లేని చిరునవ్వు.. ఫొటో చూసిన వారందరి మనసు దోచుకుంది. ఇప్పుడా ఫొటో వైరల్‌గా మారడంతో బాలీవుడ్ ప్రముఖులు అనుపమ్ ఖేర్, సునిల్ శెట్టీ, అతుల్ కస్బేకర్, బొమన్ ఇరానీ వంటి ప్రముఖులు షేర్ చేశారు. ' మీరు ఎంచుకున్న దాన్ని బట్టే ఆనందంగా ఉంటారు' అనే క్యాప్షన్ పెట్టారు. కస్బేకర్ షేర్ చేసిన ఈ ఫొటోను చూసిన అమితాబ్ అనుమానం వ్యక్తం చేశారు. 'ఇది ఫొటోషాప్‌లో ఎడిట్ చేసిన చిత్రం కావొచ్చు. ఫొటోలో చెప్పు పట్టుకున్న చేయి, మరో చేయి తేడా ఉన్నట్లు కనిపిస్తోంది' అని బిగ్‌బీ ఈ ట్వీట్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నెటిజన్లు అంగీకరించలేదు. 'అమితాబ్ జీ.. ఇది ఫొటోషాప్ చేసిన చిత్రం కాదు. నేను నిపుణులతో క్రాస్ చెక్ చేయించా.. ఇది నిజమైనదే' అంటూ కస్బేకర్ సమాధానమిచ్చారు. నెటిజన్ల మనసు దోచుకున్న ఫొటోను ఈనెల 2న గోల్డ్ కుమార్ అనే వ్యక్తి సోషల్‌మీడియాలో మొదట పోస్ట్ చేయగా లక్షలాది మంది షేర్ చేశారు. ఎవరు.. ఎప్పుడు.. ఎక్కడ తీశారనేది మాత్రం ఇంకా తెలియలేదు.

దిశ మారుతున్న 'ఉత్తరం'!

అయస్కాంత ఉత్తర ధ్రువంలో ఏటా 55 కి.మీ. వేగంతో కదలిక



వాషింగ్టన్, ఫిబ్రవరి 5: ఉత్తర దిక్కు దిశ మార్చుకుంటోంది. నిజమే..! కంపాస్(దిక్సూచి)లో ఈ మార్పును గమనించవచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికంతటికీ కారణం అయస్కాంత ఉత్తర ధ్రువం కదలుతుండటమే! ఉత్తర ధ్రువం కదలడమేమిటని ఆశ్చర్యపడొద్దు. భూమికి రెండు ఉత్తర ధ్రువాలు, రెండు దక్షిణ ధ్రువాలు ఉంటాయి. అవి.. భౌగోళిక ఉత్తర ధ్రువం, అయస్కాంత ఉత్తర ధ్రువం. భౌగోళిక ఉత్తర ధ్రువం అంటే మనందరికీ తెలిసిన, మనందరికీ కనిపించే ఆర్కిటిక్ ప్రాంతం. ఇది మారదు. అలాగే ఉంటుంది. మారేది.. అయస్కాంత ఉత్తర ధ్రువం. ఇది.. సౌర జ్వాలల నుంచి మానవాళిని రక్షించే మన కంటికి కనిపించని ధ్రువం అన్నమాట. ఇది భౌగోళిక ధ్రువంలాగా స్థిరంగా ఉండదు. కదులుతూ ఉంటుంది. ఇలా కదిలీ కదిలీ.. ఒకదశలో అయస్కాంత ఉత్తర ధ్రువం అయస్కాంత దక్షిణ ధ్రువంగానూ.. అయస్కాంత దక్షిణ ధ్రువం అయస్కాంత ఉత్తర ధ్రువంగానూ మారిపోతుంది!! ఇందుకు మరో వెయ్యి సంవత్సరాలు అంతకు మించి సమయం పట్టొచ్చని సమాచారం. గతంతో పోలిస్తే కొన్ని దశాబ్దాలుగా ఈ చలనం చాలా వేగంగా ఉందని, ఏడాదికి 55 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు తాజాగా గుర్తించామని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో శాస్త్రవేత్తలు తెలిపారు. 2017లోనే ఇది ఇంటర్నేషనల్ డేట్‌లైన్ దాటేసిందని, కెనడియన్ ఆర్కిటెక్ట్ నుంచి సైబీరియా వైపు వెళ్తోందని పేర్కొన్నారు. ఈ చలనం వల్ల స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల్లోకి దిక్సూచికి ఇబ్బందేనని అంటున్నారు. విమానాలు, నౌకల ప్రయాణానికి ఇక్కట్లు ఎదురవుతాయని తాజాగా విడుదల చేసిన వరల్డ్ మాగ్నటిక్ మోడల్‌లో తెలిపారు. దిక్కులు కనుగొనే విషయంలో జీపీఎస్‌కు వచ్చే ఇబ్బందేమీ లేదు. ఇది ఉపగ్రహాల ఆధారంగా పనిచేయడమే కారణం.



తన పోర్షే కారుతో బాలగోపాల్ కుటుంబం

నంబర్ 1కు రూ. 31 లక్షలు

» దేశంలోనే వాహన నంబర్‌కు అత్యధికం.. కేరళ వ్యాపారవేత్త సొంతం

తిరువనంతపురం, ఫిబ్రవరి 5: కె.ఎస్‌బాలగోపాల్.. ఈ పేరు ఎక్కడో విన్నట్లు గుర్తుంది కదా? గత ఏడాది ఆగస్టులో కేరళను వరదలు ముంచెత్తినప్పుడు పెద్ద మనసుతో ఆర్థిక సాయం చేసిన వ్యాపారవేత్త ఆయన. అప్పట్లో పంచెకట్టుపై వరదబాధితులకు ఆయన సాయం చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది. దేవి ఫార్మ అధినేత అయిన బాలగోపాల్.. సోమవారం మరో రికార్డు నెలకొల్పారు. ఇటీవల రూ. కోటి వెచ్చించి కొనుగోలు చేసిన తన పోర్షే 718 బాక్స్‌టర్ కారుకు.. ఫ్యాన్సీ నంబర్ (కేఎల్01-సీకే0001)ను రికార్డుస్థాయి ధర చెల్లించి సొంతం చేసుకున్నాడు. పోటాపోటీగా జరిగిన వేలంలో.. రూ. 31 లక్షలకు ఆ నంబర్‌ను పాడుకున్నాడు. షైన్ యూసుఫ్ అనే ఎన్నారై.. రూ. 25 లక్షల వరకు పోటీని ఇచ్చి.. ఆ తర్వాత తప్పుకొన్నాడు. కాగా.. ఒక ఫ్యాన్సీ నంబరుకు రూ. 31 లక్షలు వెచ్చించడం దేశంలోనే ఒక రికార్డు అని రవాణా శాఖ అధికారులు తెలిపారు. 2017లోనూ ఆయన తన లాండ్ క్రూయిజర్ కారుకు కేఎల్01-సీబీ0001 కోసం రూ. 19 లక్షలు వెచ్చించాడు. అప్పట్లో అదే పెద్ద రికార్డు.



ప్రభువులా ప్రధాని మోదీ

ఆయన తనను తాను అలా ఊహించుకుంటున్నారు.. హిందుస్థాన్ టైమ్స్ ఇంటర్వ్యూలో రాహుల్

మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు ఇటీవలి ఎన్నికల ఫలితాలు కేవలం నమూనా మాత్రమే. ప్రధాని మోదీపై ప్రజల్లో అంతర్లీనంగా కోపం ఉంది. కాకపోతే ప్రస్తుతానికి అది పూర్తిగా పైకి కనిపించట్లేదుగానీ.. తెలుస్తోంది" అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ 'హిందుస్థాన్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. బ్రిటిషర్లలా.. మోదీ తనను తాను ఈ దేశానికి ప్రభువులా భావించుకుంటున్నారన్నారు. రాఫెల్ డీల్ నుంచి దేశంలో రైతుల దుస్థితి, నిరుద్యోగం దాకా పలు అంశాలపై ఆయన ఈ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అందులో ముఖ్యాంశాలు..

రైతులను అవమానించడమే!

కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో.. రైతు కుటుంబానికి రోజుకు 17 రూపాయల చొప్పున ఇవ్వడమంటే అవమానించడమే. మోదీ సర్కారు ఇప్పుడు ఏమీ దిక్కుతోచని పరిస్థితిలో ఉంది. అందుకే ఆదరాబాదరాగా ఈ తాత్కాలిక ఉపశమన చర్యలను ప్రకటిస్తోంది. కానీ, ఇవేవీ పనిచేయవు. మోదీ ఈ బడ్జెట్‌లో రైతుల కోసం చేసినదానికన్నా.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రకటించిన రుణమాఫీ ఎక్కువగా పనిచేసింది. ప్రధాని మోదీ తన 20-25 మంది ఆశ్రితులకు సంబంధించి రూ.3.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారు. కాబట్టి రైతు రుణమాఫీ కూడా న్యాయమైనదే. అనిల్ అంబానీ రుణాన్ని మాఫీ చేసినప్పుడు.. రైతు రుణాల మాఫీ ద్వారా వారికెందుకు సాయం చేయరు? ప్రస్తుతం దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం.. మోదీ ప్రభుత్వ వైఖరివల్ల ఏర్పడిందే.

వ్యవసాయంపై కాంగ్రెస్ ప్రణాళికలు

ఎవరైనా సంక్షోభంలో ఉన్నప్పుడు వారికి సాయం చేయాలి. అందుకోసం ఒక ప్రణాళిక ఉండాలి. అంతే తప్ప.. ప్రతిపక్షాలు ప్రశ్నించినప్పుడు చర్యలు తీసుకుని, ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేసే వైఖరి ఉండకూడదు. దేశంలో వ్యవసాయరంగానికి సంబంధించి ప్రభుత్వ వైఫల్యాలపై మేం ప్రశ్నించేంతవరకూ మోదీ నిద్రపోతున్నారు. వ్యవసాయానికి సంబంధించి అయినా, మరే ఇతర రంగానికి సంబంధించి అయినా.. మిస్టర్ నరేంద్రమోదీ వద్ద ఎలాంటి వ్యూహాలూ లేవు. అదే సమస్య.

పెరుగుతున్న నిరుద్యోగం

దేశంలోని 15-20 మంది అతిపెద్ద పారిశ్రామికవేత్తల నుంచి మాత్రమే ప్రజలు ఉద్యోగాలు పొందట్లేదు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా కూడా ఉద్యోగాలను సృష్టించవచ్చు. అలాగని పెద్ద పరిశ్రమలను నేను తక్కువ చేయట్లేదు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా బ్యాంకులు, విధానాలు అందుబాటులో ఉండాలి. అగ్రస్థానంలో ఉన్న 40 వ్యాపారాల ఎన్‌పీఏలు రూ.12 లక్షల కోట్లు ఎందుకున్నాయి? చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఎన్‌పీఏలో అందులో కొంచెం మాత్రమే ఎందుకున్నాయి? అంటే.. పెద్ద కంపెనీలకు ఉన్న 'దారులు' వాటికి లేకపోవడమే కారణం.

కనీస ఆదాయపథకం

అదో విప్లవాత్మక ఆలోచన. దేశానికి దిశ. దేశంలోని అత్యంత బలహీనులైనవారిని కాపాడాలన్న మా నిబద్ధత. దీనిపై ఇప్పటికే ఆరునెలలుగా కృషి చేస్తున్నాం. సమర్థంగా అమలయ్యేలా ఒక విధానాన్ని రూపొందిస్తాం. దేశం సంక్షోభంలో ఉందన్న విషయాన్ని ఒప్పుకోవడానికి ప్రధాని మోదీ అంగీకరించట్లేదు. భారత యువత తమ భవిష్యత్తుపై వ్యాకులతతో ఉన్నారు. ఇది వారిలో కోపాన్ని పెంచుతోంది. ఆ కోపాన్ని కాంగ్రెస్ పార్టీ శాంతింపజేస్తుంది. దేశంలో చాలామంది పేదలు తమ భవిష్యత్తుపై ఆందోళనతో ఉన్నారు. వారిలో భరోసా కల్పించాలి. వారి కోసమే కనీస ఆదాయ పథకం. 'అందులో భాగంగా.. మోదీ రైతులకు ప్రకటించిన 6000 కంటే ఎక్కువిస్తారా' అంటే.. సూత్రప్రాయంగా దీన్ని మేం ప్రతిపాదించాం. దీనిపై నిపుణులు కూలంకషంగా పరిశీలించి ఎలా చేయాలో చెబుతారు.

మోదీని పక్కన పెట్టే రోజు దగ్గర్లోనే..

'మాకు మోదీ ఉన్నారు.. మరి ప్రతిపక్షాలకు ఎవరున్నారు' అని బీజేపీ అడుగుతోంది. కానీ, గడ్కరీ, సుష్మాస్వరాజ్, రాజ్‌నాథ్ సింగ్.. ఇంకా బీజేపీలోని అందరు నాయకులను అడిగి చూడండి. మోదీ పనితీరుకు వారి నుంచి తిరస్కారం ఎదురైతే నేను ఆశ్చర్యపోను. మోదీకి అర్థంకాని విషయమేంటంటే.. మొత్తం పార్టీ ఆయన్ను పక్కకు పెట్టడానికి వేచి చూస్తోంది. ఆ రోజెంతో దూరం లేదు. అలాగే.. నా పదిహేనేళ్ల రాజకీయ కెరీర్‌లో ఇంత ఐకమత్యంతో ఉన్న ప్రతిపక్షాన్ని నేను చూడలేదు. ఉదాహరణకు మాతో పోరాడిన చంద్రబాబునాయుడు ఇప్పుడు కలిసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రతి వ్యవస్థా మోదీ నిరంకుశత్వాన్ని ఎదుర్కొంటోంది. అచ్చం బ్రిటిషర్లలాగా.. మోదీ తనను తాను భారతదేశానికి ప్రభువుగా భావించుకుంటున్నారు. మేం అలా పని చేయం. వ్యవస్థలు మన దేశానికి ఆత్మవంటివి. వాటిని కాపాడాలి. మోదీ దేశానికన్నా ఎక్కువ కాదు. రాజకీయంగా పోరాడాలనుకుంటే పోరాడాలి తప్ప.. న్యాయమూర్తిలా మారకూడదు. అది రాజ్యాంగాన్ని, దేశాన్ని సవాల్ చేయడమే. అది దేశవ్యతిరేకం.

ఇందిరతో మోదీకి పోలికా?

అది (ఇందిరాగాంధీతో మోదీని పోల్చడం) ఇందిరాజీని పూర్తిగా అవమానించడమే. మా నానమ్మ తీసుకున్న నిర్ణయాలు ప్రేమ, ఆప్యాయతల నుంచి వచ్చినవి. ఆమె పేదల కోసం పనిచేశారు. ప్రజలతో కలిసి పనిచేశారు. ఆమె తీరుతెన్నులు అందరినీ ఏకం చేసేలా ఉండేవి. అదే మోదీ నిర్ణయాలు.. కోపం, ద్వేషం నుంచి వస్తాయి. ఆయన నిర్ణయాలు దేశాన్ని విభజిస్తాయి.

రామమందిరం

కాంగ్రెస్ పార్టీకి దేశ వ్యవస్థలపైన, న్యాయప్రక్రియపైన గౌరవం ఉంది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున నేను నిర్ణయం చెప్పడం సబబు కాదు. ఈ విషయంలో మాకు పూర్తి స్పష్టత ఉంది. సుప్రీంకోర్టు ఏం చెబుతుందో దాన్నే కాంగ్రెస్ సహా అందరూ అంగీకరించాలి.

2014తో పోలిస్తే పుంజుకున్న పార్టీ

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకోని ఒక్క రాష్ట్రం కూడా నాకు కనిపించట్లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో, ఒడిశాలో, కర్ణాటకలో, మహారాష్ట్రలో, ఉత్తరాదిన.. యూపీ, బిహార్‌లో అన్ని చోట్లా మేం పుంజుకుంటాం. దేశ ప్రజల్లో మోదీపై అంతర్లీనంగా ఒక కోపం ఉంది. పూర్తిగా పైకి కనపడకపోయినా.. కోపమైతే ఉంది. నోట్ల రద్దు, జీఎస్టీ ద్వారా, రైతులను విస్మరించడం ద్వారా, ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం ద్వారా దేశానికి.. ప్రత్యేకించి పేదలకు మోదీ కలిగించిన బాధ ఇందుకు కారణం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో కనిపించింది ఆ ప్రతిక్రియే. మీరొకవిషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.. అదేంటంటే, మేం మోదీతో ఆయన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో సైతం దీటుగా పోరాడాం. ప్రజల నుంచి మా ఆలోచనలకు, దార్శనికతకు పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. అక్కడా యన త్రుటిలో ఓటమిని తప్పించుకున్నారు.

మోదీ ఓటమి తర్వాతే..

కాంగ్రెస్ కన్నా విపక్షాలకు ఎక్కువ సీట్లు వస్తే ప్రాంతీయ పార్టీ నాయకుడికి లేదా కాంగ్రెస్‌లోనే మరో నేతకు మద్దతిస్తారా? అంటే.. దీనిపై ప్రతిపక్షాలన్నీ కలిసి చర్చించాం. ఆరెస్సెస్-బీజేపీ ఓటమి, దేశ రాజ్యాంగ విలువలను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం. దాన్ని సాధించాక.. ప్రధాని అనేది ఎవరో మాలో మేం చర్చించుకుని నిర్ణయించుకుంటాం.

ప్రియాంక రాజకీయ భవిష్యత్తు

పార్టీ జనరల్ సెక్రటరీగా ఆమెకు జాతీయ స్థాయిలో పాత్ర ఉంది. ఇచ్చిన పాత్రను విజయవంతంగా నిర్వర్తించేలా పార్టీని తీర్చిదిద్దుతున్నాను. నేనిచ్చిన విధిని విజయవంతంగా నిర్వర్తిస్తే దాని ఆధారంగా మరో విధిని నిర్దేశిస్తాను.

రాఫెల్.. కుంభకోణం



రాఫెల్‌తో కొత్తగా ఒప్పందం కుదుర్చుకోవడంలో కీలకపాత్ర కేవలం మోదీదే. దీంట్లో నాటి రక్షణ మంత్రి మనోహర్ పర్రీకర్‌కు ఏ సంబంధం లేదు. అది మోదీ నిర్వహించిన 'బైపాస్ సర్జరీ'. యూపీఏ హయాంలో రూ.526 కోట్లకు బేరమాడిన విమానాన్ని రూ.1600 కోట్లకు కొన్నారు. ఇది దసో వార్షిక నివేదికలో కనిపిస్తున్న వాస్తవం. ఈ డీల్‌ను అనిల్ అంబానీకి ఇవ్వాల్సిందిగా సాక్షాత్తూ ప్రధాని మోదీనే అడిగినట్లు ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలా బయటపెట్టారు. మోదీ సాంకేతిక పరిజ్ఞాన బదిలీని కూడా వద్దన్నారు. హాల్ నుంచి ఈ కాంట్రాక్టును లాగేసుకున్నారు. రాఫెల్ డీల్ ఆఫ్‌సెట్ కాంట్రాక్టును పొందడానికి అనిల్ అంబానీ కంపెనీ ఎలా అర్హమైనది? రక్షణ రంగంలో ఆయనకేమైనా అనుభవం ఉందా? లేదే! ఆయన కంపెనీలు లక్ష కోట్ల అప్పుల్లో ఉన్నాయి. మోదీ ఈ డీల్‌పై సంతకం చేసినప్పుడు పారిస్‌లో ఆయనతోపాటు అనిల్ అంబానీ ఎందుకున్నారు? ఈ ఒప్పందంతో తనకు సంబంధం లేదని పర్రీకర్ ఎందుకన్నారు? ఎందుకంటే తనను తాను రక్షించుకోవడానికి. రక్షణ కొనుగోళ్ల విధానాలను ఉల్లంఘించి, భద్రతపై కేబినెట్ కమిటీని బైపాస్ చేసి మరీ ఈ ఒప్పందంపై మోదీ ఎందుకు సంతకం చేశారో నాకిప్పటికీ అర్థం కావట్లేదు. ఇక.. ఈ అంశంపై కోర్టు కాగ్ నివేదిక ఆధారంగా ఇచ్చింది. కానీ, కాగ్ రిపోర్టు అనేదే లేదు. దాన్ని ప్రజా పద్దుల కమిటీకి పంపిందీ లేదు. తప్పకుండా ఏదో జరిగింది. అబద్ధాన్ని ఎక్కువ కాలం దాచలేరు. మోదీ విశ్వసనీయత దెబ్బతింది. కావాలంటే బయటికెళ్లి ఏ చౌరస్తాలోనైనా నిలబడి 'చౌకీదార్' అని అరవండి.. 'చోర్ హై' అని మిగతా వాళ్లు అనకుంటే చూడండి. తనను తాను అవినీతిపై పోరాడేయోధుడిగా చిత్రీకరించుకుంటూ మోదీ చెప్పిన అబద్ధాన్ని ఇప్పుడెవరూ నమ్మట్లేదు. రాఫెల్‌లో దాచడానికేమీ లేదనుకుంటే మోదీ ఆ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయడానికి ఎందుకు వెనకాడుతున్నారు? ఒకవేళ వేస్తే అందులో బీజేపీ సభ్యులే ఎక్కువమంది ఉంటారు కదా? నాకు తెలిసినంతవరకూ రాఫెల్ మంచి యుద్ధవిమానం. అయితే, అందులో నేను నిపుణుడిని కాదు. కాబట్టి.. ఈ డీల్‌కు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి తెలుసుకుంటాను. వాళ్లు సూచించిన వాటిని అమలు చేస్తాం. ఏదైనా నేరం జరిగిందంటే దాన్ని నిర్ధారించే ప్రక్రియ చేపట్టి తగిన శిక్ష వేస్తారు. అయితే ఒకటి.. మీరు మోదీ వాలకాన్ని గమనించండి. తాను దొరికిపోయినట్టు ఆయనకు తెలిసిపోయింది.



రాహుల్ ఇంటికి వెళుతున్న ప్రియాంక

రాహుల్‌తో ప్రియాంక భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంకా గాంధీ వాద్రా ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. విదేశాల నుంచి వచ్చీ రావడంతోనే 'మిషన్ ఉత్తర్‌ప్రదేశ్'కు శ్రీకారం చుట్టారు. తాను ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న యూపీ(తూర్పు)తోపాటు రాష్ట్రంలో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలపై పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతోపాటు ఇతర నేతలతో సమావేశమై చర్చించారు. యూపీ(పశ్చిమ)ఇన్‌చార్జ్ జ్యోతిరాదిత్య, యూపీ పార్టీ చీఫ్ రాజ్‌బబ్బర్, కేసీ వేణుగోపాల్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. సుమారు 2 గంటపాటు సాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. యూపీకి చెందిన పలువురు కీలక నేతలకు ఫోన్లు చేసి క్షేత్ర స్థాయి సమాచారం తెలుసుకున్నారని కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. అంతేకాక ప్రియాంక యూపీ పర్యటన షెడ్యూల్‌పైనా చర్చించినట్లు సమాచారం. కాగా ఈ నెల 7న జరిగే కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శుల సమావేశంలోనూ ప్రియాంక పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రాహుల్ గది పక్కనే ప్రియాంకకూ గది

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గది పక్కనే ప్రియాంకకూ ఓ గది కేటాయించారు. తన కార్యకలాపాలను ఆమె అక్కడినుంచే నిర్వహిస్తారు. ఆ గదికి ప్రియాంక నేమ్ బోర్డు బిగించారు.

లెఫ్ట్.. రైట్.. లిబరల్

వామపక్షవాదం, మితవాదం, మధ్యేవాదం వంటివాటిని నేను నమ్మను. ప్రజలందరి మాటా వినాలని భావిస్తాను. ఎక్కడ అన్యాయం జరిగినా దానిపై పోరాడాల్సిందే. పారిశ్రామికవేత్తలకైనా.. రైతులకైనా.. ఎవరికి అన్యాయం జరిగినా వారి ప్రయోజనాలు కాపాడ్డానికి ముందుకొచ్చే మొదటి వ్యక్తిని నేనే. లెఫ్ట్, రైట్, సెంటర్.. ఏ భావజాలానికీ చెందినవాడిగా నన్ను నేను భావించుకోను. నేను కార్యసాధకుడిని. మా ప్రత్యర్థులు వాడే భాష నేను మాట్లాడను. నాకు అహింసపై నమ్మకం ఉంది. ఇక ఆలయాలకు వెళ్లడంలో మితవాదం ఏమీ లేదు. దీన్ని సాఫ్ట్ హిందుత్వ అనకూడదు. బుద్ధుడు, మహావీరుడు, గురునానక్ తదితర మహానుభావులెందరో ఈ దేశంలో ఆలయాలకు వెళ్లారు. గురునానక్ మక్కాకు కూడా వెళ్లారు. కాబట్టి రాజకీయ నాయకులు సహా ఎవరైనా మతాన్ని గౌరవించాల్సిందే.

వివాదాస్పద ట్వీట్.. సౌదీలో ఇందూరువాసికి 5ఏళ్ల జైలు

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఓ వివాదాస్పద ట్వీట్.. గల్ఫ్‌లో తెలంగాణ వాసికి పెద్ద చిక్కే తెచ్చిపెట్టింది. మయన్మార్‌లో రోహింగ్యాలపై దమనకాండను సమర్థిస్తూ ట్విటర్‌లో పోస్ట్ చేసినందుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన యువకుడికి సౌదీలో ఐదేళ్ల జైలు శిక్ష పడింది. జిల్లాలోని పెర్కిట్ గ్రామానికి చెందిన చెన్నా రాకేశ్ కొన్నేళ్లుగా సౌదీలో ఉంటున్నాడు. మయన్మార్ లోని రోహింగ్యా ముస్లింలపై అక్కడి సైనిక ప్రభుత్వం చేస్తున్న దమనకాండను సమర్థిస్తూ 2017లో ట్విటర్‌లో ఓ మెసేజ్ పెట్టాడు. వెంటనే అతడిని సమర్థిస్తూ ఇతర దేశాలకు చెందిన కొందరు పోస్టింగులు పెట్టారు. ఈ పరిణామం ఓ వర్గంలో తీవ్ర వివాదాస్పదమైంది. కొద్దిసేపటికే రాకేశ్ తన పోస్టింగ్‌ను తొలగించినా.. పలువురి ఫిర్యాదుతో అక్కడి పోలీసలు అతడిని అరెస్టు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం రాకేశ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం అతడు రియాద్‌లోని జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో వివాదస్పద ట్వీట్‌ను షేర్ చేసినప్పుడు.. తెలియకుండా చేశామని ఒప్పుకుంటే ఇక్కడ స్వల్ప శిక్షతో బయటపడతారు. రాకేశ్ కేసు ఇందుకు భిన్నం. అతడే స్వయంగా వివాదస్పద ట్వీట్ చేయడంతో తీవ్ర నేరమై కూర్చుంది. ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకునేందుకు గడువు సమీపిస్తుండడంతో అతడి కుటుంబీకులు సహకరించాల్సిందిగా పలువురిని కోరుతున్నారు.



పోప్ ఫ్రాన్సిస్‌ను ముద్దాడుతున్న ఈజిప్టు అజార్ షాహీ ఇమామ్ షేక్ అహ్మద్ అల్ తయ్యబ్

గల్ఫ్ గడ్డపై శాంతివచనం

»» యూఏఈలో పోప్ ఫ్రాన్సిస్ బహిరంగ ప్రార్థనలు

అబుదాబి, ఫిబ్రవరి 5: క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ గల్ఫ్ గడ్డపై తనదైన ముద్రవేశారు. యూఏఈలో అడుగు పెట్టిన తొలి కేథలిక్ గురువుగా రికార్డు సృష్టించిన ఆయన.. పశ్చిమాసియాలో శాంతియుత వాతావరణానికి పిలుపునిచ్చారు. మంగళవారం అబుదాబిలోని జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఇస్లాం మతానికి పుట్టినిల్లు అయిన సౌదీ అరేబియాకు యూఏఈ సరిహద్దు దేశమే అయినా ఇక్కడ క్రైస్తవ మతాచారంపై ఆంక్షలు లేవు. యూఏఈ ఆర్థిక వ్యవస్థలోనే కాదు... అక్కడి జనాభాలోనూ 10% క్రైస్తవులు ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టేడియంలో పోప్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దాదాపు 50వేల మంది పాల్గొన్నారు.



మమతతో బాబు మంతనాలు

ప్రధానీ.. తప్పుకో!

రాజీనామా చేసి మళ్లీ గుజరాత్‌కు వెళ్లిపో... కేంద్రంలో ఏక వ్యక్తి, ఏక పార్టీ ప్రభుత్వం

రాష్ట్ర సంస్థలను గుప్పిట పట్టే ప్రయత్నం... సీబీఐ విషయంలో నైతిక విజయం మాదే!

రాజ్యాంగ, ప్రజాస్వామ్య విజయమిది: మమత... కోల్‌కతాలో మూడు రోజుల ధర్నా విరమణ

ఏపీలో మా ఎంపీలపైనా సీబీఐ, ఈడీలతో దాడి... ఉమ్మడి పోరాటం కొనసాగుతుంది: బాబు

బెంగాల్ దంగల్

కోల్‌కతా, ఫిబ్రవరి 5: "ప్రధాన మంత్రీ.. ముందు నువ్వు రాజీనామా చేయి. తిరిగి గుజరాత్‌కు వెళ్లిపో. కేంద్రంలో ఉన్నది ఏక వ్యక్తి, ఏక పార్టీ ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సహా అన్నిటినీ గుప్పిట పట్టాలని భావిస్తోంది" అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సుప్రీంలో ఇప్పుడు తమకు సానుకూల తీర్పు వచ్చిందని, నైతిక విజయం తమదేనని.. వచ్చే వారంలో ఢిల్లీలో పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. సీబీఐ అంటే తనకెంతో గౌరవం ఉందని, కానీ, అది ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఆదేశాలనే పాటిస్తోందని తప్పుబట్టారు. కోల్‌కతాలోని మెట్రో సినిమా ఎదుట చేపట్టిన మూడు రోజుల ధర్నాను విరమిస్తున్నట్లు మంగళవారం రాత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు కూడా హాజరయ్యారు. కోర్టు తీర్పు తర్వాత.. ధర్నా విరమణ అనంతరం మమత విలేకరులతో మాట్లాడారు. "తొలుత బీజేపీ బ్లాక్‌మెయిల్ చేస్తుంది. దాంతో వాళ్లంతా బీజేపీలో చేరతారు. ఆ తర్వాత వాళ్లపై ఎటువంటి కేసులూ ఉండవు. కేంద్ర దర్యాప్తు సంస్థలు అప్పటికే నమోదు చేసిన కేసులను ఎత్తేస్తారు" అని ధ్వజమెత్తారు. "మేం చట్టాన్ని గౌరవిస్తాం. ప్రజాస్వామ్య పునాదులను ధ్వంసం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలపైనే నా పోరాటం. కేంద్రంపై పోరాటంలో నేను ఒంటరిదానిని కాదు. ఈరోజు చంద్రబాబు వచ్చారు. నవీన్ పట్నాయక్ కూడా నాకు మద్దతు ఇచ్చారు. వారిని సంప్రదించి, తదుపరి చర్యలు తీసుకుంటా" అని చెప్పారు. సుప్రీం తీర్పుతో సివిల్ సర్వెంట్ల నైతికత పెరుగుతుందని వ్యాఖ్యానించారు. తాను విచారణకు రానని రాజీవ్ కుమార్ ఎన్నడూ చెప్పలేదని, ఒకరికొకరు సహకరించుకోవాలని కోర్టు గతంలో కూడా సూచించిందని గుర్తు చేశారు. అరెస్టు చేయడానికే ఆదివారం వచ్చారని, కానీ, అరెస్టు చేయరాదని కోర్టు నిర్దేశించినందుకు కృతజ్ఞతలని చెప్పారు. ఓ ముఖ్యమంత్రిగా ఉండి ధర్నా చేయవచ్చా అని ప్రశ్నించగా.. గతంలో అరవింద్ కేజ్రీవాల్, జయలలిత చేశారని గుర్తు చేశారు.

కూటమి రూపకర్త మమత: చంద్రబాబు

మహా కూటమి 'రూపకర్త' పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతిపక్షానికి ఆమే మూలస్తంభమని చెప్పారు. మోదీని గద్దె దించడమే లక్ష్యంగా 'మహా కూటమి' ఏర్పడుతోందని, ప్రధాని అభ్యర్థి ఎవరో ఏకాభిప్రాయంతో నిర్ణయించుకుంటామన్నారు. బెంగాల్ సీఎం మమత దీక్ష విరమణ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చర్యకూ ప్రతి చర్య ఉంటుందని, రాష్ట్రంలో అయోమయం సృష్టించడానికి కేంద్రం ప్రయత్నించిందని, కానీ, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్లో తృణమూల్ క్లీన్‌స్వీప్ చేస్తుందని, మొత్తం 42 సీట్లనూ గెలుచుకుంటుందని, జాతీయ స్థాయిలో ఆమే నిర్ణయాత్మక శక్తిగా ఉంటారని తెలిపారు. జనవరి 19న కోల్‌కతాలో నిర్వహించిన ప్రతిపక్షాల ర్యాలీలో పాల్గొన్న 23 పార్టీల ప్రతినిధిగా తాను హాజరయ్యానని చెప్పారు. "ప్రధాని మోదీ సహకార సమాఖ్య గురించి తరచూ చెబుతూనే.. అహంకారంతో ప్రవర్తిస్తారు. ఏ ప్రతిపక్షాన్నీ వదలడం లేదు. ఏపీలో మా ఎంపీలపై సీబీఐ, ఈడీలతో దాడి చేయించారు" అని అన్నారు. కాగా, దేశ సమాఖ్య వ్యవస్థపై దాడికి నిరసనగా భావసారూప్య ముఖ్యమంత్రులంతా కలిసి ఈనెల 12న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. శరద్ పవార్, కేజ్రీవాల్, శరద్ యాదవ్ తదితరులతో మాట్లాడామని, మమత ధర్నాను ముగించి ఢిల్లీకి పోరాటాన్ని మార్చాలని నిర్ణయించామని చంద్రబాబు తెలిపారు. ఓటింగ్ యంత్రాలను ఏమార్చడం చాలా తేలిక అని, దేశ భవిష్యత్తును ఒక కంప్యూటర్ ఆపరేటర్ చేతిలో పెట్టలేమని తేల్చి చెప్పారు. కాగా.. బెంగాల్ పరిణామాలపై విపక్షాల ఆందోళనలతో మంగళవారం పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి.

యోగీ... ముందు యూపీని చూసుకో!

ఉత్తరప్రదేశ్‌లో చాలామంది ప్రజలు, రైతులు చనిపోతున్నారని, ఓ పోలీసు అధికారిని కూడా హత్య చేశారని, ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ తొలుత యూపీని చూసుకోవాలని మమత ఎద్దేవా చేశారు. బెంగాల్లోని రాయ్‌గంజ్, బలూర్‌ఘాట్ సభల్లో పాల్గొనడానికి ఆదివారం యోగి ఆదిత్యనాథ్ వచ్చారు. కానీ, ఆయన హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వలేదు. బంకురా జిల్లాలో సభలో పాల్గొనడానికి మంగళవారం వచ్చారు. మళ్లీ మమత సర్కారు అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే మమత విమర్శలు గుప్పించారు. ఇప్పుడు పోటీ చేస్తే ఆయన యూపీలోనే గెలవలేరని, కానీ, బెంగాల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.



సుప్రీంకోర్టు మధ్యే వాదం

(మూడోపేజీ తరువాయి)

తేదీ ఖరారు చేస్తే ఆ రోజున ఆయన విధేయతతో హాజరవ్వాలని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం మంగళవారం నాడు ఇచ్చిన రూలింగ్‌లో తేల్చి చెప్పింది. అదే సమయంలో ఆయనను అరెస్ట్ చేయరాదని, ఒత్తిడిని పెంచేలా చర్యలు తీసుకోరాదని సీబీఐకు స్పష్టం చేసింది. "వివాదాన్ని నివారించేందుకు గాను- రాజీవ్ కుమార్ విచారణను అటు కోల్‌కతాలో గానీ, ఇటు న్యూఢిల్లీలో గానీ కాకుండా ఓ తటస్థ ప్రదేశంలో జరపాలని అంటూ ఇందుకు మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌ను సూచించింది. అది కూడా షిల్లాంగ్ సీబీఐ కార్యాలయంలో జరపరాదని ఆజ్ఞాపించింది. కోర్టు ఆదేశం వెలువడిన వెంటనే రాజీవ్‌కుమార్ సీబీఐకి ఒక లేఖ రాస్తూ ఫిబ్రవరి 8న షిల్లాంగ్‌కు రావడం తనకు సమ్మతమేనని చెప్పారు. ఓ పక్క స్వల్ప ఊరటనిస్తూనే సుప్రీం కోర్టు రాజీవ్ కుమార్‌కు, మమత ప్రభుత్వానికి మరో పక్క షాకిచ్చింది. శారదా చిట్‌ఫండ్ స్కాంలో సాక్ష్యాల్ని ధ్వంసం చేశారన్న సీబీఐ ఆరోపణలపై ఈనెల 20లోగా సమాధానమివ్వాలని రాజీవ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తుకు 2014లో కోర్టే ఆదేశించిందని, అయితే ఆ దర్యాప్తుకు బెంగాల్ సర్కారు సహకరించడం లేదని, ఇది కోర్టు ధిక్కారమేనని సీబీఐ చేసిన ఆరోపణను కూడా పరిగణనలోకి తీసుకున్న బెంచ్- దీనిపై ఫిబ్రవరి 18లోగా సమాధానం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డీజీపీకి నోటీసులు జారీచేసింది. వారిచ్చిన సమాధానాలు పరిశీలించాక- అవసరమైతే వారిని ఫిబ్రవరి 20న విచారణకు పిలిపిస్తామని కూడా తేల్చిచెప్పింది.

సీల్డు కవరులో రాజీవ్, తృణమూల్ సర్కార్‌కు వ్యతిరేకంగా వివరాలు

అంతకు ముందు కోర్టులో జోరుగా వాదనలు సాగాయి. మొదట పావుగంట సేపు అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శారదా స్కాం గురించి క్లుప్తంగా బెంచ్‌కు వివరించారు. సీబీఐ తరపున వాదనలు వినిపించిన వారివురూ మంగళవారం నాడు అదనంగా ఓ అఫిడవిట్‌ను సమర్పించారు. అంతేకాక- రాజీవ్ కుమార్‌కు, తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివరాలను ఓ సీల్డు కవర్లో బెంచ్‌కు అందజేశారు. "శారదా స్కాంపై దర్యాప్తుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందానికి (సిట్‌కు) నేతృత్వం వహించిన రాజీవ్ కుమార్ మొత్తం సాక్ష్యాలను ధ్వంసం చేశారు. కొన్నింటిని తారుమారు చేశారు. 2014లో సీబీఐకి ఈ దర్యాప్తు అప్పగించాక అనేకసార్లు కేసు ఫైళ్లను అడిగినా సీడీఆర్ (కాల్ డేటా రికార్డింగ్‌లు) తప్ప మరేమీ ఇవ్వలేదు. ఆ సీడీఆర్‌లు కూడా కొన్ని సృష్టించినవి, మరికొన్ని తారుమారు చేసినవి. నిందితులతో ఆయన కుమ్మక్కయ్యారు. 2013లో రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేసిన సిట్‌లోని అధికారులంతా నిందితులతో లాలూచీ పడ్డారు. దర్యాప్తునకు ప్రభుత్వం అడుగడుగునా అవరోధాలు కల్పించింది. సీబీఐ అధికారులను అరెస్టు చేయడానికి రాష్ట్ర పోలీసులు ప్రయత్నించారు" అని కోల్‌కతాలోని సీబీఐ ఎస్పీ పార్థ ముఖర్జీ సమర్పించిన 17 పేజీల అఫిడవిట్‌ను కేకే వేణుగోపాల్ బెంచ్‌కు సమర్పించారు.

ఐదేళ్లు ఎఫ్ఐఆర్ లేదు.. సడెన్‌గా ఎందుకు?

కోల్‌కతా పోలీసు తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. "ఇది వివిధ రాష్ట్రాలకు విస్తరించిన స్కాం కాబట్టి కోర్టు దీన్ని సీబీఐకి అప్పగించింది. 2016లో ఇదే సుప్రీం కోర్టు సిట్ పనితీరును అభినందించింది కూడా! నాలుగున్నరేళ్ల పాటు ఈ కేసును సీబీఐ పెద్దగా పట్టించుకోలేదు. ఆకస్మికంగా గత ఆదివారం నాడు ఏకంగా 40 మంది సీబీఐ అధికారులు ఢిల్లీ నుంచి దిగారు. ఏమిటిది, ఎందుకీ తొందర? ప్రధాని నరేంద్ర మోదీ రెండు బహిరంగ సభల్లో మాట్లాడిన మరుసటి రోజే కేసుకు జీవం వచ్చింది. పాత సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి వైదొలిగే చివర్రోజున, డీజీపీ పదవీవిరమణ రోజున- హఠాత్తుగా వచ్చారు. ఐదేళ్ల పాటు రాజీవ్ కుమార్‌పై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఆయన నిందితుడు కాదు. నేరానికి ప్రోద్బలమిచ్చినవాడు కాదు. కానీ హఠాత్తుగా ఆయనను చుట్టుముట్టారు. ఎందుకు?" అని నిలదీశారు. "అధికారులను అవమానించి, ఇబ్బందిపెట్టడమే లక్ష్యంగా రాజకీయ ప్రయోజనాలతో చేస్తున్న దర్యాప్తులివి" అని సింఘ్వీ ఘాటుగా విమర్శించారు.

మమతతో ధర్నాలో పాల్గొంటారా!

»» అధికారినన్న విషయం మర్చిపోయారా?

»» సర్వీసు రూల్స్ ఉల్లంఘించారు

»» రాజీవ్‌కుమార్‌పై కేంద్రం ఉచ్చు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: బెంగాల్ దంగల్‌కు కారణమైన కోల్‌కతా సిటీ పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ చుట్టూ కేంద్రం ఉచ్చు బిగిస్తోంది. ఆయనపై క్రమశిక్షణ చర్య తీసుకోవాలని తాజాగా ఓ లేఖను బెంగాల్ ప్రభుత్వానికి లేఖ రాసింది. "ఆయన ఓ ఉన్నతాధికారి. ధర్నా చేస్తున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటుగా తాను కూడా ధర్నాకు కూర్చొనడం తప్పు. రాజకీయ నాయకులు చేస్తున్న ఆందోళనల్లో పాల్గొనడం ఆలిండియా సివిల్ సర్వీసెస్ నిబంధనలు- 1968లోని 3, 5, 7కు విరుద్ధం. ఆయన సర్వీసు రూల్స్‌ను అతిక్రమించారు. ఆయనపై తక్షణం క్రమశిక్షణ చర్యలు తీసుకోండి" అని కేంద్ర హోంశాఖ ఆ లేఖలో డిమాండ్ చేసింది. సీబీఐకు సహాయ నిరాకరణ చేసినట్లు కూడా ఆయనపై అభియోగం ఉంది. ఆయనపై ఖచ్చితంగా చర్య తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ లేఖతో ఆయనపై అన్ని వైపుల నుంచీ ఉచ్చు బిగించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే సాక్ష్యాల ధ్వంసం అభియోగాన్ని సుప్రీంకోర్టులో మోపిన కేంద్రం ఇక సర్వీసు రూల్స్ ఉల్లంఘన సాకుతో శాఖాపరంగా ఇబ్బంది పెట్టే పని మొదలెట్టింది.

విపక్ష నేతలది దొంగల ముఠా

»» మమత అతిగా స్పందించారు: జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: సీబీఐ విషయంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అనవసరంగా అతిగా స్పందించారని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఆమె ధర్నా చేయడం అసంబద్ధమన్నారు. మమతకు ప్రతిపక్షాల నేతలు మద్దతు తెలపడమంటే 'దొంగల ముఠా' అధికారంలోకి రావాలని కోరుకోవడమేనని చెప్పారు. ఒక నేరాన్ని విచారించడానికి వెళ్లిన సీబీఐ అధికారులను కోల్‌కతా పోలీసులు దారుణంగా అడ్డుకున్నారని ఆరోపించారు. మమత అతిగా స్పందించి ధర్నాకు దిగారని, ఇది అనేక అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. కాగా.. సుప్రీం తీర్పు మమత సర్కారుకు చెంపపెట్టు అని, ఇది సీబీఐ నైతిక విజయమని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. శారదా చిట్ ఫండ్ కుంభకోణంలో ప్రజల సొమ్మును భారీగా దోచేశారని, దీనిపై విచారణ చేయవద్దా అని ప్రశ్నించారు. మరోవైపు.. మమతా బెనర్జీ పెద్ద 'నాటకాల మాస్టర్' అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. ఒక ముఖ్యమంత్రి పోలీస్ కమిషనర్‌తో కలిసి రోడ్డుపై ధర్నాకు కూర్చోవడం భారత ప్రజాస్వామ్యంలో దురదృష్టకర ఘటన అని వ్యాఖ్యానించారు. అటు.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీతో ఏడాది కాలంగా తమకు ఎలాంటి సంబంధాలు లేవని ఒడిసా సీఎం, బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ అన్నారు.

మా మద్దతు అక్కర్లేదని రాసిస్తారా?



»» ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సూటి ప్రశ్న

కోల్‌కతా, ఫిబ్రవరి 5: "కూటమి కట్టిన 23 ప్రతిపక్ష పార్టీలను దోపిడీ పార్టీలు, దొంగల పార్టీలని అభివర్ణిస్తున్నారు కదా! లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఈ 23 పార్టీల సహకారం మేం కోరం అని సంతకం చేసి మరీ అఫిడవిట్ ఇస్తారా!?" అని ప్రధాని మోదీని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. మమతకు సంఘీభావం తెలపడానికి కోల్‌కతా వచ్చిన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీతో సంబంధాలు తెంచుకుంటే అవినీతి ముద్ర వేస్తున్నారని విమర్శించారు. బీజేపీతో సంబంధాలు తెంచుకున్నప్పటి నుంచి చంద్రబాబును వేధిస్తున్నారన్నారు. వాళ్లకు కావాలంటే ఒళ్లో కూర్చోబెట్టుకుంటారని, లేకపోతే వేధిస్తారని విమర్శించారు.

తెల్‌తుంబ్డేని 12దాకా అరెస్టు చేయబోం

»» బాంబే హైకోర్టుకు పుణె పోలీసుల హామీ

ముంబై, ఫిబ్రవరి 5: భీమా-కోరేగావ్ కేసులో నిందితుడైన బీఆర్ అంబేడ్కర్ వరుసకు మనవడు ఆనంద్ తెల్‌తుంబ్డేని ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి దాకా అరెస్టు చేయబోమని మహారాష్ట్ర ప్రభుత్వం బాంబే హైకోర్టుకు తెలిపింది. న్యాయమూర్తి జస్టిస్ నితిన్ సాంబ్రేకు పుణె పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణా పాయ్ మంగళవారం ఈ మేరకు హామీ ఇచ్చారు. దళిత మేధావి తెల్‌తుంబ్డేని శనివారం తెల్లవారుజామున పుణె పోలీసులు ముంబై ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశం మేరకు ఆయన కొన్ని గంటల్లోనే విడుదలయ్యారు. తెల్‌తుంబ్డేకు ముందస్తు బెయిలు కోసం ఆయన తరఫున న్యాయవాది మిహిర్ దేశాయ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది.

నకిలీ వార్తల వ్యాప్తి భారత్‌లోనే ఎక్కువ

»» మైక్రోసాఫ్ట్ సర్వేలో వెల్లడి

ముంబై, ఫిబ్రవరి 5: ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే నకిలీ వార్తలు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయని మైక్రోసాఫ్ట్ సర్వేలో తేలింది. 22 దేశాల్లో సర్వే చేయగా మన దేశంలోనే సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తలు వేగంగా విస్తరిస్తున్నాయని వెల్లడైంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇంటర్నెట్ వినియోగదారుల్లో 64 శాతం మందికి ఏదో ఒక రూపంలో నకిలీ వార్తలు ఎదురైనట్లు సర్వేలో తేలింది. ఇది ప్రపంచ సగటు కన్నా 7 శాతం అధికంగా ఉందని మైక్రోసాఫ్ట్ తెలిపింది. కాగా భారత పౌరులకు సంబంధించి.. సైబర్ భద్రతపై సోషల్ మీడియా దిగ్గజం ట్విటర్‌కు నోటీసు జారీ చేసినట్లు సమాచార సాంకేతిక రంగాలపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు, ఎంపీ అనురాగ్ ఠాకూర్ తెలిపారు.

పరీక్షల్లో రోల్ నంబర్ బదులు బార్‌కోడ్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు ప్రస్తుతం కొనసాగుతున్న పరీక్షల విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని యూజీసీ నియమించిన అధ్యయన కమిటీ సిఫారసు చేసింది. ప్రధానంగా మాల్‌ప్రాక్టీస్‌ను నిరోధించడానికి ప్రస్తుత వ్యవస్థలో ఉన్న రోల్ నంబర్లకు బదులుగా ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ బార్‌కోడ్‌ను పరిచయం చేయాలని సూచించింది. రాజస్థాన్ కేంద్రీయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఎంఎం సాలుంకే నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల కమిటీ మంగళవారం తన నివేదికను అందజేసింది. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు 30% మార్కులు ఇవ్వాలని, అసాధారణ విద్యాసంస్థల్లో 40% ఇవ్వొచ్చని సూచించింది.

అన్నా హజారే దీక్ష విరమణ

ముంబై, ఫిబ్రవరి 5: లోక్‌పాల్, లోకాయుక్తలను నియమించాలని కోరుతూ గత వారంరోజులుగా చేస్తున్న నిరాహార దీక్షను సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే మంగళవారం సాయంత్రం విరమించారు.

నేరమని తెలిసీ చేశారు

129 మంది విద్యార్థులపై అమెరికా అభియోగం... నిందితుల్లో ఒకరికి బెయిలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: పే అండ్ స్టే రాకెట్‌లో అరెస్టయిన 129 మంది భారతీయ విద్యార్థులకూ తాము చేస్తున్నది నేరమని ముందే తెలుసునని, అన్నీ తెలిసే ఉద్దేశపూర్వకంగా ఈ నేరానికి వారు పాల్పడ్డారని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. "ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయంలో లెక్చరర్లు ఉండరు, క్లాసులుండవు అని వారికి ముందే తెలుసు. ఆన్‌లైన్‌లో గానీ, వ్యక్తిగతంగా కానీ ఎలాంటి క్లాసులకూ హాజరవ్వాల్సిన పనిలేదని వారికి తెలుసు. ఈ విషయం ఆ వర్సిటీ వెబ్‌సైట్లో రాసే ఉంది. అయినప్పటికీ చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉండిపోవాలన్న కాంక్షతో వారీ పనికి ఒడిగట్టారు" అని అమెరికా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. విద్యార్థుల నిర్బంధంపై భారత ప్రభుత్వం దౌత్యపరమైన నిరసన (డీమార్ష్) వ్యక్తం చేసిన రెండ్రోజులకు అమెరికా దానిపై ఈ విధంగా స్పందించింది. "మేం అందిస్తున్న అంతర్జాతీయ విద్యార్థి పథకాన్ని దుర్వినియోగం చేయడానికి కొందరు రిక్రూటర్లు, సంస్థల ప్రతినిధులు ప్రయత్నించారు. అమెరికాలో ఉండిపోవడానికి. అక్రమ వలసదారులుగా మిగిలిపోయే ప్రయత్నం చేశారు" అని అందులో వివరించారు. "భారత-అమెరికా స్టూడెంట్ ఎక్స్చేంజి ప్రోగ్రామ్‌లో ఇది ఓ అసాధారణ పరిణామం. ఓ దురదృష్టకర అంకం. మేం భారతీయ విద్యార్థులను చాలా విలువైన ఆస్తిగా పరిగణిస్తాం. అమెరికా పురోగతిలో, విశ్వవిద్యాలయాల్లో, ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర ఎంతో ఉంది. వారి నైపుణ్యం, అనుభవం మాకెంతో ఉపయుక్తం. ఏటా దాదాపు 10 లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికా విద్యాసంస్థల్లో, పరిశోధనశాలల్లో చేరుతున్నారు. నిరుడు1, 96,000 మంది విద్యార్థులు వచ్చారు. వారి వల్ల మా ఆర్థిక వ్యవస్థకు దాదాపు 600 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరుతోంది. ఎంతో ఉపాధి సృష్టికి వారు తోడ్పడుతున్నారు. ఇది మాకు తెలుసు. మోసం అనేది చాలా అరుదుగా జరుగుతోంది. వీసా మోసం ఘటనలు చాలా తక్కువ. దీన్ని చూసి మొత్తం స్టూడెంట్ ప్రోగ్రామ్‌ను తప్పుబట్టడం సరి కాదు" అని విదేశాంగ శాఖ పేర్కొంది.



ఒకరికి బెయిలు

ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను చేర్పించి మోసం చేసిన ఆరోపణలపై అరెస్టయిన ఎనిమిది మంది విద్యార్థులను మంగళవారం నాడు మిచిగన్ కోర్టులో హాజరుపరిచారు. తాము నేరానికి పాల్పడలేదని వారంతా విన్నవించారు. అందులో ఒకరైన కర్నాటి ఫణిదీప్‌కు కోర్టు 10వేల డాలర్ల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. మిగిలిన ఏడుగురు- కాకిరెడ్డి భరత్, కందాళ సురేష్, ప్రేమ్ రాంపీస, సామ సంతోష్, తక్కళ్లపల్లి అవినాష్, నూనె అశ్వంత్, ప్రత్తిపాటి నవీన్‌లు తమను నిర్బంధంలోనే ఉంచేందుకు సమ్మతి తెలిపారు. వీరి నేరం గనక రుజువైతే దాదాపు ఐదేళ్ల దాకా జైలుశిక్ష పడే అవకాశం ఉంది. వీసా మోసాలు, అక్రమ నివాసాలను బయటపెట్టేందుకు ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం పేరిట ఓ నకిలీ విశ్వవిద్యాలయాన్ని అమెరికా అంతరంగిక భద్రతా శాఖ నెలకొల్పి అండర్ కవర్ ఏజెంట్లు, స్టింగ్ ఆపరేషన్ ద్వారా ఈ మోసాన్ని బయటపెట్టింది. తెలియక చాలా మంది ఇందులో ఇరుక్కున్నారని, వారిని విడుదల చేయాలని భారత్ అమెరికాపై ఒత్తిడి తెచ్చింది. ఇప్పటిదాకా 117 మంది విద్యార్థులను దౌత్యసిబ్బంది సంప్రదించారని భారత విదేశాంగ శాఖ మంగళవారం నాడు ఓ ప్రకటనలో తెలిపింది. "దేశవ్యాప్తంగా 36 నిర్బంధ కేంద్రాలను మా సిబ్బంది సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఇంకా 12 సెంటర్లను సందర్శించాల్సి ఉంది. విద్యార్థులను ఈ ఊబిలోంచి బయటపడెయ్యడమే మా ప్రథమ లక్ష్యం" అని ఆ ప్రకటన వివరించింది.

ఎన్ఆర్‌సీపై కేంద్రానికి సుప్రీం చీవాట్లు

»» ఎన్నికల విధులకు బలగాల్ని మళ్లిస్తామన్న హోంశాఖ

»» ప్రక్రియను అడ్డుకుంటున్నారని చీఫ్‌జస్టిస్ మందలింపు

»» జూలై 31లోపు జాబితా పూర్తి కావల్సిందేనని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: అసోంలో జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్‌సీ) రూపకల్పనకు కేంద్రం అడ్డంకులు కల్పిస్తోందని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఎన్నికల విధుల నిర్వహణ నిమిత్తం అక్కడున్న కేంద్ర పారామిలటరీ బలగాలను కొద్ది వారాల పాటు ఉపసంహరిస్తామని కేంద్రం పెట్టుకున్న అప్పీలుపై ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌తో కూడిన ధర్మాసనం తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. "ఇలా బలగాల్ని మళ్లించి ప్రక్రియను అడ్డుకోవాలన్నదే కేంద్రం ప్రయత్నంగా కనిపిస్తోంది. కేంద్రం సహాయనిరాకరణ చేసి ఇంతవరకూ చేసిన మొత్తం పనిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా భావించాల్సి వస్తోంది" అని చీవాట్లు పెట్టింది. ఏదిఏమైనా మొదట విధించిన గడువు- జూలై 31లోపు దీన్ని పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్ఆర్‌సీ పని కోసం కొందరు అధికారులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపు నిచ్చే విషయాన్ని పరిశీలించాల్సిందిగా ఎలక్షన్ కమిషన్‌ను సుప్రీం బెంచ్ కోరింది. కిందటేడాది ప్రచురించిన ఎన్ఆర్‌సీ ముసాయిదా ప్రకారం- మొత్తం 3.29 కోట్ల మందికి గాను 2.89 కోట్ల ప్రజల వివరాలను నమోదు చేశారు. 40 లక్షల పైచిలుకు పేర్లు అందులో లేవు. వీటిలో 37లక్షల పేర్లను తిరస్కరించారు. 2 లక్షల పేర్లను పెండింగ్‌లో ఉంచారు. ఈ 40 లక్షల మందిపై వివాదం చెలరేగుతోంది. కాగా. సుప్రీం చీవాట్లపై స్పందించిన హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గడువులోగా ఎన్ఆర్‌సీని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. 'విదేశీయులెవరి పేర్లూ లేకుండా చూస్తాం. ఎన్ఆర్‌సిని అప్‌డేట్ చేయడానికి కట్టుబడి ఉన్నాం' అని స్పష్టం చేశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.